
# స్పందన



మధుబాబు

# స్పందన

అడ్డు వచ్చిన ఒక కూరగాయల బండిని తప్పించుకోబోయి తల్లక్రిందులైనాడు బాబూలాల్. తల పేవ్‌మెంట్‌కి పొడుచుకోవటంతో బాధగా అరిచి కనులు తేలవేశాడు.

గొల్లున అరిచారు అతన్ని తరుముకు వస్తున్న జనం.

“పట్టుకోండి... ఆ చోర్ బద్మాష్‌ని పట్టుకోండి....” అని కేకలు పెడుతూ మరింత వేగంగా ముందుకు వచ్చారు.

బాబూలాల్ ఎవరో కూరగాయల బండి యజమానికి బాగా తెలుసు. అతను చేస్తూ వుండే దందా ఎటువంటిదో, అంతమంది జనం అతన్ని ఎందుకు తరుముకొస్తున్నారో తెలుసు.

వారందరూ చూస్తూ వుండగా బాబూలాల్‌కి చేయి అందిస్తే తను కూడా ఇబ్బందుల పాలవటం తప్పనిసరి అని గ్రహించి శిలా విగ్రహంలా బిగుసుకుపోయాడతను. ఉన్నచోటి నుంచి ఒక్క అంగుళం కూడా కదలకుండా గుడ్లు మిటకరించి చూశాడు.

“పట్టుకో... పడిపోయిన ఆ దొంగ రాస్కెల్‌ని గట్టిగా పట్టుకో....” అంటూ అతన్ని ఉద్దేశించి గొంతు చించుకొని అరిచాడు జనం ముందు భాగంలో పరుగులు తీస్తున్న పోలీస్ కానిస్టేబిల్.

ఆ అరుపును వినేసరికి మరింతగా కుచించుకుపోయాడు కూరగాయల బండి యజమాని.

"పడక పడక నా బండి దగ్గిరే పడిపోవాలా? పడటానికి ఇంకో చోటు ఈ పట్టణంలో నీకు కనిపించలేదా?" పడినచోటినుంచి కదలకుండా అలాగే వుండిపోయిన బాబూలాల్‌తో అన్నాడతను.

ఆ మాటలతో తెలివి తెచ్చుకున్నాడు బాబూలాల్. తనను ఆవరించుకున్న బలహీనతను దూరం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ లేచి నిలబడ్డాడు.

"పట్టుకోమని చెపుతుంటే నీకు వినబడటం లేదా? పట్టుకోరా... ఆ చోర్ బద్మాష్‌ని గట్టిగా పట్టుకో..." అది చూసి మరింత బిగ్గిరగా కేక పెట్టాడు జనాన్ని లీడ్ చేస్తున్న కానిస్టేబిల్.

పట్టుకోవటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాడు కూరగాయల బండి యజమాని. బాబూలాల్ దారికి అడ్డుగా నిలబడి చేతుల్ని వెడంగా జాపాడు.

"కూరగాయల్ని తూచే తరాజు క్రింద మట్టి ముద్దల్ని అంటించటం, తరాజు తాళ్ళను మెలిపెట్టి తూకంలో మోసం చేయటం తప్ప నీకు ఇంకేమీ తెలియదు. చేతులు వెడంగా జాస్తే పారిపోయే దొంగ ఆగిపోతాడా? మీద పడి గట్టిగా పట్టుకోవాలిబే.... అవసరం అయితే నాలుగు తన్నటానికి, తన్నించుకోవటానికి సిద్ధపడాలి....." అంటూ పిడికిలి బిగించి గాలిలోకి ఎత్తాడు బాబూలాల్.

ఆ పిడికిలి ఎటువంటి పవర్ వుంటుందో బండి యజమానికి బాగా తెలుసు. కనులు చిట్లించి, పెదవులు బిగించి అతను ఆ పిడికిలిని ముందుకు విసరటం అంటూ జరిగితే, ముక్కు ముఖం ఏకమై తను వెనక్కి విరుచుకు పడిపోవటం గారెంటీ అని కూడా తెలుసు.

ఆ పని జరక్కముందే ఆకాశం బ్రద్దలైపోయేటట్లు అరిచి, తనంతట తానే క్రింద పడిపోయాడతను. ముఖాన్ని చేతులతో కప్పుకుని గిలగిలా కొట్టుకున్నాడు.

అతని నటనా చాతుర్యానికి ఆశ్చర్యపడుతూ, అక్కడే నిలబడితే ఆ తరువాత అక్కడికి వచ్చిన జనం తనచేత అటువంటి పనే చేయిస్తారని గ్రహించి, అతని మీదుగా అవతలికి జంప్ చేశాడు బాబూలాల్. పాతిక అడుగుల దూరంలో కనిపించిన ఒక సందులోకి జొరపడి, వెనుక వస్తున్న గుంపుకు స్లిప్ ఇచ్చేందుకు చూశాడు.

“ఆరు నూరయినా సరే వాడిని వదిలిపెట్టకూడదు. వాడు సందును దాటి దూరంగా వెళ్ళిపోకముందే పట్టుకోవాలి... పరిగెత్తండి... పరిగెత్తండి” అని తనతో వున్న పౌరుల్ని హెచ్చరిస్తూ తను కూడా సందులోకి అడుగు పెట్టాడు కానిస్టేబిల్.

అడ్డం రాబోయిన ఒకరిద్దరు పౌరుల్ని పిడికిళ్ళతో బెదిరించి సూటిగా ముందుకే పోయాడు బాబూలాల్. సందుకు అడ్డంగా ప్రవహిస్తున్న ఒక మురికి కాలువను అధిగమించ బోతుండగా ముఖం చాటువేసింది అతని అదృష్టదేవత.

అంతవరకూ ఆ కాలువ ప్రక్కనే వున్న ఒక చెట్టుక్రింద హాయిగా నిద్రపోతున్నది ఒక పెద్ద ఊరకుక్క. అకస్మాత్తుగా కాలువ దగ్గిర ప్రత్యక్షం అయిన

పర్సనాలిటీని చూసి అదిరిపడింది. ఆ ఖంగారులో అవతలికి పారిపోవటం కుదరక మీదికి ఎగబడింది.

లాగిపెట్టి నడుము మీద తన్నాలని అనుకున్నాడు బాబూలాల్. పెద్దగా అరిచి భయపెట్టాలని కూడా చూశాడు.

ఆ రెండు పనుల్లో ఒక్కటి కూడా అతను చేయకముందే చురకత్తుల వంటి కోరలు బయటికి కనపడేలా నోటిని తెరిచి అతని ఎడమ కాలిని పట్టుకున్నదా శునకం.

తల్లక్రిందులుగా మురుగు కాలువలో పడబోయి, ఎంతో ప్రయత్నం మీద నిలదొక్కుకున్నాడు బాబూలాల్. ప్రక్కకు వంగి దాని నడుము మీద బలంగా చరిచాడు.

కాలిని వదిలేసిందా శునకం. భీకరంగా అరుస్తూ అవతలికి పారిపోయింది.

ఇంకోసారి మీదికి ఎగబడి రెండో కాలిని కూడా పట్టుకోనందుకు అమితంగా సంతోషిస్తూ ముందుకు పోబోయిన బాబూలాల్‌కి రెండు క్షణాల తరువాత గాని అర్థం కాలేదు. తన కొంప కొల్లేరయిన సంగతి.

పాదం యొక్క కదలికల్ని కనిపెట్టుకొని వుండే కండరాన్ని గాయపరిచిందా గ్రామసింహం. ఎర్రటి రక్తం ధారలు ధారలుగా క్రిందికి జారుతోంది. కాలు కదిలిస్తే చాలు. కత్తులు పెట్టి చీరినట్లు ఎగసుకు వస్తోంది దారుణమైన బాధ!

ఆ ప్రమాదమే మరెప్పుడయినా ఎదురుపడి వుంటే అక్కడికక్కడ ఆగిపోయి వుండేవాడతను. ఆ చుట్టపట్ల నివశించే వాళ్ళందర్నీ పోగుచేసేవాడు. ఆ కుక్క ఎవరిదో తెలుసుకొని, వాళ్ళని నోటికి వచ్చినట్లు తిట్టి పోసేవాడు. వాళ్ళ ఖర్చుతోనే డాక్టర్ దగ్గిరికి పోయి వైద్యం చేయించుకునేవాడు. అవకాశం లేదిప్పుడు అలా చేయటానికి. ఏమాత్రం ఆలస్యం అయినా బ్రహ్మరాక్షసుడి మాదిరి వచ్చేస్తాడు జనాన్ని లీడ్‌చేసి తీసుకొస్తున్న కానిస్టేబిల్. మక్కెలు విరగదీసి స్టేషన్‌కి లాక్కుపోతాడు.

కుక్క కరవటం వల్ల గాయపడింది ఇప్పుడు ఎడమ పాదం ఒక్కటే. కానిస్టేబిల్ వెంట స్టేషన్‌కి పోవటం అంటూ జరిగితే ఎందుకూ పనికిరాకుండా పోతుంది రెండో పాదం కూడా.

పాదాన్ని పట్టి పట్టి వేస్తున్న బాబూలాల్‌ని చూడగానే జరిగింది ఏమిటో గ్రహించాడు వెనుకగా వస్తున్న కానిస్టేబిల్.

“వాడి పని అయిపోయింది. గట్టిగా పరిగెత్తితే పట్టుబడిపోవటం గారెంటీ... పరిగెత్తండి.... గట్టిగా పరిగెత్తండి” అని అందర్నీ హుషార్ చేస్తూ ముందుకు దూసుకు వచ్చాడు.

విల్ పవర్‌నంతా కూడ గట్టుకొని ఇంకా వేగంగా పరిగెత్తటానికి ప్రయత్నించాడు బాబూలాల్. పాతిక అడుగుల దూరం కూడా పోకముందే ఇంకోసారి ముఖం చాటుచేసుకున్నది అతని అదృష్టదేవత.

వెనుకా ముందూ చూసుకోకుండా పరుగు తీయటానికి ట్రై చేయటంలో ఒక మెరక ప్రదేశం మీద మెలికపడింది అతని ఎడమ పాదం.

బాలెన్స్ నిలుపుకోవటం చేతకాక బోర్లా పడిపోయాడతను. క్రింద పడగానే లేచి నిలబడటానికి ప్రయత్నించాడు గాని, ఫలితం లేకపోయింది.

వేట కుక్కల మాదిరి వచ్చి అతన్ని చుట్టుముట్టారు జనం.

"కొట్టండి... నడుములు జారిపోయేటట్లు కొట్టండి....." అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ ఫుట్‌బాల్ ఆడటం మొదలుపెట్టారు.

క్షణాలమీద చినిగి పేలికలైపోయాయి బాబూలాల్ దుస్తులు. పెదవులు చిట్లి భయంకరంగా వాచిపోయాయి. బొట్లుబొట్లుగా జారి గుండెలమీద పడసాగింది ఎర్రటి రక్తం నాశికా రంధ్రాలలో నుంచి.

ఏదో ఒకటి చేసి ఆ దెబ్బల నుంచి తప్పించుకోలేకపోతే. ప్రాణాలు గాలిలో కలిసిపోవటం గారెంటీ అని అర్థమై, గావుకేకలు పెట్టాడు బాబూలాల్. ఫిట్స్ వచ్చినట్లు ఎగిరెగిరి పడ్డాడు.

పడి... పడి... తల వాల్చేశాడు వున్నట్లుండి.

"వీడు సామాన్యుడు కాదు... నెంబర్ వన్ కేడి... గుండెలు తీసిన బంటు... ఉత్తుత్తి దెబ్బలు వీడిని ఏమి చేయలేవు. వేయండి... ఇంకో నాలుగు వేయండి...." అంటూ మరో నాలుగు దెబ్బలు వేసిన తరువాత వచ్చేసింది అనుమానం పోలీస్ కానిస్టేబిల్‌కి.

“నీళ్ళు తీసుకురండి... నీళ్ళు తెచ్చి ముఖంమీద జల్లండి...” అని చుట్టూ వున్న వారిని హెచ్చరించి నీటి కోసం తరిమాడు.

తలా ఒక ప్రక్కకు పరిగెత్తారు కొంతమంది జనం. ఆ చుట్టపట్ల వుండే వారిని బ్రతిమాలుకొని నాలుగు పాత్రలనిండా తీసుకు వచ్చారు నీటిని.

ఒక పాత్రలోని నీటిని బాబూలాల్ ముఖంమీద చిలకరించాడు పోలీస్ కానిస్టేబిల్. రెండు పాత్రల నీటితో అతని వంటిమీద గాయన్ని తుడిపించాడు.

పొరపాటున కూడా కనులు తెరవలేదు బాబూలాల్. తను తెలివిలోనే వున్న విషయాన్ని వాళ్ళకు తెలియనీయలేదు.

“ఏమయింది ఈ దొంగనాయాలికి? తెలివిలోనే వుండి నాటకాలు ఆడుతున్నాడా?” అంటూ చూపుడు వ్రేళ్ళతో అతని కనురెప్పల్ని పైకెత్తి పరిశీలించి చూశాడు కానిస్టేబిల్. ఆఖరి పాత్రను కూడా అతని తలమీద కుమ్మరించమని సైగ చేస్తూ జాగ్రత్తగా విన్నాడు గుండె చప్పుళ్ళని.

ఆ పైన నాటకాన్ని కొనసాగించటం ప్రమాదకరమని గ్రహించాడు బాబూలాల్.

కనులనయితే గట్టిగా మూసుకోవచ్చుగాని, పండాల్ మెయిల్‌లా పరిగెత్తుతున్న గుండె చప్పుళ్ళని కనిపెట్టడం అసాధ్యం గదా!

ఆఖరి పాత్రలోని నీరు తలమీద పడగానే చుట్టూ చేరి చిత్రంగా చూస్తున్న వారి గుండెలు జలదరించేటట్లు వికృత శబ్దాలు రెండింటిని వెలువరించి, తలను కాస్తంత కదిలించాడతను.

“దాహం..దాహం...” నాలుకతో పెదవుల్ని తడుపుకుంటూ పలవరించాడు.

ప్రాణాలు పోగొట్టుకోబోతున్న పేషెంట్‌ని తన ప్రాణాలకు తెగించి కాపాడిన డాక్టర్‌లా ఫోజుపెట్టి సగర్వంగా నవ్వాడు పోలీస్ కానిస్టేబిల్.

“తాగటానికి నీళ్ళు తెచ్చి ఇవ్వండి....” అని మరోసారి జనాన్ని కమాండ్ చేస్తూ బాబూలాల్ మీదికి వంగి అతని దుస్తులన్నిటినీ గాలించాడు.

పైజామా జేబులో కనిపించిందతనికి బాబూలాల్ దొంగిలించుకు వచ్చిన మనీ పర్స్.

జరుగుతున్నదేమిటో అక్కడివారికి అర్థమయ్యేలోపుగా, దాన్ని తన జేబులో పెట్టుకొని వెనక్కి జరిగాడు అతను.

“దెబ్బలు కాస్తంత బలంగా తగిలినట్లు కనిపిస్తోంది... తాగటానికి నీళ్ళిచ్చిన తరువాత ఏదైనా రిక్షాని పిలిచి హాస్పిటల్‌కి తీసుకుపోండి. ఆలస్యం చేస్తే ఇంకోసారి కోమాలోకి వెళ్ళిపోతాడు....” అంటూ రెండు క్షణాలపాటు బాబూలాల్ వంక చూసినట్లే చూసి మెయిన్ రోడ్డుమీదికి వెళ్ళిపోయాడు.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు అక్కడ వున్న జనం.

“పారిపోతున్న దొంగని పట్టుకోవటంలో సాయపడదామని వచ్చాం గాని, పడిపోయిన దొంగని వెంటబెట్టుకొని ఆసుపత్రుల చుట్టూ తిరగటానికి కాదు, కొట్టు కొట్టమని అందర్నీ రెచ్చగొట్టి తన దారిన తను వెళ్ళిపోతున్న ఆ కానిస్టేబిల్

గారినే తీసుకుపొమ్మనండి ఆసుపత్రికి. మాకు ఎటువంటి సంబంధమూ లేదు" అంటూ అప్పటికప్పుడు తమ దారిన తాము వెళ్ళిపోయారు సగం మంది.

"జరుగుతున్నదేమిటో చూడటానికి వచ్చిన వాళ్ళమే గాని, దొంగను పట్టుకోవటానికి వచ్చిన వాళ్ళం కాదు మేము. చోటు పాటు చూసుకోకుండా కొట్టిన వాళ్ళు ఎవరో వాళ్ళే చూసుకోవాలి గాని, మాకెందుకీ తగలాటం?" అంటూ వారిని అనుసరించారు మిగిలిన వారిలో మూడొంతుల మంది.

అర్జంట్ పనులేవో అప్పుడే జ్ఞాపకం వచ్చినట్లు హడావుడిగా అవతలికి వెళ్ళిపోయారు ఆ మిగిలిన ఒక వంతులో కొంతమంది. బాబూలాల్ దాహం తీర్చటం కోసం తీసుకువచ్చిన పాత్రల్ని వాపస్ చేసే మిషమీద దూరంగా పోయి మాయం అయినారు ఆఖరికి మిగిలిపోయినవారు.

తను వంటరిగా పడివున్నట్లు అర్థం అయిన అయిదు నిమిషాలకు మెల్లిగా కనులు తెరిచాడు బాబూలాల్.

కత్తిపెట్టి చీరినట్లు పోటెత్తిపోతున్న ఎడమ పాదాన్ని పలుగులు పెట్టి పొడిచినట్లు విపరీతమైన బాధను కలుగచేస్తున్న ప్రక్కటెముకల్ని చేతులతో వత్తుకుంటూ లేచి నిలబడటానికి ప్రయత్నించాడు.

గిర్రున తిరిగింది పాదాల ముందున్న ప్రపంచం. నిజంగానే తప్పిపోయింది స్పృహ.

పోలీసులే పట్టించుకోని ఆ మనిషిని గురించి తాము పట్టించుకుంటే లేనిపోని తలనొప్పులు ఎదురుకావచ్చునే భయంతో కాబోలు – మొదలు నరికిన

చెట్టులా విరుచుకుపడిపోయిన అతన్ని గురించి అసలు పట్టించుకోలేదు ఆ చుట్టుపట్ల నివశించే ప్రజలు.

చీకటి పడిన తరువాత చాలాసేపటికి తానే తెలివి తెచ్చుకొని లేచి కూర్చున్నాడు బాబూలాల్. భయంకరమైన స్థాయికి చేరుకున్న బాధలన్నిటినీ బలవంతంగా బిగపట్టుకొని, ఇంకోసారి క్రింద పడిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మెయిన్ రోడ్డు వైపు అడుగులు వేశాడు.

## 2

“ఈ ప్రపంచంలో ఎందరో మూర్ఖులను చూశాను గాని, నీ వంటి మూర్ఖ శిఖామణిని యింతవరకూ చూడలేదు.”

ఉదయం పదకొండు గంటల సమయంలో ఎడమ పాదాన్ని ఎత్తెత్తి వేస్తూ హాస్పిటల్‌కి వచ్చిన బాబూలాల్‌తో కోపంగా అన్నాడు డాక్టర్ వైకుంఠం.

గాయం అయిన వెంటనే సరైన చికిత్స చేయించుకోకపోవటం వల్ల ఎబ్ నార్మల్ సైజుకు చేరుకున్నది బాబూలాల్ ఎడమ పాదం. ప్రక్కటెముకల మీద పడిన దెబ్బల మూలకంగా వళ్ళు వేడెక్కి జ్వరం వచ్చేసింది.

“వయసులో ఉండగా పొట్టతిప్పల కోసం ఏదో ఒక పాడు పని చేయటంలో ఎంతో కొంత అర్థం వుంది. వయస్సు మీరి వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్నప్పుడు కూడా బుద్ధి మారకపోతే యిటువంటి యిబ్బందులే ఎదురౌతాయి” పాదం మీది గాయాన్ని శుభ్రం చేసి కట్టుకడుతూ మరోసారి నోటికి వచ్చినట్లు తిట్టిపోశాడు డాక్టర్ సాబ్.

పెదవి విప్పి ఏదో సమాధానాన్ని చెప్పపోయాడు బాబూలాల్. డాక్టర్ సాబ్ దగ్గిర అసిస్టెంట్‌గా పనిచేసే అమ్మడు ఇంజక్షన్ చేయటానికి సిరంజతో సహా సిద్ధం అయ్యేసరికి ఆగిపోయాడు.

“నీ అదృష్టం బాగుంటే పాదం పది రోజుల్లో నయమైపోతుంది. కాలిమీది గాయం... నాలుగు రోజుల్లో సరి అవుతాయి పక్కటెముకలు. ఖర్మకాలితే మాత్రం ఆవిటివాడి అవతారం ఎత్తి అడుక్కుంటూ బ్రతకాల్సిందే” టేబిల్ దగ్గిరికి పోయి ఏదో ప్రిస్కిప్షన్ వ్రాస్తూ చెప్పాడు డాక్టర్ సాబ్.

పళ్ళు బిగపట్టి, కళ్ళను గట్టిగా మూసుకుని ఇంజక్షన్ చేయించుకున్నాడు బాబూలాల్. ఆ ఇంజక్షన్ నొప్పి అధికమో, కాలిమీది గాయపు బాధ అధికమో తేల్చుకోవటానికి ప్రయత్నిస్తూ, ఎగ్జామినేషన్ టేబిల్ మీది నుంచి దిగి డాక్టర్ సాబ్‌కి నమస్కారం చేశాడు. ఆయన అందించిన ప్రిస్కిప్షన్ తీసుకుని నాలుగు పది రూపాయల కాగితాల్ని చేతిలో పెట్టాడు.

“రోజులు మారిపోయాయి. రేట్లు చాలా దారుణంగా పెరిగిపోయాయి. నా ఫీజు యింకో నలభై అవుతుంది” నిర్వికారంగా చెప్పి, ఇంకో పేషెంట్‌ని లోపలికి పిలిపించాడు డాక్టర్ సాబ్.

కానిస్టేబిల్ పరమైపోయిన మనీ పర్సు కనుల ముందు మెదిలి ఉసూరుమన్నాడు బాబూలాల్.

“నా ఫీజు ఇవ్వటానికి దిక్కులు చూస్తున్న నువ్వు గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్ళి కుక్క కరచినందుకు బొడ్డు చుట్టూ ఇంజక్షన్‌లు ఎలా తీసుకుంటావ్? పైసలు

లేకుండా వాళ్ళు నీ గోడు వినిపించుకుంటారని భ్రమపడుతున్నావా?" అడిగాడు డాక్టర్ సాబ్.

గాయాల బాధకంటే, అమ్మడు చేసిన ఇంజక్షన్ నొప్పికంటే అయన విసురుతున్న చెణుకుల బెడదే చాలా ఎక్కువగా వున్నదని నిశ్చయం చేసుకొని నోరు విప్పాడు బాబూలాల్.

"రేట్లు పెరిగిపోయిన సంగతి తెలియక తక్కువ తీసుకవచ్చాను. రేపు మా భానుకు యిచ్చి పంపిస్తాను."

ఎగ్జామినేషన్ టేబిల్ మీదికి ఎక్కిన పేషెంట్‌ని వదిలేసి అతనికేసి తిరిగాడు డాక్టర్ సాబ్.

"ఏం చేస్తున్నాడు మీ భాను? సినిమా హాళ్ళ దగ్గిర ఇంకా మిరపకాయ బజ్జీలు అమ్ముతూనే వున్నాడా?"

ఎంత వద్దని అనుకున్నా ఎగసుకు వచ్చేసింది కోపం బాబూలాల్‌కి.

"సినిమా హాళ్ళ దగ్గిర మిరపకాయ బజ్జీలు అమ్మినా, ఫుట్‌పాత్ దుకాణాల దగ్గిర చాయ్‌లు సప్లయ్ చేసినా షంషేర్‌గా బతుకుతున్నాడు నా బిడ్డడు. మాటలు చెప్పి తన పబ్బం గడుపుకోవటం లేదు."

ఇసుమంత కూడా అఫెండ్ కాలేదు డాక్టర్ వైకుంఠం ఆ మాటలకు. పెద్దగా నవ్వుతూ అతని భుజం తట్టాడు.

"మీ భాను షంషేరుగా బతుకుతున్నాడని నాకు తెలుసు. నాలాగా మాటలు చెప్పి పబ్బం గడుపుకోవటం లేదని కూడా తెలుసు. అతని చదువు

ఎంతవరకూ వచ్చిందో తెలుసుకోవటానికి అడిగాను గాని, అతన్ని కించపరచటానికి కాదు'' అంటూ వెనుతిరిగి తన పనిలో తను నిమగ్నుడైనాడు.

అనవసరంగా మాట తూలినందుకు సిగ్గుపడ్డాడు బాబూలాల్.

''ఇంకో సంవత్సరంలో కాలేజీలో చదువు పూర్తి అయిపోతుందిట... చదువు అయిపోగానే ఏదైనా మంచి ఉద్యోగంలో చేరతాడట....'' డాక్టర్ సాబ్ వీపుకు చెప్పి ఆ గది బయటికి బయలు దేరాడు.

రెండు అడుగులు కూడా వేయకముందే అతని పాదాలకు బ్రేకులు వేసింది డాక్టర్ వైకుంఠం కంఠం.

''చదువు పూర్తి అయిన తరువాత చేయబోయే ఉద్యోగం గురించి ఇప్పటి నుంచీ మాట్లాడుకోవటం దేనికి గాని, ఒక పని చేయి. చదువు మానిపించి భానును నా దగ్గిరికి పంపు. కాంపౌడర్‌గా పెట్టుకొని ట్రెయినింగ్ యిస్తాను. నెలకు వెయ్యి రూపాయల జీతం యిప్పటి నుంచీ యిచ్చేస్తాను.''

సమాధానం ఇవ్వటానికి క్షణం కూడా తడుముకోలేదు బాబూలాల్.

''వెయ్యి కాదు రెండు వేలు ఇచ్చినా సరే భాను చదువు మాన్పించేది లేదు. అతను ఉద్యోగం చేసినా, మీ వంటి వాళ్ళ దగ్గిర పనివాడిగా చేరినా చదువు పూర్తి అయిన తర్వాత చేయాల్సిందే.''

''అతని చదువు పూర్తి అయ్యేలోపల ఏదో ఒకరోజు నువ్వు పోలీసులకి దొరికి, కటకటాల పాలవటం డెఫినెట్. నీ అండ లేకుండా పోయిన నాడు అతను తనంతట తానే చదువు మానుకోవటం తప్పని సరి. అప్పుడు నేను ఇస్తానని

అంటున్న ఉద్యోగం కంటే చాలా తక్కువ పనిలో చేరి పొట్ట నింపుకోవటానికి పడరాని పాట్లు పడటం ష్యూర్ అండ్ సర్టెన్.''

వెనుతిరిగి చూడకుండా భాను భవిష్యత్తుని గురించి ఆయన అంటున్న మాటల్ని వినేసరికి మరోసారి ముంచుకు వచ్చేసింది బాబూలాల్‌కి విపరీతమైన కోపం. పెదవులు విప్పితే ఈ సారి మాటలు మహా కటువుగా బయటికి వచ్చేస్తాయని గ్రహించి, విసురుగా వచ్చేశాడు గదిలోనుంచి.

హాస్పిటల్ ఎదుటే తన రిక్షాలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు రిక్షా డ్రయివర్ యాదయ్య.

బాబూలాల్‌ని చూడగానే ''ఏమయిందన్నా? కట్టు కట్టించుకొని సూది పొడిపించుకున్నావా?'' అని అడుగుతూ సీట్లోనుంచి, తన స్థానంలోకి చేరుకున్నాడు.

''ఇక్కడికి రావడమంత బుద్ధి తక్కువ పని మరోటిలేదు బే.... కట్టుకట్టినట్లే కట్టి బుర్రంతా చెడగొట్టేశాడు... మన బండి తిరిగి దారిలో పడాలంటే రెండు చుక్కలు పుచ్చుకోవాల్సిందే'' అంటూ రిక్షా ఎక్కాడు బాబూలాల్.

చుక్కలు పుచ్చుకునే మాట చెవుల పడేసరికి చింపి చేటంత అయింది యాదయ్య ముఖం.

''ఆ మాట ఎప్పుడంటావా అని ఎదురు చూస్తున్నాను ఇందాక నుంచీ, గట్టిగా కూర్చో.... చిటికెలో తీసికెళ్ళిపోతాను'' అంటూ రిక్షాను వెనక్కి తిప్పి అక్కడికి ఫర్లాంగు దూరంలోనే వున్న ఒక సారా కొట్టు దగ్గిరికి తీసుకుపోయాడు.

ఆ కొట్టు ప్రక్కనే కనిపిస్తూ వుంటుందొక పెద్ద నిద్ర గన్నేరు చెట్టు. అక్కడికి వచ్చినప్పుడల్లా రిక్షాని దాని క్రింద ఆపటం యాదయ్యకి బాగా అలవాటు.

అలవాటు ప్రకారం అటుగా పోలేదు రిక్షా. అసలు రోడ్డును వదిలి ప్రక్కకు తిరగలేదు.

“ఏమయింది బే? నిద్రపోతున్నావా?” అసహనంగా అంటూ అతని వీపు మీద చరిచాడు బాబూలాల్.

అప్పటికీ రిక్షాని ఆపటంగాని, ప్రక్కకు తిప్పటం గాని చేయలేదు యాదయ్య.

“నిద్ర గన్నేరు చెట్టుక్రింద ఎవళ్ళున్నారో గట్టిగా చూడు.” అంటూ ఇంకా వేగంగా ముందుకు తీసుకుపోయాడు.

కనులు చిట్లిస్తూ వెనక్కి చూశాడు బాబూలాల్.

చూసిన మరుక్షణం అతన్ని కూడా ఆవరించుకున్నది ఆందోళన.

“తొందరగా పోనీ బే... ఇంకాస్త తొందరగా పోనీ....” యాదయ్య వీపు మీద ఇంకో దెబ్బవేస్తూ ఆత్రుత నిండిన కంఠంతో హెచ్చరించాడు.

“ఆ మాట నువ్వు చెప్పాల్సిన అవసరం లేదన్నా.... నాకెప్పుడో తెలుసు” అంటూ మరింత స్పీడ్‌గా ముందుకు పోనిచ్చాడు యాదయ్య రిక్షాని.

* * * * *

కొట్టు ముందు ఆగినట్లే ఆగి హడావుడిగా వెళ్ళిపోతున్న రిక్షాని అందులోని పర్సనాలిటీని గమనించి ఆశ్చర్యంగా విజిల్ వేశాడు సారా కొట్టు చిన్నా.

"ఏమయిందిరా? బాబూలాల్ ఎందుకలా పారిపోతున్నాడు? పోలీసులు ఎవరైనా కనిపించారా?" దుకాణం ముందు నిలబడివున్న తన అనుచరుడొకతన్ని అడిగాడు.

మాటలతో సమాధానం ఇవ్వలేదా అనుచరుడు. నిద్రగన్నేరు చెట్టు క్రిందికి చూడమని చూపులతోనే సూచించాడు.

పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని చెట్టు మొదట్లో నిలబడివున్న భానును గమనించి పెద్దగా నవ్వేశాడు చిన్నా.

"దిక్కూ మొక్కూ లేని అనాధ ఈ భాను. ఎనిమిది నెలల వయస్సులో ఎవరో రోడ్డు మీద వదిలేస్తే జాలిపడి చేరదీశాడు బాబూలాల్. తనకు పిల్లలు లేకపోవడం వల్ల, కడుపున పుట్టిన వాడికంటే ఎక్కువగా చూసుకుంటూ, తాహతుకు మించిన చదువు చెప్పిస్తున్నాడు. పిల్లిపిల్ల అనుకొని పాలు పోసి పెంచితే పులిపిల్ల అయినట్లు పెంచి పెద్ద చేసిన వాళ్ళనే బెదరగొట్టేటంత మొనగాడు అయినాడితను ఇప్పుడు" అంటూ చప్పట్లు కొట్టి భానును పిలిచాడు.

చెట్టు క్రింద స్టాండ్ వేసి వుంచిన సైకిల్ తీసుకొని అతని దగ్గిరికి వచ్చాడు భాను.

"నువ్వు తాగవు. తాగేవాళ్ళను చూసి ఓర్చుకోలేవు. నీ మూలకంగా నాకు ఇప్పుడు ఎంత నష్టం వచ్చిందో తెలుసా?" కోపాన్ని నటిస్తూ విసురుగా అడిగాడు చిన్నా.

"ఎంత నష్టం వచ్చింది?" అడిగాడు భాను.

“పోయించేవాళ్ళుండాలే గాని నలభై రూపాయలు పైనే తాగుతాడు రిక్షా యాదయ్య. ఇంకో నలభైకి తక్కువ కాకుండా పుచ్చుకునేవాడు మీ బాబాయి. ఆ డబ్బుల్ని ఎవరిస్తారు? నువ్విస్తావా?”

“మా బాబాయి దగ్గిర డబ్బులేవు. ఉన్నవన్నీ కాలికి కట్టు కట్టించుకుని ఇంజక్షన్ చేయించుకోవటానికి ఖర్చయిపోయి వుంటాయి. ఇక్కడికి వచ్చి వుంటే ఖచ్చితంగా అరువు అడిగి వుండేవాడు.”

“అడిగితే ఏమయిందట? అప్పు తీసుకోవటమంటూ జరిగితే తీర్చేదాకా నిద్రపోడు మీ బాబాయి. అతను అరువు అడగాలే గాని ఎంతైనా ఇస్తాను.”

“ఆ తరువాత బాధలు పడాల్సింది నువ్వు కాదు... మేము. కాలి మీద గాయం బరువు చేసి జ్వరం వచ్చింది. జ్వరం వంటిమీద వుండగా తాగి తందనలాడి లేనిపోని బాధల్ని నెత్తిమీదికి తెచ్చుకుంటే మేము ఏమైపోవాలి? అందుకే ఇక్కడ కాపలా వేశాను నేను. ఎట్టి పరిస్థితిలోనూ జ్వరం తగ్గందే బాబాయిని మీ కొట్లోకి రానీయను.”

“ఈ పట్టణంలో సారా అమ్మేది నేను ఒక్కడినే కాదు. ఇంకో ఫర్లాంగు అవతల పెద్ద పెద్ద దుకాణాలు రెండున్నాయి. వాటిలోకి పోవటం మీ బాబాయికి చేతకాదని అనుకున్నావా?” అడిగాడు చిన్నా.

అడిగాడన్న మాటే గాని అలా జరిగేందుకు అవకాశం లేదని అతనికి తెలుసు. సారా తాగదలుచుకుంటే అక్కడికే వస్తాడు బాబూలాల్. పొరపాటున కూడా మరో చోటికి పోడు.

ఏదో ఒక విధంగా భానును రెచ్చగొట్టి అతనికి కోపం వస్తే ఎలా వుంటుందో చూడాలని చిన్నా ఆశయం.... అంతకు ముందు ఎన్నోసార్లు ఎన్నెన్నో రకాలుగా ప్రయత్నించినా తీరలేదు ఆ కోరిక.... ఇప్పుడు కూడా అంతే అయింది.

''ఈ పాటికి ఇంటికిపోయి వుంటారు బాబాయి... నేను కూడా ఇంటికి పోతాను'' అంటూ సైకిల్‌ని తీసుకొని బయలుదేరాడు భాను.

''జ్వరం తగ్గగానే ఒకసారి రమ్మన్నానని చెప్పు మీ బాబాయిని. ఈ మధ్య ఇటుగా రావటం మానేశాడు'' అంటూ అతనికి వీడ్కోలు చెప్పబోయాడు చిన్నా. మాటలు అతని నోటివెంట పూర్తిగా బయటికి రాకముందే దుకాణంలో స్టార్ట్ అయింది ఏదో గందరగోళం.

''ఏమటిరా అది? ఏమయిందిరా?'' అని అడుగుతూ లోపలికి పరిగెత్తాడతను.

నిషా తలకెక్కిన కస్టమర్స్ ఎవరో కాస్తంత గొడవ ప్రారంభించి వుంటారని గ్రహించి, తనలో తను నవ్వుకుంటూ సైకిల్‌ని రోడ్డు మీదికి తిప్పాడు భాను.

అదే సమయంలో గింగిరాలు తిరుగుతూ బయటికి దూసుకువచ్చాయి రెండు సారా సీసాలు. భాను తల ప్రక్కనుంచి పోయి భళ్ళున బ్రద్దలైనాయి నడిరోడ్డు మీద.

ముప్పిరి గొన్న ఆశ్చర్యంతో సైకిల్‌ని ఆపి వెనక్కి చూశాడతను.

చొక్కా చేతుల్ని పైకి లాగి, తొడలు చరుస్తూ కదం తొక్కుతున్నారు దుకాణంలో కస్టమర్స్.

కనిపించిన గ్లాసుల్ని సీసాల్ని చిత్తుక్రింద పగలగొడుతున్నారు. అడ్డు వచ్చిన బల్లల్ని, పర్నిచర్‌ని ధ్వంసం చేస్తున్నారు.

త్రీ టవున్‌లో చిల్లర తిరుగుళ్ళు తిరిగే చమన్ భాయ్ వున్నాడు వారిలో. పట్టపగలే ఇళ్ళల్లో జొరబడి గలాటలు చేసే గగ్లూమియా వున్నాడు. డబ్బు ఇస్తే ఎటువంటి అవకాశాన్నయినా సృష్టించగల ఎమిలీ కనిపిస్తున్నాడు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో మిగిలిన వారి ముఖాలన్నిటినీ పరిశీలనగా చూశాడు భాను.

సిటీలో చాలా పెద్ద పేరున్న రౌడీ షీటర్ ఆలీమియా అనుచరులు వారందరూ... వారితో గొడవ పెట్టుకుంటే ఆలీమియాతో పెట్టుకున్నట్లే లెక్క. ఆలీమియాతో పెట్టుకుంటే అన్యాయం అయిపోవటం తప్ప ఇంకో దారి అంటూ వుండదు.

చిన్నపిల్లలకి, ఇళ్ళల్లో వుండే ఆడవాళ్ళకి కూడా తెలిసిన ఆ విషయం, చిన్నాకి ఎందుకు తెలయలేదో భానుకి అర్థం కాలేదు. ఏదో ఒకటి చేసి వాళ్ళని శాంతింప చేయకుండా అతను తగాదాని ఎందుకు పొడిగించుకుంటున్నాడో అంతుబట్టక, సైకిల్‌ని వెనక్కి తిప్పి స్టాండ్ వేశాడు.

సందు చూసుకొని చల్లగా బయటికి వచ్చేస్తున్నారు దుకాణంలో యిరుక్కుపోయిన ఇతర కస్టమర్స్ కొంతమంది.

‘‘కాష్ కౌంటర్లో కూర్చునే చిన్నా కూతురు రేవతమ్మ చేయి పట్టుకోబోయాడు వాళ్ళలో ఒకతను. చాచిపెట్టి పగలగొట్టిందామె చెంపని....

ఖాళీ సీసాతో తలమీద మోదబోయింది....." ప్రశ్నార్థకంగా చూసిన భానుకు చెప్పి, పరుగులాంటి నడకతో అక్కడినుంచి పారిపోయాడు ఒక కస్టమర్. మరింత అల్లకల్లోలమైపోయింది భాను అంతరంగం. సారా కొట్టు చిన్నా చిక్కుపడిన పరిస్థితిని తలుచుకునే సరికి విలవిలాడిపోయింది అతని హృదయం.

ఆలీమియా అనుచరులనే భయంతో వెనుకంజ వేస్తే మట్టికొట్టుకు పోతుంది అతని బిడ్డ అభిమానం. కాదు కూడదని ఎదురు తిరిగితే అక్కడికక్కడే లేచిపోతుంది టాపు.

ఆ మాటలు మనసులో మెదిలేసరికి ఆగలేకపోయాడు భాను. నాలుగు అంగల్లో లోపలికి పోయి, చిన్నా షర్టు పట్టుకోబోతున్న చిమన్ భాయ్ భుజాల్ని వాటేసుకున్నాడు.

ఎనుబోతు మాదిరి గుండెలు అవిసిపోయేలా రంకె పెట్టాడు చిమన్ భాయ్. చిన్నాను వదిలి భానువైపు తిరిగాడు.

"పొద్దున నిద్రలేచిన దగ్గర్నించీ ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకోవాల్సిన వాళ్ళు మీరు..... వదిలెయ్ చిమన్ భాయ్... చిన్నాను వదిలేయ్...." మృదువుగా అంటూ అతన్ని శాంతింపచేయటానికి ప్రయత్నించాడు భాను.

శాంతంచలేదు సరికదా... మరింతగా రెచ్చిపోయాడు చిమన్ భాయ్. పిడికిళ్ళు బిగించి అతని గుండెల మీద బలంగా కొట్టాడు.

బరువైన బండరాళ్ళు వచ్చి గుండెలమీద పడినంత బాధ భానును ఆవరించుకున్నది. ఆ.... అంటునే వెనక్కి తూలి ఒక గోడకు గుద్దుకున్నాడు.

అంతవరకే క్లియర్‌గా గుర్తున్నది అతనికి. కనులముందు ఎర్రటి సిల్కు పరదాలు అడ్డుపడినట్లు, శరీరంలోని రక్తమంతా సలసల మరుగుతున్నట్లు అనుభూతి కలిగింది. ఏం చేస్తున్నాడో తనకే తెలియని విచిత్రమైన ఆవేశం అతన్ని ఆవరించుకున్నది.

తొడలు చరుస్తూ చిందులు తొక్కుతున్న దాదాల మాదిరిగానే తను కూడా గొంతు చినిగిపోయేట్లు పొలికేక పెట్టి, కాళ్ల దగ్గిర కనిపించిన ఒక చెక్క ముక్కను చేతుల్లోకి తీసుకున్నాడు.

ఎంతోసేపు కంటిన్యూ కాలేదు ఆ గలాటా. ఎనభై సెకన్లలో అంతం అయిపోయింది. తమను ఎదిరించగల వారెవరూ అక్కడ లేరన్న నమ్మకంతో రెచ్చిపోయి గంతులు వేసిన చిమన్ భాయ్ పగిలిపోయిన తలను చేతులతో అదుముకుంటూ బయటికి పారిపోయాడు.

అతనికి తోడు రాబోయి ముందుపళ్ళు రెండింటిని పోగొట్టుకున్నారు గగ్లూమియా. నోటికి చేతిని అడ్డం పెట్టుకుంటూ చిమన్ భాయ్‌ని అనుసరించాడతను.

వెనుక ద్వారం గుండా ఎటో పారిపోయాడు ఎమిలీ. అతనికంటె ముందుగానే అడ్రసులు మార్చేశారు ఆలీమియా అనుచరులు.

చెక్క ముక్కను గిర్రున తిప్పుతూ వారిని ఇంకా ఇంకా తరిమికొట్టే ప్రయత్నం చేయబోయిన భానును వెనుక నుంచి వచ్చి కదలకుండా పట్టుకున్నాడు చిన్నా.

“ఎదురించే మనిషి ఎదురయితే క్షణం కూడా నిలబడలేని కుక్కలతో తగాదాని పెంచుకోవటం సరైన పని కాదు... శాంతించు భానూ... నువ్వు కాస్త స్థిమిత పడు....” అంటూ అతని చేతిలోని చెక్కముక్కను బలవంతంగా తీసుకున్నది చిన్నా కూతురు రేవతమ్మ.

## 3

“భాను ఈ రోజు కాలేజీకి రాలేదా?”

నిశ్శబ్దంగా కూర్చుని వున్న స్టూడెంట్స్‌ని కలియచూస్తూ ప్రశ్నించాడు ఇంగ్లీష్ లెక్చరర్.

ముందు నుంచి నాలుగో వరసలో బెంచి మధ్య భాగాన కూర్చుని వుంది గీతిక.

“ఇంత మందిమి ఇక్కడ వుండగా ఈయన గారికి భాను ఒక్కడే కావాల్సివచ్చాడు కాబోలు! అతను క్లాసులో లేకపోతే ఈయన గారు మనకి పాఠం చెప్పడు కాబోలు!!” తల వంచుకుని లోగొంతుకతో కామెంట్ చేసింది.

మాట అర్థం కాలేదు గాని, స్టౌండ్ మాత్రం వినిపించింది లెక్చరర్ గారికి.

“వాటీజ్ ఇట్ గీతికా? వాటీజ్ ఇట్ యువార్ ట్రయింగ్ టు ఇంప్రెస్ అపాన్ యువర్ ఫ్రెండ్స్?” కనులు చిట్లించి చూస్తూ అడిగాడు వెంటనే.

చండప్రచండుడు ఆ లెక్చరర్. చెప్పేది ఇంగ్లీషే అయినా కోపం వచ్చిందంటే చీల్చి చెండాడేస్తాడని పెద్ద పేరు.

నదురూ బెదురూ లేకుండా లేచి నిలబడింది గీతిక.

“ఇంటి దగ్గిర్నించి కబురు వచ్చిందని చెప్పి ఫస్టవర్లోనే పర్మిషన్ అడిగి వెళ్ళిపోయాడు సార్ భా....ను.. ఆ విషయమే మీకు చెప్పమని నా ఫ్రెండ్స్‌తో అంటున్నాను” భాను పేరును సాధ్యమైనంత వెక్కిరింపుగా సాగదీస్తూ చెప్పి, వెంటనే కూర్చున్నది.

కళ్ళ జోడు పైభాగంలో నుంచి ఆమె వంక రెండు క్షణాలు చూసి, మిగిలిన స్టూడెంట్స్ వైపు తిరిగాడు లెక్చరర్.

“ఎగ్జామినేషన్స్‌కి సంబంధించింతవరకూ మీరు బాగా ప్రిపేర్ అవ్వాల్సిన ఇంపార్టెంట్ లెసన్స్ గురించి డిస్కస్ చేద్దామనుకున్నాను గాని, సమ్ హౌ ఐ ఫీల్ దట్ టుడే ఈజ్ నాట్ ది డే ఫరిట్.... ఉయ్ విల్ డిస్కస్ దట్ మేటర్ ఇన్ ది నెక్స్‌ట్ క్లాస్. ఎంజాయ్ యువర్ సెల్ఫ్.....” అందర్నీ ఉద్దేశించి ఎనౌన్స్ చేసి క్లాసులో నుంచి వెళ్ళిపోయాడు.

అనుకోకుండా లభించిన ఆ లీజర్ టైమ్‌ని వృథా చేసుకోవటం ఇష్టం లేక ఆయన వెనుకే బిలబిలలాడుతూ బయటికి వెళ్ళిపోయారు స్టూడెంట్స్ అందరూ.

నలుగురు ఫ్రెండ్స్‌తో గీతిక ఒక్కతే మిగిలిపోయింది క్లాసురూమ్‌లో.

“గబ్బిలాలు మాదిరి మనం ఒకళ్ళమే ఇక్కడ కూర్చోవటం దేనికే? కాస్సేపు గ్రౌండులో తిరిగి వద్దాం.....” అక్కడి నించి కదిలే లక్షణాలు గీతికలో కనిపించక పోవటంవల్ల విసుగ్గా అన్నది ఒక ఫ్రెండ్.

“తన ఫేవరిట్ స్టూడెంట్ క్లాసులో లేకపోతే పాఠం చెప్పటం మానేస్తాడన్నమాట మన ఇంగ్లీషు లెక్చరర్... ఆ భాను తప్ప మిగిలిన వారెవరూ

స్టూడెండ్స్ మాదిరిగా కనిపించటం లేదన్నమాట ఆయనగారి కళ్ళకి....'' తన ఆలోచనలలో నుంచి బయటపడుతూ కచ్చగా అన్నది గీతిక.

“తేలిగ్గా తీసిపారేయాల్సిన మాటను పట్టుకొని చేంతాడు మాదిరి సాగదీస్తావు దేనికే? ఇవాళ ఒక్కరోజు పాఠం చెప్పనంత మాత్రన ఇప్పుడు వచ్చిన నష్టం ఏముందిట? ఇవాళ రాకపోతే రేపు చెపుతాడు.... ఎప్పుడో ఒకప్పుడు చెప్పక తప్పదు కదా!'' అన్నది వెంటనే మరో ఫ్రెండ్.

“రేపు కూడా ఆ భాను కాలేజీకి రాకపోతే ఈయనగారు పాఠం చెపుతాడని నీ ఉద్దేశ్యమా? ఇవాల్టి మాదిరిగానే ఐయామ్ నాట్ ఫీలింగ్ అప్ టూ ఇట్... అంటూ వెళ్ళిపోతాడు.... కావాలంటే వంద రూపాయలు పందెం....'' విసురుగా ఆ ఫ్రెండుకేసి తిరుగుతూ ఇంకాస్త వేడిగా అన్నది గీతిక.

“నువ్వు మనసులో ఒకటి పెట్టుకొని ఇంకోటి మాట్లాడుతున్నావు. కాలేజీ తెరిచిన దగ్గర్నించీ ఒక్కరోజు కూడా అబ్సెంట్ కాలేదు భాను. ఈ రోజు ఏదో ఎగనామం పెట్టాడని రేపు కూడా ఇలాగే చేస్తాడని అనుకోవటం సబబుగా లేదు.'' అంటూ ఆమె చేయి పట్టుకుని బెంచి మీది నుంచి లేపటానికి ప్రయత్నించిందా ఫ్రెండ్.

ఆ చేతిని విదిలించి కొట్టింది గీతిక.

“మనసులో ఒకటి పెట్టుకుని బయటికి మరొకటి మాట్లాడేది నేను కాదు, నువ్వు. ఎప్పుడూ లేనిది ఆ భానును వెనకేసుకు వస్తూన్నావు.... రేపు తను కాలేజీకి

తప్పకుండా వస్తానని నీకు చెప్పాడా?'' కోపంగా అంటూ తనంతట తనే బెంచీ మీదినుంచీ లేచి బయటికి దారి తీసింది.

వివర్ణమై పోయింది ఆ ఫ్రెండ్ ముఖం.

గీతిక చేసిన ఆరోపణలో నిజం లేదని చెప్పాలని ఆమెకు అనిపించింది. కానీ పట్టిన పట్టు పొరపాటున కూడా వదిలే అలవాటు, పెదవులు దాటిన మాటను వెనక్కి తీసుకునే నైజం ఆమెకు లేవని తెలిసి వుండటం వల్ల మౌనంగా వుండిపోయింది.

"ఈ లెక్చరర్ గారిని ఊరికే వదిలిపెట్టకూడదు. ఇంకోసారి ఇలా జరగటం అంటూ సంభవిస్తే గొడవ చేయాల్సిందే...'' తన నిర్ణయాన్ని ఫ్రెండ్స్‌కి వినిపిస్తూ గ్రౌండ్‌కేసి అడుగులు వేసింది గీతిక.

ఆ అంశం మీద తమ అభిప్రాయన్ని తెలియచేయలేదు ఆమె స్నేహితురాళ్ళు. తెలియచేస్తే లెక్చరర్‌గారి మీది కోపం తమ మీదికి మరలుతుందని వారందరికీ తెలుసు.

గ్రౌండ్‌లో ఎంటర్ అవుతుండగా గీతిక మనసులో ఫ్లాష్ అయిందొక ఆలోచన.

"లీజర్ టైమ్‌ని బాగా ఎంజయ్ చేయమని చెప్పాడు గదా... మాట్నీకి పోయి ఎంజాయ్ చేద్దాం....'' అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయాన్ని వారందరికీ వినిపిస్తూ గ్రౌండ్ చివర భాగంలో వున్న కాంటీన్‌కేసి బయలుదేరింది.

ఎప్పటి మాదిరిగానే ఒక్కమాట కూడా ఎదురుచెప్పకుండా ఆమెను అనుసరించి కాంటీన్‌లో అడుగు పెట్టారు ఆమె ఫ్రెండ్స్.

అడ్డదిడ్డంగా వేసి వున్న టేబిల్స్ ముందు కూర్చుని టీలు తాగుతున్నారు అనేకమంది స్టూడెంట్స్..... వెయిటర్స్ తీసుకువచ్చిన కేకుల్ని సమోసాల్ని ఆరగిస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

గీతిక ఎంటర్ అయిన మరుక్షణం ఒక్కసారిగా ఆగిపోయాయి అక్కడ మాటలు. సూది క్రిందపడినా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దం ఆ ప్రదేశాన్నంతా ఆవరించుకున్నది.

గుంభనంగా నవ్వుకుంటూ ఠీవిగా అడుగులు వేసింది గీతిక. ఒక మూలగా వేసి వున్న టేబిల్ ముందుకు పోయి, ఆ టేబిల్‌ని ఆక్రమించుకొని వున్న వారికేసి చురుకుగా చూసింది.

అందరితో పాటు తానుకూడా మాటల్ని ఆపేసి. తమ ఎదుట వున్న టీ కప్పుల వంక చూసుకుంటున్నారు ఆ స్టూడెంట్స్. ఆమె తమ దగ్గిరే నిలబడిపోవటంతో, తమ కప్పుల్ని చేతుల్లోకి తీసుకొని అర్జెంటుగా ఆ టేబిల్‌ని ఖాళీ చేసేశారు.

"ఎవరీమె? ఈ దేశానికి ప్రధానమంత్రా? ఫారిన్ కంట్రీస్ నించి వచ్చిన మోస్ట్ వాల్యుబుల్ అంబాసిడరా??" ఆశ్చర్యంగా చూస్తూ కామెంట్ చేశాడు ఒక స్టూడెంట్.

చటుక్కున అతని చేతిని అదిమాడు ప్రక్కనే వున్న మరో స్టూడెండ్. మాట్లాడవద్దని కనులతోనే సైగ చేశాడు.

"మీరందరూ ఎందుకిలా భయపడిపోతున్నారో నాకు అర్థం కావటం లేదు. ఆమె కూడా మన మాదిరిగానే ఈ కాలేజీలో ఒక స్టూడెంట్.... స్టూడెంట్‌కి మరో స్టూడెంట్ ఎటువంటి గౌరవం ఇవ్వాలో అంతే యివ్వాలి గాని, ఇలా రెడ్ కార్పెట్లు పరచటం, పద్ధతిగా లేదు....." ఆ సైగలను అర్థం చేసుకోలేక తన మాటల్ని కంటిన్యూ చేసాడు ఆ స్టూడెంట్.

తినటానికి ఏమైనా తీసుకురమ్మని వెయిటర్‌కి సైగ చేయబోతూ, మధ్యలోనే ఆగిపోయింది ఆ మాటల్ని ఆలకించిన గీతిక.

వెంటనే ఆమె భుజాలమీద చేతులు వేశారు ఆమె ఫ్రెండ్స్‌లో యిద్దరు.

"అతనెవరోగాని, కాలేజీకి కొత్తగా వున్నాడు. నీ గురించి తెలియక పోవటం వల్ల ఏదేదో మాట్లాడుతున్నాడు. మనం వెళ్ళిపోయిన తర్వాత తనంతట తనే తెలుసుకుంటాడు గాని ఇవాల్టికి అతన్ని వదిలేయవే....." వేడికోలుగా అంటూ ఆపటానికి ప్రయత్నించారు.

ఆగలేదు గీతిక....వాళ్ళ వేడికోలును లక్ష్యపెట్టలేదు.

"ఆడముఖం కనిపిస్తే చాలు నోటికి వచ్చినట్లు మాట్లాడే వాళ్ళని ఊరికే వదలకూడదు. నోరు తెరిచిన మరుక్షణం వేడివేడిగా వడ్డించేయాలి....." అంటూ వారి చేతుల్ని వదిలించుకొని కుర్చీలో నుంచి లేచింది.

“అయ్యబాబోయ్ ఇటే వస్తోంది రాక్షసి... ముందు నువ్వు ఇక్కడి నుంచి అవతలికి వెళ్ళిపో....” ఆందోళన నిండిన కంఠంతో హెచ్చరించాడు ఒక స్టూడెంట్ కామెంట్ చేసిన విద్యార్థిని.

ఆ హెచ్చరికను అతను అర్థం చేసుకుని రియాక్ట్ కాకముందే పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అతని ముందుకు పోయింది గీతిక.

“కొత్తగా చేరావా కాలేజీలో? ఏ ఊరు మనది??” అతని ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగింది.

ఆమె మీది మీదికి వచ్చేస్తుందని అనుకోలేదు కాబోలు అదిరిపోయాడా విద్యార్థి. తన కన్నుల్ని, చెవుల్ని తనే నమ్మలేకపోతున్నట్లు నోరు తెరుచుకు నిలబడి పోయాడు.

“మనది ఏ ఊరని అడుగుతుంటే వినబడటం లేదా? చెవుడు కూడా వుందా మనకి??” అతని ముఖం మీదినుంచి చూపుల్ని తిప్పకుండా మరో ప్రశ్న వేసింది గీతిక.

“నేను.... రాజమండ్రినించి వచ్చాను...” తడబడకుండా వుండటానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తూ అన్నాడా స్టూడెంట్.

“రాజమండ్రి నించి వచ్చావా? ఇంకా నయం విశాఖపట్నం నించి వచ్చావని అనుకున్నాను.... అవునూ... రాజమండ్రి కాలేజీల్లో ఆడవాళ్ళు ఎవరూ చదువుకోరా??” ఒక్కొక్కమాటా వ్యంగ్యంగా సాగదీస్తూ అడిగింది గీతిక.

ఆ మాటలకు ఆ విద్యార్థి సమాధానం చెప్పకముందే తను కల్పించుకున్నాడు అతని ఫ్రెండ్.

"మా వాడు కొత్తగా రావటం వల్ల ఇక్కడి విషయాలు తెలియవు. మీ గురించి అసలు తెలియదు.... ఈ ఒక్కసారికి వదిలేయండి మిస్ గీతికా...." అంటూ సర్ది చెప్పటానికి ప్రయత్నించాడు.

"నా గురించి తెలియటానికి అసలు యిక్కడ ఏముంది మిస్టర్? ఈ ఒక్కసారికి వదిలేస్తే యితను ఏం తెలుసుకుంటాడు నా గురించి?? మనుష్యుల్ని మింగే రాక్షసినని తెలుసుకుంటాడా? పీకి పాకాన పెట్టే పిశాచాన్నని తెలుసుకుంటాడా? ఏమని తెలుసుకుంటాడు?" అంటూ, సడన్‌గా అతని మీద దాడిని ప్రారంభించింది గీతిక.

అంతవరకూ ఏదో ఒక మూలన దాచి పెట్టుకున్న ఆత్మాభిమానాన్ని పూర్తిగా వదిలేసి తన ఫ్రెండ్ చేతిని పట్టుకున్నాడు ఆ స్టూడెంట్ తను ఏం చేస్తున్నాడో గీతికకు అర్థం అయ్యేలోపుగా అతన్ని తీసుకొని వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు అక్కడినుంచి.

"మాట్లాడిన మాటను చివరి వరకూ పోషించుకోలేని వీళ్ళు మనిషి పుట్టక ఎలా పుట్టారో నాకు అర్థం కావటం లేదు. తల వంచుకు పోతుంటే కామెంట్ చేయటం తల ఎత్తి చూస్తే తోక ముడుచుకు పారిపోవటం – వీళ్ళ బ్రతుకులు యింతే...." తమ టేబిల్ దగ్గిరికి తిరిగి వస్తూ కోపంగా అన్నది గీతిక.

‘‘టిఫిన్ చేయబుద్ధి కావటం లేదు గాని, టీ తాగి పోదాం....’’ టిఫిన్ తీసుకుంటూ ఆలస్యం చేస్తే, మళ్ళీ ఏదో ఒక గోల ప్రారంభం అవుతుందన్న భయంతో ఆకలి లేనట్లు ఫోజు పెడుతూ అన్నది ఒక స్నేహితురాలు.

ఎందుకనో గాని వెంటనే అందుకు అంగీకరించింది గీతిక. టీ తాగి హాండ్‌బేగ్‌లో నుంచి ఒక కరెన్సీ నోటును తీసి టేబిల్ మీద పడవేసింది ఛేంజ్ కోసం ఎదురుచూడకుండా లేచి నిలబడింది.

కాంటీన్ ఆవరణను దాటి దూరంగా వెళ్ళిపోయిన తర్వాత గాని చలనం రాలేదు అక్కడి వారిలో. భయంకరమైన తుఫాన్ తమ తలల మీదినించి వెళ్ళిపోయినట్లు తేలికగా నిట్టూర్చాడు అందరూ. తమ తమ మాటల్ని తిరిగి ప్రారంభించుకున్నారు.

## 4

‘‘ఆగు... లోపలికి రాకు....’’

ప్రపంచంలో వున్న కోపాన్నంతా కంఠంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తూ కటువుగా అన్నాడు బాబూలాల్.

తల వంచుకొని టకటకా లోపలికి రాబోతున్న భాను ఎక్కడి వాడక్కడ ఆగిపోయాడు.

‘‘కాలేజీకి వెళ్ళి చదువు కోమని పంపిస్తే, కాలేజీ ఎగ్గొట్టి నువ్వు చేస్తున్న దేమిటి?’’

విరిగిపోవడానికి సిద్ధంగా వున్న ఒక పాతకాలపు కుర్చీలో కూర్చుని కట్టు కట్టిన కాలును ఒక చేత్తో సవరించుకుంటూ ఇంకా కోపంగా అడిగాడు బాబూలాల్.

అతడి వెనుకే నిలబడి వున్న రాధాబాయి వంక చూశాడు భాను.

"ఇందాక పెద్ద బజార్లో చెప్పులు కుట్టుకునే సైదులు వచ్చి ఏదో చెప్పి వెళ్ళాడు. అప్పటినుంచి ఇదే వరస... దేవుడి దయవల్ల ఆ కాలు కాస్తంత అవుడు అయింది గాని, లేకపోతే యింటిని పడగొట్టి నన్ను రాళ్ళ గుట్టల మీద కూర్చోబెట్టి వుండేవాడు. కాలేజీకి పోకుండా నువ్వు ఆ సారా కొట్టు దగ్గర ఎందుకు నిలబడ్డావో నిర్భయంగా చెప్పు" వెంటనే ప్రోత్సహించిందామె.

డాక్టర్ దగ్గిరికిపోయి కట్టు కట్టించుకోవటంతో ఆగకుండా సారా కొట్టుకు వెళ్ళి పీకలదాకా తాగి వస్తాడన్న అనుమానంతో ఆమె కాలేజీకి కబురు పంపి భానును పిలిపించింది. ఆ విషయమే నిర్భయంగా చెప్పమని ప్రోత్సహిస్తోంది.

భాను పెదవి విప్పి ఒక్కమాట కూడా మాట్లాడకముందే మళ్ళీ కల్పించుకున్నాడు బాబూలాల్.

"తల్లీ కొడుకులు ఏకమై నన్ను సారా కొట్టు ఛాయలకు పోనీయకుండా అడ్డుకుంటారని నాకు ముందే తెలుసు. ఎందుకూ పనికిరాని మీ తెలివ తేటల్ని గురించి మాట్లాడటం లేదు నేను... నేను వచ్చేసిన తర్వాత ఈ పెద్ద మనిషి సారా కొట్టు దగ్గిర వెలగబెట్టిన నిర్వాకాన్ని గురించి అడుగుతున్నాను..." ముఖం మీదికి

తెచ్చుకున్న కోపం మటుమాయం అయిపోకుండా జాగ్రత్త పడుతూ యింకా పెద్దగా అడిగాడు బాబూలాల్.

ఆలీమియా అనుచరులతో తను గొడవపడిన సంగతి అతని చెవులకి చేరిపోయిందని గ్రహించి చిన్నగా నవ్వుతూ ఇంట్లోకి వచ్చాడు భాను.

"నువ్వు నవ్వద్దు..... నా దగ్గిరికి రావద్దు.... మాటలతో నన్ను ఏమార్చటానికి ప్రయత్నించవద్దు" కుర్చీని వెనక్కి జరుపుకోవటానికి ప్రయత్నిస్తూ ఖండితంగా అన్నాడు బాబూలాల్.

ఆ మాటల్ని లెక్కచేయలేదు భాను. అతని దగ్గిరికి పోయి కుర్చీ ప్రక్కన బాసిపట్టు వేసుకు కూర్చున్నాడు.

"జరిగింది ఏమిటో కాస్త వివరంగా విను బాబాయ్... నువ్వు వెళ్ళిన తరువాత ఏం జరిగిందంటే...." అని ప్రారంభించబోతుండగా, చిరునవ్వు నవ్వుతూ అతని భుజం తట్టాడు బాబూలాల్.

"సారా కొట్టు చిన్నాతో నీకు పెద్దగా పరిచయం లేదు గాని, నాకు అతనికి ముప్పయ్ సంవత్సరాల అనుబంధం వుంది. మీ పిన్నికి ఒకసారి ప్రాణాలు మీదికి వచ్చి ఆశ వదిలేసుకున్న సమయంలో అతను హాస్పిటల్ ఖర్చులన్నీ పెట్టుకుని వైద్యం చేయించాడు. నాలుగు నెలలపాటు నన్ను, మీ పిన్నినీ తనే పోషించాడు. ఆలీమియా అనుచరుల బారినుంచి అతన్ని, అతని బిడ్డని రక్షించి నా ఋణంలో కొంచెం భాగాన్ని నువ్వు తీర్చేశావు. మంచి పని చేశావు భానూ.... నాకు నచ్చిన పని చేశావు" తల నిమురుతూ ఆర్ద్రంగా అన్నాడు.

“థ్యేంక్యూ బాబాయ్... అనవసరమైన గొడవలో తల దూర్చానని తిట్టకుండా వదిలేసినందుకు థాంక్యూ వెరీమచ్....” అతని వళ్ళో తల పెట్టుకుంటూ అన్నాడు భాను.

అంత వరకూ మౌనంగా వున్న రాధాబాయి వెంటనే అతని రెక్క పట్టుకొని బలవంతంగా లేపి నిలబెట్టింది.

“బాబూ కొడుకులిద్దరూ ఒకరినొకరు మెచ్చుకోవటం చాలుగాని యిక నువ్వు అన్నం తిందువు గాని పద....” అంటూ వెనక గదిలోకి తీసుకుపోయింది.

“చెప్పటం మర్చిపోయా డాక్టర్ వైకుఠం సాబ్‌కి నలభై రూపాయల బాకీ పడ్డాను. రేపు నీతో పంపిస్తానని చెప్పి వచ్చాను....” కుంటికాలిని ఎగరేసుకుంటూ గుమ్మం దగ్గరికి వచ్చి భానుకు చెప్పాడు బాబూలాల్.

“నా దగ్గిర పది రూపాయలే వున్నాయి.” రాధాబాయి వంక చూస్తూ అన్నాడు భాను.

“నా దగ్గిర కూడా అంతే....” భాను పళ్ళెంలో అన్నంపెట్టి, పోపుల డబ్బాలో నుంచి పది రూపాయల కాగితాన్ని తీసి చూపిస్తూ చెప్పింది రాధాబాయి.

“ఇంకో ఇరవై కావాలి కదా!” అసంతృప్తిగా ముఖం పెడుతూ అన్నాడు బాబూలాల్.

“ఇప్పటికప్పుడు కావాలంటే ఎక్కడినుంచి వస్తాయ్? రెండు రోజులు ఆగిన తర్వాత యిద్దాం... మరేం ఫరవాలేదు” అన్నం కలుపుకొని ముద్దను నోటిలో పెట్టుకుంటూ అన్నాడు భాను.

కానిస్టేబిల్ పరమైన పర్సు మరోసారి కనుల ముందు మెదిలి ఉసూరుమన్నాడు బాబూలాల్. కాలును ఎత్తి ఎత్తి వేస్తూ తన కుర్చీ దగ్గిరికి తిరిగి వచ్చాడు.

“రెండు రోజులు ఆగితే వచ్చిన నష్టం ఏమీ లేదు... ఆ విషయం నాకు వదిలేసి నువ్వు నిశ్చింతగా వుండు” లోపలి నుంచి మరోసారి అన్నాడు భాను.

కుర్చీలో కూర్చున్నట్లే కూర్చుని చటుక్కున లేచాడు బాబూలాల్. కుర్చీ వెనుక గోడకు వేలాడుతున్న చొక్కాను అందుకుంటూ, “నేను అలా పెద్ద బజారు దాకా వెళ్ళి వస్తాను. తలుపు వేసుకో” అని కేకశాడు రాధాబాయిని ఉద్దేశించి.

రెండు అంగల్లో ముందు గదిలోకి వచ్చేసిందామె. నోటిలో పెట్టుకోబోతున్న ముద్దను పళ్ళెంలోకి వదిలేసి పరుగెత్తుకు వచ్చాడు భాను.

“తినటానికి లేని రోజున పస్తులయినా వుంటాను గాని, మాట మాత్రం తప్పను. ఆరు నూరయినా సరే రేపు డాక్టర్ సాబ్‌కి డబ్బు యిచ్చి తీరాలి....” అంటూ ముఖ ద్వారం వైపు బయలు దేరాడు బాబూలాల్.

అతన్ని ఆపటం తన వల్ల కాదని అర్థమై నీరు నిండిన కళ్ళతో భాను వంక చూసింది రాధాబాయి.

“ముసలి తనం మీద పడుతున్న కొద్దీ మూర్ఖత్వం ఎక్కవైపోతుంది. ఆ కుంటి కాలితో వీధుల వెంట చక్కర్లు కొడితే ఏమౌతుందో తెలుసా? గాయం పెద్దదై మొదటికే మోసం వచ్చేస్తోంది” బాబూలాల్ ముందుకు వస్తూ కోపంగా అన్నాడు భాను.

“మోసం వచ్చినా సరే... డాక్టర్ సాబ్‌కి రేపు డబ్బు ఇచ్చి తీరాలి” తన నిశ్చయాన్ని ఇసుమంత కూడా మార్చుకోకుండా మొండిగా అన్నాడు బాబూలాల్.

“ఇలాంటి వాడిని ఎలా పెళ్ళి చేసుకున్నావ్ పిన్నీ? అసలు యింత కాలం కాపురం ఎలా చేయగలిగావ్?” రాధాబాయిని అడిగాడు భాను.

“జరగాల్సింది ఏమిటో ఆలోచించు. వీధులవెంట పరిగెత్తి ప్రాణాల మీదికి తెచ్చుకోకముందే ఆ డబ్బును తీసుకువచ్చే మార్గం చూడు. ఈ మనిషిని మార్చటం ఆ దేవుడికి కూడా చేతకాదు.” సజల నయనాలతో అతనికి చెప్పిందామె.

“ఈ మాత్రం దానికే నువ్వు కన్నీళ్ళు పెట్టుకోవటం దేనికి పిన్నీ? ఏదో ఒక విధంగా నేను సర్దుబాటు చేస్తాను.... ఆ మాట ఈ బాబూలాల్ గారికి గట్టిగా చెప్పి ఇంట్లోంచి కదలకుండా చూడు” అంటూ లోపలికి పోయి పళ్ళెం ముందు కూర్చున్నాడు భాను.

అన్నం తిని అతను వీధిలోకి వెళ్ళిపోయిన తరువాత పళ్ళెం కడిగి లోపలి గదిలో అలమరలో పెట్టింది రాధాబాయి. పమిట చెంగుతో చేతులు తుడుచుకుంటూ భర్త దగ్గరికి వచ్చింది.

“మన కడుపున పుట్టిన బిడ్డ ఇటువంటి ధైర్యం చెప్పగలిగి వుండేవాడా? మన బాధను తన బాధగా మలుచుకోగలిగి వుండేవాడా??” కుర్చీ ప్రక్కన కూర్చుంటున్న భార్యను అడిగాడు బాబూలాల్.

“భాను నా కడుపున పుట్టిన వాడే అనుకుంటున్నాను నేను..... కాదని అనుకునేది నువ్వే.... నేను కాదు....” అతని కాలుమీది కట్టును సరిచేస్తూ అన్నదామె.

*　　　　*　　　　*　　　　*　　　　*

“డొక్కు సినిమా ఇది.... అమోఘంగా వుంటుందని అనుకుంటే హడలగొట్టి చంపేస్తోంది....” అంటూ కుర్చీలో నుంచి లేవబోయింది గీతిక.

ప్రేమభిక్ష పెట్టమని ప్రాధేయపడుతున్న హీరోని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తోంది హీరోయిన్. తన వెంటపడితే వళ్ళు హూనం చేయిస్తానని బెదిరిస్తోంది.

హీరోకి వున్న ఆస్తినీ, అంతస్తునీ లెక్కచేయకుండా దమ్ముగా మాట్లాడుతున్న హీరోయిన్‌ని చూసి మెచ్చుకోకుండా, అసహ్యించుకుంటున్న గీతికను చూసి విస్తుబోయారు ఆమె ఫ్రెండ్స్.

“సినిమాకు తీసుకురావటంతో నీ డ్యూటీ ముగిసింది. ఎప్పుడు వెళ్ళిపోవాలో డిసైడ్ చేయాల్సింది నువ్వు కాదు. నీకు బాగున్నా బాగోక పోయినా ఈ సినిమా మాకు బాగున్నది... ఆఖరి వరకూ చూసి తీరాల్సిందే” గీతికను తిరిగి కుర్చీలోకి లాగుతూ నిర్మొహమాటంగా తమ అభిప్రాయాన్ని తెలియచేశారు.

హీరోని ఏడిపించే కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళిపోయింది హీరోయిన్... తన గదిలో బెడ్ మీద పడుకొని ఏదో పుస్తకాన్ని తెరిచింది. అందులో నుంచి ఒక గ్రీటింగ్ కార్డ్ జారి ఆమె గుండెలమీద పడింది.

ఆడ చిలుకను ఆప్యాయంగా తన ముక్కుతో పలుకరిస్తున్న మగ చిలుక బొమ్మ వుంది ఆ గ్రీటింగ్ కార్డుపైన.....

ఎందుకో నిమీలితాలైనాయి హీరోయిన్ కనులు... ఆమె కనుల ముందు వెంటనే ప్రత్యక్షం అయ్యాడు హీరో.

"అట్టర్ నాన్సెన్స్... రైము రిథము లేని వట్టి ట్రాష్...." అంటూ చటుక్కున లేచి నిలబడింది గీతిక.

"ఈ పాత చింతకాయపచ్చడి సినిమాను బాగా ఎంజాయ్ చేయండి. నేను బయట నిలబడి రోడ్డుమీది జనాన్ని చూసి సంతోషిస్తాను...." తనను పట్టుకోబోయిన స్నేహితురాళ్ళను హెచ్చరించి విసవిసా బయటికి వచ్చేసింది.

అప్పుడు బయటికి వచ్చి కారిడార్లో ఒక ప్రక్కగా నిలబడుతున్నప్పుడు ఆమె కంటపడ్డాడు భాను. ఇంటర్వల్ టైము దగ్గర పడటంతో బనారసీ బాబు నడిపే స్వీట్స్ బండిని తీసుకువచ్చి థియేటర్ గేటుకు దగ్గిరగా నిలబెడుతున్నాడు అతను. గేటు తెరవగానే గుంపులు గుంపులుగా వచ్చిపడే కస్టమర్స్‌తో వ్యాపారం చేయటానికి అన్నీ సిద్ధం చేస్తున్నాడు.

తను పొరపాటు పడుతున్నానేమోనని అనుమానం కలిగి కనులు నులుముకుని చూసింది గీతిక.... పది అడుగులు ప్రక్కగా వేసి యింకో యాంగిల్‌లో గట్టిగా పరిశీలించింది. స్వీట్స్ బండి దగ్గిర ఉన్నది ఎవరో నిశ్చయంగా తెలిసేసరికి ఆమెను ఆవరించుకున్నది విచిత్రమైన ఉత్సాహం.

"రండి.... రండి.... మీకో విచిత్రం చూపిస్తాను... త్వరగా బయటికి రండి...." బాల్కనీలో ఉన్న ప్రేక్షకులు అసహనంగా తన వంక చూస్తున్న చూపుల్ని లక్ష్యపెట్టకుండా పెద్ద కంఠంతో తన ఫ్రెండ్స్‌ని పిలిచింది.

"నీ మనసులో ఏదైనా ఒక మాట నాటుకున్నదంటే ఈ జన్మకి మాసిపోదు అది. నువ్వు చూడని సినిమాని మేము చూస్తున్నామని నీ బాధ... ఏదో ఒక విధంగా మమ్మల్ని చెడగొట్టటమే నీ ధ్యేయం...." విసుగ్గా అంటూ బయటికి వచ్చాడు వాళ్ళందరూ.

"లోపల ఆడుతున్న డొక్కు సినిమా కంటే వెయ్యిరెట్లు ఇంట్రస్టింగ్ సినిమాని మీకు చూపిస్తాను.... కమ్ విత్ మీ...." అంటూ వారిని వెంటబెట్టుకుని క్రిందికి వచ్చింద గీతిక. మేనేజర్ ఉండే గది ముందుకు వెళ్ళి చిన్నగా గొంతును సవరించుకున్నది.

టేబిల్ ముందు కూర్చొని ఏవో కాగితాలు చూసుకుంటున్నాడతను. గది ముందు అలికిడిని విని తల ఎత్తి చూశాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ సర్... మీకు ధార్వాడ ఎస్టేట్స్‌ని గురించి తెలుసా?" అతని టేబిల్ ముందుకు పోతూ అన్నది గీతిక.

రెండు క్షణాలపాటు నొసలు ముడివేసి చూశాడు మేనేజర్.

"ధార్వాడ ఎస్టేట్స్ మేనేజర్ హరహరవర్మ గురించి మీరు విన్నారా?" అతను పెదవి విప్పకముందే మరో ప్రశ్న వేసింది గీతిక.

విడిపోయింది మేనేజర్ నొసడి ముడి.

“లాయర్ జనార్ధన్ గారికి బావమరిది కదూ ఆయన?” హరహరవర్మని గురించి తెలిసినట్లు తల వూపుతూ అన్నాడు.

“యు వార్ కరెక్ట్ సర్.... నా పేరు గీతిక... నేను హరహరవర్మ గారి కూతర్ని... లాయర్ జనార్ధన్ గారి మేనకోడల్ని....” అంటూ తనను పరిచయం చేసుకున్నది గీతిక.

వి.ఐ.పి.ని చూసినట్లు చటుక్కున కుర్చీలో నుంచి లేచి నిలబడ్డాడు మేనేజర్.

“లాయర్ జనార్ధన్ గారి క్లయింట్స్‌మి మేము... ఎన్నోసార్లు ఎన్నెన్నో ఇబ్బందుల నుంచి ఆయన చలువ వల్ల తప్పించుకో గలిగాము. కూర్చోమ్మా... వాళ్ళు నీ స్నేహితులా? వాళ్ళని కూడా లోపలికి రమ్మని చెప్పు....” అంటూ టేబుల్ ఎదుట ఉన్న చైర్స్ వంక చేయి ఊపి, టేబిల్ మీది కాలింగ్ బెల్‌ని నొక్కాడు.

పరిగెత్తుకుంటూ వచ్చిన ఆఫీస్ బాయ్‌తో అతను ఒక్కమాట కూడా మాట్లాడకముందే చేతిని ఊపి అతన్ని అడ్డుకున్నది గీతిక.

“నా ఫ్రెండ్స్‌కి గేటు ముందున్న స్వీట్స్ బండిలోని స్వీట్లు తినాలని అనిపించింది. మాకుగా మేము బండి దగ్గిరికి పోతే సిల్లీగా ఉంటుందని చెప్పి ఇక్కడికి వచ్చాము. మీరు అన్యథా భావించకపోతే, కాసిని స్వీట్స్ ప్యాక్ చేయించి, ఆ బండి మనిషితోనే ఇక్కడికి తెప్పించి పెట్టండి. మీ మనిషి తీసుకురావల్సిన అవసరం లేదు.... డబ్బు ఇస్తే బండి వాడే మోసుకువస్తాడు... ఉయ్ విల్ బి

వెయిటింగ్ ఇన్ ది హాల్..." అంటూ కుర్చీలో నుంచి లేచి హేండ్‌బేగ్‌ని ఓపెన్ చేసింది డబ్బు తీయటానికి.

హేండ్‌బేగ్‌ని తెరవటం వరకే చేయగలిగింది ఆమె.

"లాయర్ జనార్థన్ గారి మేనకోడలు మా థియేటర్‌కి వచ్చి ఆఫ్టరాల్ కాసిని రిఫ్రెష్‌మెంట్స్ కోసం డబ్బు బయటికి తీయటమా! అసలు టికెట్ తీసుకోనీయటమే పెద్ద తప్పు..." అంటూ ఆఫీస్ బాయ్‌ని అవతలికి తరిమాడు మేనేజర్.

"తీసుకరమ్మని చెప్పు... బండిలో ఉన్న వెరయిటీ లన్నింటినీ ప్యాక్ చేసి త్వరగా తెమ్మని చెప్పు...." అని ఆర్డర్ ఇచ్చాడు.

అతనికి మరో రెండుసార్లు కృతజ్ఞతలు తెలియజేసుకుని గదిలో నుంచి బయటికి వచ్చింది గీతిక.... గోడల దగ్గర బిగించి ఉన్న కుషన్ సీట్స్ వైపు అడుగులు వేస్తూ తన ఫ్రెండ్స్ వైపు చూసింది.

"బజారు తిళ్ళు తిన్నట్లు తెలిస్తే మా నాన్న గారు డొక్కచీల్చి డోలు కట్టేస్తారు. అసలు రోడ్డుమీది దరిద్రాల్ని తినాలని మాకు కోరిక పుట్టటం ఏమిటి?" ఆమె మాటల్లో ఒక్కటి కూడా అర్థం కాకపోవటం వల్ల అయోమయంగా చూస్తూ అడిగింది ఒక ఫ్రెండ్.

"లోపల ఉన్న సినిమాకంటే వెయ్యిరెట్లు ఇంట్రస్టింగ్‌గా ఉండే సినిమా అంటే రోడ్డు మీదినుంచి తెప్పించిన స్వీట్స్ తినటమా?" వెంటనే ప్రశ్నించింది రెండో ఫ్రెండ్.

మిగిలిన ఇద్దరి ముఖాల్లో కూడా అటువంటి ప్రశ్నార్థకాలే మెదులుతూ ఉండటాన్ని చూసి ఇంకా కాస్త గుంభనంగా నవ్వింది గీతిక.

"చెప్పిన పనిని చెప్పినట్లు చేయటం, అన్న మాటను అన్నట్లుగానే పోషించుకోవటం నా స్పెషాలిటీ.... యువార్ గోయింగ్ టు విట్‌నెస్ యాన్ ఇంట్రెస్టింగ్ సీన్... కాకుల మాదిరి గోల చేయకుండా తాపీగా కూర్చోండి...." అంటూ వారిని కుషన్ సీట్స్‌లో కూర్చోబెట్టి తను కూడా కూర్చున్నది.

మేనేజర్ గారి ఆజ్ఞల్ని అక్షరాలా అమలు పరిచాడు ఆఫీస్ బాయ్. గేటు బయటికి పోయి బనారసీ బాబు బండిని చేరుకున్నాడు. మేనేజర్ మాటల్ని భానుకు వినిపించి, "అర్జంటుగా బయలుదేరు.... ఆలస్యం చేస్తే అవతల సినిమా పోతుంది..." అంటూ తొందరపెట్టాడు.

బండి క్రింది భాగంలో నుంచి పాకింగ్ లీవ్స్‌ని తీస్తూ బండి మీది నూనె భాండీ బాలెన్స్‌ని సరిచూసుకుంటున్న బనారసీ బాబుకేసి చూశాడు భాను.

"నాలుగు సంవత్సరాలనుంచీ ఇక్కడ వ్యాపారం చేస్తున్నాను.... నమస్కారం పెడితే అసహ్యంగా ముఖం పెట్టకొని అవతలికి పోవటం తప్ప పలకరింపుగా నవ్విన పాపాన పోలేదు మేనేజర్ గారు. ఒక్కసారిగా మన సరుకు మీద మనసు పడ్డారంటే ఆశ్చర్యంగానే వుంది...." తను చేస్తున్న పని మీది నుంచి తల తిప్పకుండా లోగొంతుకతో అన్నాడు అతను.

ఆ పైన అతని అనుజ్ఞ కోసం ఎదురు చూడలేదు భాను. బండిలో ఉన్న వెరైటీలన్నిటినీ ఆకుల్లో పెట్టి నీట్‌గా ప్యాక్ చేశాడు. వాటిన్నిటినీ కలిపి ఒక పేపర్లో చుట్టుకొని ఆఫీస్ బాయ్ వెనకాలే హాల్లోకి వచ్చాడు.

"అరుగో.. వారికి అవి.. పొట్లాలు విప్పి వాళ్ళకి ఇవ్వు...." కుషన్ సీట్స్‌లో కూర్చొని ఉన్న పడుచుల వైపు చూపిస్తూ అన్నాడు ఆఫీస్ బాయ్.

"హల్లో మిస్టర్ భానూ.... ఇంటి దగ్గిర్నించి కబురు వచ్చిందన్న నెపంతో కాలేజీ ఎగగొట్టి ఇక్కడ ఈ డర్టీ బిజినెస్ చేస్తున్నావా? ఏమాత్రం గిట్టుబాటు అవుతోంది రోజుకి?" కాలుమీద కాలు వేసుకొని విలాసంగా కదిలిస్తూ అడిగింది గీతిక.

ఆమె ఊహించినట్లే భానును ఆ రూపంలో చూసి ఆవాక్కయిపోయారు ఆమె స్నేహితురాళ్ళు.

గోల్డ్ మెడలిస్టే కాకపోయినా, ఫస్ట్ క్లాస్ తెచ్చుకోగలడని లెక్చరర్ అందరూ విశ్వసించే తెలివైన స్టూడెంట్ అతను. నేషనల్ లెవల్లో పోటీలకు పోయేటంత నేర్పు లేకపోయినా, యూనివర్శిటీ పరిధిలో మంచి పేరుగల స్పోర్ట్స్ మన్.

ఒకరి జోలికి పోకుండా, ఎవరితోను మాట పడకుండా చాలా మంచివాడని అందరిచేతా మన్ననలు పొందే భాను ఆఫ్టరాల్ ఒక స్ట్రీట్ వెండరా?

స్ట్రీట్ వెండింగ్ అంటే అసహ్యించుకోవాల్సిన విషయమనే అభిప్రాయం చాలా గట్టిగా మనసుల్లో నాటుకుపోయి ఉండటం వల్ల అతను చేస్తున్న పనిని

హర్షించటం వారికి చేతకాలేదు. అతనివంక వెక్కరింపుగా చూడకుండా ఉండటం కూడా వారికి అసాధ్యమైంది.

తమను చూసి అతను ష్రింక్ అవుతాడని, తన మాటలకు సమాధానం చెప్పలేక తెల్లముఖం వేస్తాడని ఎదురుచూసిన గీతకకు మాత్రం ఆశాభంగమే ఎదురయింది.

తడబాటు అనేది లేకుడా, కనురెప్పల్ని కూడా కదిలించకుండా సూటిగా ఆమె ముందుకు వచ్చి, కాలేజీ గేటు దగ్గిర ఎదురైతే ఎలా పలుకరింపుగా నవ్వుతాడో అదే మాదిరి నిర్వికారంగా నవ్వాడు భాను.

"హాయిగా లోపల కూర్చోని ఆనందంగా సినిమాను చూడకుండా బయట చక్కర్లు కొడుకున్నారెందుకని? సినిమా మీకు నచ్చలేదా?" తీసుకువచ్చిన పొట్లాలను ఆమె ప్రక్కనే పెడుతూ అడిగాడు.

"నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా మాట దాటేస్తావెందుకు?" అసహ్యంగా ఆ పొట్లాల వంక చూస్తూ అన్నది గీతిక.

"మాట దాటవేయాల్సిన అవసరం లేదు మిస్ గీతికా! రోజుకు పది పన్నెండు రూపాయల ఆదాయం వచ్చే బిజినెస్ ఇది... నా కాలేజి చదువును పోషిస్తూన్న కామధేనువు...." అన్నాడు భాను.

తను చేసే పనిని సమర్థించుకోవటం కోసం అతను పెద్ద పెద్ద మాటలు వాడితే, వెనువెంటనే ఆర్గ్యుమెంటు పెట్టుకొని అతని మాటలన్నిటినీ ఖండించాలని

గుక్క తిరక్కుండా చేయాలని ఎంతో ఉత్సాహపడిన గీతిక, సింపిల్‌గా, సూటిగా ఉన్న అతని సమాధానాన్ని విని పెదవి విప్పలేకపోయింది.

"రిఫయిండ్ ఆయిల్‌తోనో, ఖరీదయిన నేతితోనో తయారుచేయబడే స్వీట్స్ తినేవారికి, ఆర్డినరీ నూనెతో ప్రిపేర్ చేసే ఈ పదార్థాలు సామాన్యంగా నచ్చవు. జాగ్రత్తగా చూసుకు తినండి...." అంటూ వెను తిరిగాడు భాను.

ఏదో ఒక విధంగా అతన్ని కించపరిచి తల దించుకునే టట్లు చేయాలన్న కోరిక మనసును వదిలి అవతలికి పోకపోవటంతో, "ఆగు... భాను... ఆగు..." అంటూ కుర్చీలోంచి లేచింది గీతిక.

"ప్లీజ్ గీతికా.... ఇంటర్వల్ టైమ్ అయింది... మీతో కబుర్లు చెపుతూ కూర్చుంటే నా బాస్ వంటరి వాడైపోతాడు... తనే సరుకును ప్రిపేర్ చేయాలి... తనే అమ్ముకోవాలంటే జరిగే పనికాదు. " అసహనంగా అన్నాడు భాను వెనుతిరిగి చూస్తూ.

"స్వీట్స్ తీసుకురమ్మని నీ దగ్గిరికి వచ్చిన మనిషి వీటికి డబ్బు ఇచ్చాడా?" హేండ్‌బేగ్‌ని సిద్ధంగా పట్టుకుంటూ అడిగింది గీతిక.

తల అడ్డంగా తిప్పాడు భాను ఇవ్వలేదని సూచించటానికి.

గీతిక ఎదురుచూసిన సమాధానం అదే!

థౌజండ్ వాల్ట్ బల్బు మాదిరి గుప్పున కాంతి వంతమయిందామె ముఖం.

చటుక్కున హేండ్‌బేగ్ తెరిచి వంద రూపాయల కాగితాన్ని బయటికి తీసిందామె.

“బిల్లు తీసుకో... మిగిలిన ఛేంజిని నువ్వే ఉంచుకో... రేపు ఏదయినా ఫీజు కట్టాలంటే ఉపయోగపడుతుంది” అంటూ ముందుకు జాచిందా నోటును.

తన క్లాస్‌మేట్ దగ్గిర టిప్ తీసుకోవాల్సి వచ్చినందుకు వివర్ణమై పోవాలి భాను ముఖం – ఆమె లెక్క ప్రకారం.

అటువంటిదేమీ జరగలేదు సరికదా... అందమైన చిరునవ్వు నవ్వుతూ మళ్ళీ తల అడ్డం తిప్పాడు భాను.

“మేనేజర్ గారి కోరికమీద తీసుకువచ్చాను స్వీట్స్‌ని.... ఈ థియేటర్ మీద ఆధారపడి బ్రతుకుతున్నందువల్ల మేనేజర్ గారికి బిల్లు వేయటం జరగదు....” అంటూ ఆమె రియాక్షన్ కోసం ఎదురుచూడకుండా బయటికి వెళ్ళిపోయాడు.

అదే సమయంలో మ్రోగింది ఇంటర్వల్‌ని సూచించే బజర్. గుంపులు గుంపులుగా బయటికి వస్తున్న ప్రేక్షకుల ముందు మళ్ళీ అతన్ని పిలిచి వాదన పెట్టుకోవటం ఇష్టం లేక మౌనంగా ఉండిపోయింది గీతిక.

“తను చేసే పనుల్లో తప్పులెంచే అవకాశం ఎవరికీ ఇవ్వకపోవటం తన స్పెషాలిటీ. రోడ్డుమీద జంతికలు అమ్ముకునే వ్యాపారాన్ని కూడా ఫారిన్ కొలాబరేషన్‌తో నడిపే మల్టిపుల్ ఇండస్ట్రీ క్రింద మనల్ని నమ్మించిపోయాడు. అతన్ని వెర్రివాడిని చేయబోయి మనమే వెర్రివాళ్ళమయినాం” లోగొంతుకతో తన అభిప్రాయాన్ని తడుముకోకుండా చెప్పింది ఒక ఫ్రెండ్.

“నువ్వు కాసేపు నోరు మూసుకుంటావా?” కోపంగా అంది గీతిక.

"ఎప్పుడో మూసుకున్నాను తల్లీ... నీ మాటల్ని బలపరిచి భాను దృష్టిలో బ్లాక్‌షీప్‌గా ముద్రింపబడినందుకు చెంపలు వేసుకొని గట్టిగా మూసుకున్నాను..." అనుకున్నదా ఫ్రెండ్ మనసులో. బయటికి మాత్రం ఒక నవ్వు నవ్వి ఊరుకున్నది.

* * * * *

సెకండ్ షో ఇంటర్వల్ అయిపోగానే ఆ రోజుకు వ్యాపారాన్ని బంద్ చేశాడు బనారసీ బాబు. బండిని సర్దుకుని ఇంటిదారి పట్టబోతూ భాను చేతిలో పది రూపాయలు పెట్టాడు.

"ఇవ్వాళ మాట్నీ టైమ్‌కి కూడా వచ్చినందుకు ఇదిగో ఐదు రూపాయలు ఇస్తాను" అంటూ ఐదు రూపాయల కాగితంతో పాటు మరో ఇరవై నోటును కూడా బయటికి తీశాడు.

"సరుకులు ఏమైనా తీసుకురావాలా?" ఆ నోటు ఎందుకు తీశాడో అర్థం కాక అడిగాడు భాను.

"ఇవాళ ఓ ఇరవై అడ్వాన్స్ కావాలని అడిగి, అప్పుడే మర్చిపోయావా? నీకు చదువు ఎక్కువైన కొద్దీ మతి తగ్గిపోతున్నదే భానూ" ఆ రెండు నోట్లనూ అతని జేబులో పెడుతూ వెక్కిరించాడు బనారసీ బాబు.

ఫస్ట్ షో ఇంటర్వల్ సమయంలో వచ్చి డ్యూటీలో జాయినవుతాడు భాను. ఆ అలవాటుకు భిన్నంగా ఆ రోజు మధ్యాహ్నమే అక్కడికి వచ్చింది అడ్వాన్స్ అడగటం కోసమే.

తన మతి మరుపుతనానికి నాలుక కొరుక్కుంటూ థియేటర్ ప్రక్కభాగంలో స్టాండ్ వేసివున్న సైకిల్‌ని తెచ్చుకోవటానికి వెళ్ళాడు.

అతను వచ్చేదాకా ఆగాడు బనారసీ బాబు.

"ఏమిటి విశేషం? నా మతిమరుపుతనానికి సంబంధించిన విశేషం ఇంకోటి గుర్తుకువచ్చిందా?" అడిగాడు భాను.

"ఎందుకయినా మంచిది కాస్తంత వెనకా ముందూ చూసుకుంటూ వెళ్ళు బే.... రోజులన్నీ మనవే అనుకోవటం మంచిది కాదు" బండిని కదిలించకుండా లోగొంతుకతో హెచ్చరించాడు బనారసీ బాబు.

వెనకా ముందూ చూసుకుంటూ వెళ్ళటమేమిటో అంతుబట్టలేదు భానుకు.

"నిజంగానే నీకు మతిమరుపు వచ్చేసింది బే.... ఈరోజు ఉదయం నువ్వు ఆలీమియా చంచాలతో పడిన ఘర్షణ గురించి చెపుతున్నాను.... చీకటి వేళ ఈలపాటలు పాడుకుంటూ అజాగ్రత్తగా ఉన్నవంటే ఖర్చుయిపోగలవ్... ఇప్పటికిప్పుడు ఇంకో కొత్తమనిషిని వెతుక్కుని బండి దగ్గిర ట్రెయినింగ్ ఇవ్వటానికి నాకు చాలా కష్టం" అంటూ బండిని ముందుకు కదిలించాడు బనారసీ బాబు.

సైకిల్ ఎక్కుతూ ఆలోచనలో పడ్డాడు భాను.

బనారసీ బాబు అలా హెచ్చరించటంలో తప్పేమీ లేదు.

తన అనుచరుల్ని తన్ని తరిమినందుకు ఆగ్రహంతో రగులుకుపోతూ, సకుటుంబ, బంధుమిత్ర సపరివార సమేతంగా దండు వచ్చివుండాలి ఆలీమియా... సినిమాహాలు ముందున్న వ్యాపారస్థులందరూ చూస్తూ ఉండగా తన ఎముకలు విరిచి నడిరోడ్డుమీద బూటుకాళ్ళతో మట్టగించాలి.

పది, పన్నెండు గంటలు గడిచిపోయాయి గలాట జరిగి... గడియారంలో డేట్ కూడా మారిపోతున్నది...

ఇంకా రాలేదెందుకని అతను??

"నీ కోసమే ఎదురు చూస్తున్నాను... పెళ్ళికొడుకు మాదిరి వయ్యారాలు పోకుండా తొందరగా రావయ్యా బాబూ... త్వరగా రా..." అని పిలుపొకటి వినబడడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు.

సినిమా హాలుకు కాస్తంత దూరంగా చిన్న పాన్‌షాపును నడుపుకుంటూ ఉండే రామ్‌జీ పిలుపు అది.

కాలికి దెబ్బ తగలడం వల్ల బాబూలాల్ బయటికి రావటం ఇంపాజిబుల్ అని తెలిసి కూడా, ఒకసారి చుట్టూ చూసుకున్నాడు భాను.... సైకిల్‌ని రోడ్డు మీదే వదిలి, రాంజీ దగ్గిర ఒక సిగరెట్‌ని తీసుకున్నాడు.

"ఇవ్వాళో రేపో ఎప్పుడో ఒకప్పుడు నీ గుట్టు కాస్తా మీ బాబాయికి తెలిసిపోతుంది... తిట్టిన తిట్టు తిట్టకుండా అరగంటసేపు తిట్టి, నీ చెమడాలు ఎక్కతీస్తాడు నాకు తెలుసు" ఆగ్గిపెట్టెను అందిస్తూ అతని భవిష్యత్‌ని తెలియచేశాడు రాంజీ.

సిగరెట్ పొగను గుండెలనిండా పీల్చుకుంటూ చిరునవ్వు నవ్వాడు.

ఆ రోజు ఉదయం ఇంటి దగ్గిర్నించి బయలుదేరే సమయంలో ఎదురువచ్చిన ఒంటి బ్రాహ్మడి శకునంతో ప్రారంభించాడు రాంజీ....

బడ్డీ తెరిచే సమయంలో ఇనుపబద్దల మధ్య పడి వేలు నలగటాన్ని గురించి, పాత బాకీని అడిగినందుకు తన్నబోయిన తాగుబోతు కస్టమర్‌ని గురించి, వ్యాపారం వదిలేసి పెళ్ళి చేసుకుంటానని అంటున్న పక్కకొట్టు పంకజం వగలు గురించీ, టేప్ రికార్డర్ మాదిరి సవివరంగా చెప్పాడు.

ఎప్పటి మాదిరిగానే ఓపికగా విన్నాడు భాను. సిగరెట్ కాల్చుకోవటం పూర్తికాగానే పాంటుజేబులో నుంచి చిల్లరను తీసి కాష్‌బాక్స్ మీద పెట్టాడు.

“నువ్వు కాల్చే ఒక్క సిగరెట్‌కి డబ్బులు తీసుకోవటం నాకు చాలా నామర్దాగా వుంది భానూ... అచ్చొచ్చిన చేయని కక్కుర్తి పడుతున్నా గాని అసలు నీకు ఊరికే ఇచ్చేయాలి....” అంటూ ఆ చిల్లరను కళ్ళకద్దుకుని కాష్‌బాక్స్‌లో పడేసుకున్నాడు రాంజీ.. బడ్డీని మూసేందుకు బయటికి వచ్చాడు.

అక్కడే ఆగితే అతను అంతకుముందు చెప్పటం మరిచిపోయిన విశేషాల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటాడన్న భయంతో రోడ్డుమీదికి వచ్చి సైకిల్ ఎక్కబోతుండగా పరుగు పరుగున భాను దారికి అడ్డువచ్చారు ఇద్దరు ఆడవాళ్ళు.

బడ్డీకొట్టుకు వెనుక భాగంలో ఉండే మురికి వాడ పౌరులు వాళ్ళు. వయసులో ఉండగా బాబూలాల్‌తో కలిసి బస్ స్టేషన్ దగ్గిర బీట్లు కొట్టిన వాళ్లు.

“మన రాములయ్య అమ్మమ్మకి ఎదురు గుటకలు ప్రారంభం అయ్యాయి. తులసీ తీర్థం పోసినా జీవుడు పైకి పోవటం లేదు... ఆఖరిసారిగా మనవడిని చూడాలనే కోరికతో కొట్టుమిట్టాడుతోందని అందరూ అంటున్నారు... నువ్వు వెళ్ళి

రాములయ్యని పిలుచుకు రాగలవా??" సైకిల్ హేండిల్‌ని పట్టుకుంటూ అడిగింది ఒకామె.

సిటీకి నాలుగుమైళ్ళ దూరంలో ఉండే చిన్న బాట్లింగ్ ఫ్యాక్టరీలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ ఉంటాడు రాములయ్య.

అతని బంధువులు, స్నేహితులు ఎందరో ఉండగా తననే ఆ పని చేయమని చెప్పటం దేనికో భానుకు అర్థం కాలేదు.

"కబుర్లు చెప్పటానికి తప్ప ఇంకెందుకూ పనికిరారు వాళ్లు. ఈ వేళప్పుడు నువ్వు ఇటుగా వస్తావని, రాంజీ బడ్డీకొట్టు దగ్గిర ఆగుతావని తెలిసి నీ కోసమే ఎదురుచూస్తున్నాం.... కాస్తంత వెళ్ళి రాములయ్యని వెంటబెట్టుకొని రామ్మా... మనవడికోసం తపించిపోతున్న ముసలిదాని బాధను విరగడ చేయి...." భాను ఆలోచనను అర్థం చేసుకుని అనునయంగా అన్నది రెండో ఆడమనిషి.

కాదని అనలేకపోయాడు భాను.... సైకిల్‌ని ప్రక్కకు తిప్పి సిటీ లిమిట్స్‌వైపు పోనిచ్చాడు.

## 5

నాలుగు మూరల పొడవుండే లాటీ కర్రతో నేలను తడుతూ బాట్లింగ్ ఫ్యాక్టరీ ఆవరణచుట్టూ ఒక రౌండ్ కొట్టి వచ్చాడు రాములయ్య. రివ్వు రివ్వున వీస్తున్న చలిగాలిని తట్టుకోలేక బీడీ నొకదాన్ని వెలిగించుకుంటుండగా, చెమటలు కక్కుతూ అతని ముందు ప్రత్యక్షమయ్యాడు భాను.

“బయలు రాములయ్యా... అర్జంట్‌గా బయలుదేరు....” అంటూ తను తీసుకువచ్చిన మెస్సేజిని అతనికి వినిపించాడు.

ఫ్యాక్టరీని వదిలి పోవటానికి ధైర్యం చాలక బేజారయిపోయాడు రాములయ్య. ఆఖరి క్షణాలలో ఉన్న అమ్మమ్మను తలచుకొని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

“ఏం చేయమంటావ్ భానూ? ఉద్యోగం ఊడిపోతే నేను నా కుటుంబం వీధుల్లో పడాల్సివస్తుంది.... ఏం చేయాలి నేనిప్పుడు?”అంటూ చేతుల్లో ముఖం దాచుకుని బావురుమన్నాడు.

వేగంగా ఆలోచించి వెంటనే తీసుకున్నాడు భాను ఒక నిర్ణయాన్ని.

“నీకు బదులుగా నేను డ్యూటీ చేస్తాను... నువ్వు ఇంటికి వెళ్ళి ముసమ్మని చూసి త్వరగా వచ్చేయ్... తెల్లారకముందే తిరిగివస్తే సమస్య ఉండదు....” అంటూ తన సైకిల్‌ని అతనికి ఇచ్చి రోడ్డు వైపుకు నెట్టాడు.

అతనికి కృతజ్ఞతలు తెలియచేసుకోవటాన్ని కూడా మరిచిపోయి సైకిల్ ఎక్కాడు రాములయ్య. పది క్షణాల్లో ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోయాడు.

అతను ఉపయోగించే లాటీని పట్టుకొని ఫ్యాక్టరీ ఆవరణ చుట్టూ రెండు రౌండ్లు కొట్టాడు భాను... అతను ఊదినట్లు పెద్దగా విజిల్ ఊదాడు. గేటు ముందుకు వచ్చి, అక్కడ ఉండే బెంచీమీద కూర్చోబోతుండగా వేగంగా వచ్చి అతని ముందు ఆగిందొక అంబాసిడర్ కారు.

చీకటి సమయంలో అక్కడికి వచ్చేవాళ్లు ఎవరూ ఉండరనే ధైర్యముతో రాములయ్యని అవతలికి పంపించాడు భాను... ఎవరైనా వచ్చే అవకాశం ఉందని ఏమాత్రం అనుమానం తోచినా అటువంటి పనిచేసి ఉండేవాడు కాదు.

"గేటు తీయమని నీకు ప్రత్యకంగా చెప్పాలా? చెప్పందే గేటు తీయావా?" కరకరమంటున్న కంఠం ఒకటి కార్లో నుంచి వినిపించటంతో, తన ఖంగారును కప్పి పెట్టుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తూ గేటును తెరిచాడు.

కారు కదిలి ముందుకు పోతున్న సమయంలో ప్రక్కనే వున్న నియోన్ లైట్ వెలుగు పడి అతనికి స్పష్టంగా ఆగుపించాడు ఫ్రంట్ సీటులో కూర్చుని వున్న ఆలీమియా.

వాతావరణం ఎంత చల్లగా వున్నా, నడివేసవి మండుటెండలో నిలబడినట్లు చెమటలతో తడిసిపోయింది భాను ముఖం.

రాములయ్యని ఆవతలికి పంపి అతని స్థానంలో తను నిలబడటం పెద్ద తప్పు అయిందని అనిపించింది అతనికి.

ఉద్యోగం ఊడితే తను పడవలసిన పాట్లన్నిటినీ రాములయ్య ఏకరువు పెట్టి వున్నందున తెగించలేకపోయాడు గాని, అప్పటికప్పుడు అటునుంచి అటే సిటీలోకి పరుగు తీద్దామనే కోరిక అతనికి కలిగిన మాట వాస్తవం.

"ఇంకో అరగంటలో మీ ఓనర్ గాడు వస్తాడు.. చూస్తూ వుండు జాగ్రత్తగా...." భుజం మీది నించి వెనక్కి చూస్తూ ఇంకో ఆర్డర్‌ని ఆలీమియా పాస్ చేసేసరికి వదిలిపోయింది అతన్ని ఆవరించుకున్న స్తబ్దత.

తెలిసి తెలిసి పెట్టాడు తను రోట్లో తలని. రోకటి పోటుకు వెరవటంలో అర్థం ఏమైనా వున్నదా??

ఆలీమియా అన్నట్లుగానే అరగంట కూడా పూర్తిగా గడవక ముందే బ్లూ కలర్ మారుతీలో గేటు ముందు ప్రత్యక్షమైనాడు బాట్లింగ్ ఫ్యాక్టరీ యజమాని.

ఆలామియా చెప్పటం వల్ల అతను ఓనరై వుంటాడని వుహించచటమే గాని, యదార్ధంగా భానుకు తెలియదు అతనెవరో.

ఓనర్ని చూసి ఫ్యాక్టరీ వర్కర్లు ఎలా వణికిపోతారో ఊహించటానికి ప్రయత్నం చేస్తూ వినయాతి వినయంగా శాల్యూట్ చేసి మళ్ళీ గేటును తెరిచాడు భాను.

"ఆలీమియా వచ్చాడా?" హుందాగా అడిగాడు ఓనర్.

నోరు తెరిస్తే తన ఐడెంటిటీ బయట పడుతుందన్న భయంతో మరింత వినయంగా తల ఊపి లోపలి వైపుకు చేయి వూపాడు భాను.

"గేటును లాక్ చేసి నువ్వు లోపల వుండు... ఎవర్నీ గేటు దగ్గిర నిలబడనీయకు...." చీకటి సమయంలో అటువంటి జాగ్రత్తలు అవసరమని తెలిసినా మాటవరసకు హెచ్చరించి వెళ్ళిపోయాడు ఓనర్.

ఆవరణ మధ్యలో ఆగివున్న అంబాసిడార్ ప్రక్కనే మారుతీని ఆపి అక్కడికి దగ్గిర్లోనే వెయిట్ చేస్తున్న ఆలీమియా వైపు అడుగులు వేశాడు.

ఆయన ఆర్డరిచ్చిట్టు గేటుకు తాళం వేసి, గేటు ప్రక్కనే వుండే చెక్కల కట్టడం ముందు నిలబడ్డాడు భాను.

చీకటి మూలకంగా తను పరాయి మనిషని గ్రహించలేదు ఫ్యాక్టరీ ఓనర్. తన అనుచరులతో తగాదా పడిన మనిషి ఆ సమయంలో అక్కడ వాచ్‌మన్ వేషంలో ప్రత్యక్షమౌతాడని ఊహించలేకపోవడం వల్ల గుర్తుపట్టలేదు ఆలీమియా.

ఎంతసేపు కొనసాగించగలడు తను ఆ నాటకాన్ని? గుట్టు రట్టు కాకుండా, రాములయ్య ఉద్యోగానికి ఎసరు రాకుండా క్షేమంగా అక్కడి నించి బయటపడటం సాధ్యపడుతుందా?

సూది క్రింద పడినా పెద్దగా వినిపించేటంత దట్టంగా వున్న అక్కడి నిశ్శబ్దాన్ని చీలుస్తూ మాటలు గట్టిగా వినబడటంతో అంతం అయిపోయాయి భాను ఆలోచనలు. తనకు తెలియకుండానే వాటిని ఆలకించడం ప్రారంభించాడతను.

*　　*　　*　　*　　*

"....అర్ధరాత్రి సమయాల్లో ఇలా మీటింగ్‌లు ఏర్పాటు చేయడం నాకు నచ్చలేదు... ఉన్న పళాన బయలుదేరి రమ్మనడం కూడా ఏమీ బాగోలేదు..." ఖరీదైన సిగరెట్‌ని వెలిగించుకుంటూ కోపంగా అన్నాడు ఫాక్టరీ ఓనర్.

"మీ ఇంటికి మేము వస్తే మీ స్టేటస్‌కి భంగం వాటిల్లుతుందని భయం. ఫోన్‌లో పూర్తిగా మాట్లాడితే ఎవరైనా వింటారని మీకు అనుమానం... ఇక అర్ధరాత్రిళ్ళు ఇలా కలుసుకోవటం తప్ప మరో మార్గం ఏముంది సార్?" మాటకు మాటగా సమాధానం ఇచ్చాడు ఆలీమియా.

“ఇంకో మార్గం ఏదీ లేదని చెప్పి నా ఫాక్టరీలోకే వచ్చి కూర్చుంటావా గేటు దగ్గిర వున్న వాచ్‌మన్‌కి మన మాటలు వినబడితే ఎంత ప్రమాదమో ఆలోచించావా?” విసుగ్గా అంటూ ప్రక్కకు తిరిగాడు ఫాక్టరీ ఓనర్.

“అర్థం అయినంత మాత్రన ఇప్పుడు వచ్చిన నష్టం ఏమీ లేదు.... పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే వాడి పళ్ళు రాలగొట్టి రైలు పట్టాలమీద పడుకోబెట్టెస్తాను.... అనవసరమైన అనుమానాలతో కాలహరణం చేయకుండా మిమ్మల్ని ఇక్కడికి పిలిపించిన కారణం వినండి సార్....” అంటూ ఉన్నట్లుండి గేటువైపు చూశాడు ఆలీమియా....

“ఎవడ్రా అది? ఇటురా... ఒక్కసారి ఇక్కడికి రా....” అంటూ భానును పిలిచాడు.

నిలుచున్న చోటు నుండి ఒక్క అంగుళం కూడా కదలలేదు భాను... తలతిప్పి అటుకేసి చూడను కూడా చూడలేదు.

స్పష్టంగా వినవస్తున్న వారి మాటలను బట్టి, తను అక్కడ వుండటం వల్ల ఫాక్టరీ ఓనర్ తడబడుతున్నట్లు అర్థం అయిందతనికి. తమ మాటలు గేటు దగ్గిరికి వినిపిస్తున్నాయో లేదో టెస్ట్ చేయటానికి పిలిచి వుంటాడు ఆలీమియా.... కాసేపు వినబడనట్లు నటిస్తే వచ్చే నష్టం ఏముందిట??

పది క్షణాలు గడిచినా గేటు దగ్గిర మనిషిలో చలనం కనిపించక పోయేసరికి, మరోసారి పిలిచాడు ఆలీమియా. అప్పటికీ అతనిలో కదిలిక రాకపోవడంతో ఫాక్టరీ ఓనర్ కేసి తిరిగి చిరునవ్వు నవ్వాడు.

“నువ్వు చెప్పదల్చుకున్నదేమిటో త్వరగా చెప్పు....” కాస్తంత తేలికగా గాలి పీల్చుకుంటూ తొందర పెట్టాడతను.

“పోయిన నెలలో మనం ఆర్డర్ ఇచ్చిన సరుకు బొంబాయి నించి వచ్చింది. మార్కెట్‌లోకి పంపించేసి చేతులు దులుపుకుందామని అనుకుంటుండగా, పోలీసులకు ఇన్ఫర్మేషన్ అందింది....” మాటల్ని తూచి తూచి వుపయోగిస్తూ తన ప్రాబ్లమ్‌ని గురించి అతనికి చెప్పాడు ఆలీమియా.

“పోలీసులకు ఇన్ఫర్మేషన్ అందించింది ఎవరు?” వెంటనే ప్రశ్నించాడు ఫాక్టరీ ఓనర్.

“పోలీసులకు ఎవరు ఇన్ఫర్మేషన్ అందించారో తెలుసుకోవడానికి మిమ్మల్ని పిలిపించలేదు... ఈ పట్టణంలో మనకు పగవాళ్ళు ఎవరూ లేరు. మన వాళ్ళకి అడ్డురాగల దమ్ము ఎవరికీ లేదు.... ఇన్ఫర్మేషన్‌ని అందుకున్న పోలీసులు ఎంక్వయిరీలు ప్రారంభించారు. మన పేర్లు బయటికి రాకముందే వాళ్లని ఆపాలి....”

“ఈ పట్టణంలో మీ దారికి అడ్డురాగల దమ్ము ఎవరికీ లేదని చాలా నమ్మకంగా చెపుతున్నావ్.... ఇవాళ ఉదయం ఎవరో కాలేజీ స్టూడెంట్ చేతిలో చావు దెబ్బలు తిని వచ్చారట గదా నీ స్నేహితులు....” మాట్లాడుతున్న విషయాన్ని ప్రక్కకు పెట్టి మరో అంశాన్ని ఎత్తుకున్నాడు ఫాక్టరీ ఓనర్.

ఎంతో ప్లెజెంట్‌గా వున్న ఆలీమియా ముఖం వికృతంగా మారిపోయింది ఒక్కసారిగా.

"పీకలదాకా తెగతాగి తాగిన మైకంలో కాస్తంత వెనుకంజ వేశారు నా మనుష్యులు.... పోలీసుల బెడదను వదిలించుకోవటానికి మీరు సరైన ఆలోచన చెబితే మన పని పూర్తి అయిన మరుక్షణం వాడికి ముహూర్తం పెట్టేస్తాను.... సారా కొట్టు దగ్గిర గలాటాని గురించి నేను పట్టించుకుపోవటానికి కారణం బొంబాయి నుంచి సరుకు వచ్చి వుండటమే... ఆ కుర్రాడి అంతుచూడటం చేతకాక కాదు..." పళ్ళు పటపటమని కొరుకుతూ అన్నాడు.

"ఆల్ రైట్... అయితే మీరందరూ ఒక పని చేయండి...." అంటూ అతన్ని అతని అనుచరుల్ని దగ్గిరికి పిలిచాడు ఫాక్టరీ ఓనర్.

"మీ సరుకులో కొంత భాగాన్ని తీసుకుపోయి వన్‌టౌన్ మార్కెట్ ఏరియాలో పేవ్‌మెంట్స్ మీద వుండే ఫుట్‌పాత్ దుకాణాల్లో ప్లాంట్ చేయండి... పని పూర్తి కాగానే పోలీసులకి ఇన్‌ఫాం చేయండి..."

దారుణమైన చలిగాలి వీచినట్లు జలదరించింది తదేక దీక్షగా వారి మాటల్ని వింటున్న భాను శరీరం.

ఫాక్టరీ ఓనర్ ఆలీమియాకి ఇస్తున్న సలహాను తలచుకున్న కొద్దీ అధికం కాసాగింది అతని బ్లడ్ ప్రెషర్.

ఆలీమియా అనుచరులు దొంగసరుకును ఫుట్‌పాత్ దుకాణాలలో ప్లాంట్ చేసిన మరుక్షణం, ఆ దుకాణదారుల మీదికి మరులుతుంది పోలీసుల అనుమానం.

ధనవంతులు కారు ఆ వ్యాపారస్తులు. రెక్క ఆడితే గాని డొక్క ఆడని దీనులు.

మార్కెట్ ఏరియాను ఆనుకొని వుండే మురికివాడలోనే నివశిస్తూ వుండటం వల్ల అందరి మాదిరిగా తను సరుకును తమతో పాటు యిళ్లకు తీసుకుపోరు వాళ్లు. బలమైన గాలివీచినా, భరించరాని వర్షం కురిసినా సరుకు పాడైపోకుండా మైనపు పట్టాలను కప్పి పెద్ద పెద్ద రాళ్ళను బరువు పెడతారు.

ఏ రోజు భత్యం ఆ రోజు సంపాదించుకుంటూ బ్రతుకులు వెళ్ళదీసే తమ వంటి నిరుపేదల జోలికి ఎవరూ రారని వారి నమ్మకం. తమ సరుకును దొంగలించేవాళ్ళు ఎవరూ వుండరని వారి విశ్వాసం.

ఆ విశ్వాసాన్ని, ఆ నమ్మకాన్ని అలుసుగా తీసుకొని దారుణమైన ఆ పథకం వేశాడు ఫాక్టరీ ఓనర్. వారి పేరు మీద పోలీసులకు అనుమానం కలిగించడం ద్వారా ఆలీమియా అవతలికి తప్పించుకునే అవకాశం కల్పిస్తున్నాడు.

"ఫుట్‌పాత్ దుకాణాల్లో సరుకు దొరికిన మరుక్షణం ప్రక్కదారి పడుతుంది పోలీసుల ఎంక్వయిరీ. అసలు విషయం ఏమిటో అందరికీ అర్థం అయ్యేలోపుగా నీ పనులు పూర్తి చేసుకొని చేతులు దులుపుకోవచ్చు...." తన పథకాన్ని పూర్తిగా వివరిస్తూ ఫాక్టరీ ఓనర్ మాటలు కంటిన్యూ చేయటంతో తన ఆలోచనల్ని అదుముకొని చెవులు రిక్కించాడు భాను.

"ఫుట్ పాత్ వర్తకులు నిర్దోషులనీ, వారికి ఏమీ తెలియదనీ పోలీసుల ఎంక్వయిరీలో బయటపడితే?" అనుమానం తీరక ఎదురు ప్రశ్న వేశాడు ఆలీమియా.

అక్కడికి వచ్చిన తరువాత మెట్టమొదటి సారిగా నవ్వాడు ఫాక్టరీ ఓనర్.

"డబ్బులేని వాళ్ళమీద పోలీసుల దృష్టి పడనే కూడదు... పడటం అంటూ జరిగితే బ్రహ్మదేవుడు కూడా వాళ్ళ మనసుల్ని మార్చలేడు.... అనవసరమైన అనుమానాలు పెట్టుకోకుండా నేను చెప్పినట్లు చేసెయ్.. ఇంకెప్పుడూ యిలా అర్ధరాత్రిళ్ళు నన్ను డిస్టర్బ్ చేయకు...." అంటూ తన కారు దగ్గిరికి వెళ్ళాడు.

కారు స్టార్ట్ అయి గేటువైపు తిరిగే దాకా అటుకేసి చూడలేదు భాను. హెడ్‌లైట్స్ వెలుగు తన ముఖం మీద పడబోతున్న సమయంలో కదిలి గేటుకు వేసిన తాళాన్ని తొలగించాడు.

"ఆలీమియా వెళ్ళిపోయిన తర్వాత తాళం వేసేయ్... ఇంకెప్పుడూ నా అనుమతి లేకుండా యిటువంటి సమయల్లో ఎవరినీ లోపలికి రానీయకు...." గేటు దగ్గిర కాస్తంత స్లో చేసి ఠీవి నిండిన కంఠంతో హెచ్చరించాడు ఫాక్టరీ ఓనర్.

అటెంక్షన్‌లో నిలబడి భాను శాల్యూట్ చేయగానే కారును ముందుకు దూకించాడు.

ఆ తరువాత అయిదు నిముషాలకే బయలుదేరాడు ఆలీమియా.

“మేము ఇక్కడికి వచ్చి మీ ఓనర్ గారితో మాట్లాడినట్లు ఎవరికైనా తెలిసిదంటే, తెగిపోతుంది నీ పీక.... అర్థం అయిందా?” ఓనర్ మాదిరిగానే కారును గేటు దగ్గర ఆపించి కరుకుగా హెచ్చరించాడు.

నియోన్ లైట్ వెలుగు తన ముఖం మీద పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, అతనికూడా వినయంగా శాల్యూట్ చేశాడు భాను. కారు వెళ్ళిపోయిన తరువాత గుండెల మీదినుంచి కొండంత బరువు దిగిపోయినట్లు తేలికగా నిట్టూరుస్తూ, బయట వున్న బెంచీ మీద కూర్చున్నాడు.

తూర్పు దిక్కు తెల్లబడటానికి మరికొంచెమే వ్యవధి ఉన్నదనగా పడుతూ లేస్తూ వచ్చి అతని ముందు సైకిల్ దిగాడు రాములయ్య.

“నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను భానూ.... నీ దయవల్ల మా అమ్మమ్మ ఆఖరి చూపులు నాకు దక్కాయి. హాయిగా ప్రాణాలు వదిలేసింది. డ్యూటీ దిగగానే ఇంటికి పోయి మిగిలిన కార్యక్రమాలు పూర్తి చేస్తాను” కృతజ్ఞతలు పూర్వకంగా చూస్తూ అన్నాడు.

గుండెల్లో బాధంతా మాసిపోయేటట్లు ఏడ్చి ఏడ్చి వచ్చాడు కాబోలు ఎరుపు జీరల్ని పులుముకుని వున్నాయి అతని కనులు.

అతను లేని సమయంలో అక్కడికి వచ్చిపోయిన వి.ఐ.పి.లను గురించి చెప్పాలా చెప్పకూడదో తేల్చుకోలేకపోతున్నాడు భాను.

వడిలి ఉన్న అతని ముఖం చూడగానే చెప్పకుండా వుండటమే మంచిదనిపించి, లాఠీని, విజిల్‌ని అతడికి అప్పగించి సైకిల్ ఎక్కాడు. నిద్ర

లేకపోవడం వల్ల మంటలు పెడుతున్న కనుల్ని షర్టు భుజానికి అద్దుకుంటూ యింటిదారి పట్టాడు.

# 6

ఎగ్జామినేషన్స్‌లో రావటానికి అవకాశాలున్న ఇంపార్టెంట్ క్వశ్చన్స్ గురించి ఒక్కనిముషం కూడా వృథా చేయకుండా డిస్కస్ చేశాడు ఇంగ్లీషు లెక్చరర్.

తన్నుకుంటూ వస్తున్న నిద్రను ఎంతో ప్రయత్నం మీద దూరం చేసుకుంటూ ఓపికగా నోట్ చేసుకుంటున్నాడు భాను ఆయన చెప్పిన పాయింట్స్‌ని.

ఎలర్ట్‌గా ఉందామని ఎంతగా ప్రయత్నించినా అప్పుడప్పుడూ ముందుకు వాలటం మానలేదు అతని తల... కనులు మూతలు పడకుండా వుండటం మానలేదు.

"వాటిజ్ ఇట్ భానూ? వాట్ హే పెన్డ్ టూ యూ?" చూసి చూసి విసుగు పుట్టింది కాబోలు – వున్నట్లుండి క్వశ్చన్ చేయనే చేశాడు లెక్చరర్.

ఉలికిపాటును కప్పి పెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ, భాను లేచి నిలబడబోయేంతలో కల్పించుకున్నది అటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్న గీతిక.

"నిన్న మధ్యాహ్నం నుంచీ రాత్రి సెకండ్ షో వదిలిపెట్టేదాకా ప్లాజా థియేటర్ దగ్గిర పాలకోవాలు, జిలేబీ చుట్టల్ని అమ్మి వుంటాడు సర్! అందుకే అలా తయారైనాడు" తడుముకోకుండా చురక అంటించింది.

గొల్లున నవ్వారు క్లాసులో వున్న స్టూడెంట్స్ అందరూ.

భాను అఫెండ్ కాలేదు గాని, వాళ్ళందరూ కలిసి తననే వెక్కిరించినట్లు ఫీలవుతూ షార్ప్‌గా చూశాడు లెక్చరర్.

నిర్భయంగా లేచి నిలబడింది గీతిక.

"ఇట్ జ్ ఎ ఫాక్ట్ సర్... నిన్న నా ఫ్రెండ్స్‌తో సినిమాకు వెళ్ళినప్పుడు తెలిసింది... పాలకోవాలు, జిలేబీ చుట్టలు అమ్మకోవటం భాను ప్రొఫెషన్ ...." తోటి స్టూడెంట్‌ని తేలికగా మట్లాడటం మర్యాద లక్షణం కాదనే సంగతి విస్మరించి వెక్కిరింపుగా అన్నది.

"బజ్జీల బండి దగ్గిర నిలబడి వ్యాపారం చేసుకునే మనిషి కాలేజీ చదువులు చదవకూడదని, అతన్ని తోటి స్టూడెంట్స్‌గా గౌరవించకూడదని మీకు ఎవరైనా బోధించారా?" ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు లెక్చరర్.

సమాధానం ఇవ్వటం గీతికకు చేతకాలేదు.

"వ్యక్తిగతపు విలువల్ని గ్రహించేందుకు తోడ్పడవలసిన ఎడ్యుకేషన్, ఎదుటి మనిషిని కించపరిచేందుకు ఉపయోగపడకూడదు. మనిషి యొక్క విలువను ఆ మనిషికి వుండే ఆస్తి పాస్తులను బట్టి వెలకట్టరు. అతనికి వుండే సంస్కారాన్ని బట్టి

లెక్కవేస్తారు...'' అంటూ టేబిల్ మీద పెట్టిన బుక్స్‌ని చేతిలోకి తీసుకున్నాడు లెక్చరర్.

‘‘చూశారా? తన ఫేవరెట్ స్టూడెంట్‌ని ఒక్కమాట అన్నందుకు మనల్ని ఎన్నెన్ని తిట్లు తిడుతున్నాడో గమనించారా?'' తన ఫ్రెండ్స్ చెవుల్లో గుస గుసలాడింది గీతిక.

‘‘దట్స్ ఆల్ ఫర్ నౌ... హేవ్ ఎ గుడ్ టైమ్....'' స్టూడెంట్స్ అందర్నీ ఉద్దేశించి అంటూ బయలుదేరాడు లెక్చరర్.

గుమ్మం దగ్గిర ఒక్కక్షణం ఆగి, ‘‘ఒకసారి స్టాఫ్‌రూమ్‌కి వచ్చి నన్ను కలుసుకో భానూ...'' అంటూ భానుకు చెప్పి వెళ్ళిపోయాడు.

‘‘వెళ్ళు మిస్టర్ భానూ... వెళ్ళి ఆయన ఇంటి దగ్గిర చేయించుకు వచ్చిన జిలేబీ చుట్టల్ని తిను....'' సన్నటి కంఠంతో రాగయుక్తంగా అన్నది గీతిక.

ఎంత ప్రయత్నించినా ఆపుకోలేక మరోసారి గొల్లుమన్నారు స్టూడెంట్స్.

భాను చాలా షార్ప్‌గా రియాక్ట్ అవుతాడని ఎదురు చూసింది గీతిక. తనకేసి చూసి నోటికి వచ్చినట్లు మాట్లాడతాడని ఊహించి, సమాధానం యిచ్చేందుకు సరైన పదాల్ని ఎంపిక చేసుకుంటూ కూర్చున్నది.

షార్ప్‌గా కాదుగదా, మైల్డ్‌గా కూడా రియాక్ట్ కాలేదు భాను. అసలు ఆమెకేసి చూడను కూడా చూడలేదు. లెక్చరర్ గారు వెళ్ళిపోయిన మరుక్షణం తలను బెంచీమీద ఆనించుకొని గాఢ నిద్దుర లోకి జారిపోయాడు.

* * * * *

"....ఆలీమియా పేరు చెపితే చెమటలు కమ్మి, పారిపోయేందుకు మార్గాలు వెతుక్కుంటారు ఈ సిటీలో వున్న పెద్ద పెద్ద గొప్పవాళ్ళందరూ... అవునా?" లంచ్ అవర్‌కి ముందు లీజర్ పిరియడ్‌లో స్టాఫ్ రూమ్‌కి వచ్చిన భానుతో అన్నాడు ఇంగ్లీష్ లెక్చరర్.

అంతకు ముందు రోజు తను మిస్ అయిన లెసెన్స్ గురించి ఏమైనా చెపుతారేమోనని ఎదురు చూసిన భాను నిరుత్తురుడయ్యాడు క్షణం పాటు. ఆలీమియా ప్రసక్తి ఎందుకు వచ్చిందో ఊహించటానికి ప్రయత్నం చేస్తుండగా, అతని కంట పడ్డాడు స్టాఫ్ రూమ్‌లో డ్యూటీ చేసే అటెండర్ కొమరవేలు.

కొమర వేలు పెదవుల మీద నాట్యం చేస్తున్న చిరునవ్వును చూసేసరికి అర్థమైపోయింది భానుకి....

"కాలేజి బయట ఏం జరుగుతోందో, ఎలా జరుగుతోందో పోగుచేసి పితూరీలు చెప్పటమే నీ కార్యక్రమమా?" కోపంగా చూస్తూ అడిగాడతన్ని "సారా కొట్టు చిన్నా దుకాణంలో ఆలీమియా చంచాలందర్ని కొట్టిన చోట కొట్టకుండా విరగబాదిన సంగతిని కాస్సేపు వదిలేయండి. నిద్ర ముఖంతో కాలేజీకి వచ్చిన కారణం అడగండి...." భాను మాటల్ని పట్టించుకోకుండా లెక్చరర్ గారితో అన్నాడు కొమరవేలు.

"కొమరవేలు మాటల్ని నమ్మకండి సార్.... వయసు పెరుగుతున్న కొద్దీ అనవసరమైన వాగుడు అధికమయింది.... నన్ను ఎందుకు రమ్మన్నారో చెప్పండి...." అంటూ ఆ మాటల్ని మరుగు పరచటానికి ప్రయత్నించాడు భాను....

అతన్ని నోరు మూసుకోమన్నట్లు సైగచేసి కొమరవేలు వైపు చూశాడు లెక్చరర్.

"నువ్వు చెప్పు.... నిద్రముఖంతో కాలేజీకి ఎందుకు వచ్చాడు?" అని అడిగాడు.

ఫ్లాస్కులో వున్న టీని రెండు కప్పుల్లో పోసి ఆయనకు, భానుకు అందిస్తూ రాములయ్యని గురించి, అతగాడి అమ్మమ్మని గురించి చెప్పాడు కొమరవేలు.

రాములయ్యని ఇంటికి పంపి భాను వాచ్‌మన్ డ్యూటీ చేయటాన్ని కూడా సవివరంగా వినిపించాడు.

"ఇట్టాంటి మనిషిని చూసి లవ్వాడాల్సింది పోయి, ముంగిసను చూసిన తాచుపాములా బుసలు కొట్టేస్తుంది ఆ పిల్ల. ఎందుకో ఏమిటో ఎంత ఆలోచించినా నాకు అర్థమై చావటం లేదు..." అంటూ అవతలికి వెళ్ళిపోయాడు.

కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడ్డాడు భాను ఆ మాటల్ని వినేసరికి. "నీకు అసలు బుద్ధి వుందా? నువ్వేం మాట్లాడుతున్నావో నీకు అర్థం అవుతోందా?" కోపంగా అంటూ అతన్ని ఫాలో కాబోతుండగా వారించాడు లెక్చరర్.

"కొమరవేలు మాదిరి కుండ బద్దలు కొట్టినట్లు మాటల్ని ఉపయోగించడం నాకు ఇష్టం వుండదు... కానీ నీ విషయంలో గీతిక ప్రవర్తన నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది... క్లాసులో అంతమంది స్టూడెంట్స్ ఉండగా అందర్నీ వదిలిపెట్టి, ప్రతీ చిన్న విషయానికి నిన్నే ఎత్తిపొడుస్తూ వుండటంలో ఆంతర్యం ఏమిటిట?" అని అడిగాడు చిరునవ్వు నవ్వుతూ.

"మీరు కూడా కొమరవేలు మాదిరిగానే మాట్లాడతారేమిటి సార్? ఈ మాటలు యింకెవరైనా వింటే ఎటువంటి ప్రచారం జరుగుతుందో తెలుసా?" ఇబ్బందిగా చూస్తూ అన్నాడు భాను.

"దేవ దానవులు పాల సముద్రాన్ని మధించేటప్పుడు అమృతానికి ముందుగా హాలహలం పుట్టిందిట. గీతిక విషయంలో ఆ కథ పునరావృతం కాబోతున్నాదా?" అతని మాటల్ని వినిపించుకోకుండా తన మాటల్ని కంటిన్యూ చేశాడు లెక్చరర్ గారు.

అక్కడే వుంటే ఆయన మరికొన్ని మాటల్ని వుపయోగించి తన్ను ఏడిపించటం డెఫినిట్ అని గ్రహించాడు భాను.

"ఆకలి వేస్తోంది సార్.... హడావుడిగా రావటంతో లంచ్ బాక్స్ మరిచిపోయాను. ఆలస్యంగా వెళితే ఖాళీ ప్లేట్లు తప్ప యింకేమీ వుండవు కాంటీన్ లో...." అంటూ తప్పించుకోవటానికి ప్రయత్నించాడు.

"నీకు ఒక ముఖ్యమైన విషయం చెప్పటానికి పిలిచాను. కుర్చీని దగ్గరికి లాక్కుని కంఫర్టబుల్‌గా కుర్చో...." అంటూ ఒక కుర్చీని చూపించాడు లెక్చరర్.

అంతవరకూ దూరదూరంగా నిలబడిన కొమరవేలు కూడా దగ్గరికి వచ్చేసరికి మతిపోయింది భానుకి... లెక్చరర్ గారు చెప్పబోయే విషయం ఏమిటో ఊహించటానికి ప్రయత్నించాడు గాని ఫలితం లేకపోయింది.

"నువ్వు నిక్కర్లు వేసుకుని చీమిడి ముక్కుతో తిరిగిన రోజులు దగ్గర్నించీ నాకు తెలుసు. తను ఎటువంటి అభ్యంతరకరమైన జీవితాన్ని గడిపినా, నిన్ను

మాత్రం నిజాయితీగానే పెంచాడు మీ బాబాయి. కూలీపని చేసి నీ చదువు కయ్యే ఖర్చును భరించింది మీ పిన్ని. నువ్వు పెద్ద చదువులు చదివి, గొప్పవాడివైతే చూసి సంతోషించాలని వారి ఆశయం ..." మాటల్ని తూచి తూచి ఉపయోగిస్తూ చెప్పటం ప్రారంభించాడు లెక్చరర్.

తనేదో తప్పు చేయబట్టే సంభాషణ అలా సీరియస్ టర్న్ తీసుకుంటోందని భావించి, "నేనేం చేశాను సార్? నా ప్రవర్తనలో మీకు ఏ దోషం కనిపించింది?" అని అడిగాడు భాను దీనంగా చూస్తూ.

"ఆర్త త్రాణ పరాయణత్వం చాలా ఎక్కువైపోయింది నీకు ఈ మధ్య.... నీకు సంబంధించని విషయాల్లో వేలు పెట్టడం అధికమైంది. ఆలీమియా అనుచరుల వంటి రాస్కెల్స్‌తో తలపట్లు పట్టటం, రాములయ్య వంటి వాళ్ళకోసం పరాయి ప్రదేశాల్లో ఇంపర్సినేషన్స్ చేయటం – ఇలాగే కొనసాగించావంటే ఏదో ఒక క్షణంలో ఖచ్చితంగా తింటావ్ ఎదురుదెబ్బ."

క్రితం రోజు కాలేజీకి రాకపోవటానికి కారణం తన దేశోద్ధరణ కార్యక్రమమే అని ఆయన భావించి అలా భావించి అలా మాట్లాడుతున్నారనే అనుమానంతో వెంటనే అడ్డుకున్నాడు భాను.

"నిన్న కాలేజీకి రాకపోవటానికి వేరే కారణం వుంది సార్... అసలు జరిగింది ఏమిటంటే...." అనబోతుండగా అసహనంగా తల విదిలించాడు లెక్చరర్.

"అనవసరమైన ఎడ్వెంచర్లతో చదువును నెగ్లక్ట్ చేస్తున్నావని గాని, కాలేజీ ఎగగొట్టి వీధుల్లో చక్కర్లు కొడుతున్నావని గాని నేను అనటం లేదు. జీవితంలో పైకి రావటానికి చదువు చాలా అవసరం... అయితే ఆ చదువును చదువుకోవటానికి నువ్వు ప్రాణాలతో వుండాలి.... ఆలీమియా అనుచరుల వంటి గూండాలతో ఫైటింగ్స్ చేస్తూ వుంటే అది సాధ్యమవుతుందా?"

బాట్లింగ్ ఫాక్టరీ దగ్గిర ఆలీమియాని చూసి, తను పడిన ఇబ్బంది గుర్తుకు వచ్చి తల వంచుకున్నాడు భాను.

"నువ్వు కొద్దిగా స్పీడ్‌ని తగ్గించుకోవాలి... వళ్ళు దగ్గిరపెట్టుకుని వెనుకా ముందు చూసుకుంటూ సంచరించాలి.....ఈ మాట చెప్పటం కోసమే నిన్నిక్కడికి రమ్మన్నాను... దట్స్ ఆల్ ఫర్ నౌ... హేవ్ ఎ గుడ్ టైమ్...." అంటూ టేబిల్ మీది పుస్తకాల్ని దగ్గిరికి తీసుకున్నాడు లెక్చరర్.

కుర్చీలో నుంచి లేవబోయిన భాను భుజం మీద చేయి వేశాడు అంతవరకూ మౌనంగా నిలబడి వున్న కొమరవేలు.

"ఆ దురుసు పిల్లతో కూడా కాస్తంత జాగ్రత్తగా వుండమని చెప్పండి సార్.... ఆ అమ్మాయి మేనమామ లాయర్ జనార్దన్ సరైన మనిషి కాదు. ఆలీమియా తోనూ, అతని అనుచరులతోను ఆయనికి చాలా దగ్గిర సంబంధాలున్నట్లు అందరూ అనుకుంటూ వుంటారు... ఆ పిల్ల మూలకంగా ఏదైనా గొడవ జరిగితే ఆయనా, ఆయనతోపాటు ఆ బడాచోర్లు అందరూ రంగంలోకి వచ్చేస్తారు...." అంటూ అతను కూడా జ్ఞానబోధ ప్రారంభించేసరికి అవాక్కయిపోయాడు భాను. గతరాత్రి తను బాట్లింగ్ ఫాక్టరీలో చూసిన ఓనర్

గీతికకు మేనమామ అవుతాడేమో తెలుసుకోవాలన్న కోరిక కలిగింది గాని, ఆ విషయం విన్న వెంటనే తన ఎడ్వెంచర్లు సాధారణ స్థాయినించి, ప్రమాదకరమైన స్థాయికి చేరుకున్నట్లు గ్రహించి మరింత ముమ్మరంగా చివాట్లు పెడతారన్న భయంతో ఒక్కమాట కూడా మాట్లాడకుండా బయటికి వచ్చేశాడు.

కాంటీన్ వైపు అడుగులు వేస్తూ స్టాఫ్ రూమ్‌లోని సంభాషణను మనసులోంచి నెట్టివేయటానికి ప్రయత్నించాడు. కాంటీన్‌లో అడుగు పెట్టే సమయానికి సఫలమైంది ఆ ప్రయత్నం. కాని దాని స్థానంలో కొత్తగా వచ్చి కూర్చుంది బాట్లింగ్ ఫాక్టరీలో తాను ఆలకించిన ఆలీమియా సంభాషణ.

చీకటి పడిన తర్వాత తప్పకుండా ప్రారంభం అవుతుంది ఫుట్‌పాత్ వర్తకుల్ని పోలీసుల దృష్టిలోకి నెట్టే ప్రయత్నం....

ఇతరులను గురించి పట్టించుకోకుండా, తమ బ్రతుకులేవో తాము బ్రతుకుతున్న ఆ అమాయకుల్ని ఆలీమియా బారినుంచి రక్షించటం సాధ్యపడుతుందా?

"హల్లో మిస్టర్ భానూ..."

కాంటీన్ చివరి భాగంలో నుంచి తన పేరు వినబడేసరికి ఉలికిపాటును కప్పి పెట్టుకుంటూ అటు చూశాడు భాను.

తన ఫ్రెండ్స్‌తో కలిసి ఖాళీగా వున్న రెండు టేబిల్స్‌ని ఆక్రమించుకొని వున్నది గీతిక.

“కాలేజీ చదువునే కాకుండా కాంటీన్ ఖర్చుల్ని కూడా పోషిస్తుందా నీ కామధేనువు?” అతను తనకేసి చూడగానే ఎత్తి పొడిచింది.

ఆ రోజుతో ఆమె అల్లరికి ఫుల్‌స్టాప్ పెట్టేయాలన్న కోరిక సడన్‌గా ఎంటర్ అయింది భాను హృదయంలోకి. అంతలోనే అతని వెన్నుతట్టి హెచ్చరించాయి స్టాఫ్ రూమ్‌లో కొమరవేలు చేసిన హెచ్చరికలు.

అలవాటుకు భిన్నంగా ఆమె మాటలకు సమాధానమిచ్చి, క్రొంగత్తగా ట్రబుల్స్‌ని నెత్తిమీదికి తెచ్చుకోవటం అనవసరం అనిపించి, గిరుక్కున వెనుతిరిగాడతను.

“పారిపోతున్నాడు... సమాధానం చెప్పటం చేతకాక పలాయన మంత్రం పఠిస్తున్నాడు...” సగర్వంగా అంటున్న గీతిక మాటలు తనకు వినబడనట్లు వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు అక్కడినించి.

ఫస్ట్ షో అయిపోగానే ఇంటర్వెల్ డ్యూటీ దిగటానికి సిద్ధపడుతున్న భాను వంక కోపంగా చూశాడు బనారసీ బాబూ.

“చెప్పా పెట్టకుండా నీ యిష్టం వచ్చినప్పుడు వెళ్ళిపోతానంటే ఏలా కుదురుతుంది?” అంటూ కసురుకున్నాడు.

చీకటి పడిన దగ్గర్నించీ వన్‌టౌన్ మార్కెట్ ఏరియానే మెదులుతోంది భాను కనుల ముందు... ఆలీమియా అనుచరులు అక్కడ చేయబోయే ఆగడం గురించే ఆలోచిస్తోంది అతని అంతరంగం.

"ఈ రోజు నాకు రావాల్సిన భత్యాన్ని నీ అడ్వాన్స్‌కు జమ వేసుకో... రేపటినుంచీ కుదురుగా కూర్చోంటాను. ఎక్కడికీ పోను...." అంటూ తన సైకిల్‌ని బయటికి తీసి వన్ టవున్‌వైపు బయలుదేరాడు.

"ఎప్పుడూ లేనిది యమ సీరియస్‌గా వెళ్ళిపోతున్నాడు... నేనేమైనా తప్పుగా మాట్లాడానా?" ప్రక్కనే వున్న పల్లీల వ్యాపారితో అన్నాడు బనారసీ బాబూ.

"ఇవాళ వచ్చిన దగ్గర్నించీ అదోలా వున్నాడు... నవ్వుతూ తుళ్ళుతూ వ్యాపారం చేయాల్సింది పోయి ఏదో పోగొట్టుకున్నట్లు దిగులుగా కనిపిస్తున్నాడు... ఇంటి దగ్గిర గొడవ పడి వచ్చాడేమో!" తనకు తెలిసిన పద్ధతిలో భాను ప్రవర్తను విశ్లేషించాడు పల్లీల వ్యాపారి.

"ఈ చదువుకునే కుర్రాళ్ళతో వచ్చిన తంటానే యిది... ఏం చేస్తారో, ఏ క్షణంలో ఎలా వుంటారో వాళ్ళకే తెలియదు" తనలో తను అనుకుంటూ నూనె బాండీ బాలెన్స్ సరిచూసుకోవటంలో బిజీ అయిపోయాడు బనారసీ బాబు.

వెనక్కి తిరిగి కూడా చూడకుండా సరాసరి వన్ టౌన్ మార్కెట్ ఏరియా దగ్గిరికి పోయి ఒక బిల్డింగ్ చాటున సైకిల్‌ని దాచాడు భాను.

అప్పటికి తొమ్మిది గంటలయింది సమయం.

వచ్చేపోయే జనంతో కిటకిటలాడిపోతుంది ఆ ప్రదేశం. అరుపులతో కేకలతో, వీధిలో తిరుగుతున్న మోటర్ వెహికిల్స్ మ్రోతలతో దద్దరిల్లిపోతోంది.

ఆ చివరినించి ఈ చివరివరకూ విస్తరించి వున్న ఫుట్‌పాత్ దుకాణాలను జాగ్రత్తగా గమనిస్తూ, మూతపడిన ఒక మోటర్ స్పేర్ పార్ట్స్ షాపు దగ్గిర కూర్చున్నాడు భాను.

పది గంటలకు సద్దుమణుగుతుంది అక్కడి రద్దీ. పదకొండు అయ్యేసరికి నిర్మానుష్యమైపోతాయి షాపింగ్ సెంటర్స్ అన్నీ.

ఇతర ప్రదేశాలనుంచి మార్కెట్ ఏరియాకి సరుకులు తీసుకువచ్చే లారీ ట్రాఫిక్‌ని సర్వే చేయటం కోసం తెల్లవార్లు తెరిచే వుండే టీ షాపులు నాలుగో వీధిలోకి అవతలి ప్రక్కన వున్నాయి. ఎప్పుడు చూసినా ఎవరో ఒకరు తచ్చట్లాడుతూ వుంటారు కాబట్టి, ఆ ప్రదేశంలో వుండే ఫుట్‌పాత్ దుకాణాల జోలికి పోడు ఆలీమియా. వీధికి రెండో ప్రక్కన వుండే షాపుల్నే ఎంచుకుంటాడు.

తను కూర్చుని వున్న ప్రదేశానికి పాతిక అడుగుల దూరంలోనే వున్న ఆ దుకాణాలను ఇంకా కాస్తా జాగ్రత్తగా పరిశీలిస్తూ, ఆలీమియా వేయబోయే స్టెప్స్‌ని ఊహించే ప్రయత్నం చేశాడు భాను.

దొంగ సరుకును ప్లాంట్ చేయగానే చల్లగా వెనక్కి తిరగుతారు ఆలీమియా అనుచరులు. ... ఆ వీధి ప్రక్కన వుండే మరో చిన్న రోడ్డు మీదికి పోయి అక్కడినుంచి పోలీసులకు ఇన్‌ఫాం చేయవచ్చు.

పోలీసులు వచ్చి ఫుట్‌పాత్ దుకాణాలన్నిటినీ చెక్ చేసేదాకా ఇద్దర్నో ముగ్గుర్నో అక్కడే నిలబెట్టి వుంచుతాడు ఆలీమియా. అక్కడ ఏం జరుగుతున్నదో జాగ్రత్తగా వాచ్ చేయమంటాడు.

అలా వాచ్ చేయటానికి నియమించేబడే దాదాల దృష్టిలో పడకుండా పని చేయాలి తను.... వాళ్ళ నోటిస్‌లోకి వెళ్ళటం అంటూ జరిగితే ప్రాణాలు పోగొట్టుకోవటమే... కన్సెషన్ అంటూ ఏమీ వుండదు.

కూర్చున్న చోటినుంచి లేచి ఆ వీధి చివరికి బయలు దేరాడు భాను. దాదాల దృష్టిలో పడకుండా తను చేయదలుచుకున్న పనిని నిరాటంకంగా ముగించుకునే మార్గాన్ని అన్వేషిస్తూ యింకో చీకటి ప్రదేశంలో నిలబడ్డాడు.

పది గంటల సమయంలో అనుకోని విధంగా అగుపించింది ఆ మార్గం.

మార్కెట్ ఏరియా వైపునుంచి వేగంగా వస్తూ భాను నిలబడిన ప్రదేశానికి పది అడుగుల దూరంలో తాగిన మనిషి తూలినట్లు వైల్డ్‌గా అటూ ఇటూ వూగిందొక కారు. ఫుట్‌పాత్ మీద వున్న కరెంట్ పోల్‌ని గుద్దుకున్నంత పనిచేస్తూ ఆగిపోయింది.

చెమటలు క్రమ్మిన ముఖంతో స్టీరింగ్ ముందునించి దిగాడు ఒక పెద్ద మనిషి. ఫ్రంట్ టైర్లలో ఒకదాన్ని తట్టి చూస్తూ ఉసూరుమన్నాడు.

అంత చీకటిలోను అతని వదనంలో ప్రతిఫలించిన ఆందోళనను గమనించాడు భాను.... తన బాధల్ని బరువుల్ని కాసేపు మరిచిపోయి అతని దగ్గిరికి వెళ్ళాడు.

"కెన్ యూ హెల్ప్ మీ యంగ్ మాన్? టైరు పంక్చర్ అయింది. అర్జంటుగా ఏర్‌పోర్ట్‌కి వెళ్ళాలి నేను.... కాస్తంత టైరు మార్చి పెట్టగలవా??" అతన్ని చూడగానే మర్యాద నిండిన కంఠంతో రిక్వెస్ట్ చేశాడా పెద్ద మనిషి.

డిక్కీ తెరిచి అందులో స్పేర్ టైర్‌ని బయటికి లాగాడు భాను... జాకీని ఇతర సామాగ్రిని అందుకొని ఐదు నిమిషాల్లో అతని పని పూర్తి చేసి పెట్టాడు.

మెయింటెనెన్స్ సరిగా లేకపోవటం వల్ల కాబోలు తుక్కుతుక్కై ఎందుకూ పనికిరానంతగా నలిగిపోయి వుంది పంక్చర్ అయిన టైరు....

"దాన్ని వెంట బెట్టుకు తిరగటం అనవసరం.... అవతల పారేయ్" అంటూ పాంటు జేబులో నుంచి వాలెట్‌ని తీసి రెండు కరెన్సీ నోట్లను భాను వైపు చూపాడా పెద్ద మనిషి.

"మీరు ఆందోళన చెందుతూ వుండటాన్ని చూసి హెల్ప్ చేయటానికి వచ్చాను డబ్బు సంపాదించుకోవటానికి రాలేదు....." అంటూ ఆ నోట్లను తీసుకోవటానికి నిరాకరించాడు భాను.

"డబ్బిస్తే తప్ప పక్కవాడి పేరు కూడా చెప్పని మనుష్యులున్న ఈ రోజుల్లో నీ వంటి కుర్రవాడు కనిపించటం చాలా ఆశ్చర్యంగా వుంది... నీ పేరేమిటి ?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడా పెద్దమనిషి.

పేరు చెప్పాడు భాను.

"ఏం చేస్తూ వుంటావ్?"

తనేం చేస్తూ వుంటాడో వివరించాడు.

"నా పేరు రమాకాంత్... హై కోర్టులో జస్టిస్‌గా పనిచేస్తూ వుంటాను. వీలు చూసుకొని ఎప్పుడైనా నన్ను కలు..." అంటూ కరెన్సీ నోట్లకు బదులుగా విజిటింగ్ కార్డు నొకదాన్ని భాను చేతిలో పెట్టి కార్లో కూర్చున్నాడా పెద్ద మనిషి.

వీధి చివర వున్న ఒక మలుపు తిరిగి ఆ కారు దృష్టి పథం నుంచి దూరమైపోయేదాకా అక్కడే నిలబడ్డాడు భాను.... చేతిలో వున్న విజిటింగ్ కార్డును జేబులో పెట్టుకుంటూ, ఫుట్‌పాత్ మీద వుండిపోయిన టైరు వంక చూశాడు.

అప్పుడు... అలా ఆ టైరు వంక చూస్తుండగా ఫ్లాష్ అయిందతనికి ఆలీమియా అక్కడ ఎవరైనా అబ్జర్వర్స్‌ని నిలబెడితే వాళ్ళ కళ్ళు కప్పటానికి ఒక చక్కటి ఆలోచన.

అతను నిలబడ్డ ప్రదేశానికి దగ్గర్లోనే రిట్రేడ్ చేసే షాపు ఒకటి వుంది. దాని ప్రక్కనే గుట్టగా పేర్చ వున్నాయి రిట్రేడ్ చేయటానికి పనికిరాని టైర్లు.

జస్టిస్ రమాకాంత్ వదిలి వెళ్ళిన తుక్కుటైరును కూడా ఆ గుట్ట మీదికి చేర్చి పెద్ద పెద్ద అడుగులతో మార్కెట్ ఏరియా దగ్గిరికి పోయాడు భాను.... చిల్లర ఇచ్చి ఒక సిగరెట్‌ని అగ్గిపెట్టెను ఖరీదు చేశాడు.

సిగరెట్ వెలిగించుకుంటూ టైర్ల షాపు దగ్గిరికి తిరిగి వచ్చి వెయిటింగ్ ప్రారంభించాడు.

పదకొండు గంటలకు నిర్మానుష్యమైపోయింది ఆ సెంటర్... పన్నెండు కావస్తున్న తరుణంలో నిశ్శబ్దంగా వచ్చి వీధి చివర నిలబడింది ఆలీమియా ఉపయోగించే అంబాసిడర్ కారు.

*  *  *  *  *

“కళ్ళు మూసి కళ్ళు తెరిచేటంతలో జరిగిపోవాలి పని.... దేబె ముఖాలతో దిక్కులు చూస్తూ నిలబడ్డారంటే ఆ టీ దుకాణాల దగ్గిరికి వచ్చేవాళ్ళకు

తెలిసిపోతుంది. త్వరగా పూర్తి చేసుకురండి....." అంటూ నాలుగు పాకెట్లను ఇద్దరు అనుచరుల చేతికి ఇచ్చాడు ఆలీమియా....

రెండు రెండు బంగారు బిస్కెట్లు చొప్పున వున్నాయి ఆ పాకెట్లలో.

"చూస్తూ చూస్తూ ఇంత సొమ్మను ఊరికే వదులుకోవాల్సి వస్తోంది.... పాకెట్‌కి ఒకటి చొప్పున పెడితే ఏమయిందిట??" బాధగా చూస్తూ కామెంట్ చేశాడు ఫ్రంట్ సీట్లో కూర్చొని వున్న మరో అనుచరుడు.

"ఏదైనా పని చేయదలుచుకున్నప్పుడు నిక్కచ్చిగా చేయాలి... అవతలి వాడికి ఊపిరి సలపనంతగా బిగించేయాలి... ఒకటి అరా పెట్టి పంపితే పోలీసులకు అనుమానం వస్తుంది. ఇదేదో ఎదుటివాళ్ళను కేసులో ఇరికించి పోలీసుల ఎంక్వయిరీని తప్పుదోవ పట్టించే ప్రయత్నమని వాళ్ళు అనుకుంటే మన కథ మొదటికి వచ్చేస్తుంది" కార్లో నుంచి దిగిన అనుచరులను కదలమని సైగ చేస్తూ అన్నాడు ఆలీమియా.

టీ తాగటానికి అటుగా వచ్చిన వాళ్ళ మాదిరి అడుగులు వేస్తూ వీధి మధ్యలోకి వెళ్ళారు వాళ్ళు. ఉన్నట్లుండి ముందుకు వంగి నాలుగు పాకెట్లను నాలుగు ఫుట్‌పాత్ దుకాణాలలో నిక్షేపం చేశారు.

ముందు సీట్లో కూర్చుని వున్న అనుచరుడిని, స్టీరింగ్ ముందున్న డ్రైవర్‌ని కారులో నించి దించేశాడు ఆలీమియా.

"ఇక్కడే వుండి ఏం జరుగుతుందో చూడండి... ప్రక్కవీధిలో నుంచి పోలీసులకు ఫోన్ చేసి ఇంటికి వెళ్ళిపోతాను. ఇక్కడ జరిగే తతంగాన్నంతా

వివరంగా చెప్పాలి నాకు...'' అంటూ తను స్టీరింగ్ ముందు కూర్చుని కారుని వెనక్కి తిప్పాడు.

కారు మలుపు తిరుగుతున్న సమయంలో గప్పున అంటుకున్నాయి రిట్రేడింగ్ షాపు దగ్గిర వున్న పనికిరాని టైర్లు.

చూస్తుండగానే నిలువెత్తుకు లేచాయి మంటలు. నల్లటి పొగల్ని వెలువరుస్తూ, తాచుపాముల మాదిరి నాట్యం చేయసాగాయి అగ్నికీలలు.

“టైర్ల షాపు అంటుకుంది.... రండిరోయ్... రండి... రండి....'' అని కేకలు పెడుతూ టీ దుకాణాలకేసి పరిగెత్తాడు భాను.

దూరం నుంచి చూసిన వారికి నిజంగానే టైర్లషాపు దగ్ధం అయిపోతున్నట్లుగా ఆగుపిస్తోంది ఆ దృశ్యం... ఇతర దుకాణాలు కూడా ఆ మంటల బారిన పడే ప్రమాదం వున్నట్లుగా గోచరిస్తోంది.

టీ దుకాణాలలో వున్న బకెట్లను, సత్తుపావులను నీటితో నింపుకొని పరుగున అక్కడికి వచ్చేశారు జనం.

ముందుగా ఆ మంటల్ని చూసి అందర్నీ హెచ్చరించిన కుర్రవాడు మాత్రం ఫుట్‌పాత్ దుకాణాల మధ్యలో ఆగిపోవటాన్ని వారెవరూ గమనించలేదు. అబ్జర్వర్‌గా నిలబడిన అలీమియా అనుచరులు కూడా అతన్ని గురించి పట్టించుకోలేదు.

టీ దుకాణాల దగ్గిర్నించి వచ్చిన జనంతో కలిసి మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు వాళ్ళు. గుట్టగా వున్న టైర్లన్నిటిని రోడ్డు మీదికి దొర్లించి, మంటలు ఇతర దుకాణాల మీదికి పోకుండా అడ్డుకున్నారు....

"ఫోన్ చేయండి... ఫైరింజన్లకు ఫోన్ చేయండి... ప్రక్క వీధిలోనే వుంది పబ్లిక్ టెలిఫోన్...." వీధికి ఇవతలి ప్రక్కగా నిలబడి ఇంకో అరుపు అరిచాడు భాను.

రెండో ఆలోచన లేకుండా ఇవతలికి పరిగెత్తుకు వచ్చారు పదిమంది వ్యక్తులు. పరుగు పందెంలో పాల్గొంటున్నట్లు వేగంగా ప్రక్కవీధిలోకి పోయారు.

అంబాసిడర్‌ని అక్కడ వున్న టెలీఫోన్ బూత్‌కి దూరంగా నిలబెట్టి బూత్ దగ్గిర పచార్లు చేస్తున్నాడు ఆలీమయా... మెయిన్ రోడ్డులో గొడవ ఏమిటో చూసి రమ్మని తనతో వున్నవారిని పంపించాడు.

అతన్ని అవతలికి నెట్టినంత పనిచేస్తూ ఒకేసారి బూత్ లోకి జొరపడటానికి ప్రయత్నించారు పరిగెత్తుకు వచ్చిన జనం... ఆ పని చేయటం సాధ్యపడదనే విషయాన్ని గమనించుకొని, ఫోన్ చేయాల్సింది ఎవరో నిర్ణయించుకొని, టెలిఫోన్ బాక్స్‌లో వేసేందుకు కాయిన్‌ని వెతుక్కొని, వారు వచ్చిన పనిని పూర్తి చేసుకునేందుకు రెండు నిమిషాలు పట్టింది.

వారి హడావుడిని చూస్తూ నిశ్శబ్దంగా నిలబడిపోయిన ఆలీమియా కంటపడకుండా అంబాసిడర్ చాటుకు చేరుకున్నాడు భాను. తను తీసుకు వచ్చిన

పాకెట్లను వెనుక సీటు క్రిందికి నెట్టి ఏమీ తెలియని వాడిలా జనంలో కలిసిపోయాడు.

ఫోన్ చేసిన నాలుగో నిమిషంలో సైరన్లు మ్రోగించుకుంటూ వచ్చేశాయి ఫైర్ ఇంజన్లు. పది నిముషాల పాటు హోరాహోరీన పోరాటం సల్పి మంటల్ని అదుపులోకి తీసుకువచ్చాయి.

"ఇప్పుడు ఫోన్ చేస్తే మన గొంతుతో పాటు ఈ గందరగోళమంతా అవతలి ప్రక్కకు వినిపిస్తుంది. నేను ఇక్కడ నిలబడటాన్ని గుర్తుంచుకున్న వాళ్ళెవరైనా రేపు పోలీసులతో మాట్లాడితే గొడవ అవుతుంది. ఇంకెక్కడినించైనా చేద్దాం పదండి..." అంటూ తన అనుచరులను వెంటబెట్టుకొని ఆలీమియా అవతలికి వెళ్ళిపోయిన మరుక్షణం బూత్‌లోకి చేరుకున్నాడు భాను. కంట్రోల్ రూమ్‌కి రింగ్ చేసి ఆలీమియా కారును వెతకమని క్లూ అందించాడు.

# 7

పూర్తిగా తెల్లవారకముందే వీధుల్లోకి వచ్చేశాయి వార్తా పత్రికలు. మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించిన వార్తను సిటీ అంతా ప్రచారం చేసేశాయి.

దొంగ బంగారాన్ని స్మగుల్ చేస్తున్న ఘరానా స్మగ్లర్ ఆలీమియా అరెస్టు!

కారులో దొరికిన బంగారు బిస్కట్ల ఆధారంగా యాభై లక్షలు విలువ చేసే సొత్తు స్వాధీనం!!!

ఎనిమిది గంటలు అవుతున్నా నిద్ర లేవని భానును బలవంతంగా లేపి కూర్చోబెట్టి, తను తీసుకువచ్చిన పేపర్‌ని అతని చేతుల్లో పెట్టాడు బాబూలాల్.

“మన చేతులు ఏమైనా వున్నాయా ఈ పని వెనుక?” అతని ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

“ఎందుకు అలా అడుగుతున్నావ్?” ఆశ్చర్యాన్ని నటిస్తూ అమాయకంగా ఎదురు ప్రశ్న వేశాడు.

“రాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత ఇంటికి వచ్చావు నువ్వు... థియేటర్ దగ్గిర పనికి– మధ్యలోనే ఎగనామం పెట్టి వెళ్ళిపోయావుట...” తన అనుమానానికి కారణాలను వివరించటం మొదలు పెట్టాడు బాబూలాల్.

“మండుతున్న కొంపల్ని ఆర్పటంలో వేలుపెట్టినట్లు బట్టలన్నీ మసిబారి వున్నాయి.... అది కూడా చెప్పు...” వంట ఇంట్లోనుంచి ప్రాంప్ట్ చేసింది రాధాబాయి.

టైర్ల గుట్టను అంటించి, మంటల్ని ఎగదోయటానికి ప్రయత్నించటంలో పొరపాటు జరిగిపోయిందని అర్థమైంది భానుకి.

అప్పటికీ తొందర పడలేదతను.... “థియేటర్ దగ్గిర్నించి ముందుగానే వెళ్ళిపోయినట్లు నీకెలా తెలిసింది?” అని అడిగాడు బాబూలాల్‌ని.

“నెత్తీ నోరు కొట్టుకుంటూ ఇందాకే వచ్చి వెళ్ళాడు బనారసీ బాబు... నువ్వు అర్ధాంతరంగా వెళ్ళిపోవటం వల్ల సెకండ్ షో ఇంటర్వల్‌లో ఇరవై రెండు రూపాయలు నష్టం వచ్చిందట....”

“అంత ఖచ్చితంగా ఎలా తెలిసిందిట లెక్క?”

“రెండు రూపాయల కాగితాన్ని ఇరవై రూపాయల నోటు అనుకొని చిల్లర ఇచ్చేశాడట.... స్వీట్స్ తీసుకుని డబ్బు ఇవ్వకుండా వెళ్ళిపోయిన వాళ్ళు చాలామంది వున్నారట.... ఆ నష్టాన్ని నీ భత్యంలో బిగించుకుంటానని చెప్పి వెళ్ళాడు...” అంటూ సంభాషణ సైడ్ ట్రాక్ పడుతున్నదని గ్రహించి మళ్ళీ సీరియస్‌గా చూశాడు బాబూలాల్.

ఆ పైన తన పప్పులు ఉడకవని, అంతకు ముందు రోజు బాట్లింగ్ ఫాక్టరీలో ఆలీమియాని చూసిన దగ్గర్నించి, పోలీసులకు తను క్లూ అందించటం వరకూ జరిగినదంతా చెప్పేశాడు భాను.

“నేను చేసిన పనిలో తప్పు ఏమైనా వుందా?” అని అడిగాడు.

మామూలుకంటే మరో రెండు అంగుళాలు విస్తరించింది. బాబూలాల్ ఛాతీ....

“శభాషయిన పని చేశావు నువ్వు... ఈ దెబ్బతో ఆ దొంగనాయాలి కెరీర్ ఖతమైపోయినట్లే... బెయిల్ కూడా యివ్వకుండా కటకటాల వెనక్కి పంపించేస్తామని అంటున్నారు పోలీసులు” భాను భుజం తడుతూ అన్నాడు.

చాప మీదినుంచి లేచి దుప్పటిని మడత బెడుతుండగా ఎందుకో అనుమానం వచ్చింది భానుకి. చేస్తున్న పనిని వదిలేసి వంట యింట్లోకి తొంగి చూశాడు.

భగ భగమండుతున్న పొయ్యి ముందు కూర్చుని పమిట చెంగుతో కనులు తుడుచుకుంటున్నది రాధాబాయి.

కట్టెలు సరిగ్గా మండకపోవటం వల్ల పొగ మూలకంగా కన్నీళ్ళు వస్తున్నాయని అనుకోవటానికి వీలులేదు... కిరోసిన్ పోసి వెలిగించినట్లు నిలబడి మండుతున్నాయి కట్టెలు.

రెండు అంగల్లో పోయి ఆమె ప్రక్కన కూర్చున్నాడు భాను....

ఆ పైన బిగపట్టకోవటం అసాధ్యమై పెద్దగా ఏడ్చింది రాధాబాయి.

"ప్రాణలన్నీ నీ మీద పెట్టుకుని బ్రతుకుతుంటే, ఈ పెద్ద వయస్సులో మమ్మల్ని దిక్కులేని వాళ్ళ మాదిరిగా చేస్తున్నావు... నీ చదువేదో నువ్వు చదువుకోకుండా ఎందుకు ఈ పాడు పనులు? నీకేమైనా జరిగితే మా గతి ఏమిటి?"

సమాధానం ఇవ్వటం భానుకి చేతకాలేదు.

ఆమె దుఃఖాన్ని ఉపశమింపచేయటం ఎలాగో అతనికి తెలియలేదు.

అటువంటి సమస్యలు ఎప్పుడైనా ఎదురుపడినప్పుడు చిన్నప్పటి నించీ చేస్తున్న పనినే యిప్పుడు కూడా చేశాడతను.

రాధాబాయి వళ్ళో తల పెట్టుకున్నాడు.

"ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చేయకురా... నీకేమైనా అయితే మేము భరించలేమురా..." అంటూ తనను తానే సంబాళించుకున్నదామె.

*     *     *     *     *

అరగంట ఆలస్యంగా కాలేజీకి వెళ్ళాడు భాను ఆ రోజు.

వందసార్లు హెచ్చరించి పంపింది రాధాబాయి. పాతికసార్లు ప్రమాణాలు చేయించుకున్నది. మళ్ళీ అటువంటి పనుల్లో తల దూర్చటం జరగదని.

క్లాసులో అడుగుపెట్టిన దగ్గర్నించీ తిరిగి బయటికి వెళ్ళేవరకూ, ప్రిపేర్ చేసుకువచ్చిన లెసన్ ప్లాన్ ప్రకారం వంచిన తల ఎత్తకుండా, పాఠం చెప్పుకుంటూ పోయే సుబ్రమణ్యం సార్ పిరియడ్ అది.

నవ్వటం అనే మాట ఒకటి ఉందని తెలియదు ఆయనకు. స్టూడెంట్స్‌తో మాట్లాడమంటే తన స్థాయి దిగజారిపోతున్నట్లు అనుకునే నేచర్ ఆయనిది.

అటువంటి స్ట్రిక్టెస్ట్ మనిషి ఆ రోజు అసలు పాఠం చెప్పటం లేదు. పొరపాటున కూడా స్టూడెంట్స్ వైపు చూడకూడదనే నియమానికి తిలోదకాలు యిచ్చినట్లు, చిరునవ్వులు చిందిస్తూ తేరిపార చూస్తున్నాడు అందరినీ.

“మే ఐ కమిన్ సర్...” ద్వారం దగ్గిర నిలబడి సాఫ్ట్‌గా అడిగాడు భాను.

అంతకు ముందు ఎప్పుడైనా అలా ఆలస్యంగా వచ్చి, ద్వారం దగ్గిర నిలబడితే డిసిప్లెన్ గురించి చెపుతూ సూటిపోటి మాటలు వదిలేవాడాయన.

ఆలస్యంగా రావటం కంటే భగవంతుడి సృష్టిలో పాపకార్యం మరొకటి లేదనే అభిప్రాయాన్ని కలిగించేవాడు.

అటువంటి డైలాగులు ఒక్కటి కూడా ఉపయోగించలేదిప్పుడు. ఉపయోగించలేదు సరికదా, ముఖమంతా నవ్వులమయం చేసుకుంటూ లోపలికి రమ్మని సైగ చేశాడు.

అడుగు తీసి లోపలికి వేయటానికి భయపడ్డాడు భాను. స్టూడెంట్స్‌తో కలిపి ఆయన తన మీద ప్రాక్టికల్ జోక్ ఏదైనా పేల్చటానికి రెడీగా వున్నడేమో!

ఇంకోసారి చేయి వూపాడు లెక్చరర్ గారు.

“లోపలికి రావోయ్... లోపలికి వచ్చి నువ్వు కూడా నీ అదృష్టాన్ని పరీక్షించుకోవోయ్...” అన్నాడు.

ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవటానికి ప్రిపేర్ అవుతూ లోపలికి పోయాడు భాను.

అతను అనుకున్నట్లు ప్రాక్టికల్ జోక్స్ పేల్చటానికి ప్రయత్నించటం లేదెవరూ. రెండు న్యూస్ పేపర్స్ చుట్టూ గుమిగూడి పెద్ద పెద్ద గొంతుకలతో ఏవో కామెంట్స్ చేస్తున్నారు.

“భానుకు కూడా చూపించండి... బహుశా అతని కోసమే పడి వుంటుందా ఎడ్వర్‌టైజ్‌మెంట్...” వున్నట్లుండి కామెంట్ చేశాడు లెక్చరర్ గారు.

గొల్లున నవ్వుతూ భానుకేసి చూశారు స్టూడెంట్స్.

“ధార్వాడ ఎస్టేట్స్‌కి వారసుడు కావాలిట... ఆ క్వాలిఫికేషన్స్ నీకేమైనా వున్నయేమో చూసుకో...” అంటూ ఒక పేపర్‌ని అతనికి యిచ్చారు.

ధార్వాడ ఎస్టేట్స్ యజమాని మాజీ జమిందార్ శ్రీ సూర్య ప్రసాద్ గారు ఆకస్మికంగా ఒక కారు ప్రమాదంలో మరణించటంతో – ఎస్టేట్ మేనేజర్ హరహరవర్మ రిలీజ్ చేశాడు ఆ అడ్వర్‌టైజ్‌మెంట్‌ని.

మొదటి పేజీలో ఆలీమియా అరస్టయిన వార్తకు కాస్తంత దూరంగా ప్రచురింపబడింది అది.

సూర్యప్రసాద్ గారి ఏకైక పుత్రుడు లక్ష్మీ ప్రసాద్ ఒక పేదపిల్లను పెళ్ళి చేసుకొని, తండ్రి అభ్యంతరం చెప్పటంతో ఇంట్లోనించి వెళ్ళిపోయాడు ఇరవై రెండు సంవత్సరాల క్రితం.

ఒక కొడుకు పుట్టాడట అతనికి. కాన్పు కష్టం కావటంతో భార్య మరణించిందిట. భార్య మరణంతో మతి భ్రమించి, పురిటికందుతో సహా ఎక్కడికో వెళ్ళిపోయాడట అతను. మనవడు పుట్టాడని తెలిసిన తరువాత మనసు మార్చుకొని, సూర్యప్రసాద్‌గారు ఎంత వెతికించినా ప్రయోజనం లేకుండా పోయిందిట.

ఆయన కాలధర్మం చెందిన తరువాత బయటికి తీయబడింది ఆయన వ్రాసిన వీలునామా. తండ్రి మరణవార్త వార్తాపత్రికలలో ప్రకటింపబడిన తరువాత కూడా లక్ష్మీప్రసాద్ జాడలు తెలియకపోవటంతో, అతను కూడా విగతజీవుడై వుంటాడని భావించి. వీలునామా సారాంశాన్ని పేపర్‌లో వేయించాడు ఎస్టేట్ మేనేజర్.

ఈ ప్రకటన వెలువడిన మూడు నెలలలోగా శ్రీ సూర్యప్రసాద్ గారి మనవడు, శ్రీ లక్ష్మీ ప్రసాద్ గారి కుమారుడు ధార్వాడ ఎస్టేట్స్‌కి వచ్చి తన వారసత్వాన్ని నిరూపించుకోవలసిందిగా తెలియచేయటమైనది.

మూడు నెలల గడువు లోపల నిరూపణ జరగని పక్షంలో శ్రీ సూర్య ప్రసాద్‌గారి వారసులు ఎవరూ జీవించిలేరని భావించి. ధార్వాడ ఎస్టేట్స్‌కి సంబంధించిన స్థిర చరాస్తులన్నిటినీ, శ్రీ సూర్య ప్రసాద్‌గారి అభీష్టం మేరకు ఎస్టేటు మేనేజర్ హరిహరవర్మ గారికి దాఖలు చేయబడతాయి.

శ్రీ సూర్యప్రసాద్ గారి వారసుడు ఈ అంశాన్ని అర్థం చేసుకొని తన వారసత్వాన్ని ఈ తేదీ నుంచి మూడు నెలలలోపల నిరూపించుకోవలసిందిగా కోరుతూ, అలా చేయని ఎడల గడువు దాటిన పిమ్మట వారసత్వపు హక్కును కోల్పోవటం జరుగుతుందనీ, ఇందు మూలముగా తెలియచేయుటమైనది.

అంతకు ముందు ఇంటి దగ్గిర ఆలీమియా అరెస్ట్ అయిన వార్తను చదివేటప్పుడు ఆ పేజీలోనే ప్రచురితమై వున్న ఈ ప్రకటనను మిస్ అవటం ఎలా జరిగిందో వూహించటానికి ప్రయత్నించాడు భాను.

ధార్వాడ ఎస్టేట్స్ గురించి ఎప్పుడో, ఎక్కడో విన్నట్లు అనిపిస్తుండగా తల ఎత్తి చూశాడు.

‘‘ఎప్పుడు బయలుదేరుతున్నావ్....?’’ వెంటనే అడిగాడు ఒక స్టూడెంట్.

‘‘ఎక్కడికి?’’ ఆశ్చర్యంగా ఎదురు ప్రశ్న వేశాడు భాను.

‘‘ధార్వాడ ఎస్టేట్స్‌కి... ఆస్తిని క్లెయిమ్ చేయాలి కదా!’’

ఇంకోసారి పెద్దగా నవ్వారు స్టూడెంట్స్ అందరూ.

“ధార్వాడ ఎస్టేట్స్ అంటే దగ్గిర దగ్గిరగా నూట యాభైకోట్ల రూపాయలు విలువ చేసే ఆస్తిట... కాలేజీకి వచ్చే పని లేకుండా లెక్చరర్స్‌నే నీ దగ్గిరికి పిలిపించుకోవచ్చు....” నవ్వుల నడుమ ఇంకో సలహా ఇచ్చాడు మరో స్టూడెంట్.

ఛట్ మని గుర్తుకువచ్చింది భానుకి.

ధార్వాడ ఎస్టేట్స్.... అవును.... ధార్వాడ ఎస్టేట్ మేనేజర్ హరిహరవర్మ అంటే గీతిక ఫాదర్!

క్లాస్‌రూమ్ నిండా కురుస్తున్న నవ్వుల జల్లులో తను కూడా తలమునకలౌతూ నాలుగో బెంచీ నడుమ భాగం వైపు చూశాడు భాను.

నవ్వుతూ, నవ్విస్తూ ఎవరో ఒకరిని వెక్కిరిస్తూ హడావుడిగా వుండాల్సిన గీతిక గ్లూమీగా వున్నది ఆ రోజు... వంచిన తల ఎత్తకుండా బుక్స్ మీద బొమ్మల్ని చూసుకుంటున్నది.

“ధార్వాడ ఎస్టేట్స్‌కి వారసుడినైతే బాగుంటుందని అనిపిస్తోంది గాని, ఆ మాట బయటికి చెప్పుకున్న మరుక్షణం వాచిపోతుంది నా తల... తిట్లతో, శాపనార్థాలతో చిల్లులు పడిపోతాయి నా చెవులు....” వున్నట్లుండి ఎనౌన్స్ చేశాడు భాను.

స్విచ్ ఆఫ్ చేసినట్లు ఆగిపోయాయి అక్కడి నవ్వులు.

“వాట్ డూ యూ మీన్? అలా జరగుతుందని ఎందుకు అనుకుంటున్నావ్?” ఉండబట్టలేక వెంటనే అడిగాడు సుబ్రమణ్యం సారు.

"ధార్వాడ ఎస్టేట్స్ వారసులు కనిపించని పక్షంలో ఆ ఆస్తి అంతా హరిహరవర్మ గారికి చెందుతుంది కదా!" సస్పెన్స్‌ని జాగ్రత్తగా మెయింటైన్ చేస్తూ అన్నాడు భాను.

లెక్చరర్ గారితో పాటు తలలు వూపారు స్టూడెంట్స్.

"హరిహరవర్మ గారికి వారసురాలైన మన గీతిక – వారసుడిగా వచ్చే మనిషిని చూసి చేతులు ముడుచుకు కూర్చుంటుందా? తల బొప్పెలు కట్టేటట్లుగా చేయదూ?"

ఫక్కున నవ్వి టేబిల్ మీది పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు సుబ్రమణ్యం సార్. "ఎప్పుడు చూసినా సీరియస్‌గా కనిపించే భాను, జోకులు కూడా వెయ్యగలడని నాకు యిప్పుడే అర్థం అయింది...." అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

ఆయన మాదిరిగానే నవ్వాలని అనిపించినా, నవ్వలేకపోయారు స్టూడెంట్స్. తలలు వంచుకొని గీతిక వైపే చూడసాగారు.

భద్రకాళి మాదిరి భాను మీద విరుచుకు పడాలామె వారి అంచనా ప్రకారం... తన తండ్రికి చెందబోయే ఎస్టేట్‌కి అతను వారసుడు కాకపోయినా, అంతకుముందు అతను వెలిబుచ్చిన అభిప్రాయాలను అక్కడి కక్కడే నిజం చేయాలి. అతని మాటల్ని అటెంటివ్‌గా విన్నందుకు మిగిలిన వారి దుమ్మును కూడా దులిపేయాలి.

ఎంతసేపు ఎదురు చూసినా వంచిన తల ఎత్తలేదు గీతిక.

“మీరేం ఖంగారు పడాల్సిన అవసరం లేదు... తుఫాన్ వచ్చేముందు వాతావరణం ఎప్పుడూ ప్రశాంతంగానే వుంటుంది....” ఉన్నట్లుండి మరో కామెంట్ చేశాడు భాను.

అతని మాటలు పూర్తి అయిన మరుక్షణం ముంచుకు రానే వచ్చింది తుఫాన్.

జలజలా బుగ్గల మీదికి జారుతున్న కన్నీటిని తుడుచుకునే ప్రయత్నం చేయకుండా, బుక్స్ తీసుకొని క్లాస్‌లోనుంచి వెళ్ళిపోయింది గీతిక.

*     *     *     *     *

“ఆస్తిపాస్తులకు సంబంధించిన వ్యవహారం కాబట్టి నువ్వు కాస్తంత ఆలోచించుకొని మాట్లాడి వుండాల్సింది. వారసుడు రాకుండా వుంటే బాగుండునని ఆ పిల్ల అనుకుంటున్నట్లుగా చిత్రించావు...”

లంచ్ అవర్‌కి ముందు లీజర్ పీరియడ్‌లో భానును స్టాఫ్ రూమ్‌కి పిలిపించి సన్నగా చివాట్లు పెడుతూ అన్నాడు ఇంగ్లీషు లెక్చరర్.

“నేను చెడుగా ఏమీ అనలేదు సార్... సరదాగా జోక్ చేశాను.... తను పలికే పలుకులు అవతలివాడికి ములుకులు మాదిరి గుచ్చుకుంటాయని ఏనాడూ ఆలోచించని ఆ మనిషికి, నా మాటలు బాధ కలిగించాయంటే నేను నమ్మను....” తను చేసిన పనికి సిగ్గు పడకుండా నిర్భయంగా అన్నాడు భాను.

కళ్ళజోడు పై భాగంలో నుంచి అతని ముఖంలోకే చూస్తూ అలాగే కూర్చుండిపోయాడు ఇంగ్లీషు లెక్చరర్.

ఆ చూపులు కొత్తగా అనిపించాయ భానుకి... ఆయన మాటల్లో, ముఖంలోని భావాలలో ఏదో కొత్తదనం కొట్టవచ్చినట్లు అగుపించసాగింది.

“నన్నెందుకు రమ్మన్నారు సార్?” అనీజీగా చూస్తూ అడిగాడు ఎంతసేపటికి ఆయన మాట్లాడక పోవటంతో.

ఆ మాటలు తన ఆలోచనలకు ఆటంకం కలిగించినట్లు గాఢంగా నిట్టూరుస్తూ తల విదిలించి, కళ్ళజోడును సర్దుకున్నాడు లెక్చరర్.

“సాయంత్రం మీ బాబాయిని మా ఇంటికి రమ్మన్నానని చెప్పు.... నువ్వు వెంట బెట్టుకుని తీసుకురా...” అంటూ టేబిల్ మీది బుక్స్‌ని దగ్గిరికి జరుపుకున్నాడు.

మీటింగ్ క్లోజ్ అయిందని సూచించే గుర్తు అది....

“బాబాయి ఎందుకు సార్? గీతికను బాగా హార్ట్ చేశానని అనుకుంటున్నారా మీరు?” ధైర్యం చేసి అలాగే నిలబడుతూ అడిగాడు భాను.

“ఫర్ గెట్ ఎబౌట్ గీతిక... షీ ఈజ్ నథింగ్ బట్ ఎ సిల్లీ గర్ల్... పందొమ్మది సంవత్సరాల క్రితం జరిగిన ఒక విషయాన్ని గురించి మీ బాబాయితో మాట్లాడాలి... మర్చిపోకుండా రమ్మని చెప్పు... దట్స్ ఆల్ ఫర్ నౌ... హావ్ ఎ గుడ్ టైమ్....”

పందొమ్మిది సంవత్సరాల క్రితం అంటే – అప్పటికి తన వయసు ఎంత వుండి వుంటుందో లెక్క వేసుకుంటూ వెనుతిరిగి, కాంటీన్ వైపు బయలుదేరాడు భాను.

# 8

పూలకుండీలో పెరుగుతున్న గులాబీ మొక్కలకు నీరుపోస్తూ గేటు దగ్గిర అలికిడి అయ్యేసరికి తలతిప్పి చూసింది ఇంగ్లీషు లెక్చరర్ గారి భార్య.

భాను భుజంమీద చేయివేసి ఎడమ పాదాన్ని ఎత్తెత్తి వేస్తూ లోపలికి వచ్చిన బాబూలాల్‌ని గమనించేసరికి, ఆమె పెదవుల మీదికి పరిగెత్తుకు వచ్చిందొక చిరునవ్వు.

"అయ్యగారున్నారా అమ్మా? నన్ను రమ్మని భానుతో చెప్పారట..." ఆమెకు నమస్కారం చేస్తూ అన్నాడు బాబూలాల్.

చేతుల్లో వున్న రోజ్ కాన్‌ని క్రిందపెట్టి, పమిటచెంగుకు చేతులు తుడుచుకుంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకుపోయిందామె వారద్దరినీ... అక్కడ వున్న కుర్చీలలో కూర్చోమని సైగచేస్తూ మంచినీళ్లు తీసుకువచ్చి యిచ్చింది.

"ఆయన మార్కెట్‌కి వెళ్ళారు... మీరు వస్తే కూర్చోబెట్టమని చెప్పారు... ఇప్పుడే వస్తాను నేను..." అంటూ లోపలికి పోబోతుండగా, ఆపే ప్రయత్నం చేశాడు బాబూలాల్.

"నేను కాఫీ టీలు తాగటం మానేశానమ్మా.... మా భానుకు అసలు మొదటినించీ అలవాటే లేదు... మా కోసం మీరు హడావుడి పడాల్సిన అవసరం లేదు...." అంటూ.

“నువ్వొక దొంగవి.... నీ కొడుకు భాను యింకో పెద్ద దొంగన్నర దొంగ... మాటలతో ఎదుటి వాళ్ళను బోల్తా కొట్టించటంలో మీకు మీరే సాటి....” అంటూ అప్పుడే లోపలికి వచ్చాడు లెక్చరర్.

కుర్చీలో నుంచి లేవబోయిన బాబూలాల్ భుజం తట్టి కూర్చోబెడుతూ భానుకేసి చూశాడు.

మధ్యాహ్నం కనిపించిన కొత్తకొత్త భావాలు మరోసారి ఆయన చూపుల్లో ప్రత్యక్షం అయ్యేసరికి చటుక్కున తల దించుకొని కాలివేళ్ళ వంక చూసుకున్నాడు భాను.

“నన్నెందుకో రమ్మన్నారట!” అక్కడ కూర్చుని ఆయన టైమ్‌ని వేస్ట్ చేయటం యిష్టం లేక సూటిగా అసలు విషయంలోకి వచ్చాడు బాబూలాల్.

భార్య టీ కప్పులతో వచ్చేదాకా ఆగాడు లెక్చరర్... ఆమెను కూడా తన ప్రక్కన కూర్చోమని సైగ చేశాడు.

“నీకు గుర్తుందా బాబూలాల్! పెదొమ్మది సంవత్సరాల క్రితం, నీకు మాకు పరిచయం ఆయిన రోజు?” బాబూలాల్‌కి, భానుకి టీ కప్పులను అందించి, భర్త ప్రక్కన కూర్చుంటూ చిరునవ్వుతో అడిగిందామె.

అప్రయత్నంగా వెనక్కి పరిగెత్తింది బాబూలాల్ మనస్సు..... పందొమ్మిది సంవత్సరాల క్రితం... తను మంచి వేడిమీద వున్న సమయం. తిండి తినకపోయినా, నిద్రలేకపోయినా లెక్క చేయకుండా రోజులకు రోజులు వీధుల్లో చక్కర్లు కొట్టిన టైమ్ అతని కనుల ముందు ప్రత్యక్షం అయింది.

*            *            *            *            *

"డి.యస్.పి. దొరగారు బొంబాయి వెళ్ళటానికి వస్తారట... ఇవాల్టికి నువ్వు ఇంటికి వెళ్ళిపో...." జోరున కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్క చేయకుండా రైల్వేస్టేషన్ దగ్గిర బీటేసిన బాబూలాల్‌తో అన్నాడు స్టేషన్ ముందు ట్రాఫిక్‌ని కంట్రోల్ చేయటానికి నియమించబడిన పోలీస్ కానిస్టేబిల్.

"పచ్చనోటు కళ్ళజూచి నాలుగు రోజులైందన్నా... నిన్నటి నుంచీ నీకు ఇవ్వాల్సిన మామూలు అలాగే వుండిపోయింది... సారా కొట్టు చిన్నాగాడికి నలభై రూపాయలు బాకీ పడ్డాను....." అక్కడినుంచి కదలటం తనకు ఇష్టం లేదని సూటిగా చెప్పకుండా చుట్టు దారిన ఎక్స్‌ప్లెయిన్ చేయటానికి ప్రయత్నించాడు బాబూలాల్.

"డి.యస్.పి. దొరగారికి అనుమానం వచ్చిందంటే మా బాకీలతో పాటు డాక్టర్‌కి కూడా బాకీ పడిపోతావ్... పిచ్చివేషాలు వెయ్యకుండా యింటికెళ్ళు బే... ఈ వాతావరణంలో నీకు దొరికే బేవకూఫ్ ఎవడూ వుండడు....." అంటూ కసురుకున్నాడు కానిస్టేబిల్.

అయినాసరే లెక్కచేయకుండా యింకో పక్కకు పోయి ఒక గోడ చాటున నిలబడ్డాడు బాబూలాల్. చీకటి పడుతుండగా ఆగుపించాడతనికి ఒక పెద్ద మనిషి.

నాలుగు సంవత్సరాల వయసున్న పిల్లను ఎత్తుకొని, పెద్ద సూట్ కేసును పట్టుకొని స్టేషన్ బయటికి వచ్చాడు. రెండు చేతుల్లోను రెండు బుట్టల్ని తీసుకొని అనుసరిస్తోంది అతని భార్య.

వర్షం మూలకంగా ఎక్కువ రేటు అడిగినట్లున్నారు ఆటోరిక్షా డ్రైవర్లు. వాళ్ళ అవకాశవాద తత్వానికి అసహ్యించుకుంటూ చుట్టూ చూస్తున్నాడతను.

వర్షపు జల్లుపడి స్వల్పంగా తడిసిన అతని ఫాంటు జేబులో నుంచి బాబూలాల్ కనులకు స్పష్టంగా కనిపించింది మందంగా వున్న పర్సు.

రెండో ఆలోచన లేకుండా గోడ చాటునుంచి కదిలి ముందుకుపోయాడు బాబూలాల్. ఉన్నట్లుండి వేగాన్ని పెంచి, అతన్ని ఢీ కొట్టాడు.

ఎడమ చేతిలో వున్న సూట్‌కేసును వదిలేశాడా వ్యక్తి. భుజంమీది బిడ్డ క్రింద పడిపోకుండా పట్టుకోవటంలో బిజీ అయ్యాడు.

“వర్షం మూలకంగా కాలుజారి పొరపాటు జరిగిపోయింది. క్షమించండి....” అంటూ పరుగులాంటి నడకతో అవతలికి వెళ్ళిపోయాడు బాబూలాల్. నేర్పుగా సంగ్రహించి తన జేబులోకి పెట్టుకున్న మనీ పర్సును తడుముకుంటూ, హుషారుగా విజిల్ వేస్తూ, వర్షంలో తడుస్తూనే సారా కొట్టు చిన్నా దగ్గిరికి పోయాడు.

“ఎవడి ఖర్మ గాలిపోయిందో యివ్వాళ... ఈ జన్మలో నీ బతుకేమౌతుందో తెలియదు గాని వచ్చే జన్మలో మాత్రం కుక్కకంటే హీనమైన బతుకు బతుకుతావు....” జానెడు పొడుగున్న గ్లాసునిండా సారా నింపి అందిస్తూ తిట్టిపోశాడు చిన్నా.

"కుక్క కంటే హీనమైన బతుకు నేను బతికితే, మరి నా దగ్గిర మాముళ్ళు వసూలు చేసేవాళ్ళు ఎలాంటి బతుకు బతుకుతారు?" రెండే రెండు గుక్కల్లో గ్లాసు ఖాళీచేసి, జేబులో వున్న పర్సును బయటికి తీస్తూ అడిగాడు బాబూలాల్.

"నీతో మాటలు పెంచుకోవటం వలన బుద్ధి తక్కువ పని మరొకటి లేదు. రెట్టమతంలో నిన్ను మించిన వాడెవడూ లేడు..." అతనందించిన కరెన్సీ నోట్లను కాష్‌బేగ్‌లో పెట్టుకుంటూ విసుగ్గా అన్నాడు చిన్నా.

విజిల్ వేస్తూనే సారా దుకాణంలో నుంచి బయటికి వచ్చాడు బాబూలాల్..... పెద్ద బజార్లో మూడు మూరల కనకాంబరాలను పొట్లం కట్టించుకుని, అడ్డదారిన ఇంటికి బయలుదేరాడు.

వర్షం మూలకంగా చాలా ముందుగానే ఖాళీ అయిపోయాయి వీధులు. సందులు, గొందుల్లో అసలు జనసంచారమే అగుపించటం లేదు.

అటువంటి ఒక చిన్న సందును దాటి, పడిపోవటానికి సిద్ధంగా ఉన్న ఒక పాతకాలపు భవంతి ప్రక్కగా పోతుండగా కనిపించిందతనికి అటుగా వచ్చి నిలిచిన ఒక ఆటో రిక్షా.

"ఇక్కడ ఆపావేమిటి? ఎందుకు ఆపావ్?" ఆందోళనగా అంటూ ఆటోలోనుంచి దిగాడు ఒక పాసింజర్.

ఒక్క దుముకులో అతన్ని సమీపించి వెనక్కి నెట్టాడు ఆటో డ్రైవర్.

"మోసం... మోసం...." అని అరుస్తూ బాలెన్స్ నిలుపుకోవటానికి ప్రయత్నించాడు ఆ పాసింజర్.

అతని ప్రయత్నం ఫలించకముందే పాడుబడిన భవంతిలో నుంచి బయటికి వచ్చారు నలుగురు వ్యక్తులు.

"వీడి సంగతి మేము చూసుకుంటాం.... నువ్వు ఆటోలో వున్న పిట్టను లోపలికి లాక్కుపో..." అని ఆటో డ్రైవర్‌ని హెచ్చరిస్తూ పాసింజర్‌ని చుట్టుముట్టారు.

భయంతో వణికిపోతున్న ఆడమనిషిని, నాలుగేళ్ళ పసిబిడ్డని ఆటోలో నుంచి బయటికి లాగాడు ఆటో డ్రైవర్.

"పిచ్చి వేషాలు వేయకుండా లోపలికిరా... అరిచి కేకలు పెట్టటానికి చూస్తే ఈ పిల్లను గొంతు పిసికి అవతల పారేస్తాను" అని హెచ్చరిస్తూ ఆ యువతిని భవంతిలోకి తీసుకుపోయే ప్రయత్నం చేశాడు.

"రక్షించండి... మమ్మల్ని ఎవరైనా రక్షించండి...." అని అరిచింది ఆ యువతి... అతని చేతుల్లో చిక్కుకున్న తన బిడ్డను రక్షించుకునే ప్రయత్నం చేసింది.

రాక్షసుడి మాదిరి నవ్వుతున్న ఆటో డ్రైవర్‌ని చూశాడు బాబూలాల్. అతని స్నేహితుల మధ్య చిక్కుకుని దారుణమైన దెబ్బలు తింటున్న పాసింజర్‌ని గమనించాడు. అభిమానాన్ని పోగొట్టుకోబోతున్న ఆడబిడ్డ ఆక్రోశాన్ని విన్నాడు.

అతనికి తెలియకుండానే బిగుసుకున్నాయి పిడికిళ్ళు.

"ఆగండిరా దొంగనాయాళ్ళలారా... ఆళ్ళని వదిలేయండిరా....." అని అరుస్తూ పది అంగల్లో పోయి వాళ్ళముందు నిలబడ్డాడు.

సినిమాల్లో విలన్లు హెచ్చరించినట్లు చేస్తున్న పనిని ఆపి పెద్ద పెద్ద మాటలు ఉపయోగించలేదు వాళ్ళెవరూ.

"కొట్టండిరా... ఎముకలు విరిగిపోయేటట్లు కొట్టండి...." అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ అతని మీద కలబడ్డారు.

తను చేసే పనిలో పట్టుబడిపోయినప్పుడల్లా ప్రాణాంతకమైన దెబ్బలు తినటానికి అలవాటు పడి వుంది బాబూలాల్ శరీరం. వాళ్ళ పిడికిటి పోట్లు చీమలు కుట్టినట్లుగా కూడా అనిపించలేదతనికి. ఉక్కు ముక్కల వంటి చేతుల్ని గిరగిరా తిప్పుతూ దొరికిన వాళ్ళని దొరికినట్లే విరగదీసేశాడతను, ఆటో డ్రైవర్ గుండెలు పగిలిపోయేటట్లు తన్ని, లావుపాటి బండరాయి నొకదాన్ని పైకెత్తాడు తల చితికిపోయేటట్లు మీద పడేయటానికి.

కీసర బాసరగా అరవటానికి కూడా ధైర్యం చాలక చట్రాతిమీద కొట్టిన చిల్లపెంకుల్లా చెల్లాచెదురైపోయారు వాళ్ళందరూ. ఆటోని అక్కడే వదిలి పరారైపోయారు.

కచ్చతీరక సర్వనాశనం చేశాడు బాబూలాల్ ఆటోని. డ్రైవర్ తలమీద వేయటానికి పైకెత్తిన బండరాయిని ఇంజిన్ మీద పడేసి, ఎందుకూ పనికిరాకుండా పాడు చేశాడు.

అప్పటికి చల్లబడింది అతని ఆవేశం. అప్పుడు గుర్తుకు వచ్చింతనికి ఆ ఆవేశం రావటానికి కారకులైనవారు.

తూలిపోతున్న భర్తను ఒక ప్రక్కకు తీసుకుపోయి, పమిటె చెంగుతో కనులు వత్తుకుంటూ పరిచర్యలు చేస్తోంది ఆ యువతి. బిగ్గరిగా ఏడుస్తున్న బిడ్డను సముదాయించటానికి విఫల ప్రయత్నం చేస్తోంది.

ముందు చూపు కొంచెంగా కూడా లేకుండా ఆటోను నాశనం చేసినందుకు తనను తానే నిందించుకుంటూ వారి దగ్గిరికి పోయాడు బాబూలాల్.

“పెద్ద బజారుల్లోకి పోయి యింకో ఆటో ఏదైనా తీసుకొస్తానమ్మా... అంతవరకూ కాస్తంత ధైర్యంగా వుండండి” అంటూ వెనుతిరగబోతుండగా అడ్డుకున్నదా యువతి.

“మళ్ళీ వాళ్ళు వస్తారేమో....” అని అనుమానాన్ని వ్యక్తం చేసింది.

ఆ మాటను కూడా ఆలోచించలేని తన మందబుద్ధికి మరింత ఘాటుగా నిందించుకుంటూ, నిలబడలేకపోతున్న పాసింజర్‌ని లేపి నిలబెడ్డాడు బాబూలాల్. భుజాల చుట్టూ చేతులు చుట్టి జాగ్రత్తగా నడిపిస్తూ పెద్ద బజారుకు తీసుకువచ్చాడు.

పేషెంట్లెవరూ లేకపోవటం వల్ల హాస్పిటల్ వరండాలో నిలబడి కూనిరాగాలు తీసుకుంటున్నాడు డాక్టర్ వైకుంఠం. అనుకోకుండా ఎదుటికి వచ్చిన బాబూలాల్‌ని చూసి ఆశ్చర్యంతో నొసలు ఎగురవేశాడు.

పాడుబడిన భవంతి దగ్గిర జరిగింది ఏమిటో వివరించి చెపుతూ, పేషెంట్‌ని ఎగ్జామినేషన్ టేబిల్ మీద పడుకోబెట్టాడు బాబూలాల్.

“కంటికి కనిపించని చవిటి దెబ్బలు చాలా తగిలాయి. నా ఫీజు వంద రూపాయలు అవుతుంది.” ఎగ్జామినేషన్ చేయటానికి రెడీ అవుతూ నిర్మొహమాటంగా తన రేటును తెలియచేశాడు డాక్టర్ వైకుంఠం.

“ఈగలు తోలుకుంటున్నప్పుడు వచ్చిన వాళ్ళకి కూడా వంద అవుతుందా? కన్సెషన్ వుండదా?” కోపంగా అడిగాడు బాబూలాల్.

“ఈగలు తోలుకుంటున్నాను కాబట్టే వంద.... ఇంకో టైమ్‌లో వచ్చి వుంటే రెండు వందలు అని వుండేవాడిని....” అంటూ ఎగ్జామినేషన్ పూర్తిచేసి, రెండు ఇంజక్షన్స్ చేశాడు డాక్టర్ వైకుంఠం.

ఏదో ఆయింట్ మెంట్‌ని యిచ్చి, అంతకు ముందు అడిగిన వంద కాకుండా, అదనంగా పది రూపాయలు వసూలు చేశాడు.

మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఉచితంగా ఇచ్చిపోయే మందుల్ని అయిన కాడికి అమ్ముకొని సొమ్ము చేసుకునే డాక్టర్లు – తర్వాత జన్మలో వాళ్ళ బ్రతుకబోయే బ్రతుకులు మొదలైన విషయాల్ని గురించి ఆలోచించుకుంటూ వీధిలోకిపోయి రిక్షానొకదాన్ని తీసుకువచ్చాడు బాబూలాల్.

“యాదయ్య అనీ మనవాడే... నేను కూడా మీతో పాటు వస్తున్నాను. భయపడకుండా కూర్చోండి” అని ధైర్యం చెపుతూ పేషెంట్‌ని, అతని భార్యబిడ్డల్ని అందులో ఎక్కించి, కాలినడకను వారిని అనుసరించాడు.

పది నిమిషాలు ప్రయాణం చేసిన తరువాత కొత్తగా కట్టిన చిన్న బంగ్లా ముందు రిక్షాని ఆపించిందా యువతి.

“రైల్వే స్టేషన్‌లో మా పర్సును ఎవరో కొట్టేశారు... ఇంట్లో ఇరవై రూపాయల కంటే ఎక్కువ లేవు.... స్టేషన్ దగ్గిర అడిగితే మీటర్ ఛార్జీకి నాలుగైదొందలు అధికంగా డిమాండ్ చేస్తున్నారని, అక్కడ వున్న కానిస్టేబిల్ వద్దు వద్దని అంటున్నా వినకుండా రోడ్డు మీదికి వచ్చి, ఆ పాడు ఆటో ఎక్కాము. అందరి మాదిరిగా కాకుండా, యిచ్చినంతా పుచ్చుకుంటానని అంటే అనుమానపడకుండా ఎక్కి కూర్చుని ప్రాణాల మీదికి తెచ్చుకున్నాము....” లోపల నుంచి యిరవై రూపాయల చిల్లరను తెచ్చి బాబూలాల్ చేతికి అందిస్తూ అన్నదామె.

వాడిగా వున్న బరిశె ఏదో గుండెలమీద పొడుచుకుంటున్నట్టు అయింది బాబూలాల్‌కి.

"రేపు పదకొండు గంటల సమయంలో ఒకసారి కనపడితే డాక్టర్ గారికి యిచ్చిన డబ్బు కూడా యిచ్చేస్తాము. టీ పెట్టటానికి పాలు లేవు... ఫ్రిజ్‌లో ఎప్పటివో నాలుగు కూల్‌డ్రింక్ సీసాలు వున్నాయి. తీసుకువచ్చి ఇస్తాను కాస్సేపు కూర్చోంటే....” అంటూ లోపలికి పోబోతుండగా ఆపేశాడామెను. ముఖంలోకి చూడకుండా జేబులో నుంచి పర్సును తీసి ముందుకు జాచాడు.

తగిలిన దెబ్బలకంటే, డాక్టర్ వైకుంఠం చేసిన ఇంజక్షన్స్ ఎక్కువ పోటు పెడుతుండగా, భుజాల్ని సవరించుకుంటూ అపసోపాలు పడుతున్నాడు ఆ యువతి భర్త.

అంత బాధలోనూ నవ్వకుండా వుండలేకపోయాడతను.

“మా పర్సును కొట్టేసింది నువ్వేనని తెలిసి మా బాధలు చెప్పుకోలేదు. డాక్టర్ గారికి డబ్బు యిస్తున్నప్పుడు మాత్రమే నాకు తెలిసింది ఆ సంగతి. నా భార్యకు తెలియలేదు. తెలిసి వుంటే పర్సు ప్రసక్తి తీసుకువచ్చేది కాదు” సోఫాలో సర్ధకు కూర్చుంటూ అన్నాడు.

“దయచేసి మీరు మరొక్కమాట కూడా మాట్లాడవద్దు. ముందు మీ పర్సును మీరు తీసుకోండి” వంచిన తల ఎత్తకుండా అన్నాడు బాబూలాల్.

పొరపాటుగా కూడా చేతిని ముందుకు జాచలేదు యువతి.

“జేబులు కొట్టుకుంటూ బ్రతకటం మహాపాపమని, వచ్చే జన్మలో కుక్క కంటే హీనమైన జన్మ ఎత్తుతానని పెద్ద పెద్ద మాటలు దయచేసి వుపయోగించకండి” ముందు జాగ్రత్త కోసం వెంటనే హెచ్చరించాడు బాబూలాల్.

అప్పుడు పెదవి విప్పింది యువతి.

“నువ్వు మా పర్సునే కాదు – ఇప్పటికిప్పుడు ఇక్కడికిక్కడే ఈ యింటిని దోచుకోవాలని అనుకున్నా అభ్యంతరం చెప్పలేనంతగా నీకు ఋణపడిపోయాం. అనవసరమైన మాటలెందుకుగాని, ముందు ఆ పర్సును జేబులో పెట్టుకో....” అన్నది మందలింపు స్వరంతో.

ఏం చేయాలో అర్థం కాక గిజాటు పడిపోయాడు బాబూలాల్.

“నీకు అర్థంకాని విషయాల్ని గురించి ఆలోచించి హైరానా పడటం కంటే, ఇంటికి పోయి నిద్రపోవటం చాలా బెస్ట్.... యిప్పటికి చాలా ఆలస్యం అయింది. ఇంటి దగ్గిర నీ భార్యబిడ్డలు నీ కోసం ఎదురుచూస్తూ వుండి వుండవచ్చు. ఇప్పుడు

యింటికి పోయి రేపు పదకొండు గంటలకు ఒకసారి కనిపించు. అప్పుడు మాట్లాడుకుందాం...” అంటూ సోఫాలో నుంచి లేచి అతన్ని ముఖద్వారం వైపు నడిపించాడు ఆ యువతి భర్త.

తన రాకకోసం ఎదురు తెన్నులు చూస్తూ వుండే భార్య వుంది గాని, బిడ్డలు లేరని చెప్పాలని అనుకున్నాడు బాబూలాల్. అంతవరకూ ఓపికగా ఎదురుచూస్తూన్న రిక్షా యాదయ్య అసహనంగా బెల్ మ్రోగించటంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

“చలిచలిగా వుందన్నా.... గొంతులో పోయిస్తావా రెండు చుక్కలేవైనా?” రిక్షా ఎక్కగానే తన మనసులోని కోరికను బయటపెట్టాడు యాదయ్య.

ఎందుకో తాగాలనే కోరిక చచ్చిపోయింది బాబూలాల్‌కి ఆ మాటే అనేసరికి చిన్న బుచ్చుకున్నాడు యాదయ్య.

“నువ్వు తాగకపోతే తాగకపోయావు గాని నాకో నాలుగు రూపాయలియ్యి. ఈ చలిలో చచ్చిపోకుండా....” అంటూ రిక్షాని ఆపేశాడు ఒక సారా కొట్టుముందు.

పర్సు తీసి పది రూపాయలిచ్చాడు బాబూలాల్.

“తొందరగా వచ్చేయ్...” అని హెచ్చరించాడు.

నాలుగు రూపాయలడిగితే పది రూపాయలు వచ్చినందుకు సంతోషంతో పరవశించుపోతూ, మామూలుగా పుచ్చుకునే అరగ్లాసు బదులు రెండు గ్లాసులు

గొంతులోకి వంపేసుకున్నాడు యాదయ్య. మత్తు ఒక్కసారిగా నెత్తికి ఎక్కేసరికి కూనిరాగాలు తీస్తూ హుషారుగా కదిలించాడు రిక్షాని.

"నెమ్మదిగా పోనీ బే... కాస్తంత నిదానంగా నడిపించు...." అని హెచ్చరిస్తూనే వున్నాడు బాబూలాల్. ముందూ వెనకా చూసుకోకుండా అడగగానే డబ్బు యిచ్చినందుకు తనను తాను నిందించుకుంటూనే వున్నాడు.

పెద్ద బజారు టర్నింగ్‌లో అతను భయపడినంతా చేయనే చేశాడు యాదయ్య.

ఆటోరిక్షా మాదిరి అతివేగంగా తీసుకపోయి, రోడ్డును క్రాస్ చేయబోతున్న ఒక మనిషి మీదికి ఎక్కించేశాడు.

ఆ కదుపుకు సీట్లోనుంచి లేచి రోడ్డు మధ్యలో పడిపోయాడు బాబూలాల్. హేండిల్ మీది నుంచి పల్టీకొట్టి ఒక బురదగుంటలో పడ్డాడు యాదయ్య.

తల రోడ్డుకు పొడుచుకోవటం వల్ల తీవ్రమైన గాయం అయింది రిక్షా క్రింద పడిన మనిషికి. ధారలు ధారలుగా బయటికి వచ్చి వర్షపు నీటిలో కలుస్తోంది ఎర్రటి రక్తం.

తలకు ఎక్కిన సారామత్తు ఛటాలున వదలిపోతుండగా బురదగుంటలో నుంచి లేచాడు యాదయ్య. రోడ్డుమధ్యలో పడిపోయిన బాబూలాల్ ఏమైపోయాడో చూడను కూడా చూడకుండా పిక్కబలం ప్రదర్శించాడు. కన్ను మూసి తెరిచేటంతలో ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా పారిపోయాడు.

*         *         *         *         *

రిక్షా క్రింద పడిన మనిషి మాదిరిగా తల పగిలిపోకపోయినా, పగిలిపోయినంత బాధ నరాలన్నిటినీ మెలిపెడుతుండగా, పడిన వాడు పడినట్లే వుండిపోయాడు బాబూలాల్.

తనకు సమీపంలో పసికందు ఎవరో గుక్కపట్టి ఏడుస్తున్నట్లు అనిపించేసరికి ఒక్కసారిగా వదిలిపోయింది అతన్ని ఆవరించుకుని వున్న అశక్తత.

చేతుల్ని రోడ్డుమీద ఆనించి పైకి లేచేసరికి, నిజంగానే కనిపించాడతనికి ఆ పసిబిడ్డ.

రిక్షా క్రిందపడిన మనిషి గుండెలమీద కూర్చుని గావురు గావురుమని ఏడుస్తున్నాడు. తన చిన్న చిన్న చేతులతో ఆ మనిషి ముఖాన్ని తడుముతున్నాడు.

తన భుజాల మీద వున్న ఆ బిడ్డకు దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో తను దెబ్బతిన్నాడు తల పగిలిన ఆ మనిషి. బిడ్డకు తగలవలసిన దెబ్బను తను భరించాడు.

జరిగింది ఏమిటో గ్రహించేసరికి పెద్ద గులకరాయి ఏదో గొంతుకు అడ్డుపడిన ఫీలింగ్ బాబూలాల్‌ని ఆవరించుకున్నది.

వద్దు వద్దుని ఎంత హెచ్చరించినా, గుడ్డిగా రిక్షా తొక్కిన యాదయ్యను నోటికి వచ్చిన మాటలతో దారుణంగా తిట్టిపోస్తూ ఆ బిడ్డను చేతుల్లోకి తీసుకున్నాడతను. పడిపోయిన మనిషిని పైకి లేపి ఒక భుజం మీదికి ఎత్తుకున్నాడు.

*   *   *   *   *

"...దారుణంగా పగిలిపోయింది తల... పది కుట్లయినా వేయాలి... కుట్టుకు పది రూపాయలు.... ట్రీట్‌మెంట్‌కి యాభై... ఇటువంటి యాక్సిడెంట్ కేసుల్ని పోలీసుల దృష్టికి తీసుకుపోకుండా ఆగినందుకు ఇంకో యాభై....."

ఎగ్జామినేషన్ టేబుల్ మీద బాబూలాల్ పడుకోబెట్టిన పేషెంట్‌ని పరీక్షగా చూస్తూ ఎనౌన్స్ చేశాడు డాక్టర్ వైకుంఠం.

"జేబులు కొట్టేయటాన్ని వదిలేసి, పేషెంట్స్‌ని తీసుకువచ్చే పని ప్రారంభించావు కాబట్టి పది పర్సంట్ నీకు కమీషన్ యిస్తాను... ఇంకో యిద్దర్ని తీసుకువస్తే పదిహేను పర్సంట్...." అంటూ ట్రీట్‌మెంట్ ప్రారంభించాడు.

జేబురు తలతో, మాసిన గడ్డంతో, తిండి తిప్పలు సరిగా తీసుకోనట్లు కృశించిపోయి వున్నాడు టేబిల్ మీద పేషెంట్. ట్రీట్‌మెంట్ పూర్తి అయ్యేలోపలే ప్రాణాలు వదిలేసేటట్లు కనిపిస్తున్నాడు. తన మూలకంగా అతనికి ఆ గతి పట్టబోతున్నదనే ఆలోచన మనసులో అడుగు పెటేసరికి నీటితో నిండిపోయాయి బాబూలాల్ కనులు.

చకచకా పనిచేశాడు డాక్టర్ వైకుఠం. నాలుగే నాలుగు నిముషాలలో గాయన్ని కుట్టి క్లోజ్ చేసేశాడు. ఒక దాని తరువాత ఒకటిగా నాలుగు ఇంజక్షన్స్ పొడిచాడు.

"బతుకుతాడంటారా ?" అడగలేక అడగలేక అడిగాడు బాబూలాల్.

వాష్ బేసిన్‌లో చేతులు శుభ్రం చేసుకొని, టవల్‌తో తుడుచుకుంటూ, టేబిల్ మీది పేషెంట్ వంక పరిశీలనగా చూసి, తల విదిలించాడు డాక్టర్ వైకుంఠం.

"తల పగలటం వల్ల ఇతనికి చావు వస్తోందని నువ్వు బాధపడకు. తల పగిలినా పగలకపోయినా ఇతను చనిపోవటం డెఫినెట్.... లంగ్స్ పూర్తిగా పాడైపోయాయి. బహుశా లంగ్ కాన్సర్ కావచ్చు....." అంటూ ఒక కాగితం మీద తనకు రావాల్సిన ఎమౌంట్‌ను వేసి చూపించాడు.

పర్సులో వున్న నోట్లన్నిటినీ యిచ్చినా యింకో పది రూపాయలు తక్కువ అవటంతో కొద్దిగా టైమ్ అడిగాడు బాబూలాల్. మర్నాడు తెచ్చి ఇస్తానని వాగ్దానం చేశాడు.

"ఇతగాడి బంధువులు ఎవరైనా నీకు తెలుసా?" అడిగాడు డాక్టర్ వైకుంఠం.

తెలియదని బాబూలాల్ తల అడ్డంగా తిప్పటంతో "ఇతని అంత్యక్రియలు కూడా నీకు డబ్బు కావాలి.... అంత సొమ్మును సంపాదించటానికి నువ్వు ఎంత కష్టపడాలో నేను అర్థం చేసుకోగలను" అంటూ ప్రారంభించాడు.

ఆ పది రూపాయలు ఇవ్వాల్సిన అవసరం లేదని అంటాడేమోనని ఎదురు చూశాడు బాబూలాల్.

"నాలుగు రోజులు ఆగిన తర్వాతే తెచ్చి ఇవ్వు.... మరేం పరవాలేదు" అంటూ తన కుర్చీలో కూర్చున్నాడు డాక్టర్ వైకుంఠం.

అదను చూసుకొని అతని జేబుకే బెజ్జం వేయాలనే కోరికను అతి ప్రయత్నం మీద అదుముకుంటూ బయటికి పరుగెత్తాడు బాబూలాల్ రిక్షా పిలుచుకు రావటానికి.

* * * * *

''భానూ.... భానూ...''

మాటా మంతీ లేకుండా పడివున్న అపరిచిత వ్యక్తి ఉన్నట్లుండి కలవరింపులు ప్రారంభించటంతో అదిరిపడి కుర్చీలో నుంచి లేచాడు బాబూలాల్. రెండు అంగల్లో గుడిశె బయటికి వచ్చి, కొంచెం దూరంలో ఉన్న భజరంగభళి ఆలయం వైపు చూశాడు.

అతను తీసుకువచ్చిన పసిబిడ్డను గుండెల్లో పొదుపుకొని ఆలయం వరండాలో ఆదమరిచి నిద్రపోతున్నది అతని భార్య.

అతని అడుగుల చప్పుడుకు అదిరిపడి లేచి కూర్చున్నది.

ఆమె గుండెలమీది బిడ్డను తీసుకొని గుడిశెలోకి వచ్చాడు బాబూలాల్.

''ఇదిగో నీ భాను... ఇక్కడే వున్నాడు....'' పెద్దగా అంటూ బిడ్డను ఆ వ్యక్తి గుండెల మీద పడుకోబెట్టాడు.

దబ్బలాల వంటి సూదులతో డాక్టర్ వైకుంఠం కుట్లు వేసినా, ఎగుడు దిగుడు రోడ్ల మీద ఎగిరెగిరి పడుతున్న రిక్షాలో ప్రయాణం చేసినా కనులు తెరవని ఆ వ్యక్తి. చటుక్కున కదిలించాడు కనురెప్పల్ని – బిడ్డ స్పర్శ తన వంటికి తగిలిన మరుక్షణం.

"నీ బిడ్డకు వచ్చిన భయం ఏమీలేదు.... అరలీటరు పాలు హాయిగా తాగేశాడు... గుడిశెంతా కలియతిరిగి ఆనందంగా ఆడుకున్నాడు... నీ విషయమే నాకు భయం కలిగిస్తోంది....." మంచం మీదికి వంగుతూ పెద్దగా అన్నాడు బాబూలాల్.

పూర్తిగా కనులు తెరిచి అతని వంక చూశాడా వ్యక్తి. గుండెలమీది బిడ్డ వంక చూసుకున్నాడు.

"నీ బంధువులు ఎవరైనా వుంటే చెప్పు... వాళ్ళకి కబురు పంపిస్తాను...." మరికొంచెం ముందుకు వంగుతూ అన్నాడు బాబూలాల్.

దీర్ఘంగా నిట్టూర్చి తల అడ్డం తిప్పాడు ఆ వ్యక్తి.

"అయ్యబాబోయ్... నీకు బంధువులు ఎవరూ లేకపోతే ఎట్లా?" ఖంగారుగా అన్నాడు బాబూలాల్.

గుండెల మీది బిడ్డవంక ఇంకోసారి చూసుకొని, చినిగి పేలికలై పోవటానికి సిద్ధంగా వున్న పాంటు జేబులో నుంచి మందంగా వున్న కవర్ నొకదాన్ని బయటికి తీశాడు ఆ వ్యక్తి.

"భానుకు ఇవ్వండి... పెరిగి పెద్దవాడైన తరువాత... తను... ఎవరో..." అంటూ ఏదో చెప్పటానికి శక్తినంతా కూడగట్టుకుని ప్రయత్నించాడు.

దాహంతో గొంతుక ఎండిపోవటం వల్ల మాటలు సరిగ్గా రావటం లేదేమోనన్న అనుమానంతో మంచినీటి కుండ దగ్గిరికి జంప్ చేశాడు

బాబూలాల్... మంచినీళ్ళు తీసుకొని అతను వెనక్కి చూసేసరికి, అయిపోయింది ఆ వ్యక్తి పని....

*　　　*　　　*　　　*　　　*

పదకొండు గంటలకు రమ్మని చేపితే, ఉదయం ఎనిమిది గంటలకే బంగ్లా ముందు ప్రత్యక్షం అయిన బాబూలాల్‌ని చూసి ఆశ్చర్యపడింది ఆ యువతి. దెబ్బలన్నీ బరువు చేయటం వల్ల అనీజీగా వున్న భర్తను తీసుకువచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టింది.

ఉపోద్ఘాలతో, ఉపచార వాక్యాలతో టైమ్‌ని వృథా చేయకుండా తను వారి ఇంటి దగ్గిర్నించి, బయలుదేరిన తరువాత జరిగినదంతా క్లుప్తంగా చెప్పాడు బాబూలాల్.

"జాలిపడి సారా తాగటానికి డబ్బు ఇచ్చినందుకు తగిన శాస్తి చేశాడు ఆ యాదయ్య... ఊరు పేరు లేని మనిషిని నా పీకల మీదికి తీసుకొచ్చి వదిలాడు...." మరణించిన వ్యక్తి తనకు ఇచ్చిన మందపాటి కవర్‌ని ముందుకు జాస్తూ వాపోయాడు.

మరణించిన వ్యక్తి తన భార్యతో కాబోలు తీయుంచుకున్న ఫోటోలు నాలుగు వున్నాయి ఆ కవర్లో. రెండు మూడు నెలలు వయస్సున్న బిడ్డను వళ్ళో కూర్చోబెట్టుకుని దిగినవి మరో రెండున్నాయి.

బిడ్డను వళ్ళో కూర్చోబెట్టుకున్న ఫోటోల్లో అతను మాత్రమే వున్నాడు అతని భార్య లేదు. అందుకు కారణం ఏమిటో తెలియలేదు బాబూలాల్‌కి ఆ తర్వాత తెలిసింది.

“బెంగుళూర్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో పుట్టాడు ఇతని బిడ్డడు. హాస్పిటల్ వాళ్ళు ఇచ్చిన బర్త్ సర్టిఫికెట్ వుంది వీటిలో...” అంటూ ఆ ఫోటోలతో పాటు వున్న ఒక కాగితాన్ని బయటికి తీశాడు.

“చనిపోయిన వ్యక్తి పేరు లక్ష్మీ ప్రసాద్... అతని భార్య పేరు ప్రసూన...” అంటూ ఇంకో కాగితాన్ని కూడా బయటికి తీసి గాఢంగా నిట్టూర్చాడు.

“ఏమయింది సార్?” ఆశ్చర్యంగా అడిగాడు బాబూలాల్.

“కాన్పు కష్టమై చనిపోయింది ఆ పిల్ల... హాస్పిటల్ వాళ్ళు ఇచ్చిన డెత్ సర్టిఫికెట్ ఇది...” అంటూ తల పట్టుకు కూర్చున్నాడు బాబూలాల్.

“ఈ కవర్లోని ఫోటోలు, కాగితాలు చనిపోయిన మనిషి పేరును మాత్రమే తెలియచేస్తున్నాయి. నీ దగ్గిర వున్న పిల్లడు – ఆ చనిపోయిన మనిషి కొడుకేనని నిర్ధారిస్తున్నాయి. అంతకుమించి అతనెవరో, ఎక్కడినుంచి వచ్చాడో, అతని బంధువులు ఎవరో తెలియటం లేదు. చనిపోయే సమయంలో ఆ వ్యక్తి ఉచ్ఛరించిన మాటలు కూడా గజిబిజిగా వున్నాయి. సరైన అర్థం నాకు స్ఫురించటం లేదు... బెంగుళూరు గవర్నమెంట్ హాస్పటల్ వెళ్లి ఎంక్వయిరీ చేస్తే ఏమైనా ప్రయోజనం వుండటానికి అవకాశాలున్నాయేగాని, ఖచ్చితంగా పని జరుగుతుందని మాత్రం నేను చెప్పను...” అంటూ ఆగాడు యువతి భర్త.

“డబ్బులు ఖర్చుయ్యే ఉపాయాలు వద్దు సార్. ఇప్పటికే పీకలదాకా కష్టల్లో కూరుకుపోయి వున్నాను. మీ పర్సులో వున్న సొమ్ము అంతా ఖర్చుయిపోయింది. డాక్టర్ గారికి పది రూపాయలు బాకీ పడ్డాను. ఇప్పుడు మళ్ళీ చనిపోయిన పెద్ద

మనిషిని తీసుకపోయి అంత్యక్రియలు ఏర్పాటు చేయాలి. అందుకు ఎంతవుతుందో తెలియదు. బెంగుళూరు వెళ్ళి రావటం నా వల్ల అయ్యేపని కాదు గాని, ఇంకో మాట చెప్పండి...” ఖంగారుగా అన్నాడు బాబూలాల్.

పది క్షణాలు ఆలోచించి, “అంత్యక్రియలు చేసెయ్... ఆ పిల్లడ్ని తీసుకుపోయి ఏదైనా అనాధ శరణాలయంలో చేర్పించేయ్... ఈ కాయితాల్ని ఫోటోల్ని చించి అవతల పారెయ్... అనవసరమైన జంజాటాలు పెట్టుకుని హైరానా పడకుండా, నీ బ్రతుకేదో నువ్వు బ్రతుక్కో....” అన్నాడు యువతి భర్త.

అప్పుడు... ఆయన అంత ఖచ్చితంగా చెప్పిన తరువాత బయల్పరిచాడు బాబూలాల్ తన అంతరంగంలో ఉన్న అసలు విషయాన్ని.

“ఆ పిల్లడ్ని చూసిన దగ్గర్నించీ చంకలో కూర్చోబెట్టుకుని క్రిందికి దించటంలేదు నా భార్య. అతన్ని పెంచుకుందామని అంటోంది అలా చెయ్యోచ్చా?”

“ఎందుకు చేయకూడదు? నిరభ్యతరంగా చేయొచ్చు” అంటున్న తన భార్యను కాస్తంత ఆగమని సైగచేస్తూ, బాబూలాల్ కేసి చూశాడు భర్త.

“నువ్వు తీసుకువచ్చిన ఈ ఫోటోలను చూస్తుంటే చనిపోయిన లక్ష్మీప్రసాద్ ఎవరోగాని, కాస్తంత కలిగిన కుటుంబంలో నుంచి వచ్చాడని నాకు అనిపిస్తోంది. ఇవాళ కాకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు ఆ కుర్రాడిని వెతుక్కుంటూ రావచ్చు. అలా వచ్చినప్పుడు అతన్ని వారికి అప్పగించేయాలి. అలా చేయకపోవటం చట్టరీత్యా దారుణమైన నేరం అవుతుంది. నేరాలు చేయటానికి

అలవాటు పడిన నువ్వు అలా చేయకుండా, మొండిగా ప్రవర్తించి, ఆ పిల్లడి భవిష్యత్తును నాశనం చేస్తావేమోనని నా అనుమానం.''

బంధువులు ఎవరైనా వస్తే పిల్లాడిని అప్పగించకుండా తప్పించుకుని, తన మాదిరిగానే జేబు దొంగగా మార్చటం జరుగుతుందని చెప్పీ చెప్పకుండా ఆయన చెప్పిన మాటల్ని ఆలకించేసరికి ఉద్రేకం ముంచుకు వచ్చేసింది బాబూలాల్‌కి.

''పిల్లడి కోసం ఎవరైనా వచ్చిన మరుక్షణం, వాళ్ళను మీ దగ్గిరికి తీసుకువచ్చి మీ సమక్షంలోనే అప్పగించేస్తాను సార్.... అలా ఎవరూ రాని పక్షంలో నా గుండెల్లో పెట్టి పెంచుకుంటాను. నా మాదిరి నికృష్టపు జీవితం గడపాల్సిన అవసరం లేకుండా, చదువు చెప్పించి పెద్దవాడిని చేస్తాను. మా గుడిశె ఎదురుగా వున్న భజరంగభళి మీద, నా భార్య మీద ప్రమాణం చేసి చెబుతున్నాను...'' అన్నాడు ఆవేశం నిండిన కంఠంతో.

''నువ్వు అంత నిక్కచ్చిగా మాటమీద నిలబడగలిగేటట్లయితే ఆ పిల్లడి చదువుకు ఎటువంటి సాయం కావాలన్నా నేను చేస్తాను'' వెంటనే అన్నాడు యువతి భర్త.

''ఇంతకీ ఆ పిల్లాడికి ఏం పేరు పెట్టావ్...?'' ఉన్నట్లుండి వారి మాటల్లో కల్పించుకుంటూ అడిగిందా యువతి.

''పేరంటూ నేను పెట్టలేదమ్మా చనిపోయిన మనిషే 'భానూ... భానూ...' అని కలవరించాడు. అదే పేరుతో పిలుద్దామని అంటోంది నా భార్య '' ఆమె వైపు తిరిగుతూ అన్నాడు బాబూలాల్.

“పేరు ఎవరు పెట్టారో గాని చాలా బాగుంది” వెంటనే మెచ్చుకుంది ఆమె.

ఎందుకో తెలియదు గాని, అదో విధమైన సంతోషం ఉప్పొంగిపోయింది బాబూలాల్ హృదయం ఆమె మెచ్చుకోలును ఆలకించేసరికి.

టీపాయ్ మీద ఉన్న ఫోటోల్ని, కాగితాల్ని తిరిగి కవర్లో పెట్టేశాడతను.

“పోలీసులతో సంబంధాలుండటం వల్ల, ఎప్పుడు ఏ క్షణంలో వాళ్ళు నా గుడిసెమీద పడి సామానంతా చెల్లాచెదరు చేస్తారో తెలియని పరిస్థితి నాది... నా దగ్గిరుంటే గల్లంతైపోతుంది. ఇది అవసరం అంటూ వచ్చేదాకా మీ దగ్గిరే వుంచాలి....” అంటూ ఆ యువతి భర్తకు అందించాడు.

“నీకు యివ్వాల్సిన డబ్బును బ్యాంకులు తెరిచిన తరువాత డ్రా చేసి తీసుకురావచ్చునే ఉద్దేశ్యంతో పదకొండు గంటలకు రమ్మన్నాను. నువ్వు చాలా ముందుగానే వచ్చావ్. బ్యాంకులు పది గంటలకు గాని తెరవరు...” అతనితో పాటు గేటు దాకా వస్తూ అన్నాడతను.

“డబ్బు కోసం రాలేదు సార్ నేను... అసలు డాక్టర్ గారికిచ్చిన డబ్బు మీదే. నాది కాదు. మీరు నాకేమీ యివ్వాల్సిన అవసరం లేదు.....” అంటూ రోడ్డు మీదికి పోబోయిన బాబూలాల్‌ని మధ్యలోనే ఆపి, ప్రక్క ఇంటికి వెళ్ళి వచ్చింది ఆ పెద్ద మనిషి భార్య.

“ఎవరి డబ్బు ఎవరు ఇచ్చారనే విషయం గురించి గతరాత్రి మనం మాట్లాడుకున్నాం. మరోసారి ఆర్గ్యుమెంట్‌ని మొదలుపెట్టి నాకు తల నెప్పి

తెప్పించకు" అంటూ ప్రక్క ఇంట్లో బదులడిగి తీసుకు వచ్చిన డబ్బును బలవంతంగా పెట్టింది అతని చేతిలో.

పెదవి విప్పి ఒక్కమాట కూడా మాట్లాడలేకపోయాడు బాబూలాల్. మౌనంగా నమస్కరించి తన దారిన తాను –

"లెక్చరర్ గారు ఏదో అడుగుతున్నారు... సమాధానం చెప్పకుండా అలా కళ్ళ మూసుకు కూర్చుంటావేమిటి.....?" అంటూ భాను భుజం తట్టటంతో ఉలిక్కిపడి ప్రస్తుతంలోకి వచ్చేశాడు బాబూలాల్.

కనులముందు కదలాడిన దృశ్యాలు పందొమ్మిది సంవత్సరాల క్రిందటివని అనిపించటం లేదతనికి.

జేబులు కొట్టుకుంటూ బ్రతికే తన చీకటి జీవితంలోకి పున్నమి వెలుగులా ప్రవేశించాడు భాను.

వచ్చీ రాని మాటలతో 'బాబాయ్... బాబాయ్...' అని పిలుస్తూ అతనింకా తన భుజాల మీదికి పాకుతున్నట్లే అనిపిస్తోంది.

ఎంత ఆలస్యంగా యింటికి పోయినా, నిద్రపోకుండా గుమ్మంలోనే కూర్చుని, కనిపించిన మరుక్షణం కాళ్ళకు చుట్టుకుంటున్నట్లే కనిపిస్తోంది.

లెక్చరర్ గారు అనుమానించినట్లు భాను కోసం బంధువులెవరూ రాలేదు. అతని పెంపకంలోని మాధుర్యాన్ని అనుభవించకుండా తనకు అడ్డుపడలేదు.

"లెక్చరర్ గారికి సమాధానం చెప్పకుండా అలాగే కూర్చుంటావేమిటి బాబాయ్! నిద్రపోతున్నావా?" భుజం తడుతూ భాను మరోసారి హెచ్చరించటంతో పూర్తిగా తెలివి తెచ్చుకున్నాడు బాబూలాల్.

"ఏవో ఆలోచనల్లో పడి ఏమరుపాటుగా వున్నాను... క్షమించాలి" అని అతను అనబోతుండగా వారించి, "గతించిన రోజుల్ని ఆనందంగా పంచుకోగలిగిన మనిషి నిజంగా చాలా అదృష్టవంతుడు... అందుకు గర్వపడాలిగాని, సిగ్గుపడకూడదు" అన్నాడు లెక్చరర్.

"నన్నెందుకు రమ్మన్నారో మీరు చెప్పలేదు సార్..." అంటూ సూటిగా అసలు విషయం ప్రస్తావించాడు బాబూలాల్.

"ఆ విషయం గురించి మాట్లాడబోతుంటే నువ్వు నీ గతంలోకి పరగుతీశావ్...." అంటూ లోపలికి వెళ్ళి, రంగు వెలిసిన ఒక పాత కవర్ని, ఒక న్యూస్ పేపర్ని తీసుకువచ్చాడు లెక్చరర్.

"పందొమ్మిది సంవత్సరాల క్రితం, అవసరం వచ్చేదాకా జాగ్రత్త చేయమని దీన్ని నాకు యిచ్చావ్. దీన్ని తెరిచి చూడాల్సిన అవసరం ఎప్పటికీ రాదనే అనుకున్నాను గాని, అనుకోని విధంగా వచ్చేసిందిప్పుడు...." కవర్లోని ఫోటోలను, కాగితాల్ని టీపాయ్ మీద ఒక వరసలో అరేంజి చేస్తూ అన్నాడు.

కవరు తెరువక ముందే అదేమిటో గుర్తుపట్టి అదోలా అయిపోయాడు బాబూలాల్. లెక్చరర్ గారి మాటలు మరింత క్రుంగదీశాయి అతన్ని, కాళ్ళు

చేతులు చల్లబడిపోతున్నట్లు అనిపించి తనకు తెలియకుండానే సోఫా వెనక్కి వాలిపోయాడు.

"ఏమైంది బాబాయ్? ఏమైంది నీకు?" ఆశ్చర్యం, ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ అతని భుజాలు పట్టుకున్నాడు భాను.

"కమాన్ పార్వతీ.... బ్రింగ్ సమ్ వాటర్... క్విక్..." అని భార్యను హెచ్చరిస్తూ అతని దగ్గిరికి జంప్ చేశాడు లెక్చరర్.

నాలుగు అంగల్లో లోపలికి పోయి పెద్ద పాత్రనిండా నీటిని తీసుకవచ్చి బాబూలాల్ ముఖం మీద చిలుకరించింది అతని భార్య.

వెంటనే తేరుకున్నాడు బాబూలాల్... తేరుకోవటమైతే తేరుకున్నాడు గాని, అంతకుముందు పది క్షణాల క్రిందటి వరకూ అతని ముఖంలో వెల్లివిరిసిన కళాకాంతులు యిప్పుడు కనిపించటంలేదు.

"ఆర్ యూ ఆల్ రైట్? డాక్టర్ దగ్గిరికి తీసుకువెళ్ళమంటావా??" అతని కండిషన్‌ని జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూ అడిగాడు లెక్చరర్.

"డాక్టర్ దగ్గిరికి వెళ్ళల్సిన అవసరం లేదు సార్... భాను మాకు దూరమై పోతున్నాడేమో అనిపించి కళ్ళు తిరిగాయి. ఇప్పుడు బాగానే ఉంది... మీరు చెప్పదలుచుకున్నదేదో చెప్పండి. మరేం ఫరవాలేదు..." అన్నాడు బాబూలాల్.

అతని వంక, లెక్చరర్ గారి వంక ఆశ్చర్యంగా చూశాడు భాను.

"నేను దూరమై పోవటమేమిటి బాబాయ్? నీకు పిచ్చి ఎక్కిందా? కాలి మీద దెబ్బ మళ్లీ బరువు చేసి జ్వరం వచ్చిందా?" అని అడుగుతూ అతని నుదుటి మీద చేయి వేశాడు.

ఆ చేతిని తన కుడి చేతిలోకి తీసుకొని, రెండో హస్తాన్ని అతని భుజాల చుట్టూ చుట్టి ఆప్యాయంగా దగ్గిరికి లాక్కున్నాడు బాబూలాల్.

"ఆ రోజు మీ ముందు చేసిన ప్రమాణాన్ని పూర్తిగా పాటించాను సార్... వీడిని గుండెల్లో పెట్టుకుని పెంచటం కాదు... మా కళ్ళలో పెట్టుకొని కాపాడుకున్నాము... బంధువులు ఎవరైనా వెదుక్కుంటూ వచ్చిన మరుక్షణం మీ సమక్షంలోనే వాళ్ళకి అప్పగించేస్తానని అన్న మాట కూడా నాకు జ్ఞాపకం వుంది. ఇంతకాలం కనిపెట్టుకుని వున్న భ్రమత మూలకంగా కళ్ళు తిరిగి పడిపోయాను గాని, వీడిని నా స్వంతం చేసుకోవాలన్న కోరికతో మాత్రం కాదు...." అంటూ మొదలు పెట్టేసరికి ఫక్కున నవ్వాడు లెక్చరర్.

"భాను నీకు కాకుండా పోతున్నాడని యిప్పుడు ఎవరు అన్నారు?" నవ్వుతూనే అడిగారు.

"మరి... ఆ ఫోటోలు... ఆ కవరు?"

"వయస్సు పెరుగుతున్న కొద్దీ నీకు తొందరపాటు తగ్గాల్సింది పోయి చాలా ఎక్కువ అవుతోంది. నేను చెప్పేది పూర్తిగా వినకుండా నీ అంతట నువ్వే నిర్ణయాలు తీసేసుకొని కళ్ళు తేలవేస్తే ఎలా?"

సిగ్గుతో తల వంచుకున్నాడు బాబూలాల్.

అతని ఫీలింగ్స్‌తో తనకు నిమిత్తం లేనట్లు. "ఆ రోజు రిక్షా క్రింద పడి తల పగలగొట్టుకొని నీ గుడిశెలో ప్రాణాలు వదిలిన మనిషి పేరు లక్ష్మీ ప్రసాద్ అని ఈ కాగితాలను బట్టి మనం అనుకున్నాం... అవునా?" అన్నాడు లెక్చరర్ టీపాయ్ మీద కాగితాల్లో ఒకదాని ప్రక్కన పెడుతూ.

తల వూపాడు బాబూలాల్.

"అతను మన భానును వళ్ళో కూర్చోబెట్టుకుని తీయించుకున్న ఫోటోలు యివి, అవునా?" రెండు ఫోటోలను కూడా ప్రక్కకు తీస్తూ అడిగాడాయన.

ఆయన చెప్పదలుచుకున్నదేమిటో అర్థం కాకపోయినా ఎదురు ప్రశ్నలు వేస్తే మళ్ళీ వెక్కిరింపులకు గురికావాల్సి వస్తుందన్న భయంతో ఆ మాటలకు కూడా వెంటనే తల ఊపాడు బాబూలాల్.

"ఈ రోజు పేపర్లన్నిటిలోను ఒక ప్రకటన చాలా ప్రముఖంగా ప్రచురింపబడింది. ధార్వాడ ఎస్టేట్స్‌కి సంభందించిన వారసుడి కోసం... నువ్వు చుశావా?" టీపాయ్ మీది ఫోటోల్ని, కాగితాల్ని కదిలించటం ఆపి మరో ప్రశ్న వేశాడు లెక్చరర్.

ఆలీమియా అరెస్ట్ అయిన వార్త కోసం ఆ రోజు పేపర్ని చదివాడు బాబూలాల్. లెక్చరర్ గారు చెపుతున్న ప్రకటనను కూడా చూడటం జరిగింది గాని, ఆలీమియాకి సంబంధించిన వార్త మాదిరిగా అతన్ని ఆకర్షించలేదది.

"నన్ను బాగా ఆకర్షించింది అది...." అతని ముఖంలోని భావాలను బట్టి అతని అంతరంగంలోని మాటను అర్థం చేసుకుంటూ అన్నాడు లెక్చరర్.

"అందులో ధార్వడ ఎస్టేట్స్ యజమాని సూర్యప్రసాద్ కుమారుడు లక్ష్మీ ప్రసాద్ అని చదవగానే అనుమానం వచ్చి, పాత పేవర్లను తిరగవేశాను.... పదిహేను రోజుల క్రితం సూర్యప్రసాద్ యాక్సిడెంట్‌లో మరణించినప్పుడు యివ్వబడిన యింకో ప్రకటన నాకు దొరికింది. పదిహేను రోజుల క్రితమే రావాల్సిన అనుమానం యిప్పటికైనా వచ్చినందుకు సంతోషిస్తూ నీకు కబురు పంపాను...." అంటూ ఆ పాత పేపర్‌ని తెరిచి మధ్య పేజీలోని ఒక వార్తను చూపించాడు అతనికి.

ధార్వడ ఎస్టేట్స్ యజమాని మరణించినప్పుడు ఆయన కూమారుడు ఎక్కడ వున్నా వెంటనే రావల్సిందిగా కోరుతూ ఫోటో కూడా ప్రింట్ చేయించారు.

ఆ ప్రకటనలోని మాటలు కుతూహలాన్ని కలిగించలేదు గాని, ఫోటోని చూసేసరికి కరెంట్ షాక్ కొట్టినట్లు అయింది బాబూలాల్‌కి.

"ఇతనే! రిక్షా క్రింద పడి తల పగలగొట్టుకుని, నా గుడిశెలో ప్రాణాలు వదిలేసిన మనిషి ఇతనే!!" అంటూ వుండగా, లెక్చరర్ గారికి వచ్చిన అనుమానం ఏమిటో పూర్తిగా అర్థమై, ఇంకోసారి షాక్ తగిలినట్లు అదిరిపడ్డాడతను.

ధార్వడ ఎస్టేటు యజమాని సూర్యప్రసాద్.

అతని కుమారుడు లక్ష్మీ ప్రసాదే రిక్షా క్రింద పడిన మనిషి.

భానుని తనకు అప్పగించి తన గుడిశెలో ప్రాణాలు వదిలింది అతనే.

అంటే భాను... లక్ష్మీప్రసాద్‌కి కొడుకు... ధార్వాడ ఎస్టేటుకి వారసుడు!

నెలలు వయసున్న భానును వళ్ళో కూర్చోబెట్టుకుని అతను తీయించుకున్న ఫోటోలను చూస్తూ మాట్లాడటానికి ప్రయత్నించాడు బాబూలాల్. ఏం మాట్లాడాలో అర్థం కాకపోవటంతో వెర్రిచూపులు చూశాడు.

అతని వంక ఇంకోసారి ఆందోళనగా చూస్తున్న భానును గమనించి చిన్నగా నవ్వుతూ టీపాయ్ మీది కాగితాన్ని, న్యూస్ పేపర్ని, అతని చేతిలోని ఫోటోలను పాత కవర్ లోకి నెట్టాడు లెక్చరర్.

"భాను తన వారసత్వాన్ని నిరూపించుకునేందుకు ఇంకో మూడు నెలలు వ్యవధి వుంది కాబట్టి యిప్పుడు ఈ విషయాన్ని గురించి మనం ఆలోచించవద్దు. ఇంకో పది రోజుల్లో పరీక్షలు ప్రారంభం అవుతాయి. అవి అయిపోయిన తర్వాత చూసుకుందాం" అంటూ ఆ కవర్ని లోపలి గదిలో భద్రపరిచి వచ్చాడు.

అప్పటికి తనను తాను కంట్రోల్ చేసుకున్నాడు బాబూలాల్.

"ఇప్పుడు... మమ్మల్ని ఏం చేయమంటారు సార్?" అని అడుగుతూ సోఫాలోనుంచి లేచి నిలబడ్డాడు.

"ఇంటికి పోయి హాయిగా విశ్రాంతి తీసుకోండి... ఏమీ చేయవద్దు.... భానుకు పరీక్షలు అయిపోయిన తర్వాత చెపుతాను ఏం చేయాలో..." అతన్ని సాగనంపటానికి గేటు దాకా వస్తూ అన్నాడు లెక్చరర్.

అటుగా వచ్చిన ఒక రిక్షాని పిలిచి బాబూలాల్ని అందులో కూర్చోబెట్టాడు భాను. తను అడ్రసు చెప్పి, తను కూడా అతని సరసన కూర్చున్నాడు.

పెద్ద బజారు టర్నింగ్ దాకా సజావుగా వున్నాడు బాబూలాల్. టర్నింగ్‌ని దాటి ముందుకు పోబోతున్న సమయంలో, “నా మనసంతా గజిబిజి అయిపోయింది... రెండు చుక్కలు గొంతులో పడితే తప్ప మాములు మనిషిని కాలేను” అని ఎనౌన్స్ చేశాడు.

“వద్దు బాబాయ్... కాలు మీది గాయం పూర్తిగా తగ్గకుండా చుక్కల జోలికి పోవద్దు. ఇంటికి వెళ్ళిపోదాం. పిన్నిని అడిగి మంచి టీ పెట్టించుకుందాం...” అంతకు ముందు రోజు బనారసీ బాబు దగ్గిర తీసుకున్న అడ్వాన్సు, ఓవర్ టైమ్ చేసి సంపాదించుకున్న ఎక్‌స్ట్రా భత్యంలో డాక్టర్ వైకుంఠం బాకీ చెల్లు వేయగా మిగిలిన కొద్దిపాటి చిల్లరను తడుముకుంటూ బ్రతిమాలాడు భాను.

మొండిగా తల అడ్డంగా తిప్పి, రిక్షాని సారాకొట్టు చిన్నా దుకాణం దగ్గిరికి పోనీయమని సైగ చేశాడు బాబూలాల్.

## 9

త్రీటవున్ మధ్య భాగంలో వుండే హనుమాన్ టెంపుల్ దగ్గిర సిటీ బస్ దిగి, అక్కడికి చాలా దగ్గిర్లో కనిపించే ఒక అందమైన బిల్డింగ్ లోకి వెళ్ళాడు భాను.

విశాలమైన ముందు గదిలో వెంటనే కనిపించిందొక అందమైన యువతి.

“వాట్ కెనైడూ ఫర్ యూ?” అతన్ని చూడగానే మర్యాద పూర్వకంగా అడిగింది.

"లాయర్ జనార్ధన్ గారిని కలుసుకోవాలి...." అక్కడి గోడల కున్న ఖరీదైన పెయింటింగ్స్‌ని, క్రింద పరిచి వున్న వాల్ టూ వాల్ కాస్ట్‌లీ కార్పెట్‌ని పరిశీలనగా చూస్తూ చెప్పాడు భాను.

"అపాయింట్‌మెంట్ తీసుకున్నారా?" ఆ రోజు లాయర్ గారి ప్రోగ్రామ్స్‌ని సూచించే చార్టును తీసి, ఆ టైములో వచ్చేవారిని వెతుకుతూ అడిగిందామె.

"అపాయింట్‌మెంట్ తీసుకోనిదే వారిని కలుసుకోవటం కుదరదంటారా?" ఆమె శ్రమను తగ్గించే వుద్దేశ్యంతో తన పొజిషన్‌ని వెంటనే బయటపెట్టాడు భాను. "చాలా ముఖ్యమైన పనిమీద వచ్చాను. పది నిముషాలకంటే ఎక్కవ డిస్టర్బ్ చేయను..." అంటూ రిక్వెస్ట్ చేశాడు.

ఆలోచనలో పడిందా యువతి.

"మీరు కాసేపు వెయిట్ చేయండి. లాయర్ గారితో మాట్లాడి ఆయన అంగీకరించేటట్లయితే లోపలికి పంపిస్తాను...." అంటూ తన టేబిల్ మీద వున్న కాగితాలు కొన్నింటిని తీసుకుని ప్రక్క గదిలోకి వెళ్ళింది.

పది నిముషాలు పాటు ఆ టేబిల్ దగ్గిరే నిలబడి గోడలమీది పెయింటింగ్స్‌ని చూశాడు భాను. దగ్గిరో వున్న ఒక కిటికీ దగ్గిరికి పోయి, అక్కడి నించి ఆగుపిస్తున్న వీధిలోకి చూస్తూ యింకో పది నిముషాలు వెయిట్ చేశాడు. అప్పటికి అవతలి గదిలోకి పోయిన యువతి బయటికి రాకపోవటంతో విసుగ్గా తల విదిలించి, ఒక కుర్చీలో కూర్చున్నాడు.

మరో పది నిముషాలు గడిచి పదకొండో మినిట్ అడుగు పెడుతుండగా, ఆ బిల్డింగ్ ఎదుట ఆగిందొక ఆటో. హడావుడిగా అడుగులు వేస్తూ లోపలికి వచ్చాడు అందులో నుంచి దిగిన వ్యక్తి ఒకతను.

భాను మాదిరిగా ద్వారం ప్రక్కనే టేబిల్ ముందు ఆగి తనెవరో, తనకు అపాయింట్‌మెంట్ వున్నదో లేదో చెప్పుకోలేదతను. ఎంతో చొరవగా టేబిల్ మీద వున్న ఇంటర్ కమ్ స్విచ్‌ని నొక్కి "నేను గగ్లూమియాని వచ్చాను. మీతో చిన్న పని పడింది...." అని ఎనౌన్స్ చేశాడు.

కుర్చీ ప్రక్కన వున్న టీపాయ్ మీది మాగజైన్ నొకదాన్ని తిరగేస్తున్నాడు భాను. ఆ వ్యక్తిని గురించి పట్టించుకోలేదు. అతను చెప్పుకున్న పేరును వినే సరికి అదిరిపడి తల ఎత్తాడు.

సారాకొట్టు చిన్నా దుకాణంలో తను కొట్టిన దెబ్బలకు తల వాచిపోయిన ఆలీమియా అనుచరుడు గగ్లూమియానే అతను. చోటుగాని చోటులో ఎదురైనందువల్ల గుర్తుపట్టలేదు. అలాగే మరో రెండు నిముషాలపాటు అక్కడే కూర్చుని వుంటే తప్పకుండా జ్ఞప్తికి తెచ్చుకుంటాడు.

చేతిలోని మాగజైన్‌ని కొద్దిగా పైకెత్తి ముఖం అతనికి కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు భాను. గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకుని కదలకుండా కూర్చున్నాడు.

ఇంటర్‌కమ్‌లో నుంచి సమాధానం వినవచ్చేదాకా ఆగలేదు గగ్లూమియా తన రాకను ఎనౌన్స్ చేసిన వెంటనే ప్రక్కగదివైపు బయలుదేరాడు.

అతను అక్కడ వుండగా తను ఆ ప్రిమైనెస్‌లో నిలబడటం మంచిది కాదని అనిపించి కుర్చీనుంచి లేచాడు భాను. అలా లేస్తుండగా ప్రక్కనే కిటికీలోనుంచి అతనికి ఆగుపించారు ఆలీమియా అనుచరవర్గంలోని ఎమిలీ – ఎడ్విన్‌లు.

గగ్లూమియా తోపాటు తన్నులు తిన్న వారిలో ఎమిలీ వున్నాడు. ఎడ్విన్ లేడుగాని తన జతగాళ్ళ మీద చేయి వేసిన మనిషి కనిపిస్తే వట్టొట్టి చూపులతో కాలక్షేపం చేసే మనిషి మాత్రం కాదతను.

ఆలీమియాతోపాటు వాళ్ళందరూ అరెస్ట్ అయివుంటే బాగుండేదని తలపోస్తూ తిరిగి కుర్చీలో జేరగిలపడి టీపాయ్ మీది మాగజైన్‌ని అందుకున్నాడు భాను.

ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరిగా తయారయింది అతని పరిస్థితి.

ఏ క్షణంలోనైనా బయటికి రావచ్చు గగ్లూమియా..... లోపలికి పోయే హడావుడిలో పరిశీలనగా చూడలేదు. బయటికి వచ్చే సమయంలో పరకాయించి చూసే అవకాశాలు చాలా హెచ్చుగా వున్నాయి. అలా చూసిన మరుక్షణం గుర్తుపట్టేస్తాడు..... గుర్తుపట్టి నెక్ట్స్ సెకనులో ఫైటింగ్‌కి రెడీ అయితే తనేం చేయాలి??

అతని ఆలోచనలు ఒక కొలిక్కి రాకముందే రెండో ప్రక్కనుంచి ముంచుకు వచ్చింది మరో ప్రమాదం.

“నడిరోడ్డు మీద నిలబడి ఎండలో మాడిపోవటం దేనికి? లోపలికి పోయి కూర్చుందాం... లోపల చల్లగా వుంటుంది.” అంటూ రిసెప్షన్ హాల్ కేసి బయలుదేరాడు ఎమిలీ – ఎడ్విన్‌ని వెంటబెట్టుకొని.

వద్దు వద్దన్న కొద్దీ వినకుండా అక్కడికి పంపించిన లెక్చరర్ గారిని తలచుకొని విపరీతమైన విసుగుతో తల విదిలించాడు భాను.

అంతకు ముందురోజే అయిపోయాయి పరీక్షలు.

ఆఖరి పరీక్ష వ్రాసి ఎగ్జామినేషన్ హాల్లో నుంచి బయటికి వస్తూండగా, అటెండర్ కొమరవేలు దారికి అడ్డుగా ప్రత్యక్షమై లెక్చరర్ గారు రమ్మంటున్నారని చెప్పాడు.

“ధార్వాడ ఎస్టేట్స్‌కి లీగల్ ఎడ్వయిజర్ మన గీత మేనమామ లాయర్ జనార్ధన్ అని నాకు తెలిసింది. ఒకసారి వెళ్ళి ఆయనతో మాట్లాడిరావటం బాగుంటుంది” స్టాఫ్ రూమ్ ముందున్న వరండాలో నిలబెట్టి లోగొంతుకతో సలహా ఇచ్చారయన.

“నాకు ఇష్టం లేదు సార్... మీరు ఈ మాట చెప్పిన దగ్గిర్నించీ బాబాయ్ పరిస్థితి బాగోలేదు. బంధాలు భ్రమతలు పెంచుకోవటం చాలా తప్పని చీటికి మాటికీ అంటున్నాడు. పిన్నిని వేధించుకు తింటున్నాడు ” అన్నాడు భాను.

“అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి?” ఆశ్చర్యంగా అడిగారాయన.

“నాకు బాబాయి పెంపకమే బాగుంది సార్... అయిన వాళ్ళెవరూ లేని శ్మశానం వంటి ఆ ఎస్టేటు నాకు వద్దు. ఆ వారస్వతం అసలు వద్దు” అంటూ

లెక్చరర్‌గారి సమాధానం కోసం ఎదురు చూడకుండా ఇవతలికి వచ్చేసే ప్రయత్నం చేశాడు.

రెండు అడుగులు కూడా వేయకముందే చేయి పట్టుకొని ఆపేశారాయన.

"నీకు ఆ ఆస్తి వద్దు. ఆల్‌రైట్... నీ మాట ప్రకారమే వదిలేద్దాం ఆ ఆలోచనని. నా మనసులో ఒక సందేహం మెదులుతోంది. దానికి సమాధానం చెపితే నీకు సంబంధించిన ఫోటోల్ని, కాగితాల్ని చింపి అవతల పారేస్తాను, ఓ.కే?" స్టాఫ్ రూమ్‌లోకి తీసుకుపోయి కుర్చీలో కూర్చుబెడుతూ అడిగాడు.

ఆ సందేహం ఏమిటో ఊహించటానికి ప్రయత్నం చేసి, ప్రయోజనం లేకపోవటంతో అంగీకార సూచకంగా తల వూపాడు తను.

"నీ చదువు పూర్తి కావటానికి ఇంకో సంవత్సరం వ్యవధి వుంది. చదువు అయిన తర్వాత సరయిన ఉద్యోగం దొరకాలంటే యింకో ఒకటి రెండు సంవత్సరాలు పడుతోంది. అంతవరకూ మీ బాబాయి వీధుల్లో తిరుగుతూ వుండవలసినదేనా? అందలం ఎక్కించే అదృష్టాన్ని ఎదుట పెట్టుకొని, అతను అందరిచేత తన్నులు తింటూ బ్రతకవలసిందేనా?" అడిగాడు లెక్చరర్ గారు.

సమాధానం చెప్పటానికి క్షణం కూడా తడుముకోలేదు తను.

"ఇవ్వాళ ఏదో పొరపాటున నా పుట్టుక గురించి తెలిసింది కాబట్టి ఇలా అడుగుతున్నారు. తెలియకుండా వుంటే? చదువు పూర్తి అయి ఉద్యోగం దొరికేదాకా మీరు చెప్పిన పరిస్థితి కంటిన్యూ అయ్యేది కదా?" ఎంతో తెలివిగా

సమాధానం ఇచ్చానని అనుకుంటూ, ఆ సమాధానం తోనే ఆయన చేతికి దొరికిపోయాడు.

“మన చేతుల్లో లేని విషయాల మీద ఆశ పెట్టుకొని ఆత్మవంచన చేసుకోవటం నాకు నచ్చదు. ఇప్పుడు నీ పరిస్థితి వేరు. నీ వారసత్వాన్ని నిరూపించుకోగల్గితే నీ పిన్ని, బాబాయిలను పువ్వుల్లో పెట్టి చూసుకోవచ్చు....”

ఆయనతో ఆర్గుమెంట్ పెట్టుకొని గెలవటం కష్టమని గ్రహించి ఆయన చెప్పినట్లే బయలుదేరి వచ్చాడు తను.

ధార్వాడ ఎస్టేట్స్‌కి వారసుడిగా గుర్తింపబడటం అంటే మాటలు చెప్పినంత తేలిక కాదు... కొన్ని కోట్ల రూపాయలకు సంబంధించిన వ్యవహారం అది... ఎదురు పడిన అర నిముషంలో అన్‌ఫిట్‌గా నిర్ణయించి బయటికి తరిమేస్తాడు లాయర్ జనార్ధన్.

అలా జరిగితే హాయిగా యింటికి పోవచ్చని తన ఆశ... ఎదురౌతున్న పరిస్థితులు మాత్రం అందుకు అంగీకారంగా లేవు..... లాయర్ గారు బయటికి తరిమేసే మాట ఎలాగున్నా ఆలీమియా అనుచరులు వెంటబడటం మాత్రం డెఫినెట్.

పరువులు పోకుండా ఎలా బయటపడాలి ఆ ప్రమాదంనుంచి?

సమాధానం లభించని ఆ ప్రశ్నతో అతను సతమతమౌతుండగానే లోపలికి వచ్చేశారు ఎమిలీ – ఎడ్విన్‌లు.

వస్తూనే భాను వంక ఎగాదిగా చూశాడు ఎమిలీ.

‘‘నిన్ను ఎక్కడో చూసినట్లుంది... నీ పేరేమిటి భాయీ? ఏ ఊరు?’’ అని అడుగుతూ వచ్చి ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చున్నాడు.

కొంపలు అంటుకోవటానకి ఎంతో వ్యవధి లేదని గ్రహించి చటుక్కున లేచాడు భాను కుర్చీలో నుంచి.

ముఖద్వారానికి అడ్డుగా నిలుచుని వున్నాడు ఎమిలీ సహచరుడు ఎడ్విన్.

అటుపోవటానికి వీలులేదు.

లాయర్ గారి గదిలోకి తీసుకుపోతుంది ఎడమచేతి వైపు వున్న మార్గం.

అనుమతి లేకుండా లోపలికి పోతే, అరిచి కేకలు పెట్టి బయటికి నెట్టేయవచ్చాయన. గగ్లూమియా అక్కడే వున్నాడు. ఆ పనిలో తప్పకుండా పాలుపంచుకుంటారు.

ఇక మిగిలింది ఒకే ఒక మార్గం! అది ఆ హాలు కుడిచేతివైపున వుంది!!

అది ఎటుతీసుకుపోతుందో, అక్కడ ఇంకేదయినా కొత్త ప్రమాదం పొంచులు వేసుకొని వుందేమో తెలియదు. తెలిసే దాకా ఆగే వ్యవధి తనకు లేదు.

‘‘పేరు అడిగితే కుర్చీలోనుంచి లేచిపోతున్నా వేమిటి భాయీ? మనది ఏ ఊరు?’’ మరింత పరీక్షగా ముఖంలోకి చూస్తూ ఎమిలీ అడగటంతో, అనుమానాలన్నిటినీ ప్రక్కకు నెట్టి కుడిచేతి వైపున వున్న ద్వారం కేసి బయలుదేరాడు భాను.

‘‘నాది ఈ ఊరు కాదు... లాయర్ గారికి దూరపు చుట్టాన్ని... నా పేరు రాందాసు.’’

ఎమిలీ ప్రశ్నకు నోటికి వచ్చిన సమాధానం ఇస్తూ ద్వారాన్ని దాటి, తలుపుల్ని తన వెనకే క్లోజ్ చేశాడు.

తలుపుల్ని మూస్తూ వుండగానే "ఎవరు? ఎవరది? ఎవరు ద్వారం దగ్గిర??" అంటూ వినవచ్చింది ఒక కంఠం.

పెనం మీదినుంచి నిప్పుల్లో పడినట్లుగా తయారయిన తన పరిస్థితిని తలుచుకుంటూ శిలావిగ్రహంలా నిలబడిపోయిన అతని ఎదుటికి పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అవతలి గదిలో నుంచి వచ్చిందొక అందాల బొమ్మ.

ఎమిలీ ఎడ్విన్‌లు తనను గుర్తుపట్టి గోలచేస్తే, ఏదో ఒక విధంగా సర్దుకుపోవచ్చనిపించింది భానుకి.

కాదు కూడదని వాళ్ళు తన్నులాటకే సిద్ధమయితే నోరు మూసుకుని తన్నులు తినటమే మంచిదని తోచింది.

ఎందుకంటే, అతని ముందుకు వచ్చిన అందాల బొమ్మ మరెవరో కాదు.

లాయర్ జనార్ధన్ గారి మేనకోడలు – అతని క్లాస్‌మేట్ అయినటు వంటి గీతిక!

*　　*　　*　　*　　*

"నువ్వా?" ఆశ్చర్యంతో కనులు పెద్దవి చేసి చూస్తూ అన్నది గీతిక.

"నేనే" ఆ రోజు ఉదయం నిద్రలేవగానే ఎవరి ముఖం చూశాడో గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ సమాధానమిచ్చాడు భాను.

"ఎందుకు వచ్చావిక్కడికి?"

“పరీక్షలు అయిపోయాయి గదా... బాగా... వ్రాశావో లేదో అడగటానికి వచ్చాను.”

“తలలో పెట్టుకోవాల్సిన పూలు చెవిలో పెట్టుకున్నానని నీ ఉద్దేశ్యమా?”

నోటికి వచ్చినట్లు మాట్లాడటం వల్ల ఉపయోగం ఏమీ లేకపోగా, మరిన్ని చిక్కులు నెత్తిమీదకి తెచ్చుకోవటమే అవుతుందని గ్రహించి. “లాయర్ గారితో కాస్త పని వుండి వచ్చాను” అన్నాడు భాను.

“మామయ్యతో పనివుంటే బయట హాల్లో కూర్చోవాలి గాని, ఇక్కడికి రావటం దేనికి?”

హాల్లో ఆలీమియా అనుచరులు వున్న సంగతిని చెప్పాలో వద్దో నిర్ణయించుకోలేకపోయాడు భాను. చెపితే వాళ్ళను చూసి భయపడాల్సిన అవసరమేమొచ్చిందని అడుగుతుంది. చెప్పకపోతే –

“సమ్ థింగ్ ఈజ్ రాంగ్ విత్ యూ... నీ నాటకం నాకు అనుమానంగానే వుంది. మామయ్యను పిలిచి నీ సంగతేమిటో తేల్చేస్తాను” అంటూ ప్రక్కనే వున్న కిటికీ దగ్గరికీ వెళ్ళింది గీతిక.

కిటికీ తలుపులు తెరిచి ఆమె ఎవరినైనా పిలిస్తే తన నాటకం బట్టబయలు అయిపోతుందన్న భయంతో “మంచినీళ్ళు కావాలి గీతికా... దాహంతో నాలుక విరగలాక్కుపోతుంటే యిక్కడికి వచ్చాను” గబగబా అన్నాడు భాను.

కిటికీ తలుపును లోపలికి నెట్టి ఎవరినో పిలవటానికి రెడీ అవబోతున్నది గీతిక. ఆ ప్రయత్నాన్ని విరమించుకొని అతనికేసి చురుగ్గా చూసింది ఆమె.

“హాల్లో వుండే సెక్రటరీ మీ మావయ్యగారి గదిలోకి వెళ్ళింది... ఎంతసేపటికి రాకపోవటంతో ఎవరిని అడగాలో తెలియక యిటుగా వచ్చాను. ఇది ఫామిలీ వుండే జాగా అని నాకు తెలియదు....” ఇంకా కాస్త స్పీడ్‌గా తను అక్కడికి వచ్చిన కారణాన్ని వివరంగా చెప్పాడు భాను.

దీర్ఘంగా నిట్టూర్చి కిటికీ దగ్గిర నుంచి ఇవతలికి వచ్చింది గీతిక. లోపలి గదిలోకి పోయి మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

గ్లాసును ఎత్తి గొంతులో వంపుకోవటానికి వీలుగా తలను వెనక్కి వంచాడు భాను. నీళ్లు అతని గొంతులో పడకముందే కనిపించింది ఎదుట గోడమీద వున్న ఆ ఫోటో.

కనుబొమ్మలు ముడిచి కాస్తంత సీరియస్‌గానే చూస్తున్నాడు ఆ ఫోటోలో వున్న బాట్లింగ్ ఫాక్టరీ ఓనర్.

గొంతులోకి పోయిన నీరు సాఫీగా క్రిందికి దిగలేదు. ఉక్కిరి బిక్కిరి అవుతూ గ్లాసును వదిలేసినంత పనిచేసి, నేర్పుగా సర్దుకున్నాడు భాను.

“ఆయన మా మామయ్యే... పది సంవత్సరాల క్రితం తీయించుకున్న ఫోటో కావటం వల్ల ఇప్పటికీ అప్పటికి కాస్త డిఫరెన్స్ వుంటుంది” అతని చూపుల్ని తను కూడా ఫాలో అవటం వల్ల ఆ ఫోటోని చూసి అతను పడిన యిబ్బందిని గమనించలేక కాజువల్‌గా చెప్పింది గీతిక. తన మామయ్య ఎవరో అతనికి తెలుసనే అనుకుంటోంది ఆమె.

"మీ మామయ్యంటే లాయర్ జనార్ధన్ గారేనా? ఇంకెవరయినా వున్నారా?" మంచినీళ్ళు తాగాలని వున్నా, సాఫీగా గొంతులోకి దిగుతాయో దిగవో అనుమానం వచ్చేసరికి, గ్లాసును అలాగే పట్టుకుని నిలబడుతూ అడిగాడు భాను.

"లాయర్ జనార్దన్ గారు ఒక్కరే... ఇంకెవరూ లేరు...."

ఇక తను అక్కడ వెయిట్ చేయాల్సిన అవసరం లేదని భానుకు అర్థమైంది.

అమాయకులైన ఫుట్‌పాత్ వర్తకుల్ని పోలీసు కేసుల్లో ఇరికించే ఉపాయాలు చెప్పగల నిర్దయుడు బ్లాటింగ్ ఫ్యాక్టరీ ఓనర్. ధార్వాడ ఎస్టేట్స్‌కి లీగల్ ఎడ్వయిజర్ లాయర్ జనార్ధన్ అతనే అయితే – ఆరు నూరైనా పరాయి వ్యక్తికి ఆ ఆస్తిని దక్కనీయడు. ఎన్ని ఆధారాలు చూపించినా, ఎంతమందితో రుజువు చేయించినా, ఏదో ఒక మెలికపెట్టి ఎస్టేట్‌నంతా తన బావమరిది హరహరవర్మకే అంకితం చేయిస్తాడు....

అటువంటి వ్యక్తిని నమ్మి తన ఐడెంటీని బయటపెడితే – ఆలీమియా అనుచరుల్ని ఉసిగొల్పి మక్కెలు విరగదీయించినా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

"దాహంతో నాలుక విరగలాక్కుపోతుందని చెప్పి, అలాగే నిలుచుండి పోయేవేమిటి?" గీతిక ఆశ్చర్యంగా అడగటంతో, గబగబా గ్లాసును ఎత్తి గొంతులోకి వంపుకున్నాడతను నీటిని.

“థేంక్యూ వెరీమచ్... సారీ ఫర్ ది డిస్టర్బెన్స్....” అంటూ వెనుతిరగబోతుండగా, తల అడ్డం తిప్పుతూ, “మామయ్యతో ఏం పని వుండి వచ్చావ్?” అని అడిగిందామె.

లాయర్ గారిని కలుసుకోవలసిన అవసరం లేదని నిర్ణయించుకునే సరికి, దారికి అడ్డుగా వున్న ఎమిలీ ,ఎడ్విన్‌లను తప్పించుకోవటం పెద్ద సమస్యగా అనిపించలేదు భానుకి. అంతకుముందు చెప్పినట్లే ఏదో ఒక అర్థంలేని మాట చెప్పి, సాధ్యమైనంత త్వరగా అక్కడనుంచి అవతల పడటం మంచిదనుకుంటూ, “ఏదైనా ఉద్యోగం యిస్తారేమో రిక్వెస్ట్ చేద్దామని వచ్చాను.. సెలవల్లో ఖాళీగా కూర్చుంటే బాగోదు కదా?” అన్నాడు.

ఉద్యోగం యిప్పించటమనేది చాలా పెద్ద పని కాబట్టి, ఆమె అంతటితో తనను వదిలేస్తుందని అనుకున్నాడతను... ఇంకెప్పుడూ అలా ఫామిలీ నివసించే ప్రదేశాల్లోకి రావద్దని హెచ్చరించి తలుపు గడియ వేసుకుంటుదని భావించాడు.

అటువంటి పనులేవీ చేయలేదు గీతిక... అంతకుముందు సగం తెరిచి వదిలిన కిటికీని పూర్తిగా తెరిచి, “ఒక్కసారి లోపలికి రాగలవా మామయ్యా?” అని పిలిచింది.

జరుగుతున్నదేమిటో భానుకి పూర్తిగా అర్థమయ్యేలోపుగానే ఆఫీస్ రూమ్ వెనుక వున్న ద్వారంగుండా ఆ గదిలోకి వచ్చాడు బాట్లింగ్ ఫాక్టరీ ఓనర్... కాదు లాయర్ జనార్ధన్.

"నా క్లాస్ మేట్ ఇతను..." అంటూ భానును పరిచయం చేసి, క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతను వచ్చిన పనిని వివరించింది గీతిక.

"పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వాళ్ళే ఉద్యోగాలు దొరక్క కిరాణా కొట్లలో పొట్లాలు కట్టుకుంటున్నారు. గ్రాడ్యుయేషన్ కూడా కాకుండా ఉద్యోగం రావాలంటే ఎక్కడ్నించి వస్తుంది?" క్రిందినుంచి పై దాకా పట్టి పట్టి చూస్తూ అడిగాడు లాయర్ జనార్ధన్.

"పొట్లాలు కట్టే ఉద్యోగమైనా చేయగలడు. ప్లాజా థియేటర్ దగ్గిర బజారు సరుకులు అమ్మే అనుభవం బాగా వున్నది" జవాబు చెప్పే అవకాశం భానుకు యివ్వకుండా తనే చెప్పింది గీతిక.

"అటువంటి పనులు మన దగ్గిర ఏమీలేవు. డ్రయివింగ్ తెలిసుంటే డ్రయివర్‌గా పెట్టుకుందాం. మన డ్రయివర్‌కి మలేరియా వచ్చిందట... ఇంకో రెండు నెలలదాకా రాడు."

కాళ్ళక్రింద వున్న భూమి రెండుగా చీలిపోయి తనను లోపలికి లాగుకుంటే బాగుండుననే కోరిక వెంటనే అడుగు పెట్టింది భాను హృదయంలోకి.

తనకు డ్రయివింగ్ వచ్చుననే సంగతి గీతికకు తెలుసు. ఆ సంవత్సరం కాలేజ్ తెరిచిన కొత్తలో కోణార్క్‌లోని సూర్య దేవాలయాన్ని విజిట్ చేసే ప్రోగ్రాం అరేంజ్ చేయబడింది. దారి మధ్యలో డ్రయివర్‌కి కళ్ళు తిరిగినట్లు అనిపిస్తే, పెద్ద మొనగాడి మాదిరిగా తను నడిపాడు బస్‌ని. ఇప్పుడు ఈ విధంగా ఇరకాటంలో

పడటం జరుగుతుందని ఏ మాత్రమైనా ముందుగా తెలిస్తే, ఆ రోజున ఆ పని చేసి వుండేవాడు కాదు.

ఆ మాటలు భాను మనస్సులో మెదులుతూ వుండగానే వికసించిన ముఖంతో అతని తరుపునే తనే ఆ ఆఫర్‌ని యాక్సెప్ట్ చేసింది గీతిక.

"సూపర్ డీలక్స్ బస్సును నడపగలిగిన మనిషికి మారుతీ కారు ఒక లెక్కా? నీ సజిషన్ బ్రహ్మాండగా వుంది మామయ్యా... పనిలో పని... ఎంతో కొంత జీతం ఎడ్వాన్స్‌గా యివ్వమని నీ సెక్రటరీకి చెప్పు " అని సజస్ట్ చేసింది.

నోరు మూసుకు నిలబడితే కథ ఇంకెంత దూరం పోతుందో తెలీక. "నాకు డ్రయివింగ్ తెలుసు ... కాని లైసన్స్ లేదు.... లైసెన్స్ లేకుండా సిటీలో ...." అంటూ మాటల్ని నాన్చాడు భాను.

లైసెన్స్ లేకపోతే డ్రయివర్‌గా పనిచేయటం చాలా కష్టమని అతని ఉద్దేశ్యం. ఆలోచనలో పడి, ఆ తర్వాత "ఇంకేదైనా పని చూద్దాం లే..." అంటారని అతని ఆశ.

"లాయర్ జనార్ధన్ గారి కారు నడిపే వ్యక్తికి లైసెన్స్ అవసరమని నాకు యిప్పుడే తెలిసింది..." అంటూ పెద్దగా నవ్వింది గీతిక.

ఆమెతో పాటు తను కూడా నవ్వాడు లాయర్ జనార్ధన్.

"గీతిక నీకు కారుని చూపిస్తుంది. క్లీన్ చేసి సిద్ధంగా వుండు... ఇంకో గంటలో కోర్టుకి పోవాలి..." వచ్చిన దారినే తన ఆఫీస్ రూమ్‌లోకి పోతూ ఆర్డర్ యిచ్చాడు.

అప్పుడు కూడా భానుకి లభించలేదు పెదవి విప్పే అవకాశం.

“కమాన్ భానూ..... కమ్ విత్ మీ...” అంటూ ప్రక్కనే వున్న ద్వారంలోనుంచి ఆ బిల్డింగ్ ప్రక్క భాగంలోకి దారితీసింది గీతిక.

తను వచ్చిన పని ఏమిటో, చేసిన పని ఏమిటో, చేయబోతున్నది ఏమిటో ఆలోచించుకుంటూ అలాగే నిలబడ్డడు భాను ఒక్క క్షణం పాటు.

తెరిచి వున్న ఆఫీసు గది కిటికీలోనుంచి వచ్చి అతని చెవికి చేరాయి కొన్ని మాటలు.

“తెల్లవారగానే అర్జంటుగా వచ్చి కనిపించమని కబురు చేశారు. వచ్చిన దగ్గర్నించీ మీ పనులే చూసుకుంటున్నారు గాని, మా గురించి పట్టించుకోవటం లేదు...” సన్నటి కంఠంతో కంప్లయింట్ చేస్తున్నాడు గగ్లూమియా.

“ఇప్పుడు మాట్లాడటం కుదిరేటట్లు కనిపించలేదు. సాయంత్రం కబురు చేస్తాను. వెళ్ళి మీ పనులు చూసుకోండి....” అంటున్నాడు లాయర్ జనార్ధన్.

“రమ్మని చెపితే వినిపించటం లేదా? అలా బొమ్మలా నిలుచుండి పోయావేమిటి?” ఆశ్చర్యంగా అడుగుతూ గీతిక వెనక్కి వచ్చేసరికి విధిలేక ఆమెను అనుసరించాడు భాను. బిల్డింగ్ ప్రక్కభాగంలో వున్న గారేజి దగ్గిరికి పోయి, అందులో నిలుచుని వున్న కారును హేండోవర్ చేసుకున్నాడు.

## 10

సూర్యుడు పడమటి దిశకు మరలుతున్న సమయంలో కోర్టు బిల్డింగ్‌లో నుంచి బయటికి వచ్చాడు లాయర్ జనార్ధన్.

అందరి మాదిరిగా పార్కింగ్ ఏరియాలో కారును నిలబెట్టలేదు భాను. అక్కడ వుండే వాచ్‌మన్ అభ్యంతరం చెపుతున్నా వినిపించుకోకుండా తీసుకుపోయి ఒక చింతచెట్టు క్రింద ఆపాడు.

అతను చేసిన పని లాయర్ సాబ్‌కి బాగా నచ్చింది.

"నీకు కాలేఖాన్ దర్గా తెలుసా?" కార్లో కూర్చుంటూ అడిగాడు లాయర్ జనార్ధన్.

అడ్డువచ్చిన వెహికల్స్‌ని జాగ్రత్తగా తప్పించుకుంటూ కోర్టు ఆవరణను దాటి, కారును రోడ్డుమీదికి పోనిస్తూ తలూపాడు భాను.

"గగ్లూమియా అని ఒక పెద్ద దాదా అక్కడ వుంటాడు. చీకటి పడిన తర్వాత మన బాట్లింగ్ ఫాక్టరీ దగ్గిరికీ రమ్మన్నానని చెప్పిరా... నేను టాక్సీలో వెళతాను యింటికి" మెయిన్ రోడ్ మీద కనిపించిన ఒక టాక్సీస్టాండ్ దగ్గిర క్రిందికి దిగి డోర్‌ని తెరిచాడు.

కారును రోడ్డు ప్రక్కకు పోనిస్తూ. ఒక టాక్సీ డ్రయివర్‌కి సైగ చేశాడు భాను. అతను టాక్సీని తీసుకువచ్చి తమ కారు ప్రక్కన ఆపిన తరువాత తను క్రిందికి దిగి డోర్‌ని తెరిచాడు.

ఆ పని కూడా లాయర్ సాబ్‌కి నచ్చింది.

టాక్సీలో యింటికి పోయిన తరువాత గీతికను పిలిచి ఆ మాటే చెప్పాడు.

"కాలేజీలో చదువుకున్న కుర్రవాడు ఖచ్చితంగా పని చేయలేదని అనుకున్నాను గాని, హీ ఈజ్ వెరీ ఎఫిషియంట్..." అని మెచ్చుకున్నాడు.

“చూపులకు చాలా మెత్తగా వున్నాడని మోసపోకు మామయ్యా... పెద్ద ఖతర్నాక్. అతను చేయదలుచుకుంటే ఈ పట్టణంలో ఎన్నో పనులు, ఎన్నో ఉద్యోగాలు వున్నాయి. ఇక్కడికే రావటం దేనికో? నీకు డ్రయివర్గా సెటిల్ అవటం ఏమిటో నాకు అంతుబట్టటం లేదు... అసలు మొదటి నించీ మిస్టరీగానే వుంది అతని వ్యవహారం” తనలో తను అనుకుంటున్నట్లు పైకి అనేసింది గీతిక.

“అదేమిటో నువ్వే సాల్వ్ చేసుకో... ఐ హేవ్ సమ్ అర్జంట్ వర్క్” అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు లాయర్ జనార్ధన్.

*    *    *    *    *

కాలేఖాన్ దర్గా ప్రక్కన కారును ఆపి, సమీపంలో వున్న పూల దుకాణం ఓనర్ని దగ్గిరికి పిలిచాడు భాను.

“గగ్లూమియాని ఒకసారి రమ్మని చెప్పు.... అర్జంటుగా మాట్లాడాలని కూడా చెప్పు” అని అర్డర్ యిచ్చి, క్రిందికి దిగకుండా అలాగే కూర్చున్నాడు.

పది నిముషాల తరువాత పరుగులాంటి నడకతో కారు దగ్గిరికి వచ్చి అందులో లాయర్ సాబ్ లేకపోవటంతో ఉరిమి చూశాడు గగ్లూమియా.

లాయర్ గారు చెప్పమన్న మాటల్ని చెప్పి కారును వెనక్కి తిప్పాడు భాను.

“నిన్నెక్కడో చూసినట్లుంది... నీ పేరేమిటి? ఏవూరు?” ఆ రోజు ఉదయం ఎమిలీ అడిగినట్లుగానే అనుమానంగా చూస్తూ అడిగాడు గగ్లూమియా.

ఎమిలీ అడిగినప్పుడు పడిన యిబ్బంది యిప్పుడు పడలేదు భాను.

"ఎక్కడ చూశావో బాగా ఆలోచించి గుర్తు తెచ్చుకో... నీతో మాట్లాడుతూ కూర్చునే టైమ్ నాకు లేదు...." అంటూ రోడ్డు మీదికి వచ్చేశాడు.

*     *     *     *     *

"మీ డ్రయివర్ పద్ధతి నాకు నచ్చలేదు. తనే పెద్ద లాయరైపోయినట్లు గీరగా మాట్లాడుతున్నాడు" రాత్రి ఎనిమిది గంటల సమయంలో బాట్లింగ్ ఫాక్టరీ దగ్గిరికి వచ్చి, వచ్చీరాగానే కంప్లయింట్ చేశాడు గగ్లూమియా.

గేటు దగ్గిర నైట్ వాచ్‌మన్ రాములయ్యతో కబుర్లు చెబుతున్న భానువైపు ఒకసారి చూసి చిన్నగా నవ్వాడు లాయర్ జనార్ధన్.

"అతను నా డ్రయివర్... ఆ మాత్రం గీర లేకపోతే ఏం బాగుంటుంది చెప్పు?" అంటూ ఆఫీస్ రూమ్‌లోకి దారితీశాడు.

"ఫాక్టరీ మూతబడటం నా ప్రాణాల మీదికి వచ్చింది. రాత్రి సమయల్లో మీటింగ్‌లు ఎక్కువైపోయాయి. ఎందుకో తెలియదుగాని ఈళ్ళను చూస్తూ వుంటే నా వంటిమీద చీమలు జెర్రులు పాకుతున్నట్లుగా అనిపిస్తుంది" లాయర్ సాబ్ వెనకాలే లోపలికి పోతున్న గగ్లూమియాను చూపిస్తూ లోగొంతుకలో భానుకు చెప్పాడు రాములయ్య.

తనకు కూడా అటువంటి అనుభూతే కలుగుతోందని అతనికి చెప్పలేదు భాను.

"నా గురించి వీళ్ళెవరయినా అడిగితే ఏమని చెబుతావ్?" అతని ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

తన బాబాయ్ పెద్ద జేబు దొంగ అని తెలిస్తే ఉద్యోగం ఊడిపోతుందేమోనని అతను భయపడుతున్నట్లుగా భావించి, సానుభూతిగా భుజం తట్టాడు రాములయ్య.

"నాకు తెలియదా భానూ? నా కంఠంలో ప్రాణం వుండగా నీకు కీడును కలిగించే మాటలు చెప్పుతానా? నువ్వెవరివో నాకు తెలీదు పొమ్మంటాను. గట్టిగా మాట్లాడితే అసలు నిన్నింతవరకూ చూడలేదని అంటాను" అని మాట యిచ్చి తన పద్ధతి ప్రకారం కాంపౌండ్‌వాల్ చుట్టూ రౌండ్స్ కొట్టటానికి బయలుదేరాడు.

గేటు దగ్గిర్నించి ఆఫీస్ రూమ్ ముందుకు వచ్చాడు భాను.

ఆలీమియా అక్కడికి వచ్చినప్పుడు ఫుట్‌పాత్ వ్యక్తుల నోళ్ళు కొట్టే ఉపాయం చెప్పి పంపాడు లాయర్ సాబ్.. ఇప్పుడు ఆలీమియా అనుచరుడికి ఎటువంటి సలహాలు ఇస్తున్నాడో!

ఎంత ప్రయత్నించినా కుతూహలాన్ని అణుచుకోవడం సాధ్యపడక పోవటంతో, ఒకసారి చుట్టూ చూసి, ఆ బిల్డింగ్ ప్రక్కభాగంలోకి పోయాడతను. ఓరగా తెరిచి వున్న ఒక కిటికీ ప్రక్కన నిలబడి లోపలి భాగంలోని సంభాషణను ఆలకించటం మొదలుపెట్టాడు.

"....మీరు వంద చెప్పండి... వెయ్యి చెప్పండి.. నాకు మాత్రం అతని వరస నచ్చలేదు... కారం రాసినట్లు భగ్గుమంటోంది నా వళ్ళు అతన్ని చూస్తుంటే..." సూది క్రిందపడినా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంగా వున్న ఆ వాతావరణంలో చాలా స్పష్టంగా అతని చెవికి చేరాయి గగ్లూమియా అంటున్న మాటలు.

కాలేఖాన్ దర్గా దగ్గిర కారులోనుంచి దిగకుండా పెద్ద పోటుగాడి మాదిరి కబురు పంపటం గగ్గూమియాకి నచ్చలేదని గ్రహించి, తనలో తను నవ్వుకుంటూ ఇంకా కొంచెం గోడ దగ్గిరికి జరిగాడు భాను.

"నిన్ను ఇక్కడికి పిలిపించింది నా డ్రయివర్‌ని గురించి మాట్లాడటానికి కాదు. ధార్వాడ ఎస్టేట్స్‌కి వారసులెవరయినా వుంటే వచ్చి వారసత్వాన్ని నిరూపించుకోవాల్సిందిగా పేపర్లో ప్రకటన ఇచ్చాం చూశావా?"

లాయర్ సాబ్ నోటివెంట తను ఎదురుచూడని టాపిక్ వచ్చేసరికి అప్రయత్నంగా అదిరిపడ్డాడు తాను.

"నేను చూడలేదు గాని, ఎమిలీ చూశాడు. ఎంతో కాలంగా మీ చేతిక్రింద వున్న ఆస్తి పరాయివాళ్ళకు వెళ్ళిపోతున్నదని చెప్పాడు" అని గగ్గూమియా సమాధానం ఇవ్వటంతో ఊపిరి బిగపట్టాడు.

"పరాయి వాళ్ళకు వెళ్ళకూడదనే ఇప్పుడు నిన్ను పిలిపించాను. ఈ రోజు నుంచీ మీలో ఎవరో ఒకరు నా బిల్డింగ్ దగ్గిరే కాపలా వుండాలి. ఆస్తిని క్లెయిమ్ చేయటానికి ఎవరు వచ్చినా సరే.... కామ్‌గా అవతలికి తీసుకుపోయి అడ్రసులు కూడా కనిపించకుండా మట్టిలో కప్పెట్టేయాలి....."

తెల్లనివన్నీ పాలు, నల్లని వన్నీ నీళ్ళు అనుకునే తను లెక్చరర్ గారి సలహా ప్రకారం తను కూడా తన ఐడెంటిటీని బయటపెట్టుకుని వున్నట్లయితే ఏం జరిగేదో తలుచుకునే సరికి చల్లబడిపోయాయి భాను అరిచేతులు.

“మూడు నెలలు పాటు మీ బిల్డింగ్ దగ్గిర నిలబడి వుండాలంటే బాగా ఖర్చువుతుంది సార్.. మేము చేసే పనివల్ల మీకు కలిగే లాభం సామాన్యమైంది కూడా కాదు...” ఆలోచించి ఆలోచించి మాటల్ని సాగదీశాడు గగ్లూమియా.

భాను ఊహించినట్లు బేరాలు ప్రారంభించలేదు లాయర్ జనార్ధన్.

“మీకు ఎంత కావాలంటే అంత ఇస్తాను. ఖర్చులు భరించి పాతిక లక్షలు ఇస్తాను. సరిపోతుందా?” అన్నాడు.

“మరి మా ఆలీమియా సంగతి ఏమిటి?”

“చెప్పిన పనిని చెప్పినట్లు చేయకుండా ఎక్కడో తప్పటడుగు వేశాడతను. బెయిల్ ఇవ్వటం జరిగితే తమ ఇన్వెస్టిగేషన్‌కి అవాంతరం ఏర్పుడుతుందని పోలీసులు అభ్యంతరం పెడుతున్నారు. ఏదో ఒకటి చేసి బయటికి తీసుకువస్తాము... ఇప్పట్లో జరిగే పని మాత్రం కాదది. కొంచెం టైము తీసుకుంటుంది.”

“మరి మాకు యిస్తామంటున్న డబ్బులో అతనికి కూడా వాటా వుంటుందా?”

“మీరు చేసిన పనిలో అతనికెందుకు వాటా ఇవ్వాలి? ఈ పనికి అతనికి సంబంధం వద్దు...”

మనిషి కనిపించకపోయినా, అతను చేసిన శబ్దాలను బట్టి, ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోతున్నట్లు గ్రహించి, గబగబా కిటికీని వదిలి ఇవతలికి వచ్చేశాడు భాను.

భరించరాని సంతోషం కలిగిన మనిషి ఒకేచోట కుదురుగా కూర్చోవటం గాని, నిలబడి వుండటం గాని చేయలేదు. ఉన్న చోటినించి కదులుతాడు... అటూ ఇటూ పచార్లు చేస్తాడు.

పది క్షణాల తరువాత కరెక్ట్ అయింది భాను అంచనా.

కుర్చీలో నుంచి లేచి కిటికీ దగ్గరికి వచ్చాడు గఫ్లామియా. తల బయటికి పెట్టి గుండెల నిండా గాలిని పీల్చుకున్నాడు.

తను వినదగ్గ మాటలేవీ ఇక వినబడవని రూఢి చేసుకొని, నిశ్శబ్దంగా వెనక్కి జరిగాడు భాను. ఏమీ తెలియనట్లు వచ్చి గేటు దగ్గిర స్టూల్ మీద కూర్చున్నాడు.

అతను ఊహించినట్లే మరో నాలుగు నిముషాల తరువాత బిల్డింగ్‌లో నుంచి బయటికి వచ్చాడు లాయర్ సార్. ప్రక్కలకు కూడా చూడకుండా కార్లో కూర్చుని హారన్ మ్రోగించాడు.

# 11

"....లాయర్ జనార్ధన్ ఇటువంటి దారుణమైన ఆలోచన చేస్తాడంటే నాకు నమ్మబుద్ధి కావటం లేదు... ఇది ఇరవై ఒకటో శతాబ్దం భాను... పదివందల నలభై కాదు. పోలీసులు వున్నారు... కోర్టులు వున్నాయి... ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం వుంది. ఎవరిని బడితే వారిని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు చంపి పారేస్తామంటే ఎవరూ చూస్తూ ఊరుకోరు" ఆవేశంగా అన్నాడు లెక్చరర్ గారు.

బాట్లింగ్ ఫాక్టరీ దగ్గిర్నించి లాయర్ సాబ్‌ని ఇంటికి తీసుకుపోయాడు భాను. ఆ రోజుకు డ్యూటీ అయిపోయిందని తెలిసిన తర్వాత, కారును గారేజిలో పెట్టి, సరాసరి అక్కడికి వచ్చాడు.

“నువ్వు ఏమైపోయావోనని కొంచెం ఖంగారు పడుతున్నాము. లాయర్ గారిని కలుసుకున్నావా? ఏమన్నాడతను?” బంగ్లా ముందు భాగంలో పచార్లు చేస్తూ అతన్ని చూడగానే అడిగాడు లెక్చరర్ గారు.

లాయర్ సాబ్ దగ్గిరికి పోయిన తరవాత జరిగిన సంఘటనలన్నీ సవివరంగా చెప్పాడు భాను. ఎటువంటి పరిస్థితిల్లో తను డ్రయివర్‌గా కుదురుకోవటం సంభవించిందో వివరించాడు.

అంతా విని సాలోచనగా తల వూపాల్సిన మనిషి కాస్తా ఆవేశానికి గురై పెద్ద పెద్ద డైలాగులు వదలటం నవ్వు తెప్పించింది... ఎంత బిగబట్టుకుందామని ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవటముతో పైకే నవ్వేశాడు భాను.

“ఎందుకా నవ్వు! పగలబడి నవ్వాల్సిన పరిస్థితా నీది....?” కనుబొమ్మలు ముడివేస్తూ కోపంగా అడిగాడు లెక్చరర్.

చెరిగిపోయింది భాను ముఖం మీది నవ్వు.

తల వంచుకొని అతను కదలకుండా నిలబడేసరికి, జాలి కలిగింది కాబోలు అతని తరుపున లెక్చరర్ గారితో పోట్లాటకు దిగింది ఆయన భార్య.

“క్లాసు రూమ్‌లో కూర్చుని లెక్చర్లు ఇవ్వటం, లైబ్రరీకి పోయి పెద్ద పెద్ద పుస్తకాలు చదవటం తప్ప మీకు బయటి ప్రపంచంలో ఏం జరుగుతుందో

తెలుసుకోవటం చేతకాదు. పది హత్యలు, పది మాన భంగాలు, పది దోపిడీలు వార్తలు లేకుండా పేపర్లు అసలు బయటికి రావటం లేదు. మీరు అంత గట్టిగా చెపుతున్న ప్రభుత్వం ఏం చేస్తోంది? పోలీసులు ఏం చేస్తున్నారు?''

''ఆ సంగతి వేరు.... అవి ఎప్పుడో చాలా అరుదుగా జరిగే సంఘటనలు ... భాను విషయంలో అలా జరగటానికి వీలులేదు....''

''మనదాకా వచ్చేవరకూ ఏ సంఘటనయినా ఆరుదుగా జరిగినట్లు కనిపిస్తుంది. భాను విషయంలో ఇప్పుడు మీరు ఏం చేద్దామని అనుకుంటున్నారు?''

''పోలీస్ కంప్లయింట్ ఇచ్చేద్దాం.... ముందుగానే పోలీసుల్ని హెచ్చరించి ఆ లాయర్‌ని, ఆ రౌడీల్ని అరెస్ట్ చేయమని అడుగుదాం.''

''అందుకు ఆధారాలు ఏమున్నాయి మీ దగ్గిర? సాక్ష్యాలు ఏవైనా చూపించగలరా?''

అంతవరకూ ఎంతో వేగంగా మాట్లాడిన లెక్చరర్ గారు, ఆ ప్రశ్నల్ని ఆసకించేసరికి కామ్ అయిపోయాడు ఒక్కసారిగా.

''కష్టపడి పని చేయకుండా, క్షణాలమీద డబ్బు సంపాదించి తెల్లవారేసరికి లక్షాధికారులు అవ్వాలనే కోరిక రోజు రోజుకి ప్రబలిపోతోంది ప్రజల్లో.... అందుకోసం అడ్డదారులు తొక్కటం, అవసరమైతే నేరాలు చెయ్యటం సర్వసాధారణమై పోయింది. ఈజీ మనీ కోసం వెంపర్లాడే ప్రజలున్నంతవరకూ చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వం మనకి రాదు... చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వం లేకపోతే

చట్టాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు కూడా అదే మాదిరి తయారవుతారు... నీతి నియమాలు కలిగిన ప్రజా నాయకులు పొరపాటుగా ఎన్నికై సింహాసనాన్ని అధిష్టించినా, వారిని కూలత్రోసేంతవరకూ ఎవరు నిద్రపోరు.....”

“ఇంతకీ నువ్వు చెప్పదలుచుకున్నది ఏమిటి?” అసహనంగా అడిగాడు లెక్చరర్ గారు ఆమె మాటల్ని అడ్డుకుంటూ.

“ఎప్పుడో ఏదో ప్రమాదం జరగబోతున్నదని భయపడి ఇప్పటి నుంచీ భాను బ్రతుకును బజార్లో పడవేయకండి. మీరు చెప్పే పోలీసులు, మీరు చెప్పే ప్రభుత్వము అతన్ని రక్షించలేవు. ఎటువంటి ఆపద ఎదురైనా, ఏదో విధంగా తట్టుకోవటానికి సిద్ధపడి అక్కడ ఉద్యోగంలో చేరాడు భాను... అతని ఉద్దేశ్యమేమిటో తెలుసుకోండి.... అతను ఏంచేయాలని అనుకుంటున్నాడో అడిగి, ఆ పద్ధతుల్లోని సాధక బాధకాలను గురించి చర్చించండి. లెక్చర్లు ఇవ్వటానికి అలవాటు పడిన నోరు వుందిగదా అని అరిచి కేకలు పెట్టకండి....” అంటూ లోపలికి వెళ్ళిందామె. వేడివేడి టీ తీసుకురావటానికి.

“నువ్వు ఏ పని చేసినా ఫరవాలేదుగాని, పెళ్ళి మాత్రం చేసుకోకు భానూ.... పెళ్ళి చేసుకుంటే యిటువంటి సూటిపోటి మాటలు వినక తప్పదు....” చటుక్కున భాను కేసి చూస్తూ సలహా యిచ్చాడు లెక్చరర్ గారు.

వాతావరణం కాస్తంత ప్లెజంట్‌గా తయారయిందని గ్రహించి రాములయ్య అమ్మమ్మ చనిపోయనప్పుడు తను అతని స్థానంలో డ్యూటీ చేసిన విషయాన్ని ఆయనకి చెప్పాడు భాను.... అక్కడ విన్న సంభాషణ, ఆ తరువాత తను ఆలీమియాని బోల్తా కొట్టించటం అన్నీ వివరించాడు.

“ఈ విషయం నువ్వు నాకు ముందే ఎందుకు చెప్పలేదు?” అంతా విని మళ్ళీ కోపం తెచ్చుకుంటూ అడిగాడు లెక్చరర్ గారు.

టీ కప్పుల్ని ట్రేలో పెట్టుకొని వరండాలోకి వస్తోంది ఆయన భార్య.

“ముందే చెపితే ఏం చేసేవారు?” మరోసారి భాను తరుపున తను మాట్లాడుతూ అడిగింది.

“వారసత్వానికి ఒక నమస్కారం పెట్టి ఆ ఆలోచన వదిలేయని చెప్పేవాడిని. అటువంటి నరరూప రాక్షసులతో తలపడే శక్తి మనవంటి వాళ్ళకు లేదు....”

“ఆ ఆస్తి తనకు వద్దని ముందునుంచీ చెపుతూనే వున్నాడు భాను.... కాదు కూడదని ముందుకు నెట్టి, ఇప్పుడు పిరికిమందు నూరిపోస్తారా?”

“అప్పుడు నేను అనుకున్నది వేరు.... ఇప్పుడు నాకు తెలిసింది వేరు. తప్పుగా ఆలోచించినా మనిషి తన తప్పును దిద్దుకోకూడదూ?”

సెగలు వెలువరుస్తున్న టీ కప్పును భాను చేతికి అందిస్తూ చిరునవ్వు నవ్వింది ఆయన భార్య.

“ఇప్పటికి దారిలో పడ్డాడు మీ లెక్చరర్ గారు. ఇక ఏం చెప్పినా నువ్వు వినవచ్చు.....” అంటూ అక్కడే వున్న ఛైర్‌లో కూర్చున్నది.

“చెప్పటానికి ఇక మిగిలింది ఏమీ లేదు. నోరు మూసుకుని ఇంటికి వెళ్ళిపోవటం ఒక్కటే నువ్వు చేయగలిగింది. మనకు ఆ ఆస్తి వద్దు... ఆ రాస్కెల్స్‌తో

విరోధం కూడా వద్దు" కామ్‌గా కూర్చుని టీని సిప్ చేస్తూ తన నిర్ణయాన్ని ఎనౌన్స్ చేశాడు లెక్చరర్ గారు.

ఏం చెప్పినా తల ఊపి, చెప్పినట్లుగా తూ.చా తప్పకుండా చేసే భాను తల వూపలేదు సరికదా, టీ తాగటం పూర్తికాగానే, కప్పును క్రింద పెట్టి, నిఠారుగా నిలబడ్డాడు.

"ఆస్తి కోసం గాని, ఆ ఆస్తి తెచ్చిపెట్టే సుఖాల కోసం గాని నేను ఆశపడటం లేదు సార్... తమది కాని సొత్తును తాము చేజిక్కించుకోవటం కోసం వాళ్ళు పన్నుతున్న కుయుక్తులు నాకు కొరుకుడు పడటంలేదు... తాము ఏం చేసినా చెల్లుతుందనీ, అడిగేవాడు వుండడనీ వాళ్ళు అనుకునే పద్ధతి నాకు నచ్చటం లేదు... వాళ్ళకి బుద్ధి చెప్పాలని అనిపిస్తోంది."

ఎదురు చూడని విధంగా అతని నోటినుంచి వచ్చిన ఆ మాటల్ని ఆలకించి అదిరిపడ్డాడు లెక్చరర్. ఆశ్చర్యంగా చూసింది ఆయన భార్య.

"వాళ్ళ మధ్యలో మెసిలేందుకు డ్రయివర్ ఉద్యోగం ఎలాగు దొరికింది కాబట్టి, ఇంకా కొంతకాలం ఈ ఉద్యోగాన్ని కంటిన్యూ చేస్తాను. వాళ్ళ అంతరంగాల్ని పూర్తిగా అర్థం చేసుకుని, వాళ్ళ వ్రేళ్ళతోనే వాళ్ళ కళ్ళు పొడిపిస్తాను....." అటువంటి విషయాల్లో ఎంతో అనుభవం వున్న వాడిలా బింకంగా చెప్పాడు భాను.

“కెన్ యూ డూ ఇట్ భానూ? అంతటి అనుభవం నీకు వుందా? ఆ క్రిమినల్స్ చేసే దురాలోచనల్ని అడ్డుకోగల శక్తి నీలో వుందా......?” ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది లెక్చరర్ గారి భార్య.

“పేరు పొందిన పెద్ద క్రిమినల్ బాబూలాల్ పెంపకంలో పెరిగిన వాడిని నేను..... వాళ్ళ ఆలోచనల్ని అర్థం చేసుకోవటం ఏమంత కష్టం అనిపించదు... కష్టమయినా, నిష్టూరమైనా ఐ విల్ డూ యిట్ మేడమ్... దట్సాల్ ఫర్ నౌ....” అన్నాడు భాను.

సంభాషణ అంతం అయిపోయిందని సూచించటానికి గుర్తుగా తను ఉపయోగించే మాటను అతను తనమీదే ప్రయోగించేసరికి ఫక్కున నవ్వుకుంటూ వుండలేకపోయాడు లెక్చరర్ గారు.

“టేక్ కేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్.... ఎప్పటికప్పుడు నీ క్షేమాన్ని గురించి మాకు తెలియచేస్తూ వుండు... మేము చేయగల సహాయం ఏదైనా వుంటే నిస్సంకోచంగా అడిగి చేయించుకో.... అన్నింటికంటే ముఖ్యంగా, ఈ విషయాలన్నీ మీ బాబాయికి చెప్పు... అతని సలహా కూడా తీసుకుని ఆ తరువాత ప్రొసీడ్ అవ్వాలి.... హీ ఈజ్ వెరీ గుడ్ ఎట్ దీజ్ సార్ట్ ఆఫ్ థింగ్స్.....” గేటు దాకా వచ్చి వీడ్కొలువుతూ మృదు స్వరంతో హెచ్చరించాడు.

ఆయనకు, ఆయన ప్రక్కనే నిలబడిన మేడమ్‌కి నమస్కరించి రోడ్డుమీదికి వెళ్ళిపోయాడు భాను.

# 12

“మీది మీదికి వస్తున్నావ్... వళ్ళు ఎలావుంది బే? కళ్ళు కనిపించటం లేదా?” నిలుచున్న చోటినించి ప్రక్కకు దూకుతూ కోపంగా అన్నాడు గగ్లామియా సహచరుడు ఎడ్విన్.

బ్రేక్ మీద కాలువేసి, కారును నిలుపువేస్తూ, విండోలోనుంచి బయటికి చూశాడు భాను.

గారేజీలో వున్న కారు బయటికి రావాలంటే తను నిలబడిన ప్రదేశాన్ని రాచుకుంటూ వెళ్ళాలని తెలిసి కూడా, దాదాగిరీ చూపిస్తున్నాడు ఎడ్విన్.

అప్పటికప్పుడు కారు దిగి అతని వ్యవహారం ఏమిటో తేల్చుకోవాలన్న కోరిక కలిగినా, బలవంతంగా అణిచిపట్టుకొని నవ్వు ముఖం పెట్టాడు భాను.

“ఏదో ఆలోచనలో ఉండి నిన్ను గమనించలేదన్నా.... ఏమీ అనుకోకుండా కాస్తంత ప్రక్కకు జరుగుతావా....?” వినయం, విధేయత నిండిన కంఠంతో రిక్వెస్ట్ చేశాడు.

“ఈ తెలివి ముందే ఉండాలి బే... లాయర్ గారి డ్రయివర్‌ననే టెక్కు చూపిస్తే తల పొడుము పొడుమైపోతుంది జాగ్రత్త.....” అంటూ అక్కడినించి కదిలి యింకో ప్రక్కగా వెళ్ళిపోయాడు ఎడ్విన్.

బాట్లింగ్ ఫాక్టరీలో లాయర్ సాబ్ కోరినట్లు తన మనుష్యుల్ని ఇద్దర్ని ఆ బిల్డింగ్ దగ్గిరికి పంపించాడు గగ్లామియా... లాయర్ సాబ్ చూపించిన మనిషిని ఎవరినైనా సరే అవతలికి తీసుకుపోయి మట్టిలో కప్పెట్టే ఏర్పాట్లు చేసేవాడు.

బిల్డింగ్‌కి రెండో ప్రక్కనే నిలబడి వున్న ఆ రెండో మనిషిని కూడా కనుచివరలనుంచి గమనించుకుంటూ కారును పోర్టికో ముందుకు తీసుకుపోయాడు భాను.

"నీ గురించి కొంచెం గొప్పగా ఊహించాను భానూ... కారు నడపటం, పొట్లాలు కట్టటం తప్ప నీకేమీ చేతకాదని యిప్పుడే తెలిసింది...." వెంటనే అన్నది అక్కడ నిలబడివున్న గీతిక.

అంతవరకూ ఆమె ప్రెజెన్స్‌ని గమనించనందుకు నాలుక కొరుక్కుంటూ కారుదిగి, యిబ్బంది కరంగా నవ్వాడు భాను.

"దారికి అడ్డంగా నిలబడింది కాక, అతను అంత పొగరుగా మాట్లాడుతుంటే తల వంచుకోవటానికి నీకు సిగ్గుగా లేదూ? సమాధానం చెపితే తన్నులు తినాల్సివస్తుందని భయపడ్డావా?" అంతటితో వదిలిపెట్టటం ఇష్టంలేనట్లు మాటల్ని పొడిగించిందామె.

"అతను మీ మామయ్యగారి మనిషే...." అన్నాడు భాను.

"అయితే ఏమిటిట? నీ పిరికితనాన్ని కప్పి పెట్టుకోవటానికి కుంటి సాకులు చెప్పకు. నీ స్థానంలో నేను వుండి వుంటే చెప్పు తీసుకుని పళ్ళు రాలగొట్టేదాన్ని....." కోపంగా అన్నది గీతిక.

లాయర్ సాబ్ చేసే పనుల గురించి, అపాయింట్ చేసుకునే మనుష్యుల గురించి ఆమెకు తెలీదేమో అనే అనుమానం భానుకి వెంటనే కలిగింది.

ఆ విషయాన్ని గురించి అధికంగా ఆలోచించే అవకాశం అతనికి ఇవ్వలేదు గీతిక. "మామయ్య నీ కోసం వెయిట్ చేస్తున్నాడు....లోపలికి వెళ్ళు" అని డైరెక్ట్ చేసింది.

లోపలికి వెళ్ళాడు భాను. ఆఫీస్ రూమ్ ద్వారంలో నిలబడిన విష్ చేశాడు.

"మనం అర్జంటుగా బేంక్‌కి వెళ్ళి కొంత కేష్‌ని డ్రా చేయాలి... ఆ కాష్‌ని వెంటబెట్టుకొని ఎస్టేట్‌కి వెళ్ళాలి... రెడీగా వుండు...." టేబిల్ మీది ఫైల్స్‌లో నుంచి తల తిప్పకుండా చెప్పాడు లాయర్ సాబ్.

కొన్ని వందల కిలోమీటర్లు దూరంలో వుండే ఎస్టేట్‌కి నిలుచున్న పళాన బయలుదేరటం ఎలాగో అర్థంకాక నుదురు రుద్దుకుంటూ హాల్లోకి వచ్చాడు భాను.

అక్కడే వున్నద గీతిక. అతని డైలామాను అర్థం చేసుకున్నది కాబోలు, "రాత్రి నువ్వు ఇంటికి వెళ్ళిన తర్వాత ఫోన్ వచ్చింది మా డాడీ దగ్గర్నించి.... అందువల్ల నీకు ఎడ్వాన్స్‌గా చెప్పటం కుదరలేదు.... డ్రస్ ఛేంజి చేసుకోవటానికి నీ దగ్గిర స్పేర్‌గా ఏవీ లేవు కదూ?" అని అడుగుతూ ప్రక్కనే వున్న లాయర్ గారి సెక్రటరీకి సైగచేసి, "భానుకి నాలుగొందలు ఇవ్వండి... బ్యాంకుకి వెళ్ళేటప్పుడు ఏవైనా రెడీమేడ్ డ్రస్ తెచ్చుకుంటాడు" అని ఆర్డర్ ఇచ్చింది.

ఎదురు ప్రశ్నలు ఏవీ వేయకుండా అప్పటికప్పుడు కేష్‌బాక్స్‌ని తెరిచి భాను చేతికి అందించిందా సెక్రటరీ ఆమె చెప్పిన మొత్తాన్ని.

“రెండు మూడు టవల్స్ కూడా తెచ్చుకో... మనం నాలుగైదు రోజులదాకా తిరిగిరాము” కుడివైపున వుండే ద్వారం వైపు అడుగులు వేస్తూ భుజంమీది నుంచి హెచ్చరించింది అతన్ని గీతిక.

“మనము! నువ్వు కూడా వస్తున్నావా?” ఆశ్చర్యంగా అడిగాడు భాను.

గిరుక్కున వెనుతిరిగి సీరియస్‌గా చూసింది గీతిక.

“ఏం రాకుడదా? నా ఇంటికి నేను వెళ్ళటానికి ఎవరి పర్మిషనైనా తీసుకోవాలా?”

“నీ ఇల్లా అది? స్వంతమా?” అనబోయి ఆఖరి క్షణంలో ఆ మాటల్ని మింగేశాడు భాను. అమాయకంగా ముఖం పెట్టి అపాలజిటిక్‌గా నవ్వుతూ పోర్టికోలోకి వెళ్ళి, కారు దగ్గిర నిలబడ్డాడు.

పది గంటల అవుతుండగా పెద్ద సూట్‌కేస్ వంటి బ్రీఫ్‌కేసును పట్టుకొని ఆఫీస్ రూమ్ లోనుంచి బయటికి వచ్చాడు లాయర్ సాబ్.

రోడ్డుమీద వున్న గగ్లూమియా అనుచరులిద్దరూ ఎలర్ట్ అవటాన్ని గమనించి తనలో తను నవ్వుకుంటూ కారు డోర్‌ని తెరిచాడు భాను.

“వన్ టవున్ కి పోనీ....” అంటూ ఆర్డర్ ఇచ్చాడు లాయర్ సాబ్.

అరగంట తరువాత వన్ టవున్‌లో వున్న స్టేట్ బ్యాంక్ ముందు కారును ఆపించి లోపలికి వెళ్ళాడు. ఆ ప్రక్కనే కనిపించిన ఒక రెడీమేడ్ షాపుకి వెళ్ళి రెండు జతల దుస్తుల్ని, టవల్స్‌ని, ఒక దుప్పటిని పర్చేజ్ చేశాడు భాను. షాపులో నుంచి బయటికి వస్తుండగా సడన్‌గా కలిగింది సిగరెట్ కాల్చుకోవాలన్న కోరిక.

అతనికి తెలియకుండానే అక్కడికి వంద గజాల దూరంలో వున్న పాన్ బడ్డీ వైపు కదిలాయి కాళ్ళు.

చిల్లర ఇచ్చి ఒక సిగరెట్‌ని తీసుకుంటుండగా అతనికి ఆగుపించాడు గగ్లామియా సహచరుల్లో ఇంకొకడైన ఎమిలీ.

లాయర్ సాబ్ రెసిడెన్స్ దగ్గిర కనిపించి వుంటే ఆశ్చర్యపడి ఉండేవాడు కాదు. ఆల్ రెడీ అక్కడ డ్యూటీ చేస్తున్న వారిని రిసీవ్ చేయటానికి వచ్చి వుంటాడని భావించి ఉండేవాడు.

అక్కడివారు అక్కడే వుండగా ఇతను ప్రత్యక్షం అవటం కొంచెం వింతగానే అనిపించి, సిగరెట్‌ని వెలిగించుకోకుండా జేబులో పడేసుకున్నాడు. బడ్డీ ప్రక్కకు జరిగి అతన్ని క్లోజ్‌గా వాచ్ చేశాడు.

ఖచ్చితంగా రెండు నిముషాల తరువాత ఎమిలీ ముందుకు వచ్చారు యింకో నలుగురు వ్యక్తులు. చుట్టూ చూసి తనను ఎవరూ గమనించటం లేదని నిశ్చయం చేసుకున్న తరువాత – బ్యాంక్ ముందు ఆగివున్న లాయర్ సాబ్ కారును వారికి చూపించాడు ఎమిలీ.... పెదవులు కదిలీ కదలన్నట్లు లోగొంతుకతో ఏదో చెప్పాడు.

పది క్షణాల పాటు కారు వంకే చూసి తలలు ఊపారా వ్యక్తులు. ఉన్నట్లుండి కదిలి అవతలికి వెళ్ళిపోయారు.

పాంటు జేబుల్లో చేతులు పెట్టుకొని అటూ ఇటూ చూస్తున్న ఎమిలీ తన కోసం ఆ చుట్టు పట్ల వున్న ప్రదేశాలన్నిటినీ పరిశీలనగా చూస్తున్నాడని అర్థమై,

అతను అవతలి ప్రక్కకు తల తిప్పిన క్షణంలో బడ్డీ చాటు నుంచి యివతలికి వచ్చాడు భాను. రెడీమేడ్ షాపులో నుంచి అప్పుడే బయటికి వచ్చినట్లు దుస్తులు పాకెట్‌ని చేతితో తడుతూ తల వంచుకొని కారు దగ్గిరికి పోయాడు.

ఖాళీ బ్రీఫ్ కేసును బ్యాంక్ లోపలికి తీసుకుపోయిన లాయర్ సాబ్ నోట్ల కట్టలతో అది బరువెక్కినట్టుగా అడుగులు వేస్తూ బయటికి వచ్చిన తరువాత అవతలికి జారుకున్నాడు ఎమిలీ.

కారును స్టార్టు చేసి ఇంటిదారి పట్టిస్తూ ఆలోచనలో పడ్డాడు భాను.

నమ్మిన బంట్లు మాదిరి నటించి, వెన్నుపోటు పొడిచే కార్యక్రమం చేపట్టబోతున్నారా గగ్లూమియా సహచరులు.

ముక్కు ముఖం తెలియన కొత్త మనిషి డ్రయివర్‌గా చేరినప్పుడు ఏదైనా పాడు పనిచేస్తే, ఆ నింద తమ మీదికి రాకుండా కొత్త మనిషి మీదికి పోతుందని భావిస్తున్నారా??

ఏది ఏమైనా ప్రమాదం తనకు ఎదురు కాబోతున్నది.... వళ్ళు దగ్గిర పెట్టుకొని సంచరించకపోతే ఎస్టేట్ నుంచి ప్రాణాలతో తిరిగి రావటం జరగకపోవచ్చు.

“నువ్వు భోజనం చేసి వచ్చేయ్....” పోర్టికోలో కారు ఆగగానే, జేబులో నుంచి యాభై రూపాయల నోటును అతని మీదికి విసురుతూ చెప్పాడు లాయర్ సాబ్.

బ్రీఫ్‌కేసును తీసుకొని ఆయన లోపలికి పోగానే, ఆయన చెప్పినట్లు ఏదైనా హోటల్‌ని వెతుక్కుంటూ రోడ్డు మీదికి బయలుదేరలేదు భాను. కారును పోర్టికోలో నుంచి కదిలించి, గారేజీ దగ్గిరికి తీసుకుపోయాడు. బోనెట్ ఎత్తి ఇంజన్ నంతా చెక్ చేశాడు. బ్రేకులు పరీక్షించాడు... స్టెప్నీలో ఎయిర్ తగినంతగా వుందో లేదో చూసుకున్నాడు.

"ఏ పని చేసినా సిన్సియర్‌గా చేయాలి... తిండి తిప్పలు మానుకుని చేయటం మాత్రం మంచిది కాదు..." అంటూ కేకలు వినపడేసరికి డైవర్ట్ అయింది అతని అటెంక్షన్.

ప్రయాణానికి రెడీ అయింది కాబోలు, అందంగా అలంకరించుకుని వచ్చింది గీతిక. వంటరిగా రాలేదు. వెంట ఒక పనిమనిషి వున్నది. పెద్ద ప్లేటు మీద అరటి ఆకును కప్పి తీసుకువచ్చిందా సర్వెంట్.

"భోజనం చేసిరమ్మని మీ మామయ్య డబ్బిచ్చారు..." అందులోని భోజనం తన కోసమేనని గ్రహించి అనీజిగా చూస్తూ అన్నాడు భాను.

"ప్లాజా థియేటర్ దగ్గిర కాళ్ళు వాచిపోయేటట్లు నిలబడి, పైసలు పైసలు చొప్పున వ్యాపారం చేసే నీకు డబ్బు ఎలా మిగుల్చుకోవాలో అర్థంకాక పోవటంలో వింత ఏమీ లేదు. భోజనం చేసే టైమ్ వచ్చినప్పుడల్లా మామయ్య నీకు డబ్బు యిస్తూనే వుంటాడు.. ఎదురు చెప్పకుండా జేబులో వేసుకొని, ఏదో ఒక విధంగా అవసరం తీర్చుకోవాలి నువ్వు... నీతులు చెప్పకూడదు...." భోజనం ప్లేటును గారేజీలో వున్న ఒక టేబుల్ మీద పెట్టమని పనిమనిషికి సైగచేస్తూ అన్నది గీతిక.

మాటలతో ఆమెను గెలవడం కష్టమని గ్రహించి, చేతులు కడుక్కు వచ్చాడు భాను. వంచిన తల ఎత్తకుండా ఆ ప్లేటును ఖాళీ చేశాడు.

"నాతో పాటు చదువుకుంటూ, నాతో సరిసమానంగా తిరుగుతూ, నా ముందే మా యింట్లో పని చేస్తున్నందుకు నీకు యిబ్బందిగా అనిపించటం లేదా?" అవతలికి పోకుండా, అలాగే నిలబడి యధాలాపంగా అడిగినట్లు అడిగిందతన్ని గీతిక.

అప్పుడు కాకపోయినా ఎప్పుడో ఒకప్పుడు ఆమె అటువంటి ప్రశ్న వేయక తప్పదని అనుకుంటూనే ఉన్నాడు భాను. అయితే అతను సమాధానం చెప్పటానికి సిద్ధపడక ముందే, "ప్లాజా థియేటర్ దగ్గిర చేసే పనిని గురించి పెద్ద ఉపన్యాసం ఇచ్చిన వాడివి నువ్వు.... డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ని గురించి ఇప్పుడు ఇంకో లెక్చర్ ప్రారంభిస్తే వినే ఓపిక నాకు లేదు... మామయ్య ఈ పాటికే రెడీ అయి వుంటాడు. నువ్వు కూడా సిద్ధం కా..." అని తనకు తనే సమాధానం చెప్పుకుంటూ అవతలికి వెళ్ళిపోయిందామె.

ఎదుటి మనిషిని వెక్కరించి వీధుల పాలు చేసే గీతికనే చూసి వున్నాడు భాను... ఎదుటి వాడి కష్టసుఖాలను గురించి కూడా ఆమె ఆలోచించగలదని అతను అనుకోలేదు. ఉద్యోగంలో అడుగు పెట్టిన క్షణం నుంచీ కాన్‌స్టంట్‌గా కనిపిస్తోంది ఆమెలో ఆ రెండో వ్యక్తిత్వం.

సహజమైనదేనా ఆ స్పందన? అందుకు కారణం ఇంకేమైనా వున్నదా?

సమాధానం లభించని ఆ ప్రశ్నతో తల బ్రద్దలు కొట్టుకోవటం ఇష్టంలేక కారును తీసుకుపోయి పోర్టికోలో నిలపెట్టాడు భాను. తాను రెడీ అయినట్లు హారన్ మ్రోగించాడు.

*     *     *     *     *

"నాకు ఆకలి వేస్తోంది.... కూర్చుని కూర్చుని బోరుకొడుతోంది." పది గంటలపాటు ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసిన తర్వాత వున్నట్లుండి ఎనౌన్స్ చేసింది గీతిక.

"ఇంకో గంట ఓపిక పడితే మంచి హోటల్ ఒకటి వస్తుంది. ఫుడ్ అక్కడ చాలా బాగుంటుంది." బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ అన్నాడు లాయర్ సాబ్.

"ఇంకో గంటవరకూ నా ప్రాణాలు నిలుస్తాయనే నమ్మకం లేదు" పట్టుదలగా అన్నది గీతిక.

"ఏదైనా హోటల్ కనిపిస్తే ఆపవయ్యా.... ఈ పిల్లతో ప్రయాణం పెద్ద తలకాయనొప్పి" విసుగ్గా భానుకు చెప్పాడు లాయర్ సాబ్.

తనలో తాను నవ్వుకుంటూ పదినిముషాల తర్వాత రోడ్డుకు ప్రక్కగా కనిపించిన హైవే హోటల్ ముందు కారును ఆపాడు భాను.

రెండు లారీలు నిలబడి వున్నాయక్కడ... ఇంకో రెండు కార్లు కనిపిస్తున్నాయి.

వేగంగా వచ్చి సడన్‌గా రోడ్డు దిగిన మారుతీని చూడగానే, చటుక్కున లేచారు అక్కడ విశ్రాంతి తీసుకుంటున్న వ్యక్తులు నలుగురు... పెద్ద పెద్ద అడుగులు వేస్తూ పోయి ఒక కారులో కూర్చున్నారు.

“డబ్బులు.... నా డబ్బులు ఇవ్వకుండా వెళ్ళిపోతున్నారేమిటి?” పెద్ద కంఠంతో ప్రశ్నిస్తూ పరుగులాంటి నడకతో ఆ కారు దగ్గిరికి పోబోయింది హోటల్‌ని అజమాయిషీ చేసే ఆంటీ.

ఆమె మాటలు తమకు వినబడనట్లు వెళ్ళిపోయారు వాళ్ళు. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో దృష్టిపథం నుండి దూరమైపోయారు.

హోటల్ ముందున్న చెట్ల క్రింద పచార్లు చేస్తూ, పెద్ద పెద్ద కళ్ళతో ఆ హోటల్ ఆంటీ వంక చూసింది గీతిక... చెవులు చిల్లులు పడేటట్లు ఆమె నోటి వెంట వెలువడుతున్న తిట్లను ఆలకించి, “ఈ చోటు నాకు నచ్చలేదు.... వెళ్ళిపోదాం....” అంటూ కారెక్కింది.

“మంచి మంచి మాటలు చెపితే నీకు ఏదీ అర్థం కాదు... నీ అంతట నువ్వు తెలుసుకుంటే గాని కన్విన్స్ కావు....” అంటూ భానుకు సైగ చేశాడు లాయర్ సాబ్.

తమను చూసీ చూడగానే పరారైపోతున్నట్లు పరిగెత్తిన వ్యక్తుల్ని గురించే ఆలోచిస్తున్నాడు భాను. లాయర్ సాబ్ సైగ చేయగానే డిక్కీ తెరిచి అందులో వున్న పొడుగాటి ఐరన్ రాడ్ నొకదాన్ని తన సీటు క్రింద దాచుకున్నాడు.

‘‘ఎందుకది? దానితో ఇప్పుడు అవసరం ఏమొచ్చింది?’’ ఆశ్చర్యంగా అడిగాడు లాయర్ సాబ్.

‘‘తిన్న పదార్థాలకు డబ్బు ఇవ్వకుండా పారిపోయినా వాళ్ళని తిట్టినట్లే ఏమీ తినని వాళ్ళ మీదికి కూడా ఎగబడుతుంది ఇక్కడి ఆంటీ.... కారులో ఆత్మరక్షణ కోసం అందుబాటులో వుంచుకుంటున్నట్లున్నాడు....’’ కామెంట్ చేసింది గీతిక.

ఆమె అన్నట్లు అలా ఎగబడకపోయినా, ఎగబడేందుకు సిద్ధంగా వున్నట్లు ఒక లుక్ ఇచ్చింది హోటల్ ఆంటీ... రెండుసార్లు మొటికలు విరిచింది.

అంతకు ముందు మాదిరి వేగంగా నడపకుండా నెమ్మదిగా పోనిచ్చాడు భాను. రోడ్డుకు అటూ ఇటూ ఎదిగి వున్న చెట్లను జాగ్రత్తగా చూస్తూ డ్రయివ్ చేయసాగాడు.

‘‘కారుకేమైనా అయ్యిందా?’’ చూసి చూసి విసుగ్గా అడిగింది గీతిక.

సమాధానం ఇవ్వలేదు భాను. తలను ప్రక్కకు తిప్పి చూడను కూడా చూడలేదు.

‘‘ఇలా అయితే ఎల్లుండి సాయంత్రానికి కూడా వెళ్ళలేం మనం... స్పీడ్‌గా పోయినందువల్ల కారుకేమీ ప్రమాదం వుండదు...’’ మళ్ళీ వెక్కిరించింది గీతిక.

అయినా సరే తొందర పడలేదు భాను... మరో నాలుగు కిలోమీటర్ల దూరం పోయిన తరువాత యదార్థం అయింది అతని ఊహ.

అంతవరకూ సూటిగా స్ట్రయిట్‌గా వున్న రోడ్డు కాస్తా ఒక చిన్న వంతెన దగ్గిర షార్ప్‌గా మలుపు తిరుగుతుంది.

పెద్ద పెద్ద బండరాళ్ళను ఆ మలుపులో రోడ్డుకు అడ్డంగా పెట్టి ఓపికగా వెయిట్ చేస్తున్నారు నలుగురు అగంతకులు.

ఎంత జాగ్రత్తగా వున్నా మలుపులోకి ఎంటర్ అయిన తరువాత గాని వారిని గమనించలేకపోయాడు భాను. గమనించిన మరుక్షణం బ్రేకులు వేసి వేగంగా గేర్లు మార్చాడు.

"ఏమిటి? ఏమయ్యింది?" ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ కనులు తెరిచాడు కునికిపాట్లు పడుతున్న లాయర్ సాబ్.

"కారుని వెనక్కి పోనిచ్చి ఆపేస్తాను... కిందికి దూకి దూరంగా పారిపోండి..." పళ్ళు బిగించి హెచ్చరిస్తూ రివర్స్ గేర్‌లో కారును వెనక్కి తీసుకువచ్చి ఆపేశాడు భాను.

అతనంత వేగంగా రియాక్ట్ అవుతాడని ఊహించలేదు కాబోలు వెంటపడటంలో కాస్తంతా ఆలస్యం చేశారు వెయిట్ చేస్తున్న వ్యక్తులు.

"కొట్టండి... తలలు పగలగొట్టండి...." అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ కారుకేసి పరుగెత్తుకువచ్చారు వాళ్ళు, నాలుగు క్షణాలు ఆలస్యంగా.

సీటు క్రింద పెట్టిన ఐరన్ రాడ్‌ని చేతుల్లోకి తీసుకుంటూ బయటికి దూకాడు భాను. అలా దూకుతుండగా అతనికి తెలిసి వచ్చింది.

కారులోనే వున్నది గీతిక... భయంతో బిగుసుకుపోయాడు కాబోలు కూర్చున్నచోటి నుంచి అంగుళం దూరం కూడా అవతలికి జరగలేదు లాయర్ సాబ్.

అరిచి, కేకలు పెట్టి, హోటల్ ఆంటీ మాదిరి నోటికి వచ్చినట్లు వారిని తిట్టాలని అనిపించినా, దారి కాచిన వ్యక్తులు మీదికి వచ్చేయటంతో ఆ పని చేయలేకపోయాడు భాను.

"కొట్టండి.... తల పగిలిపోయేటట్లు కొట్టండి...." అని మిగిలిన వారిని హెచ్చరించి, లాయర్ సాబ్ కూర్చున్న వైపు పరిగెత్తబోయిన వ్యక్తి నొకతన్ని అడ్డుకున్నాడు మొట్ట మొదటిగా. అతను విదిలించిన కత్తి తనకు తగలకుండా తప్పించుకుని, ఐరన్ రాడ్‌తో బలంగా మోదాడు తలమీద.

ఆ పరిసరాలన్నీ దద్దరిల్లిపోయేటట్లు అరిచి, మోకాళ్ళ మీద వాలిపోయాడా వ్యక్తి. గాయపడిన తలను చేతులతో అదుముకుంటూ గోల చేయడం మొదలు పెట్టాడు.

అతన్ని గురించి పట్టించుకోకుండా మిగిలిన వారిమీద తన దృష్టిని కేంద్రీకరించాడు భాను. వారి దగ్గిర వున్న కత్తుల్లో ఏ ఒక్కటీ తన శరీరానికి తగిలినా, తన పని ఖతమ్ అయిపోతుందని అర్థం అవుతూనే వుందతనికి. చేతిలో వున్న రాడ్‌ని వదిలేసి పిక్కబలం చూపిస్తే వాళ్ళు తన జోలికి రారాని కూడా తెలుస్తూనే వుంది.

అయినా సరే అడుగు అవతలికి వేయలేదతను... ఆ కత్తుల్ని చూసి జంకలేదు. ఐరన్ రాడ్‌ని గిరిగిరా తిప్పుతూ వున్నట్లుండి పడగొట్టేశాడు మరో వ్యక్తిని.

"చచ్చిపోయాను... నేను చచ్చిపోయాను...." అని అరుస్తూ క్రిందికి దొర్లిన ఆ వ్యక్తిని చూసేసరికి ధైర్యాలు దిగజారిపోయాయి కాబోలు, గిరుక్కున వెనుతిరిగి రోడ్డు ప్రక్కన వున్న చెట్లలోకి పారిపోయారు మిగిలిన ఇద్దరూ.

"వచ్చేయ్ భానూ.... త్వరగా వచ్చేయ్.... ముందు నువ్వు వెనక్కి వచ్చేయ్...." అంతవరకూ మాటా మంచీ లేకుండా బొమ్మలా కూర్చుండిపోయిన గీతిక పెద్దగా అరిచి హెచ్చరించేసరికి, వారిని వెంబడించే ప్రయత్నాన్ని విరమించుకున్నాడు భాను.

అదే సమయంలో క్రింది నుంచి లేచి రెండో ప్రక్కకు పరుగెత్తారు తలలు పగిలి నేలమీద వాలిపోయిన అగంతుకులు.

"నీ మూలంగానే పారిపోయారు వాళ్ళు. నువ్వు అరవకుండా వున్నట్లయితే ఇద్దరినీ కాళ్ళు చేతులు కట్టేసి డిక్కీలోకి నెట్టేసే పని...." కోపంగా అంటూ వెనక్కి వచ్చి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు భాను.

"నీ గొప్పతనాన్ని చూసి సంతోషించాం గానీ, ముందు కారును కదిలించు...." అతని మాదిరిగానే కోపంగా హెచ్చరించింది గీతిక.

కారును కదిలించాడు భాను... మలుపు దగ్గిర ఆపి, రోడ్డు మీది రాళ్ళల్లో నాలుగింటిని మాత్రం తొలగించి దారి ఏర్పాటు చేశాడు.

“అతను ఎలర్ట్‌గా వుండటం వల్ల ఇవ్వాళ పెద్ద ప్రమాదం తప్పిపోయింది... అతన్ని మెచ్చుకోవాల్సింది పోయి విసుక్కుంటావెందుకు?” మొట్ట మొదటిసారిగా పెదవి విప్పుతూ గీతికతో అన్నాడు లాయర్ సాబ్.

“పొద్దున వట్టి పిరికి వాడని వెక్కిరించాను. ఆ మాటలు మనసులో పెట్టుకొని నా ముందు తన గొప్పతనాన్ని ప్రదర్శించాడు.... వాళ్ళ చేతుల్లో వున్న కత్తులు వంటికి తగిలినట్లయితే వుండేది ఈ పెద్ద మనిషి గొప్పతనం. హాస్పిటల్లో చేర్చి సేవలు చేయలేక చచ్చిపోయేవాళ్ళం.....” ముక్కును ఎగబీలుస్తూ కోపంగానే సమాధానం ఇచ్చిందామె.

ఆమెలో అగుపిస్తున్న ఆ రెండో మనిషిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ కారును వేగంగా ముందుకు పోనిచ్చాడు భాను.

# 13

పచ్చటి చెట్లతో, ఎత్తయిన కొండ గుట్టలతో కనుల విందుగా కనిపించే ధార్వాడ ఎస్టేట్ క్వార్టర్స్ దగ్గిర నిలబడి చుట్టూ చూశాడు భాను.

వారానికి ఒకసారి పేమెంట్స్ ఇస్తారు కోబోలు, వరుసల్లో నిలబడి వున్నారు ఎస్టేట్‌కి చెందిన పొలాల్లోను, అడవుల్లోను, తేయాకు తోటల్లోను పనిచేసేవాళ్ళు.

పెద్ద పెద్ద క్యాష్ బ్యాగ్స్ దగ్గిర పెట్టుకున వారిని అదిలిస్తున్నారు ఎస్టేట్ సూపర్‌వైజర్లు... లైన్లలో నిలబడకుండా ముందుకు వచ్చిన వారిని పరుషమైన మాటలతో బెదిరిస్తున్నారు.

"ధర్మ ప్రభువు సూర్యప్రసాద్ గారు బ్రతికి వున్నంతకాలం మూతలుపడే వున్నాయి వీళ్ళ నోళ్ళు. అయన పోయాడు.... వీళ్ళ ఆగడాలకు హద్దు లేకుండా వుంది...." సన్నటి గొంతుకతో ప్రక్కనే వున్న యువతికి చెప్పింది ఒక మధ్య వయస్కురాలు.

"కొడుకును ఇంట్లో నుంచి తరిమేసిన సూర్య ప్రసాద్ ధర్మ ప్రభువు ఎలా అయ్యాడు" నోరు వూరుకోక వెంటనే అడిగాడు దగ్గిర్లోనే నిలబడి ఆ మాటల్ని విన్న భాను.

ఉలికిపాటును కప్పి పెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ చటుక్కున తల తిప్పేసుకున్నదామె.

"నా మాటకు సమాధానం చెప్పవా?" నవ్వుతూ మరోసారి అడిగాడు భాను.

"పెద్దోళ్ళ విషయాల్లో వేళ్ళు పెడితే వేళ్ళతో పాటు చేతులు కూడా ఎగిరిపోతాయి..... మా బతుకేదో మమ్మల్ని బతుక్కోనీయండి బాబూ.... మా చేత అనవరసమైన వాగుడు వాగించి పీకల మీదికి తీసుకురాబోకండి...." అంటూ తాను కూడా తల పక్కకు తిప్పుకున్నది ఆమె పక్కన వున్న యువతి.

సూర్యప్రసాద్ గురించి మాట్లాడితే చేతులు పోవటమేమిటో, పీకలు ఎగిరిపోవటం ఏమిటో భానుకు అర్థం కాలేదు. వాళ్ళని మాట్లాడించటానికి ప్రయత్నించడం వృథా అని గ్రహించి ముందుకు కదులుతుండగా పొగలు విడుస్తూ అక్కడికి వచ్చిందొక జీప్.

ఖరీదయిన దుస్తులు ధరించి, నల్లటి కళ్ళద్దాలు పెట్టుకొని అందులో నించి దిగాడు ఒక యువకుడు. హుందాగా అడుగులు వేస్తూ భాను ఎదుటికి వచ్చాడు.

"అతను మా మామయ్య కొడుకు... నాకు బావ... పేరు దినేష్" భాను వెనుక నుంచి మృదువుగా పలికింది గీతిక.

సూర్యప్రసాద్‌ని గురించి తెలుసుకోవాలనే కోరికలో పడి. ఆమె రాకను అబ్జర్వ్ చేయలేకపోయినందుకు తనను తానే నిందించుకుంటూ, లాయర్ సాబ్ పుత్రరత్నానికి నమస్కారం చేశాడు భాను.

"దారి మధ్యలో కారును ఆపే ప్రయత్నం జరిగిందట గదా...." భాను వంక పరీక్షగా చూస్తూ అడిగాడు దినేష్.

ఆ కంఠంలో అనవసరంగా ప్రతిధ్వనిస్తున్న అహంకారాన్ని గమనించి నొసలు విరుస్తూ తల వూపాడు భాను.

"డాడీ దగ్గిర హెవీ ఎమౌంట్ వున్నదని ఎవరికీ తెలిసే అవకాశం లేదు... ఆ విషయం గురించి తెలిసిన వాళ్లలో నువొక్కడివే బయటివాడివి....." అలాగే చూస్తూ అన్నాడు దినేష్.

ఆ మాటల్లో విపరీతార్థం గోచరించి కొంచెం షాక్ తిన్నాడు భాను.

"మీ ఉద్దేశం ఏమిటో నాకు అర్థం కావటం లేదు..." తన ముఖంలోని భావాలు బయటికి కనిపించకుండా వుండటానికి ప్రయత్నం చేస్తూ అన్నాడు.

"పట్టుబడకుండా తప్పించుకున్న వాళ్ళందరూ అనే మాటే అది... డాడీ కేష్‌ని తీసుకు వస్తున్నట్లు వాళ్ళను ఎదిరించినట్లే ఎదిరించి డాడీకి నమ్మకస్తుడి

మాదిరి ఫోజు పెడుతున్నాడు.....” తడుముకోకుండా, ఎక్కువగా ఆలోచించను కూడా ఆలోచించకుండా ఆరోపించాడు దినేష్.

లాగిపెట్టి అతని నోటి మీద కొట్టాలనే కోరికను బలవంతంగా అణుచుకుంటూ “నేనే ఆ పని చేయించినట్లయితే, కేష్ ఇంకా మీ డాడీ దగ్గిర ఎందుకుంటుంది?” అని అడిగాడు భాను.

“అదే నాకు కూడా అర్థం కాలేదు... డాడీ ఈ విషయం చెప్పినప్పుడు నిన్ను పోలీసులకు పట్టివ్వమని చెప్పకుండా వుండటానికి కారణం కూడా అదే... నీ సంగతి నాలుగైదు రోజుల్లో తేల్చేస్తాను ఖంగారు పడకు....” అంటూ అతన్ని వదిలి గీతిక ముందుకుపోయాడు దినేష్.

అతను చేసిన ఆరోపణలో నిజం లేదని ఆమె అంటుందని ఎదురుచూశాడు భాను. తన తరుపున అతన్ని మందిలిస్తుందని అనుకున్నాడు.

అటువంటి పని ఏదీ చేయకుండా, అందంగా నవ్వుతూ అతని చేయి పట్టుకొని జీప్ వైపు తీసుకుపోయిందామె.

“ఫారెస్ట్ అంచుల్లో కొండమల్లెలు వున్నాయి. కోసుకువద్దాం పద...” అంటూ జీప్ ఎక్కి కూర్చున్నది.

పొగలు విడుస్తూ వెనుదిరిగిన ఆ జీప్ వైపే చూస్తూ విగ్రహంలా నిలబడిపోయిన భాను దగ్గిరికి వచ్చాడు ఒక సర్వెంట్.

“అయ్యగారు పిలుస్తున్నారు... వెంటనే రమ్మని చెప్పమన్నారు....” అంటూ.

తన ఆలోచనలను తనలోనే అదుముకొని అతన్ని అనుసరించాడు భాను.

*          *          *          *          *

"మనం ఒకసారి బెంగుళూరు వెళ్ళిరావాలి... డ్రయివ్ చేయగలవా?" రాజభవనం వంటి మెయిన్ హౌస్‌లో పది ఎకరాల స్థలం ఆక్రమించుకున్నట్లు విశాలంగా కనిపించే హాల్లో కూర్చుని ప్రశ్నించాడు లాయర్ సాబ్.

ఆయన ప్రక్కనే వున్న సోఫాలో ఆశీనుడై వున్నాడు ఎస్టేట్ మేనేజర్ హరిహరవర్మ. ఖరీదైన సిగార్‌ని కాలుస్తూ భాను వంకే పరీక్షగా చూస్తున్నాడు.

అక్కడికి వచ్చిన దగ్గర్నుంచీ ఆయన అలాగే చూస్తూ వుండటం విస్మయాన్ని కలిగించినా అదేమిటని అడిగే పరిస్థితి లేదు కాబట్టి గమనించనట్లే వూరుకున్నాడు భాను.

"ఈ నాటు రోడ్ల మీద మన కారు పనిచేయదు. గారేజి దగ్గిరికి పోయి ఏదైనా జీప్‌ని తీసుకో..." సమాధానం కోసం ఎదురు చూడకుండా లాయర్ ఆర్డర్ ఇచ్చేసరికి, వినయంగా తల వూపి వెనుతిరిగాడతను.

ఆ భవంతి ముందున్న పెద్ద పెద్ద మెట్లను చేరుకుంటుండగా, అతని చెవులకు చేరింది ఆ శబ్దం... మెట్లు దిగి, భవంతి ప్రక్క భాగంలోకి పోయే సరికి కనిపించిందా భయంకర దృశ్యం.

మెయిన్ హౌస్‌కి రెండు వందల మీటర్ల దూరంలో నిర్మించబడి వున్నాయి సర్వెంట్ క్వార్టర్స్. వాటిలో ఒకటి అగ్నికి ఆహుతి అవుతోంది... ఎర్రటి జ్వాలలు నాలుకలు విరజాస్తూ ప్రక్కనే వున్న కట్టడాల మీదకి పాకుతున్నాయి.

పేమెంట్స్ కోసం క్యూలలో నిలబడిన వర్కర్స్ అందరూ గగ్గోలుగా అరుస్తూ అక్కడికి పరిగెత్తుకు వస్తున్నారు. ఖణేల్ ఖణేల్ మని మ్రోతలు చేస్తూ గాలిలో ఎగురుతున్న పెంకుల్ని, వాటి క్రింద వెదురుగడల్ని చూసి భయంతో మ్రాన్పడిపోతున్నారు.

"నా బిడ్డ... నా బిడ్డ లోపలే వుంది... నా బిడ్డ...." పెద్ద కంఠంతో బిగ్గరిగా అరుస్తూ క్వార్టర్స్ ముందు అటూ ఇటూ పరుగెత్తుతున్నాడు భానును మెయిన్ హౌస్ లోకి పిలుచుకువచ్చిన సర్వెంట్.

డండ వాడిన భుజంగాల మాదిరి నిట్టనిలువుగా లేస్తున్న జ్వాలల వంక చూశాడు భాను. దారుణమైన బాధతో అలమటించిపోతున్న ఆ వృద్ధుడిని పరికించాడు.

చేతులకు అందిన చెంబుల్ని పాత్రల్ని తీసుకువచ్చి మంటల మీదికి నీళ్లను విరజిమ్ముతున్నారు అక్కడికి వచ్చిన వర్కర్స్. కొందరు దోసిళ్ళతో మట్టిని అందుకుని విసిరికొడుతున్నారు.

దగ్గిరలో కనిపించిన ఒక వ్యక్తిని నిలుపు చేసి అతని చేతిలోని నీళ్లు బక్కెట్‌ని తను తీసుకున్నాడు భాను. తానేం చేయబోతున్నాడో అతనికి అర్థం కాకముందే ఆ నీళ్లను తలమీద వంపుకుని ముందుకు జంప్ చేశాడు.

"వద్దు... వద్దు... ముందుకు పోవద్దు...." అతని ఆలోచన అర్థమై గొల్లున అరిచారు అక్కడివారు. చేతులు జాచి అతని షర్టును పట్టుకోబోయారు.

పట్టు దొరికించుకోబోయిన చేతుల్ని విదిలించి కొట్టి వింటి నుంచి వెలువడిన బాణంలా యింట్లోకి పరుగెత్తాడు భాను.

నీళ్ళు నెత్తిమీద కుమ్మరించుకోవటం వల్ల అప్పటికి ఆ వేడిమిని భరించగలిగినా, ముందు గదిని దాటి నాలుగు అడుగులు వేసేసరికి ఆవిరై పోయింది అతని వంటిమీద తడి, సూదులు పెట్టి గుచ్చినట్లు బాధ ప్రారంభం అయింది.

మరో పది క్షణాల్లో బయటికి పోలేకపోతే తన పని అయిపోయినట్లే అని అర్థమవుతున్నా అలాగే మొండిగా వెనుక గదిలోకి పోయాడు అతను.

అక్కడ కనిపించిందతనికి పద్దెనిమిది సంవత్సరాల పడుచు ఒకామె మంటల బారి నుంచి తప్పించుకోవటానికి వెనుక వున్న ద్వారం దగ్గరికి పరుగెత్తుతూ, ఆ వేడిమిని భరించలేక స్పృహ తప్పి పడిపోయి వుంది.

చటుక్కున ముందుకు వంగి ఆమెను చేతుల్లోకి ఎత్తుకున్నాడు భాను. ఫెటేల్ మని శబ్దం చేస్తూ మీద పడబోయిన రెండు వెదురుగడలను తప్పించుకుంటూ దగ్గరికి పరిగెత్తుకు వచ్చాడు.

పూర్తిగా మంటల బారిన పడి వుందా మార్గం.... దారుణమైన వేడిమిని వెలువరిస్తూ నాట్యం చేస్తున్నట్లు వూగుతున్నాయి అగ్ని జ్వాలలు.

వెనుతిరిగే వ్యవధి లేకపోవటం వల్ల గుడ్డిగా ముందుకు దూకాడు భాను.

చేతుల్లో వున్న పడుచుతో సహా అక్కడికక్కడే మాడి మాసి అయిపోవాల్సిన అతన్ని బయట గుమికూడిన వర్కర్స్ కాపాడారు.... అతను లోపలికి వెళ్ళిన

మరుక్షణం తమ దృష్టినంతా ముఖద్వారం మీదనే కేంద్రీకరించారు వాళ్ళు.... తాము తెచ్చిన నీళ్ళన్నింటినీ అక్కడే చిలకరిస్తున్నారు.

భాను పరిగెత్తుకు వచ్చి ద్వారాన్ని దాటే సమయానికి కొద్దిగా తలలు వంచుతూ మంటలు అతన్ని, అతని చేతుల్లోని నిస్సహాయురాలిని ఆరగించకుండా వదిలేశాయి.

"ఏ తల్లి కన్న బిడ్డవోగాని, నా ఇంటి దీపాన్ని నిలబెట్టావు. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థం కావటం లేదు...." భాను చేతుల్లోని పడుచును తను అందుకుంటూ కృతజ్ఞతా పూర్వకంగా అన్నాడు వృద్ధుడు.

"నా ఋణం తీర్చుకునే మాటను గురించి తర్వాత ఆలోచిద్దాం గాని, ముందు ఆ పిల్లకు వైద్యం చేయించాలి... వెంటనే స్పృహ తెప్పించాలి....." అంటూ ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు రెడీ అయినాడు భాను.

అటువంటి విషయాల్లో తమకు అనుభవం వున్నట్లు, అతని కంటె ముందుగానే ఆ పిల్లను క్రింద పడుకోబెట్టి, స్పృహ తెప్పించే ప్రయత్నాలు ప్రారంభించారు అక్కడి వారిలో కొందరు వర్కర్స్.

ఐదు నిముషాల తరువాత ఫలించాయి వాళ్ళ ప్రయత్నాలు. బాధగా నొసలు విరుస్తూ కనులు తెరిచిందామె.

సంతోషం పట్టలేక గంతులు వేసి బిగ్గరగా అరుస్తున్న వర్కర్స్‌ని చూచి నవ్వుకుంటూ వారి మధ్యలో నుంచి యివతలికి వచ్చేశాడు భాను.

అదృష్టం బాగుండి గాలి గట్టిగా వీచకపోవడం వల్ల, ఆ క్వార్టర్స్‌ని ఆరగించటంతో తృప్తి చెందాయి మంటలు.... భీభత్సాన్ని సృష్టించటం మానుకొని మలిగిపోతున్నాయి.

ప్రమాదం తప్పిపోయిన తర్వాత మెల్లిగా మొదలైనాయి, అసలా మంటలు ఎలా ప్రత్యక్షమైనాయన్న అనుమానాలు, ఆ మాటల్ని కూడా ఆలకించుకోలేదు భాను.

గారేజి దగ్గిర నిలబెట్టిన తమ కారు దగ్గిరికి పోయి మసితోను, మట్టితోను, నిప్పురవ్వలు పడటం వల్ల ఏర్పడిన చిల్లులతోను అసహ్యంగా తయరయిన దుస్తుల్ని మార్చుకున్నాడు. ప్రక్కనే వున్న వాటర్ టాప్ దగ్గిర కాళ్ళు చేతులు శుభ్రం చేసుకుని అతను రెడీ అయ్యే సమాయానికి సూట్‌కేస్ వంటి బ్రీఫ్‌కేసును పట్టుకొని అక్కడికి వచ్చేశాడు లాయర్ సాబ్.

సర్వెంట్ క్వార్టర్స్ తగలబడిపోయిన సంగతి తనకు పట్టనట్లుగా ఖరీదయిన సిగార్‌ను వెలిగించుకుంటూ అతని వెనుకే అరుగు దెంచాడు ఎస్టేట్ మేనేజర్ హరిహరవర్మ.

# 14

రెండు వందల కిలోమీటర్ల దూరాన్ని రెండున్నర గంటల్లో అధిగమించి, చీకటిపడే సమయానికి బెంగుళూరు అవుట్ స్కర్ట్స్‌ని చేరుకున్నాడు భాను.

లైట్లు సరిగా వెలగని ఒక వీధిలో జీప్‌ని ఆపించి, బ్రీఫ్‌కేసుతో సహా క్రిందికి దిగారు లాయర్ సాబ్, హరిహరవర్మ.

"నువ్వు ఇక్కడే వుండు.... ఒక అరగంటలో వచ్చేస్తాము...." అంటూ అక్కడికి కొద్ది దూరంలో వున్న పెద్ద బిల్డింగ్ ముందుకు వెళ్ళారు.

"ఎవరు మీరు...? ఎందుకు వచ్చారు?" అని అడుగుతూ వెంటనే వారి దారికి అడ్డంగా ప్రత్యక్షం అయ్యారు ఇద్దరు వ్యక్తులు.

"వీళ్ళు ధార్వాడ ఎస్టేట్ నుంచి వచ్చినట్లున్నారు.... అవునా?" లాయర్ సాబ్ గాని, హరహరవర్మ గాని పెదవులు కదిలించకముందే అడ్డుగా వస్తూ అన్నాడు ఇంకోవ్యక్తి.

ఆ మాటకు మూగగా తల వూపాడు లాయర్ సాబ్.

"లోపలికి వెళ్ళండి... దొర మీ కోసమే ఎదురు చూస్తున్నాడు..." అంటూ మూసి వున్న ముఖద్వారాన్ని తెరిచి అతన్ని, హరహరవర్మనూ లోపలికి పోనిచ్చాడు మరో వ్యక్తి.

ఓల్టేజి డౌన్ అయినట్లు గుడ్డిగా వెలుగుతున్నాయి లోపలి భాగంలోని లైట్లు. కనులు చిట్టించుకుని చూస్తే తప్ప ఎదుట ఏమున్నదో తెలియటం లేదు.

తలుపుల దగ్గిరే నిలబడి చుట్టూ చూస్తున్న లాయర్ సాబ్‌కి పది క్షణాల తరువాత గానీ ఆగుపించలేదు. హాలు మాదిరిగా వున్న ఆ ప్రదేశం చివర సోఫా వంటి చెక్క బల్ల మీది పర్సనాలిటీ.

వాళ్ళ తనను చూసి ముందుకు అడుగు వేసిన తర్వాత గాని నోరు విప్పలేదా పర్సనాలిటీ..... "మీ కోసం ఉదయం నుంచీ ఎదురు చూస్తున్నాను.

ఆర్చుకుని, తీర్చుకుని అడుగులు లెక్కపెట్టుకుంటూ ఇప్పటికి వచ్చారన్న మాట.... డబ్బు తీసుకువచ్చారా?''

తుప్పు పట్టిన ఇనుప గొలుసులు ఒకదానికొకటి రాసుకుంటే వికృతంలా వినబడే శబ్దం మాదిరి, అసహ్యాన్ని కలిగిస్తున్న అతని కంఠాన్ని విని అదిరిపడకుండా వుండటానికి ప్రయత్నిస్తూ, అతని ఎదుట వున్న ఆర్డినరీ బల్ల మీద కూర్చున్నాడు లాయర్ సాబ్, హరిహరవర్మ.

''డబ్బు తీసుకువచ్చారా?'' మరోసారి రెట్టించాడు తాపీగా కూర్చుని వున్న దొర.

తన దగ్గిర వున్న బ్రీఫ్‌కేసును ముందుకు జాచాడు లాయర్ సాబ్.

దాని అందుకుని ఓపెన్ చేశాడు దొర. అందులో వున్న నోట్ల కట్టల్ని జాగ్రత్తగా లెక్కబెట్టుకుని తల వూపాడు.

''నువ్వు అడిగినంత యిచ్చాము....'' అన్నాడు లాయర్ సాబ్.

''ఇవ్వలేదని నేను అన్నానా?'' ప్రశ్నించాడు దొర.

''మరి క్యాసెట్ ఏది?''

పెద్దగా నవ్వి చెక్కబల్ల మీద నుంచి లేచాడు దొర.

''ఎందుకు నవ్వుతావ్?'' అయోమయంగా చూస్తూ అడిగాడు లాయర్ సాబ్.

''దొరక్క... దొరక్క దొరికిన బంగారు బాతును అప్పడే వదిలిపెడతానని ఎందుకు అనుకున్నారు? కాసెట్ మీకు చేరాలంటే ఇప్పుడిచ్చిన డబ్బు సరిపోదు...

ఇంకా ఇంకా యివ్వాలి... ధార్వాడ ఎస్టేట్ మీ చేతి క్రింద వున్నంతవరకూ యిస్తూనే వుండాలి...." అంటూ బ్రీఫ్‌కేసుని తీసుకుని వెనుక గదిలోకి వెళ్ళిపోయాడు దొర.

"పాతిక లక్షలు ఇస్తే కాసెట్ ఇచ్చేస్తానని మాట ఇచ్చి, డబ్బు చేతిలో పడగానే మాట మార్చటం అన్యాయం...." చటుక్కున నిలబడుతూ కోపంగా అన్నాడు హరిహరవర్మ.

"న్యాయం, అన్యాయం అనే మాటల్ని మనం ఉచ్చరించకూడదు సార్.... న్యాయం గానే బ్రతకాలని అనుకుని వుంటే ఈనాడు ధార్వాడ ఎస్టేట్ మీ చేతికి వచ్చి వుండేది కాదు" అంటూ అడుగు ముందుకు వేశాడు దొర.

"ఆగు.... అడుగు కదల్చకు...." గీరపడిన కంఠంతో బిగ్గరిగా అరిచాడు హరిహరవర్మ.

మంత్రం వేసినట్లు ప్రత్యక్షమయిందొక రివాల్వర్ అతని చేతిలో.

"మనం చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ కాసెట్‌ని మాకు యివ్వు.... కాసెట్‌ని యివ్వకుండా నువ్వు ప్రాణాలతో అవతలికి పోలేవు..." దొర గుండెలకేసి గురి పెడుతూ యింకా బిగ్గరిగా హెచ్చరించాడతను.

మొదటి నుంచీ అక్కడ డిమ్‌గా వున్న లైట్లు మరింత డిమ్ అవటాన్ని గమనించలేకపోయాడతను. గమనించేసరికి చాలా ఆలస్యం అయి పోయింది... తగ్గినట్లే తగ్గి ఒక్కసారి ఆరిపోయాయి అవన్నీ.

కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని కటిక చీకటి తనను చుట్టుముట్టుటంతో ఆత్రాన్ని అణుచుకోలేక ట్రిగ్గర్‌ని ప్రెస్ చేశాడు హరిహరవర్మ.

గుండెలు జలదరించే శబ్దాన్ని వెలువరించింది రివాల్వర్... లైట్లు ఆరిపోకముందు దొర నిలబడిన ప్రదేశంలో నుంచి దూసుకుపోయింది బుల్లెట్.

రివాల్వర్ చేసిన మ్రోతను ఆలకించిన మరుక్షణం తెరుచుకున్నాయి ముందు తలుపులు. మూకుమ్మడిగా వచ్చి అతిథులిద్దరి మీదా కలబడ్డారు బిల్డింగ్ బయట వున్న దొర అనుచరులు.

ఉక్కు ముక్క వంటి పిడికిలి ఒకటి ముఖం మీద పడేసరికి, బాధను భరించలేక బిగ్గరిగా అరిచి క్రిందికి వాలిపోయాడు లాయర్ సాబ్.

* * * * *

లాయర్ సాబ్, హరిహరవర్మ అవతలికి పోగానే బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ జీప్‌లో నుంచి క్రిందికి దిగాడు భాను. ముడతలు పడిన షర్టును సరిచేసుకుంటుండగా, కనిపించిందతనికి ప్రయాణం ప్రారంభించక ముందు పర్చేజి చేసిన సిగరెట్.

దుస్తులు మార్చుకున్నప్పుడల్లా, జేబులోని బిలాంగింగ్స్‌తో పాటు కొత్త జేబులోకి మారుతూ వస్తోంది అది. మరో రెండు సార్లు అలా మారితే ఎందుకూ పనికిరాకుండా పోతుంది.

అగ్గిపెట్టె అరువు ఇచ్చే మహనీయుడికోసం వెతుకుతూ జీప్‌ని వదిలి ముందుకు బయలుదేరాడతను.

లాయర్ సాబ్ ఎంటర్ అయిన బిల్డింగ్ దగ్గిరికి వచ్చేసరికి, కనిపించారతనికి ద్వారం దగ్గిర నిలబడివున్న అపరిచిత వ్యక్తులు.

వారిలో ఒకతను సిగరెట్ కాలుస్తూ వుండటాన్ని గమనించి, అటుగా అడుగులు వేశాడు భాను. “అగ్గిపెట్టె కొంచెం ఇస్తారా?” అంటూ చేతిని ముందుకు జాచాడు.

అదే సమయంలో అదిరిపాటుగా వినవచ్చింది హరిహరవర్మ అరుపు... ఆ తరువాత కొద్ది సేపటికే గుండెల్ని జలదరింపజేస్తూ వినవచ్చింది రివాల్వర్ మ్రోత.

చేతిని ముందుకు జాచి నిలబడిన భాను వంక అనుమానంగా చూస్తూ అగ్గిపెట్టెను అందించబోతున్న వ్యక్తితో సహా, గిరుక్కున వెనుతిరిగి బిల్డింగ్ లోకి పరిగెత్తారు.

వంటిరిగా నిలబడిపోయాడు భాను... లోపల ఏం జరుగుతున్నదో తెలియక, గిజాటుగా అటూ ఇటూ చూస్తున్న సమయంలో అతని చెవికి చేరింది లాయర్ సాబ్ కంఠం.

చేతిలోని సిగరెట్ అవతలికి విసిరేసి నాలుగు అంగల్లో లోపలికి పోయాడతను. అప్పుడే గబుక్కున వెలిగాయి అంతకు ముందు ఆరిపోయిన లైట్లు.

ఆ వెలుగులో అక్కడ కనిపించిన దృశాన్ని చూడగానే తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడతను. మరో నాలుగు అంగల్లో చెక్కబల్లల్ని సమీపించి తన పిడికిళ్ళకు పని కల్పించాడు.

ఎదురు చూడని విధంగా తమ వెనుకనుంచి వచ్చిన ప్రమాదాన్ని ఎదుర్కొవటం చేతకాక, అటూ ఇటూ చెదిరిపోయారు దొర అనుచరులు.

రెండే రెండు నిముషాల్లో పిన్‌డ్రాప్ సైలెన్స్ ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది.

"బ్రీఫ్ కేసు... మనీ బ్రీఫ్ కేసు...." ఆందోళనగా అంటూ అటూ ఇటూ పరిగెత్తుతున్న హరిహరవర్మను అతని బాధలకు అతన్ని వదిలేసి, క్రిందపడిపోయిన లాయర్ సాబ్‌ని లేపి నిలబెట్టాడు భాను.

దొర అనుచరులు సడన్‌గా వచ్చి చుట్టుముట్టడంతో, రివాల్వర్‌ని చేజార్చుకున్నాడు హరిహరవర్మ.... దాన్ని వెతికి, రెడీగా పట్టుకొని బిల్డింగ్ నంతా గాలించి వచ్చాడతను.

దొరగాని, దొర అనుచరులు గాని కనిపించకపోవటంతో చిరాకుగా నేలను తన్ని, జీప్ దగ్గిరికి బయలుదేరాడు. నడవటానికి చాలా అవస్థపడుతున్న లాయర్ సాబ్‌ని కూడా జీప్ దగ్గిరికి చేర్చి, స్టీరింగ్ ముందు కూర్చున్నాడు భాను.

* * * * *

"అసలు నిన్నెవడు లోపలికి రమ్మన్నాడు? జీప్‌ని వదిలి నువ్వు అక్కడికి ఎందుకు వచ్చావు?" ఎస్టేట్‌కి తిరిగివచ్చేదాకా మాట్లాడకుండా కూర్చుని, ఎస్టేట్‌ని చేరుకోగానే ఫ్లేరాప్ అయ్యాడు హరిహరవర్మ.

తాను వచ్చి వుండకపోతే వాళ్ళ మక్కెలు విరిగిపోయి వుండేవని చెప్పలేదు భాను. నేల చూపులు చూస్తూ మౌనంగా నిలబడ్డాడు.

"నీ వంటి తొందరపాటు వ్యక్తిని పనిలో పెట్టుకోవటం బుద్ధి తక్కువ.... ఈ రోజు నించీ నువ్వు పనిలోకి రావాల్సిన అవసరం లేదు... గెటవుట్... గెటవుట్ ఫ్రమ్ మై ఎస్టేట్....." జీరపడిన కంఠంతో ఇంకా ఇంకా బిగ్గరిగా అరిచాడు హరిహరవర్మ.

వంచిన తల ఎత్తకుండా వెనుతిరిగిన భానును మెట్ల దగ్గిర ఆపేశాడు వెనుకగా వచ్చిన లాయర్ సాబ్.

"అక్కడ... ఆ బల్డింగ్ లో మా మాటలేవయినా నీకు వినిపించాయా?" వస్తూనే అడిగాడు.

ఒక్కమాట కూడా భానుకి వినిపించలేదు... తడుముకోకుండా యదార్ధం చెప్పేశాడు.

"మా బావగారికి కోపం కాస్తంత ఎక్కువ... ఆయన మాటల్ని నువ్వు పట్టించుకోవాల్సిన అవసరం లేదు... వెళ్ళి విశ్రాంతి తీసుకో..." అని చెప్పి వెనక్కి పోబోతూ, మరోసారి భానుని పిలిచాడు లాయర్ సాబ్, "మనం బెంగుళూరు వెళ్ళి వచ్చిన సంగతి ఎవరికీ చెప్పకు నీలోనే వుంచుకోవాలి... అర్థం అయిందా?" ముఖంలోకి చూస్తూ అడిగాడు.

అర్థం అయినట్లు తల వూపి తమ కారు దగ్గిరికి వచ్చేశాడు భాను. అక్కడ కనిపించిన ఒక చెక్క బల్లమీద కూర్చుబోతుండగా, మెత్తగా అడుగులు వేస్తూ అతని ముందుకు వచ్చాడు, అగ్ని ప్రమాదంలో నష్టపోయిన వృద్ధుడు.

"అన్నం తిన్నావా బాబూ?" అతని ప్రక్కనే కూర్చుంటూ అడిగాడు.

రాజభవనం వంటి ఆ భవనంలో అవసరానికి మించిన సేవకులు ఎంతోమంది వుండికూడా, వారెవరూ అడగని ఆ ప్రశ్నను విని చలించి పోయాడు భాను.

“నా తిండిదేముంది గాని, ఆ పిల్ల ఎలా వుంది తాతా? డాక్టర్‌కి చూపించారా?” మాట మార్చటానికి ప్రయత్నిస్తూ అడిగాడు.

“ధర్మప్రభువు సూర్యప్రసాద్ గారు బ్రతికి వున్న రోజుల్లో ఎవరు ఇక్కడికి వచ్చినా మొట్టమొదట ఆయన అడిగే ప్రశ్ననే నేను అడిగాను బాబూ... అన్నం తిన్నావా?” భాను మాటలు తనకు వినబడనట్లు మరోసారి తన ప్రశ్నను రిపీట్ చేశాడా వృద్ధుడు.

సూర్యప్రసాద్‌ని గురించిన పొగడ్త రెండో మారు చెవుల పడటంతో మళ్ళీ కుతూహలాన్ని అణుచుకోలేకపోయాడు భాను.

“కొడుకును ఇంట్లోంచి తరిమివేసిన ఆ పెద్దమనిషి ధర్మప్రభువు ఎలా అయ్యాడు?” సూటిగా చూస్తూ ప్రశ్నించాడు.

వినరాని మాట ఏదో చెవుల పడినట్లు అదిరిపడి, బల్లమీది నుంచి లేచాడు ఆ వృద్ధుడు. “నీ వాలకం చూస్తుంటే తిండి తినకుండా కబుర్లతోనే కడుపు నింపుకునేట్లు కనిపిస్తోంది... నాతో పాటు రా బాబూ... ఈ రోజు మా దగ్గిరే భోజనం చేద్దువు గాని....” తమ మాటలు పరాయి చెవులకు చేరుతున్నాయేమోననే అనుమానం తోచినట్లు గబగబా అంటూ చేయి పట్టుకొని బల్లమీది నుంచి లేవదీశాడు బలవంతంగా.

సూర్యప్రసాద్ ప్రస్తావన మరోసారి తీసుకువస్తే అతను అప్పటి కప్పుడు అక్కడినించి వెళ్ళిపోతాడని అర్థమై, తన కుతూహలాన్ని తనలోనే దాచుకొని, అతని వెనుక అడుగులు వేశాడు భాను.

అగ్ని జ్వాలలకు ఆహుతి అయిన ఇంటిని వదిలేసి, క్వార్టర్స్‌కి కొంచెం దూరంగా వాళ్ళు వీళ్ళు ఇచ్చిన దుప్పట్లతో చిన్న టెంట్‌ని ఏర్పాటు చేసుకున్నాడు వృద్ధుడు. చిరిగిపోయిన చాపనొకదాన్ని టెంట్ ముందు పరిచి భానును కూర్చోబెట్టాడు.

"వేళకాని వేళలో నీ క్వార్టర్స్‌కి నిప్పు ఎలా ముట్టుకుంది తాతా? అసలు ఆ ప్రమాదం ఎలా సంభవించింది?" సూర్యప్రసాద్‌ని గురించి వాకబు చేయమంటే, అతన్ని ఇబ్బందిలో పడవేయటమే అని గ్రహించటం వల్ల, టాపిక్ మార్చి ఇంకో ప్రశ్న వేశాడు భాను.

అది కూడా ఏదో ఇబ్బందిని కలిగించే ప్రశ్న అయినట్లు తల వంచుకున్నాడు వృద్ధుడు. అరటి ఆకు వంటి ఏదో పెద్ద ఆకులో అన్నం పెట్టి, పలుచుగా వున్న కూరను అన్నం మీద పరుస్తోంది మంటల్లో పడిపోయిన పిల్ల.

చేస్తున్న పనిని ఆపి ఒక్కసారిగా ఏడుపు ప్రారంభించింది ఆమె. మోకాళ్ళ మీద తలను ఆనించుకొని తనలో తను కుమిలిపోవటం మొదలు పెట్టింది.

"అడగకూడని ప్రశ్న అడిగివుంటే నన్ను క్షమించండి... కొత్తగా వచ్చిన వాడిని కాబట్టి యిక్కడి పరిస్థితుల గురించి నాకు తెలియదు...." అనవసరంగా వారికి బాధ కలిగించినందుకు సిగ్గు పడుతూ అన్నాడు భాను.

“నువ్వు అడిగింది అడగకూడని ప్రశ్న కాదు బాబూ... మేము సమాధానం చెప్పినా చెప్పకపోయినా ఇంకో నాలుగైదు రోజులు ఇక్కడే వుంటే నీ అంతట నువ్వే తెలుసుకోగలవు. ఇల్లు కాలిపోవటం మా ఖర్మ కాదు బాబూ... గ్రహచారం... ఇప్పటికి కొంతకాలం నుంచీ ఒక దుష్టగ్రహం మమ్మల్ని పీడించుకు తింటోంది.....” తన వ్యధను తనలో దాచుకుని, పిల్ల రెడీ చేసిన ఆకును భాను ముందుకు తీసుకు వస్తూ అన్నాడు వృద్ధుడు.

ఇరవైఒకటో శతాబ్దంలో గ్రహచారాలు, దుష్టగ్రహాలు గురించి మాట్లాడేవాళ్ళు వున్నందుకు ఆశ్చర్యపడ్డాడు భాను... ఆ మాటల్ని వెంటనే ఖండించాలని అతనికి అనిపించింది.

అయితే ఈ సారి తొందరపడి మాట తూలలేదతను.... ముక్కుకు సూటిగా పోలేదు.

“దుష్టగ్రహం పీడించుకుతింటోదని ఖచ్చితంగా తెలిసిన తర్వాత చూస్తూ ఎందుకు వూరుకున్నారు? ఏదో ఒక విరుగుడు వేయకపోయారా?” అన్నం కలుపుకుని, ముద్దను నోటి దగ్గిర పెట్టుకోబోతూ అడిగాడు.

“విరుగుడు వేయటానికి అది సామాన్యమైన గ్రహం కాదు బాబూ ధన మదంతో కళ్ళు పొరలు క్రమ్మిన ధనిక గ్రహం... నోరు తెరిచి ఏమైనా అంటే మా కడుపులమీద కొడుతుంది... పనిలో నుంచి పీకేసి ముష్టి ఎత్తుకునేట్లు చేస్తోంది...” తల వంచుకుని తన పద్ధతిలో తను చెప్పుకుంటూ పోయాడు వృద్ధుడు.

గొంతులోకి పోయిన ముద్ద అంగిటికి అడ్డం పడిన అనుభూతి కలిగి పెద్దగా దగ్గుతూ నెత్తిమీద టపటపా చరుచుకున్నాడు భాను.

వృద్ధుడి మాటల్ని తప్పుగా అర్థం చేసుకునే అవకాశం యికలేదు.

"మిమ్మల్ని పీడించుకు తింటున్నది ఎవరు? దినేషేనా?" వృద్ధుడి మాదిరిగా చుట్టూ చూసి లోగొంతుకతో అడిగాడు.

"తనకు లొంగకపోతే నిలువ నీడ లేకుండా చేస్తామని యిప్పటికి చాలా రోజులనుంచీ పీడించుకు తింటున్నాడు. నిలువ నీడ లేకుండా చేయటమంటే మా ఉద్యోగాలకి ఎసరు పెడతాడేమోనని అనుకున్నాం గాని, ఇల్లు తగలబెట్టి యిలా చెట్ల క్రిందికి నెడతాడని అనుకోలేదు..." గద్గద స్వరంతో చెప్పాడు వృద్ధుడు.

"ఎస్టేట్‌లో ఇంతమంది వున్నారు కదా... వాళ్ళేమంటున్నారు? మేనేజర్ సాబ్‌కి చెప్పి ఏదో ఒకటి చేయమని అడగలేకపోయారా?" అని అడగబోతూ, ఆఖరి క్షణంలో ఆ మాటల్ని మ్రింగేశాడు భాను.

ధన మదంతో కళ్ళు పొరలు క్రమ్మిన దుష్ట ధనిక గ్రహానికి ఎదురు వెళ్ళే ధైర్యం ఎవరికి వుంటుంది? ఆఫ్టరాల్ ఒక కూలి మనిషి కోసం తన మనిషిని శిక్షిస్తాడా హరిహరవర్మ?

"మా బాధల్ని భగవంతుడికి చెప్పుకుంటూ, ఏదో ఒక విధంగా బతుకులు వెళ్ళదీయటం తప్ప మేము చేయగలిగింది ఏమీలేదు... అన్నం తిను బాబూ... ఇప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది" ఖాళీ అయిన మంచినీళ్ళ గ్లాసులో నీటిని పోస్తూ ఆర్ధ్రంగా అన్నాడు వృద్ధుడు.

ఆ పైన మరొక్కమాట కూడా మాట్లాడకుండా తినటం ముగించి చాప మీది నుంచి లేచాడు.

“మంచివాళ్ళను భగవంతుడు ఎప్పుడూ మంచిగానే చూస్తాడు తాతా.... అతని మీదే భారం వేసి నిర్భయంగా వుండు...” అని సానుభూతి మాటలు రెండుచెప్పి అక్కడినుంచి గారేజి దగ్గిరికి వచ్చేశాడు.

డిక్కీలో వున్న దుప్పటిని, చెక్కబల్ల మీద పరిచి పడుకోబోతుండగా వచ్చింది అతనికి అనుమానం.

ఇల్లు తగలబడిన సమయంలో ఆ చుట్టుపట్ల ఎక్కడా లేడు దినేష్. గీతికతో కలిసి కొండమల్లెల కోసం అడవి అంచులకు పోయాడు.

అతని తరుపున యింకెవరో ఆ పని చేశారు... ఎవరై వుంటారు వాళ్ళు??

ఎవరెవరూ ఆ ఎస్టేట్‌లో పనిచేస్తూ వుంటారో తెలియకపోవటం వల్ల ఆ ప్రశ్నకు సమాధానాన్ని వెతుక్కునే ప్రయత్నం చేయలేదతను. మెత్తగా వుండటం వల్ల బల్లమీద నిలవకుండా ప్రక్కకు జారిపోతున్న దుప్పటిని, తిరిగి నడుము క్రిందికి లాక్కుంటూ, లాక్కుంటూ నిద్రలోకి జారిపోయాడు తనకు తెలియకుండానే.

*          *          *          *          *

గ్లాసు మీద గ్లాసుగా నాలుగు గ్లాసుల సారాని పట్టించి బాబూలాల్, తూలుకుంటూ ఇంటికి చేరుకున్నట్లు కల వచ్చేసరికి నిద్రలోనే నొసలు విరిచాడు భాను.

సారా వాసన భరించటం అసాధ్యమై పోయేసరికి ఒక్కసారిగా వచ్చేసింది మెలకువ.

పీకల దాకా సారా పుచ్చుకుని అతని ముఖంలోకి తొంగి చూస్తున్నాడు ఒక వ్యక్తి.

"వీడెవడో గాని మంచి నిద్రలో వున్నాడు... మనకి అడ్డంరాడు..." అంటున్నాడు.

తనకు మెలకువ వచ్చిన విషయం అతనికి అవగతమవకుండా వెంటనే జాగ్రత్తలు తీసుకున్నాడు భాను. ఊపిరి బిగపట్టి అలాగే వుండిపోయాడు.

మరో పది క్షణాలపాటు అలాగే చూసి తూలుకుంటూ అవతలికి వెళ్ళిపోయాడు వ్యక్తి.

ఎలా వున్నావాడు అలాగే పడుకుని, తలను మాత్రం కొద్దిగా ప్రక్కకు తిప్పాడు భాను.

వెంటనే అతనికి కనిపించాడు గారేజీ ప్రక్కనే నీడల్లో నిలబడివున్న దినేష్.

"మా డాడీ ఇంకా నిద్రపోలేదు... గీతిక కూడా మెలుకువగానే వున్నది... నా కోసం ఎవరయినా వెతికితే అనవరసమైన గొడవలో చిక్కుకుంటాను....." అంటూ నిలబడిన చోటినుంచి కదిలి, గారేజీ వెనుకభాగంలోవున్న గార్డెన్ వైపు వెళ్ళాడతను.

తూలుకుంటూ అతన్ని అనుసరిస్తున్న వ్యక్తిని కూడా ఇంకోసారి చూసి, చల్లగా బల్లమీది నుంచి లేచాడు భాను. క్రిందికి జారిపోయిన దుప్పటిని భుజాల చుట్టూ కప్పుకుంటూ తను కూడా అటుకేసి వేశాడు అడుగులు.

ఎత్తుగా ఎదిగి వున్న ఒక పోకచెట్టు క్రింద కూర్చుని, తన దగ్గిర వున్న ఖరీదయిన విస్కీ బాటిల్‌ని ఓపెన్ చేశాడు దినేష్. నీళ్ళు కలపాల్సిన అవసరం లేనట్లు, బాటిల్‌ని ఎత్తి రెండు గుటకలు వేశాడు.

"చీకటి పడగానే నువ్వు వస్తావని, సీమ మందు పోయిస్తావని ఎదురు చూసి చూసి నాటు సారాతో కడుపు నింపుకున్నాను... నువ్వు చెప్పిన పనిని పూర్తి చేసేందుకు నా ప్రాణాల్ని పణంగా పెట్టి పని చేశాను. ఎవరైనా చూసివుంటే నా కాళ్ళు చేతులు కట్టేసి ఆ మంటల్లో పారేసేవాళ్ళు" అతని చేతిలో నుంచి ఆ బాటిల్‌ని అందుకుని తను కూడా రెండు గుటకలు వేస్తూ అన్నాడు అతన్ని అనుసరించిన వ్యక్తి.

"నన్ను చూడగానే ముఖం అదోలా పెట్టుకొని దూరంగా తప్పుకు పోయేది గీతిక. ఇప్పుడు ఎందుకనో పూసుకు పూసుకు తిరుగుతోంది... క్షణం కూడా వదిలి పెట్టకుండా వెంట వెంట వస్తోంది...." అతని చేతిలో నించి బాటిల్‌ని తీసుకుంటూ అన్నాడు దినేష్.

"నీ రొట్టె విరిగి నేతిలో పడే రోజులు వచ్చేశాయన్న మాట... పనిలో పనిగా ఏదో ఒక పొద చాటుకు తీసుకుపోయి లొంగతీసుకో... చక్కెర బొమ్మవంటి పిల్లతో పాటు, అంతూ పంతూ కనిపించని ఈ ఎస్టేట్ కూడా నీ

స్వంతం అయిపోయింది....” ముద్ద మాటలతో అతని అదృష్టాన్ని మెచ్చుకున్నాడతని ఫ్రెండ్.

“ఎస్టేట్ మన స్వంతం అవటం కష్టమనిపిస్తోంది... వారసుడికోసం ప్రకటన యిచ్చారు... ఎవడో ఒకడు వచ్చి కూర్చుంటాడు.....”

“వచ్చిన వాడిని తాపీగా కూర్చోనిస్తామా? అవతలికి పంపించటం కష్టమైన పనా??” పెద్దగా నవ్వుతూ అనబోయి, దినేష్ ఖంగారుగా చూసే సరికి గొంతు తగ్గించాడు అతని ఫ్రెండ్.

“ఆస్తిని గురించి తరువాత ఆలోచించుకుందాం గాని, ముందు గురువప్ప ఎమంటున్నాడో చెప్పు. ఇల్లు తగలబడిపోయినందుకు రాగాలు తీస్తున్నాడా?” అడిగాడు దినేష్.

“క్వార్టర్స్‌కి దూరంగా చెట్టుక్రింద గుడారం వేసుకున్నాడు... చీకటి పడేదాకా ఆ గుడారం ముందే ఏడ్చుకుంటూ కూర్చున్నాడు.... ఎక్కడికి పోలేదు... బహుశా మనవరాలికి కాపలా కాస్తున్నాడేమో!”

అతని ఫ్రెండ్ చెపుతున్న మాటల్ని బట్టి తనను పిలుచుకుపోయి అన్నం పెట్టిన వృద్ధుడి పేరు గురువప్ప అని అర్థం అయింది భానుకి. పెద్ద పెద్ద కళ్ళతో దిగులుగా చూసిన ఆ పిల్ల అతని మనవరాలని తెలిసింది.

ఎస్టేట్‌ని గురించి వాళ్ళు మాటలు ప్రారంభించేసరికి, తనకు తెలియని కొత్త విషయాలు ఏమైనా తెలుస్తాయన్న అభిప్రాయంతో అటెంటివ్‌గా వినటానికి సిద్దపడిన భానుకి, వాళ్ళు ఆ విషయాన్ని వదిలి గురువప్పని గురించి

మాట్లాడుకోవటం డిసప్పాయింట్‌మెంట్‌ని కలిగించినా, అవతలికి వెళ్ళిపోకుండా అలాగే నిలబడ్డాడు ఒక పొదచాటున.

సీసాలో వున్న విస్కీ మూడొంతులు పూర్తి అయ్యేసరికి అంతకు ముందు లేని హుషార్ అగుపించింది దినేష్ మాటల్లో.

"ఇంట్లో వున్న వాళ్ళందరూ ఈ పాటికి నిద్రలు పోయి వుంటారు గాని, ఒకసారి గురువప్ప టెంట్ దగ్గిరికి పోయి వద్దామా?" ఉన్నట్లుండి అడుగుతూ లేచి నిలబడ్డాడు.

"ముసలాడు అరిచి కేకలు పెడతాడేమో!" అతనితో పాటు తాను కూడా లేస్తూ సందేహంగా అన్నాడు అతని ఫ్రెండ్.

"ముందుగా పోయి నువ్వు వాడి గొంతు నొక్కేయ్... వెనుకనుంచి నేను ఆ పిల్లను పట్టుకుంటాను...." అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా తూలుకుంటూ గార్డెన్‌లో నుంచి బయటికి వచ్చాడు దినేష్.

అన్నెం పున్నెం ఎరుగని ఒక అమాయకురాలి మీద అత్యాచారం చేయటం, అన్నం తినటమంత తేలికైనపనిగా భావిస్తున్న ఆ యిద్దర్నీ చూసి, పట్టరాని కోపంతో పళ్ళు కొరికాడు భాను.

అప్పటికప్పుడు, అక్కడికక్కడ వాళ్ళ మీదికి జంప్ చేసి, ఎడాపెడా చెంపలు వాయించాలనే కోరిక కలిగింది గాని, ఆ తరువాత తను అక్కడ వుండటం అసాధ్యమని తెలియటం వల్ల ఆగిపోయాడు.

విస్కీ మత్తు తలకెక్కటం వల్ల, అతని ప్రక్కనుంచే అడుగులు వేసి కూడా అతని ప్రెజెన్స్‌ని గమనించలేకపోయారు దినేష్, అతని ఫ్రెండ్. అన్‌స్టెడీగా పడుతున్న వారి అడుగుల్ని చూసేసరికి భాను మనసులో ఫ్లాష్ అయింది ఒక ఆలోచన.

వారిని పాతిక గజాల దూరం పోనిచ్చి, తను కూడా గార్డెన్‌లో నుంచి బయటికి వచ్చాడతను. దూరదూరంగా నడిచి వారికంటే ముందుగా గురువప్ప గుడారాన్ని చేరుకున్నాడు.

గట్టిగా గాలివేస్తే ఎగిరిపోయేటట్లున్న దుప్పట్లను మధ్య మధ్యలో సరిచేసుకుంటూ నిద్రపోకుండా అలాగే కూర్చుని వున్నాడు గురువప్ప... సడన్‌గా ఎదుటికి వచ్చిన ఆకారాన్ని చూసి భయంతో బిగుసుకుపోయాడు.

"ఎందుకు ఏమిటనే ప్రశ్నలు వేయొద్దు. నీ మనవరాలిని తీసుకొని దూరంగా వెళ్ళిపో...." అంటూ అతని చేయి పట్టుకొని బలవంతంగా పైకి లేపాడు భాను.

ఎంత భయంతో బిగుసుకుపోయినా, వెంటనే తేరుకున్నాడు గురువప్ప.... లోపలికి పోయి మనవరాలిని నిద్రలేపాడు.

"వెళ్ళిపోండి... త్వరగా వెళ్ళిపోండి....." ఆత్రుత నిండిన కంఠంతో యింకోసారి హెచ్చరించాడు భాను.

గుడారం వెనుక ఉన్న దుప్పటిని ప్రక్కకు నెట్టి చీకట్లలోకి పరుగుతీశాడు గురువప్ప, మనవరాలిని వెంటబెట్టుకుని.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా గుడారంలోకి ప్రవేశించి ఒక ప్రక్కగా నిలబడ్డాడు భాను.

పది క్షణాల తరువాత ముందునుంచి ఎంటర్ అయినాడు దినేష్ ఫ్రెండ్, మోకాళ్ళ మీదికి వంగి, నేలమీద పరిచివున్న చాపల్ని చేతులతో తడమటం మొదలుపెట్టాడు.

అతని సిగ్నల్ కోసం ఎదురు చూడాలి దినేష్ లెక్కప్రకారం... తాగిన మైకంలో తొందరపాటు ఎక్కువై తనంతట తనే వచ్చేశాడతను లోపలికి.

"ఎక్కడ? గురవప్ప మనవరాలు ఎక్కడ?" అని అడుగుతూ తను కూడా తడమటం మొదలుపెట్టాడు చాపల్ని.

భుజంమీద ఉన్న దుప్పటిని చేపల వల మాదిరి విదిలించి స్నేహితులిద్దరి తలమీదా పడవేశాడు భాను. అదిరిపడి వాళ్ళు బయటికి వచ్చే ప్రయత్నం చేయబోయేటంతలో మీదపడి మర్ధన కార్యక్రమాన్ని ప్రారంభించాడు.

"చచ్చిపోయాను..... నేను చచ్చిపోయాను...." అని అరిచాడు దినేష్ ఫ్రెండ్.

ఆ శబ్దం వినవచ్చిన ప్రదేశాన్ని గుర్తుపెట్టుకొని పిడికిలితో బలంగా పొడిచాడు భాను.

అరుపుల్ని ఆపేశాడు ఆ వ్యక్తి... బాధను భరించటం అసాధ్యమైపోయింది కాబోలు చిన్నగా మూలగటం మొదలుపెట్టాడు.

అతన్ని ఆనుకొని అటు ఇటూ కదులుతున్న దినేష్ మీద కాన్‌సన్‌ట్రేట్ చేశాడు భాను. దెబ్బమీద దెబ్బగా పది దెబ్బలు కొట్టి వెనక్కి తగ్గాడు.

విస్కీ మత్తుకు ఆ దెబ్బలు కూడా తోడయ్యేసరికి తట్టుకోలేక స్పృహ కోల్పోయాడు కాబోలు, కదలకుండా వుండిపోయాడు దినేష్. స్పృహలోనే వున్నాడు గాని, కదిలే ప్రయత్నం చేయకుండా మూలగటమే జీవిత పరమావధిగా పెట్టుకున్నాడు అతని ఫ్రెండ్.

ముఖం మీద మరో పోటు పొడిచి, అతని నోటిని కూడా మూయించాడు భాను. భుజం మీదికి ఎత్తుకొని చకచకా అడుగులు వేస్తూ గారేజ్ దగ్గరికి తీసుకువచ్చాడు.

గారేజి వెనుక భాగంలో వుండే గార్డెన్‌కి కొంచెం అవతలగా కనిపిస్తూ వుంటుందొక పల్లపు ప్రదేశం. తనను ఎవరూ గమనించటం లేదని నిశ్చయం చేసుకొని, భుజంమీది బరువును అందులోకి దొర్లించాడు.

గుడారంలో ఉండిపోయిన దినేష్ కోసం వెనక్కి వెళ్ళేసరికి, సస్పెన్స్‌ని భరించటం అసాధ్యమైపోయింది కాబోలు, తనకు అక్కడికి వచ్చిన గురువప్ప కనిపించాడు.

కనులు తేలవేసి తుమ్మ మొద్దులా పడివున్న దుష్టగ్రహాన్ని చూసేసరికి సంతోషం కలిగింది గురువప్పకి. అంతకు మించిన ఆందోళన కూడా కలిగింది.

"ఈ నింద మా మీదకి వస్తుందేమో! మేమే కొట్టామని పంచాయితీ పెడతారేమో!!" భయం భయంగా చూస్తూ అన్నాడతను.

"పంచాయితీలు పెట్టే అవకాశాలు చాలా తక్కువ తాతా. పంచాయితీ పెడితే చీకటి వేళలో వాళ్లు మీ గుడారంలోకి వచ్చిన కారణాన్ని వప్పుకోవాలి.... అర్ధరాత్రుళ్ళు ఆడపిల్లల జోలికి వస్తే, ఎటువంటి వాడికయినా యిటువంటి అవస్థ తప్పదని అందరికీ తెలుసు. కథ అసలు అంతదాకా పోదు తాతా... తప్ప తాగి తలకు పోసుకున్న వీళ్ళకి జరిగిందేమిటో గుర్తు వుండదు" అంటూ దినేష్‌ని కూడా భుజం మీద వేసుకొని, పల్లపు ప్రదేశంలోకి పంపించాడు భాను.

వాళ్ళు ఖాళీ చేసిన విస్కీ బాటిల్‌ని వెతకటానికి మాత్రం రెండు గంటలకు పైగా కష్టపడవలసి వచ్చింది. గార్డెన్‌లో నుంచి గురువప్ప గుడారానికి బయలుదేరుతూ, దారి మధ్యలో దాన్ని వదిలేశారు వాళ్ళు.

అడుగు భాగంలో మిగిలివున్న కొద్దిపాటి ద్రవం వంక అసహ్యంగా చూస్తూ ఆ బాటిల్‌ను కూడా పల్లపు ప్రదేశంలో పడవేశాడు భాను.

అక్కడి నుంచి చేతులు దులుపుకుంటూ చెక్కబల్ల దగ్గిరికి వస్తుండగా గుర్తుకు వచ్చిందతనికి తన దుప్పటి గురువప్ప గుడారంలోనే వుండిపోయిన సంగతి.

వట్టిగా ఉండి పోలేదది... దినేష్ స్నేహితుడి ముక్కు ముఖం ఏకం చేసేటప్పుడు రక్తంతో మలినపడి మరీ ఉండిపోయింది.

గురువప్ప భయపడినట్లు మరునాడు ఉదయం పంచాయితీ ఏదైనా ప్రారంభం కావటం అంటూ జరిగితే, తన ఇన్‌వాల్వ్‌మెంట్‌ని గురించి అందరికీ తెలియటానికి ఆ ఒక్క ఆధారం చాలు.

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకొని మరోసారి గురువప్ప గుడారం వైపు లెఫ్ట్ రైట్ మొదలు పెట్టాడు భాను. పది అడుగుల దూరం కూడా పోకముందే ఎదురుగా వస్తూ అగుపించింది ఒక ఆకారం.

అదిరిపడి ఎక్కడివాడక్కడ ఆగిపోయాడతను. వెనుతిరిగి చెక్కబల్ల దగ్గిరికి జంప్ చేసే వ్యవధి లేకపోవటం వల్ల, అలాగే చూస్తూ వుండిపోయాడు.

"మీరు గమనించకపోయినా, మా తాత గమనించి నాతో చెప్పాడు. శుభ్రంగా ఉతికి గాలిలో కాసేపు ఎత్తి పట్టుకోగానే తడి ఆరిపోయి చక్కగా తయారైంది. నెత్తుటి మరకలు కనిపించటం లేదు...." దగ్గిరికి వచ్చి. తగ్గు స్వరంతో అంటూ, తను తీసుకువచ్చిన దుప్పటిని అందించింది గురువప్ప మనవరాలు.

ఆ పిల్లను గుర్తుపట్టలేక తను పడిన ఖంగారును తలచుకొని నవ్వుకుంటూ చెక్కబల్ల మీద పడవేశాడు భాను ఆ దుప్పటిని. "చీకటిలో అక్కడి నుంచి యిక్కడకు రావటానికి నీకు భయం అనిపించలేదా?" అని అడిగాడు.

"భగవంతుడి వంటి మీరు ఈ చుట్టుపక్కల వుండగా భయం దేనికి?" అన్నది ఆ పిల్ల. వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయింది అక్కడ నుంచి.

నిద్ర సరిగ్గా పట్టలేదు భానుకి. కొత్త కొత్త బిరుదులు సంపాదించుకోవటం వల్ల సుఖాల కంటే, కష్టాలే అధికం అవుతాయన్న భయంతో కలత నిద్దుర మాత్రమే పోయాడు. తిరిగి లేచేసరికి తెల్లబడి వుంది తూర్పు దిక్కు. అరుపులతో , కేకలతో, అల్లకల్లోలంగా వుంది ఎస్టేట్ హెడ్ క్వార్టర్.

## 15

“తప్పతాగి గోతిలో పడిపోయాడు దినేష్ బాబు... అతని దగ్గిర డ్రయివర్‌గా పనిచేసే అయ్యనార్ ముక్కుముఖం ఏకం అయిపోయాయి” అడగకుండానే చెక్కబల్ల దగ్గిరికి వచ్చి, జరిగిందేమిటో భానుకు చెప్పాడు భవనంలో పనిచేసే మధ్యవయస్కుడు ఒకతను.

“వాళ్ళు తప్ప తాగారని నీకెలా తెలుసు?” దుప్పటిని మడతపెట్టి కారు డిక్కీలో భద్రపరుచుకుంటూ, అమాయకంగా అడిగాడు భాను.

“దగ్గిరికి పోతే చాలు ముక్కులు బద్దలైపోతున్నాయి... హరిహరవర్మగారు తనకోసం సీమ నంచి తెప్పించుకున్న విస్కీ సీసా వాళ్ళతో పాటు గోతిలో పడివుంది.” అని చెప్పి అవతలికి వెళ్ళిపోయాడా సర్వెంట్.

గురువప్ప భయపడినట్లు పంచాయితీ ప్రారంభం అయ్యే అవకాశాలు యిక లేవని గ్రహించి, హుషారుగా తన కార్యక్రమాలు పూర్తి చేసుకున్నాడు భాను. కారును శుభ్రంగా తుడిచాడు.... క్రితం రోజు బెంగుళూరు తీసుకుపోయిన జీప్‌ని కూడా క్లీన్ చేసి, ఫర్దర్ ఆర్డర్ కోసం వెయిటింగ్ ప్రారంభించాడు.

పది గంటల సమయంలో కబురు పంపి అతన్ని పిలిపించాడు లాయర్ సాబ్.

“ఈ రోజు నీకు పనేమీ లేదు.... మనం ఇంకో నాలుగైదు రోజులు యిక్కడే వుండాలి... బాగా రెస్ట్ తీసుకో....” అని చెపుతూ వెళ్ళిపొమ్మని సైగ చేశాడు.

ఆయన ప్రక్కనే కూర్చొని వున్న హరిహరవర్మ తనకేసి గుర్రుగా చూస్తూ వుండటాన్ని గమనించి, త్వరత్వరగా బయటికి వచ్చేశాడు భాను. చేసేందుకు పని ఏమీ లేకపోవటంతో, తాపీగా అడుగులు వేస్తూ, దూరంలో అగుపించిన చిన్న కొండగుట్ట వైపు బయలుదేరాడు.

రేకులతో నిర్మించబడిన షెడ్ వంటి కట్టడం ఒకటి వుంది ఆ గుట్ట మీద. అక్కడ కూర్చుని ఆ చుట్టుపట్ల వుండే టీ తోటల్లోని పనుల్ని సూపర్వైజ్ చేస్తున్నాడు ఎస్టేట్ సూపర్వైజర్లలో ఒకతను.

లాయర్ గారి డ్రయివర్ అని తెలుసు కాబోలు దగ్గిరికి పిలిచి మర్యాద చేశాడతను. తన ప్రక్కనే వున్న ఫ్లాస్కులో నుంచి వేడి వేడి టీని కప్పుల్లో పోసి చేతికి యిచ్చాడు.

"ఈ గుట్ట దాటిన దగ్గిర్నుంచీ అడవి ప్రారంభం అవుతుంది. పాములు, తేళ్ళే కాకుండా, ఎలుగుబంట్లు, ఏనుగులు కూడా వుంటాయి. తోడు లేకుండా వెళితే దారి తెలియక తప్పిపోవచ్చు... అటుకేసి వెళ్ళకు" అని సలహా కూడా యిచ్చాడు.

అడవికి వెళ్ళి అనవసరమైన కష్టాల్ని కొని తెచ్చుకునే ఆలోచన భానుకి లేదు. ఒక అరగంట అక్కడే గడిపి, ఆకలి మంటలు యిబ్బంది పెట్టడం ప్రారంభించగానే వెనక్కి బయలుదేరాడు.

"జాగ్రత్తగా వెళ్ళు... అజాగ్రత్తగా వున్నావంటే దారి తప్పి అడవిలోకి వెళ్ళిపోతావ్" వెనుక నుంచి పెద్దగా అరిచి జాగ్రత్తలు చెప్పాడు సూపర్వైజర్.

రేకుల షెడ్‌కి దగ్గర్లో వున్న టీ పొదల్లో పనిచేస్తున్న ఆడవాళ్ళు కొందరు ఆ మాటల్ని విని కిసుక్కున నవ్వేసరికి, సిగ్గుతో ముడుచుకుపోతూ గబగబా గుట్ట దిగాడు భాను.

అదే పనిగా జీపులు తిరగటం వల్ల బాగా నలిగిపోయి కనిపిస్తున్న ఆ మార్గంలో... దారి తప్పటం అనే మాటకు అర్థం లేదని అనుకుంటూ అడుగులు వేశాడతను.

అరగంట గడిచింది... గంట గడిచింది.... సూర్యుడు నడినెత్తి మీదకి వచ్చేసిన తర్వాత హెడ్‌క్వార్టర్స్ ఎదురు పడకపోవటంతో గుండెల్లో రాయి పడినట్లయింది.

ముందుకు పోయే ఆలోచనను విరమించేసుకొని, దగ్గిర్లో కనిపించిన ఒక బండరాయిమీదికి ఎక్కాడతను.

ఎటు చూసినా ఒకే మాదిరి కనిపిస్తున్నది సీనరీ... తను వదిలి వచ్చిన కొండగుట్ట గాని, తను చేరవలసిన ప్రదేశం గాని ఆ చుట్టు పట్ల ఎక్కడా కనిపించడం లేదు.

కొండ గుట్టమీది సూపర్‌వైజర్ హెచ్చరించినట్లే, తను దారి తప్పటం జరిగిందని గ్రహించేసరికి అతన్ని ఆవరించుకున్నది విపరీతమైన నీరసం.

గారేజి దగ్గిర చెక్కబల్ల మీద పడుకుని హాయిగా విశ్రాంతి తీసుకోకుండా, పోటుగాడి మాదిరి సైట్ సీయింగ్‌లకు బయలుదేరిన తన తెలివితక్కువతనాన్ని

నిందించుకుంటూ ఒండమీది నుంచి క్రిందికి దిగి, వచ్చిన దారినే వెనక్కి నడిచాడతను.

అరగంట కూడా పూర్తిగా గడవకముందే మార్పు చెందటం ప్రారంభించింది రోడ్డున రెండు పక్కలా వున్న సీనరీ... నడుం ఎత్తున వుండే పొద స్థానంలో నిలువెత్తున వుండే పుట్టలు కనిపించటం మొదలుపెట్టాయి.

మరో అరగంట గడిచేసరికి అతన్ని పూర్తిగా చుట్టుముట్టింది దట్టమైన అడవి.

* * * * *

కంటికి కనిపించనంత ఎత్తుగా వున్న ఒక చెట్టు క్రింద కూర్చుంటూ తన పొజిషన్ అంచనా వేసుకున్నాడు భాను.

నడినెత్తి మీద వున్న సూర్యుడు పడమటి దిశకు మరలి చాలా సేపయింది. ఇంకో గంటలోనో, రెండు గంటల్లోనో పడిపోతుంది చీకటి. వెలుతురు వున్న సమయంలోనే దారి వెతుక్కోలేని తను – చేయగలిగింది ఏమీ వుండదు చీకటి పడిన తర్వాత.

సూపర్‌వైజర్ చెప్పిన పాములు, తేళ్ళు ఎలుగుబంట్లు, ఏనుగులు మొదలైన అరణ్యజీవులన్నీ కనుల ముందు మెదిలి, వేపాకులు నమిలినట్లు చేదుగా తయారైంది అతని నోరు.

కదలకుండా కూర్చుని తన అజ్ఞానానికి అలమటించుకోవటం కంటే, కంటి ఎదుట కనిపించిన దారిని అనుసరించి అడుగులు వేస్తూ వుండటమే మంచిదనిపించి, చెట్టు క్రింద నుంచి లేచాడతను.

మెల్లమెల్లగా ప్రారంభమై తారాస్థాయిని చేరుకోబోతున్న దాహపు బాధను బలవంతంగా అణుచుకుంటూ ముందుకే నడిచాడు. మరో అరగంట గడిచిన తర్వాత ఉన్నట్లుండి దారికి అడ్డుగా ప్రత్యక్షమైన నీటి వాలును చూసి పరవశించిపోయాడు.

స్వచ్ఛంగా, ఎంతో చల్లగా వున్న ఆ నీటిలో అడుగుపెట్టేసరికి, అంతం అయిపోయినట్లనిపించింది వంటిని ఆవరించుకొని వున్న నీరసం, గొంతు తడుపుకునేసరికి మటుమాయమైపోయింది దాహం.

దాహం తీర్చుకున్న తరువాత బయటికి రాకుండా దోసిళ్ళతో ఎత్తి నెత్తి మీద పోసుకున్నాడు ఆ నీటిని... చల్లదనంలోని సుఖాన్ని అనుభవిస్తూ వుండగా అతని నాసికా రంధ్రాలకు సోకిందా వాసన.

మామూలు వాసన కాదది. లక్షో, రెండు లక్షలో అగరుపుల్లల్ని ఒకే చోట పెట్టి ఒకేసారి వెలిగించినట్లు, సుగంధపూరిత సుమధుర పరిమళం.

అడవుల్లో అటువంటి వాసనలు వచ్చిన చోట ప్రమాదకరమైన పాములు వుంటాయని చిన్నతనంలో విన్న కథల్ని గుర్తుకు తెచ్చుకున్న తరువాత కూడా వదిలిపోలేదు అతనిలో ఆరంభమైన కుతూహలం.

నీటి జాలు ఒడ్డునే అడుగులు వేస్తూ ఆ పరిమళం వీస్తున్న దిశకు బయలుదేరాడతను. పది నిముషాల తరువాత చిన్న సైజు ఖాళీ స్థలం ముందు ఆగాడు.

అంతకు ముందు కొద్ది రోజుల క్రితమే తవ్వి పోసినట్లు పచ్చి పచ్చిగా కనిపిస్తున్నాయి ఆ స్థలంలోని మట్టిపెళ్ళలు, బరువైన వస్తువేదో వాటి క్రింద దాచబడినట్లు గోచరిస్తున్నాయి కొన్ని జాడలు.

అది తనకు సంబంధించిన పని కాదని అతనికి తెలుసు..... అదేమిటో తెలుసుకోవాల్సిన అవసరం తనకు లేదని కూడా తెలుసు. అయినా సరే ఖాళీ స్థలంలోకి పోయి నాలుగు మట్టిపెళ్ళల్ని ప్రక్కకి లాగాడు.

తళతళమని మెరుస్తూ అతనికి ఆగుపించాయి కొన్ని తెల్లటి దుంగలు.

అవేమిటో అర్థం చేసుకొనేసరికి మతిపోయినంత పని అయిందతనికి.

దంతాలు! ఏనుగుల్ని వధించి, వాటి దగ్గిర్నుంచి బలవంతంగా సేకరించిన వైట్ గోల్డ్!!

వాటిని సంపాదించటం కోసం ఎన్ని అమాయక ప్రాణాల్ని బలి తీసుకోవటం జరిగిందో అంచనా వేయటానికి ప్రయత్నిస్తూ ప్రక్కకు లాగిన మట్టిపెళ్ళల్ని యధాస్థానంలోకి చేర్చాడు భాను.

అలా చేస్తుండగా అతనికి అర్థమైంది మరో విషయం.

బంగారం మాదిరిగా ఖరీదు కలవే ఏనుగు దంతాలు. చూపులకు సుందరంగా కనిపిస్తాయే తప్ప, సుగంధ వీచికల్ని విరజిమ్మవు.

మరి, అగరుపుల్లల మాదిరి ఆ ప్రదేశాన్నంతా హోరెత్తించేస్తున్న సుమధుర పరిమళం ఎక్కడి నుంచి వస్తోంది?

ఎక్కడినుంచి వస్తోందో అని తెలుసుకోవటానికి ఏమంత కష్టపడాల్సిన అవసరం లేకపోయింది. ఏనుగు దంతాలు పాతిపెట్టి వున్న ప్రదేశానికి పది అడుగుల దూరంలోనే మట్టిపెళ్ళల క్రింద అతనికి అగుపించాయి అక్రమంగా నిలువ చేసిన గంధపు దుంగలు.

తనను అటుకేసి ఆకర్షించిన సుగంధం వాటినుంచే వస్తున్నదని గ్రహించిన మరుక్షణం, ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టటానికి రెడీ అయినాడు భాను.

చట్టానికి వ్యతిరేకంగా, ప్రభుత్వం కళ్ళు కప్పి పరాయి ప్రదేశాలకు పంపించే నిమిత్తం అక్కడ స్టాక్ చేయబడింది విలువయిన ఆ ఆరణ్య సంపద. ఆ చుట్టుపట్లే సంచరిస్తూ వుంటారు ఆ పని చేసిన వాళ్ళు. కొత్త మనిషి ఎవరైనా ఆ ప్రదేశంలోకి వస్తే, తమ గుట్టురట్టు అవుతుందన్న భయంతో మట్టుబెట్టటానికి ట్రై చేయవచ్చు.

సాధ్యమైనంత త్వరగా అవతలికి వెళ్ళిపోవాలన్న తొందరలో, కాలుజారి నీటి జాలులో పడిపోయాడు భాను. లేచి నిలబడి పైకి రాబోతుండగా, అతను భయపడినంతగా జరగనే జరిగింది.

ఏ చెట్టు మొదట్లో కునికిపాట్లు పడుతున్నారో గాని, అతను నీటి జాలులో పడినప్పుడు అయిన శబ్దాన్ని ఆలకించి, అటుగా పరుగెత్తుకు వచ్చారు ఇద్దరు వ్యక్తులు.

“ఎవరది? ఎవక్కడ??” అని ప్రశ్నిస్తూ వెతుకులాట ప్రారంభించాడు.

వారి హస్తాల్లో వున్న రవ్వలబారు తుపాకీలను గమనించేసరికి మరోసారి దాహం వేస్తున్నట్లు ఎండుకుపోయింది భాను గొంతు. రెండే రెండు అంగల్లో నీటి జాలును దాటి, ప్రక్కనే వున్న పొదలచాటుకు పరుగుతీశాడు అతడు.

అతన్ని ప్రత్యక్షంగా చూడకపోయినా, ఆ కదిలికను కనిపెట్టి యింకా పెద్దగా అరుస్తూ అటుకేసి వచ్చారు ఆ వ్యక్తులు.

ప్రాణాలన్నీ పాదాల్లోకి తెచ్చుకొని పరుగులు పెట్టాడు భాను. ఆయాసం అధికమై, పాదాలు కదలమని మోరాయించబోతున్న తరుణంలో, పెద్ద పల్లపు ప్రదేశం ఒకటి అతని కంటపడింది. అందులో పెరిగి వున్న పొదల చాటుకు చేరి ముడుచుకు కూర్చున్నాడు.

తరుముకు వస్తున్న వ్యక్తులు తనను గమనించలేదనీ, వాళ్ళు పల్లపు ప్రదేశాన్ని దాటి అవతలకు పోయిన మరుక్షణం, ఇంకో ప్రక్కకు పరగుతీయవచ్చునీ అతని ఉద్దేశ్యం.

నెరవేరలేదు ఆ ఉద్దేశ్యం. అతను అనుకున్నట్లు పల్లపు ప్రదేశం దగ్గరికి వాళ్ళు రావటమైతే జరగింది గానీ, అవతలికి పోవటం మాత్రం జరగలేదు.

అడవి జంతువులు అలకించినట్లు చెవులు రిక్కించి, తలను ఓరగా పెట్టి ఆ చుట్టు పట్ల వినవస్తున్న శబ్దాల్ని విన్నాడు ఒక వ్యక్తి.

"వాడు ఈ చుట్టుపట్లే ఎక్కడో దాక్కున్నాడు. దూరంగా పోలేదు" ఉన్నట్లుండి ఎనౌన్స్ చేస్తూ రెండో వ్యక్తి వైపు చూశాడతను.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఫాంటు జేబులో నుంచి విజిల్ వంటి సాధనాన్ని తీసి చెవులు చిల్లులు పడిపోయేటట్లు పెద్దగా ఊదాడా రెండో వ్యక్తి.

అడ్డువచ్చిన పొదల్ని విరగదొక్కుకుంటూ అక్కడికి వచ్చేశారు పాతికమందికి పైగా వున్న స్త్రీ, పురుషులు. అతని ముందు నిలబడి ప్రశ్నార్థకంగా చూశాడు.

"మమ్మల్ని తప్పించుకొని ఇటుగా పారిపోయి వచ్చాడు ఒక దొంగరాస్కెల్... పొదలన్నీ గాలించి వాడిని బయటకు లాగండి" కర్కశంగా ధ్వనిస్తున్న కంఠంతో ఆర్డర్ ఇచ్చాడా వ్యక్తి.

జట్లు జట్లుగా విడిపోయి, పల్లపు ప్రదేశం చుట్టూ వున్న పొదల్ని వెతకటం మొదలు పెడుతున్న ఆ జనాన్ని గమనించేసరికి జ్వరం వచ్చినంత పని అయింది భానుకి.

నిలుచున్న పళాన మనిషిని మాయంచేసి, కోరుకున్న ప్రదేశానికి క్షణంలో తీసుకెళ్ళగల మంత్రం ఏదైనా తనకు తెలిసి వుంటే బాగుండి వుండేదనిపించింది.

మంత్రాలు రావు కాబట్టి, భగవంతుడి మీద భారం వేయటం తప్ప చేయగలిగింది ఏమీ లేదని, మరింతంగా ముడుచుకు కూర్చుంటుండగా, అతని భుజం మీద పడింది ఒక గాజుల చేయి.

భయంకరమైన పాము ఏదో మీదపడినట్లు కంపించిపోయాడు భాను. తల తిప్పి చూడబోతుండగా, "సద్దు చేయకుండా కూర్చోండి... ఏమాత్రం శబ్దం

అయినా ప్రాణాలు పోతాయి....'' వినబడీ వినబడనట్లు హెచ్చరించింది ఒక మృదుస్వరం.

గుండెల్లో గూడుకట్టుకుని వున్న టెన్షన్ ఒక్కసారిగా తొలగిపోయే సరికి, జ్వరం తగ్గిన మనిషికి చెమటలు క్రమ్మినట్లు స్వేదజలంతో తడిసిపోయింది భాను శరీరం. ఆ చేయి ఎవరిదో, ఆ మాటలెవరివో తెలుసుకోవాలని కోరికను బిగపట్టుకుని, అలాగే కూర్చుండిపోయాడతను.

''ఈ గోతిలో ఎవరూ లేరు... ఇందులో దిగటం వృధా ప్రయాస'' పల్లపు ప్రదేశం అంచు మీద నిలబడిన ఎవరినో హెచ్చరిస్తూ, అతని భుజాన్ని మరోసారి తట్టి, అవతలికి వెళ్ళిపోయింది అతని వెనుక నిలబడిన స్త్రీ.

క్షణమొక యుగంగా గడుపుతూ, వంచిన తల ఎత్తకుండా కూర్చున్న భాను దగ్గిరికి నిశ్శబ్దంగా అడుగులు వేస్తూ వచ్చాడు ఒక మనిషి – పది నిముషాల తరువాత.

''పొదలన్నింటినీ విరగగొడుతూ దూరంగా వెళ్ళిపోయారు అందరూ. త్వరగా బయటకు రావాలి నువ్వు....'' అని హెచ్చరిస్తూ, చేయి పట్టుకుని పైకి లేపాడు.

అంతకు ముందు వచ్చిన స్త్రీ ఎవరో, ఇప్పుడు వచ్చిన ఇతనెవరో తెలియక అయోమయంగా అతని ముఖంలోకి చూసి, ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయాడు భాను.

ఎవరో కాదతను... గత రాత్రి తిండి తిప్పలు లేకుండా చెక్కబల్లమీద కూర్చుని తత్వాలు పాడుకుంటున్న తనకు అన్నం పెట్టి ఆదరించిన గురువప్ప!

"ఈ ప్రక్కనే వున్న చెట్లను నరికి లారీల మీదికి ఎత్తుతున్నాం మేము. నువ్విక్కడికి రావటం నా బిడ్డ కంటపడింది. ఇంకెవరైనా ఈ గోతిలోకి దిగితే నువ్వు పట్టుబడిపోతావని, తనే దిగి నిన్ను హెచ్చరించింది. చీకటి పడకముందే నువ్వు యిక్కడ నుంచి బయటపడాలి. చీకటి పడిన తరువాత ఒక్క అడుగు కూడా అవతలికి వేయలేవు....." అంటూ అతని చేయి అలాగే పట్టుకుని పైకి తీసుకుపోయాడు గురువప్ప.

తన మనసులో మెదులుతున్న ఎన్నో ప్రశ్నలను బయటపెట్టి, సమాధానాలు పొందాలని అనిపించినా, అందుకు అది సరియైన సమయం కాదని గ్రహించి మిన్నకుండిపోయాడు భాను.

నాలుగే నాలుగు నిముషాల పాటు నడిపించి, నాలుగు అడుగులు మాత్రమే వెడల్పు వుండే కాలిబాట నొకదాన్ని అతనికి చూపించాడు గురువప్ప.

ఏదో చెప్పబోతుండగా అటుకేసి దూసుకొచ్చిందొక జీప్.

ప్రమాదం ముంచుకు వచ్చిందని గ్రహించి, నిలుచున్న పళాన ఒక పొదచాటుకు డైవ్ చేసి ముడుచుకు కూర్చున్నాడు భాను.

అదృష్టవశాత్తు అది గమనించలేదు జీప్‌లో వున్న వ్యక్తి.

"ఏం చేస్తున్నావిక్కడ? పని ఎగొట్టి పచార్లు చేస్తున్నావా?" గురువప్ప ముఖంలోకి క్రూరంగా చూస్తూ కరుకు కంఠంతో ప్రశ్నించాడు.

ఆ కంఠం ఎవరిదో గుర్తుపట్టి ఆశ్చర్యంగా చూశాడు భాను.

తగిలిన దెబ్బలనుంచి త్వరగా కోలుకున్నాడు లాయర్ సాబ్ పుత్రరత్నం దినేష్ బాబు. పెదవులు వాచి భయంకరంగా తయారైనా, కుడికున్ను మూసుకుపోయినా లెక్కచేయకుండా అటవీ సంచారానికి వచ్చాడు.

"నరికిన చెట్లను లారీల మీదికి ఎత్తుతుండగా విజిల్ వేసి పిలిచారు సూపర్‌వైజర్లు" వినయంగా నిలబడి తను అక్కడ ఎందుకున్నాడో అతనికి తెలియచెప్పటం మొదలుపెట్టాడు గురువప్ప.

"నీటి జాలు దగ్గర్నుంచి ఇటుగా పారిపోయి వచ్చాడట ఒక దొంగ... అతన్ని వెతికి పట్టుకొమ్మని మాకు ఆదేశాలియ్యబడ్డాయి...."

ఆ మాటల్ని వినేసరికి పట్టరాని కోపంతో మరింత వికృతంగా మారిపోయింది దినేష్ ముఖం. "చెప్పిన పని చెప్పినట్లుగా చేయకుండా కబుర్లతో కాలం గడపటం మీకందరికీ బాగా అలవాటైపోయింది ఈ మధ్య. వచ్చిన వాడెవడో వెంటనే పట్టుబడకపోతే కొరడాలతో కొట్టిస్తాను మిమ్మల్నందరినీ. మంటల్లో నిలబెట్టి మాడ్చి మసి చేస్తాను" అని నోటికి వచ్చిన మాటలో తీవ్రంగా నిందిస్తూ జీప్‌ని ముందుకు దూకించాడు.

దృష్టిపథం నుంచి అతను దూరమవ్వగానే చిటికె వేసి భానుని పిలిచాడు గురువప్ప. "ఈ కాలిబాట వెంబడి సూటిగా పోయవంటే ఎస్టేట్ ప్రక్కనే వుండే చాముండేశ్వరీ ఆలయం కనిపిస్తుంది. హెడ్ క్వార్టర్స్ అక్కడికి అరమైలు

దూరంలోనే వుంటుంది వెంటనే వెళ్ళిపో....'' అని హెచ్చరిస్తూ వెనక్కి పరుగు తీశాడు.

తను కూడా పరుగు ప్రారంభించాడు భాను.... పరుగు పందెంలో పాల్గొంటున్నట్లుగా వేగంగా ప్రయాణం చేశాడు.

సూర్యుడు పడమటి దిశలో మరుగు పడిపోతున్న సమయానికి ఎదుట ప్రత్యక్షం అయింది గురువప్ప చెప్పిన చాముండేశ్వరీ ఆలయం.

ఆయాసం అణిగిపోయేదాకా పొదలచాటునే కాలక్షేపం చేశాడతను. ఆ తరువాత ఆలయం వెనుక భాగంలో వున్న కోనేటిలో స్నానం చేశాడు. అడవిలోకి వెళ్ళి వచ్చిన చిహ్నాలు తన వంటి మీద గాని, తను దుస్తుల మీద గాని కనిపించకుండా జాగ్రత్తలు తీసుకొని, ఆలయం ముందుకు వచ్చేసరికి, ఇద్దరు సర్వెంట్స్‌ని వెంటబెట్టకుని, అక్కడ సాక్షాత్కరించింది గీతిక.

## 16

"...పొద్దుటి నుంచి కనిపించకపోతే ఇంటి మీద బెంగ పుట్టి వెనక్కి పారిపోయావని అనుకుంటున్నాను, ఇక్కడ వున్నావా?'' అతన్ని చూడగానే చిన్నగా నవ్వుతూ అన్నది గీతిక.

అడగకూడని ప్రశ్నలు అడిగి తనను యిరకాటంలో పడవేస్తుందని భయపడిన భానుకు ప్రపంచమంతా కాంతివంతమైనట్లు అనిపించింది ఆ మాటల్ని వినేసరికి.

"గారేజి దగ్గిర కూర్చుంటే ఏమీ తోచలేదు... అటూ ఇటూ తిరిగి యిక్కడ తిష్టవేశాను... సంధ్యా సమయంలో యిక్కడ పూజ చేయటానికి ఎవరైనా వస్తారేమోనని ఎదురు చూస్తున్నాను....." ఆమెతో పాటు ఆలయంలోకి అడుగు పెడుతూ అన్నాడు.

"సూర్యప్రసాద్ గారు బ్రతికి వున్నంతవరకూ ముప్పొద్దులా వచ్చి పూజ చేస్తూ వుండేవాడు ఒక పూజారి. ఇప్పుడు ఎందుకని రావటం లేదో నాకు తెలియదు..." అంటూ తనతో వచ్చిన సర్వెంట్స్‌కి సైగ చేసి, తను వెంట తెచ్చిన పూజా సామాగ్రి అలంకరించింది గీతిక.

గర్భగుడిలో దీపం వెలిగించి తామే పూజ చేశారు ఆ సర్వెంట్స్. గీతిక తెచ్చిన టెంకాయను కొట్టి, ప్రసాదం పెట్టారు.

ఆ రోజు ఉదయం కొండగుట్ట మీద సూపర్‌వైజర్ యిచ్చిన టీ నీళ్ళు తప్ప ఆహారాన్ని పోలిన పదార్థమేదీ భాను గొంతులో పడలేదు. వద్దు వద్దుని అనుకుంటునే ఆత్రంగా ఆరగించేశాడు ప్రసాదాన్ని. గీతిక తనవంక విచిత్రంగా చూసేసరికి, "ప్రసాదం చాలా రుచిగా వుంది...." అన్నాడు తను చేసిన పనిలో తప్పు ఎంచే అవకాశం యివ్వకుండా వుండటానికి.

"దేవుడి ప్రసాదానికి రుచులు ఎంచకూడదు, తప్పు...." అంటూ ఆలయం నుంచి బయలుదేరింది గీతిక... అతను కూడా వచ్చేదాకా ప్రాకారం బయట నిలబడింది.

మరికొద్దిసేపు అక్కడే వంటరిగా గడపాలని అనిపించింది భానుకి. గర్భగుడి ముందున్న మంటపంలోని చలువరాళ్ళ మీద పడుకొని, తన మనస్సును తొలిచేస్తున్న అనుమానాలకు, ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోవాలని కూడా కోరిక కల్గింది.

అడవిలోకి వెళ్ళి వచ్చిన సంగతి తెలియకుండా వుండేందుకు, ఉదయం నుంచీ అక్కడే గడుపుతున్నట్లుగా అంతకు ముందు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చేసరికి, హడావుడిగా కదిలి గీతికను కలుసుకున్నాడతను.

"పొద్దుటి నుంచి కూర్చున్నది చాలదా? ఇంకెంతసేపు కూర్చుంటే నీ తనివి తీరుతుంది?" అని సతాయింపు మొదలు పెడితే తట్టుకోవటం కష్టం కదా.

ఎస్టేటు నుంచి కాలి నడకనే వచ్చింది గీతిక... కారు గాని, జీప్‌ని గాని తీసుకురాలేదు.

"ఇక్కడకి ఎప్పుడు వచ్చినా నడుచుకుంటూ రావడమే నాకు బాగుంటుంది. ఎందుకనో కారు మీద రావాలనిపించదు...." వంకర టింకర్లుగా పోతున్న ఒక ఘాట్ రోడ్డు మీదకి మరలుతూ తన అలవాటును గురించి అతనికి చెప్పింది ఆమె.

మౌనంగా అడుగులు వేస్తున్న భానుకు మరో పది నిముషాలు గడిచిన తర్వాత గాని ఆమెకు ఆ అలవాటు ఎందుకు ఏర్పడిందో అర్థం కాలేదు.

పౌర్ణమి తిథి గడిచిపోయింది కాబోలు, చీకటి పడిన తర్వాత కాస్తంత ఆలస్యంగా ఆకాశంలో ప్రత్యక్షం అవుతున్నాడు చంద్రుడు.

వెన్నెల వెలుగులు పడి దేవమందారపు చెట్ల మాదిరి మిలమిల మెరిసిపోతున్నాయి ఘాట్ రోడ్డుకు రెండువైపులా పెరిగి వున్న ముళ్ళ పొదలు. ఎక్కడో ఏవో అడవి పూలు అప్పుడే విచ్చుకుంటున్నాయి కాబోలు. ఖరీదయిన అత్తరు అక్కడెక్కడో కుమ్మరించబడినట్లు తెరలు తెరలుగా సోకుతోందొక సుమధుర పరిమళం.... అలుపు ఆయాసాల గురించి తెలియకుండా వుండేందుకు వింజామరతో విసురుతున్నట్లు, ఆగి ఆగి వీస్తున్నాయి పిల్ల తెమ్మెరలు......

ఎటువంటి మొరటు మనిషినైనా సరే అతి తేలికగా ఆకట్టు కోగల ప్రదేశం అది..... కారులో కాకుండా కాలినడకన రావాలని గీతిక కోరుకోవడంలో వింత ఏముంది?

"సూర్యప్రసాద్ గారు యాక్సిడెంట్‌లో మరణించిన ప్రదేశం ఇదే." ఉన్నట్లుండి ఒక ప్రదేశంలో ఆగి గీతిక కామెంట్ చేయటంతో, ఊహా లోకంలో నుండి ఊడి క్రింద పడ్డాడు భాను.

"ఒక రోజు సాయం సమయంలో గుడికి వస్తుండగా కంట్రోల్ తప్పి ప్రక్కకు పరిగెత్తిందట కారు.... పల్టీలు కొడుతూ పడిపోయిందట....." అంతూ పొంతూ అగుపించని పెద్ద ఆగాధాన్ని చూపిస్తూ చెప్పింది గీతిక.

ఆమెతో పాటు వచ్చిన సర్వెంట్స్ దగ్గిర టార్చ్ లైట్లు వుండటాన్ని చూసి, ఒక లైటును తీసుకొని ఆ ఆగాధంలోకి ఫోకస్ చేశాడు భాను....

“రెండు వందల మీటర్ల లోతు వుంటుందట... పాడైపోయిన కారును బయటికి తీయటం కుదరక అలాగే వదిలేశారు ” అతనితో పాటు తను కూడా తొంగి చూస్తూ అన్నది గీతిక.

కనులు చిట్లించుకు చూసినా ఏమీ కనిపించకపోవటంతో వెనక్కి వచ్చేశాడు భాను.

“దినేష్ నన్ను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాడు... అతని మీద నీ అభిప్రాయం ఏమిటి?” అతను కలలో కూడా ఊహించని టాపిక్‌ని ఉన్నట్లుండి ప్రారంభించింది గీతిక.

“తాగి, తందనాలాడి, గోతుల్లో పడి ముఖం పగలగొట్టుకున్నా, అతనికి నేనంటే అభిమానం వున్నట్లే కనిపిస్తుంది. నన్ను చూడకపోతే క్షణం కూడా వుండలేకపోతున్నాడట.... ఇరవై నాలుగు గంటలూ నాతోనే వుండాలని, నాతోనే మాట్లాడాలని అనిపిస్తోందట... నా సంతోషం కోసం తను ఏమైనా చేస్తాడట....” ఎంతసేపటికి భాను పెదవి విప్పకపోవటంతో తనంతట తనే మాటల్ని కంటిన్యూ చేసిందామె.

గారేజ్ వెనుకభాగంలో గార్డెన్‌లో విస్కీ బాటిల్‌ని ఖాళీ చేస్తూ తన స్నేహితుడితో దినేష్ చెప్పిన మాటలు, అందుకు ఆ స్నేహితుడు ఇచ్చిన సలహా, తన చెవుల్లో మార్మోగి తల విదిలించాడు భాను.

“ఏదో తెలిసినవాడివి, క్లాస్‌మేట్‌వి, ఇంకో సంవత్సరం పాటు కలిసి, చదువుకోబోతున్నవాడివి అని, ఇంతవరకూ ఎవరి ముందూ బయటపెట్టని

మాటను నీ ముందు బయటపెడితే, బుద్ధ దేవుడి మాదిరిగా తల పంకిస్తావేమిటి?" ఉన్నట్లుండి చాలా వేడిగా అడిగింది గీతిక.

ఫక్కున నవ్వకుండా వుండటం భానుకి చేతకాలేదు.

"ఎందుకా నవ్వు?" కోపంగా చూస్తూ అడిగింది గీతిక.

"దినేష్‌ని చేసుకోవటం, చేసుకోకపోవటం నీకు, నీ జీవితానికి, నీ ఫామిలీకి చెందిన సమస్య... నీకు నువ్వుగా తేల్చుకోవాలి, లేదా నీ పేరెంట్స్‌తో మాట్లాడి సెటిల్ చేసుకోవాలి...." నవ్వుతూనే చెప్పాడు భాను.

"నువ్వు మాత్రం సలహా ఇవ్వనని అంటావ్... అంతేనా?" అంతటితో వదిలిపెట్టకుండా పట్టుదలగా అడిగిందామె.

అంతేనని అన్నట్లు తల వూపాడు భాను.

"పెద్ద మొనగాడి మాదిరి ఫోజు పెట్టి తల వూపుతున్నావ్ గాని, నేను అతన్ని వివాహం చేసుకోవటం నీకు యిష్టం లేదు..." అతని అంతరంగాన్ని శోధించి అక్కడ నిక్షిప్తమై వున్న అభిప్రాయాల్ని తెలుసుకున్నట్లు తనంతట తానే చెప్పింది గీతిక.

ఇంకోసారి పెద్దగా నవ్వుతూ ఆ మాటకు సమాధానం చెప్పబోయి, మధ్యలోనే ఆగిపోయాడు భాను. ఎస్టేట్‌కి సంబంధించిన కట్టడాలు ఎన్నో ఎదురయ్యాయి... వాటి ముందు నిలబడి తమ వంకే చూస్తున్న వర్కర్స్ ముందు అనవసరమైన మాటలు మాట్లాడితే మర్యాదగా వుండదు కదా! ఆ విషయాన్ని గీతిక గమనించలేదు.

“నువ్వు ఎంత బిగపట్టుకున్నా, నీ చేత సమాధానం చెప్పించి తీరుతాను, చూస్తూ వుండు” అంటూ ఎస్టేట్ భవంతి వైపు వెళ్ళిపోయింది.

తన దగ్గర్నించి ఆమె ఎటువంటి సమాధానాన్ని ఆశిస్తున్నదో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ, గారేజీని సమీపించి చెక్కబల్ల మీద కూర్చున్నాడు భాను.

పది నిముషాల తరువాత దుమ్ముతెరలు రేపుతూ అక్కడికి వచ్చిన జీప్‌ని చూసి లేచి నిలబడ్డాడు. “ఒకసారి ఇటు రారా....” స్టీరింగ్ ముందు నుంచి దిగకుండానే అతన్ని పిలిచాడు దినేష్.

అప్రయత్నంగా బిగుసుకున్నాయి భాను పిడికిళ్ళు. అతనికి తెలియకుండానే ఎరుపు జీరల్ని పులుముకున్నాయి కనులు.

“రమ్మని పిలుస్తుంటే గుడ్లు మిటకరించి చూస్తావేమిటిరా.” వికృత కంఠంతో అతను ఇంకోసారి పిలవటంతో, విల్ పవర్ నంతా కూడగట్టుకుని తనలోని ఆవేశాన్ని అదుముకున్నాడు భాను. జీప్ దగ్గిరికి పోయి వినయంగా నిలబడ్డాడు.

“రాత్రి నువ్వు ఎక్కడ పడుకున్నావ్?” మూసుకుపోయిన కన్నును అరచేత్తో అద్దుకుంటూ అడిగాడు దినేష్.

వెనుక వున్న చెక్క బల్ల వైపు చూపించాడు భాను.

“నేను, నా కారు డ్రయివర్ కలిసి రాత్రంతా ఈ చుట్టు పట్లే తిరిగాం.... నువ్వు ఇక్కడ కనిపించలేదు.” ఒక్కొక్క మాటను వత్తి వత్తి పలుకుతూ అన్నాడు దినేష్.

“రాత్రి మామూలు పరిస్థితిలో తిరిగి వుండరు. మామూలు పరిస్థితిలో వుండి వుంటే తప్పకుండా కనిపించి వుండేవాడిని.” తన మనసులోని భావాలు మాటల్లో ప్రతిధ్వనించకుండా జాగ్రత్తపడుతూ, సాధ్యమైనంత మృదువుగా అన్నాడు భాను.

“అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి? రాత్రి మేము వళ్ళు తెలియనంతగా తాగి, తందనాలాడామా?” ఉన్నట్లుండి ఆవేశపడిపోతూ రంకె వేసినంత పనిచేశాడు దినేష్.

రాత్రి జరిగిన సంఘటన పూర్తిగా కాకపోయినా, కొంతవరకు అతనికి గుర్తుకు వచ్చినట్లు వెంటనే అర్థం అయింది భానుకి. పేరుపెట్టి చూపించేటంత తెలివి లేకపోవటంతో, ఏదో ఒక విధంగా కక్ష తీర్చుకునే మార్గం ఆలోచిస్తున్నాడతను. మాటలు పెంచి పోట్లాట ప్రారంభించటానికి సిద్ధపడుతున్నాడు.

అతని ఉద్దేశ్యం అవగతమైన మరుక్షణం నోటిని గట్టిగా అదిమేసుకొని శిలా విగ్రహంలా నిలుచుండిపోయాడు భాను.

ఊపిరి తీసుకోవటానికి కూడా ఆగకుండా ఏకధాటిగా అరిచాడు దినేష్. అతన్ని అతని పుట్టు పూర్వోత్తరాల్ని అన్నిటినీ కలిపి అదే పనిగా క్వశ్చన్ చేసి,

ఒక్కసారి కూడా ఎదురు మాట చెవికి చేరకపోవటంతో విధిలేక తనంతట తానే కూల్‌డౌన్ అయ్యాడు.

"నీ ప్రవర్తన, నీ వ్యవహారం నాకు అనుమానాన్ని కలిగిస్తోంది... నీ సంగతి తేల్చకపోతే మారు పేరు పెట్టుకుంటాను." అని అల్టిమేటమ్ ఇచ్చి జీప్ దిగాడు. నేల అదిరిపోయేటట్లు అడుగులు వేస్తూ భవంతి వైపు వెళ్ళిపోయాడు.

ఎందుకో అనుమానం వచ్చి భవంతి కేసి తిరిగాడు భాను... పై అంతస్థులో ఒక కిటికీ దగ్గర నిలబడి అతని వంకే చూస్తోంది గీతిక. అతను తలతిప్పి చూసేసరికి అక్కడి నుంచి తప్పుకున్నది.

* * * * *

"నీ అదృష్టం బాగుండి నా బిడ్డ నిన్ను చూడటం జరిగింది. చూడకపోతే ఏమైపోయి వుండేవాడివి?" అంతకు ముందు రోజు మాదిరిగానే భానును వెతుక్కుంటూ వచ్చి, తన గుడారం దగ్గిరికి తీసుకు పోతూ అన్నాడు గురువప్ప.

"అడవిలో మీరు చేసే పని ఏమిటి? చెట్లను నరికి లారీలకు ఎత్తటమేనా?" ఆ మాటలు తనకు వినబడనట్లు నటిస్తూ అడిగాడు భాను.

అవునని తల వూపాడు గురువప్ప.

"మరి గంధపు దుంగల్ని, ఏనుగు దంతాల్ని పోగు చేస్తోంది ఎవరు?"

అదిరి పడి అతని నోటిని గట్టిగా అదిమాడు గురువప్ప.

"నీ వరస చూస్తుంటే నీతో పాటు మమ్మల్ని కూడా నట్టేట్లో ముంచేటట్లుంది. ఎవరు ఏ పని చేస్తే నీకెందుకు? నీ సంగతేదో నువ్వు

చూసుకోకుండా ఇతరుల వ్యవహారాల్లో వేళ్ళు పెట్టటం దేనికి?" లోగొంతుకతో మందలిస్తూ, తీసుకుపోయి గుడారం ముందు కూర్చోబెట్టాడు.

"ఈ ఒక్క ప్రశ్నకీ సమాధానం చెపితే ఇక మీదట నిన్ను ఇబ్బంది పెట్టను తాతా....." అంటూ తను దారి తప్పి, అడవిలోకి ఎలా వచ్చాడో, పాతిపెట్టి వున్న అటవీ సంపదను ఎందుకు చూశాడో వివరంగా చెప్పాడు భాను.

అతనంతగా ప్రాధేయపడినా గురువప్ప నోరు విప్పకపోవటంతో తాను కల్పించుకున్నది గుడారంలో వున్న అతని మనవరాలు.

"ఈ చుట్టు పట్ల వుండే వారందరకీ తెలిసిన బహిరంగ రహస్యం అది.... నువ్వు నీ నోటితో చెప్పనంత మాత్రన ఆయనకి తెలియకుండా పోతుందా? ఇవాళ కాకపోతే రేపయినా ఖచ్చితంగా తెలిసి తీరుతుంది....." అని ఎత్తి పొడిచింది.

అయిష్టంగానే చెప్పటానికి పూనుకున్నాడు గురువప్ప.

ఎస్టేట్ మేనేజర్ హరిహరవర్మ చేయించే పనట అది... నెలకో సారి ప్రభుత్వానికి చెందిన అడవిలోకి పోయి ఏనుగుల్ని వేటాడి వస్తాడట దినేష్ బాబు... వాటి దంతాలను తెచ్చి ఎస్టేట్‌కి సంబంధించిన చిట్టడివిలో పాతిపెట్టిస్తారట.

"గంధపు చెట్లను కూడా అదే పద్ధతిలో దొంగచాటుగా తీసుకువచ్చి నిలువ చేస్తారు. రెండు మూడు నెలలకు ఒకసారి బొంబాయి నుంచి పెద్ద పెద్ద సేఠ్‌జీలు వచ్చి వాటిని ఖరీదు చేసి తీసుకుపోతుంటారు. ఈసారి ఎందుకనో

ఇంకా రాలేదు.... ఈ పాటికి వచ్చి, సరుకును అవతలికి తీసుకుపోతూ ఉండాల్సిన మాట.....''

గురువప్ప మాటల్ని వినేసరికి బెంగుళూరులో జరిగిన సంఘటన భాను కనుల ముందు మెదిలింది. సరుకు నిలువ చేసి చాలాకాలం అయిందనే దుగ్ధతో ఆ వ్యాపారుల కోసం వెదుక్కుంటూ బెంగుళూరు పోవటం జరిగిందా?

అదే నిజం అయితే... సరుకు తీసుకొని డబ్బు వాళ్ళు ఇవ్వాలి కదా! లాయర్ సాబ్ తీసుకుపోయి ఇవ్వటం ఏమిటి??

సమాధానం లభించని ఆ ప్రశ్నతో సతమతం అవ్వటం ఇష్టంలేక, లాయర్ సాబ్ చేసిన హెచ్చరికను పెడచెవిన పెట్టి బెంగుళూర్లో జరిగిన ఉదంతాన్ని గురువప్పకు చెప్పాడు భాను.

అంతా విని నెత్తిమీద చేతులు పెట్టుకున్నాడు గురువప్ప.

''ఇక నిన్ను మానవమాత్రుడెవరూ కాపాడలేరు... భగవంతుడు కూడా కాపాడగలడనే నమ్మకం నాకు లేదు'' అంటూ అక్కడినుంచి అవతలికి వెళ్ళిపోబోతుండగా, చెయ్యి పట్టుకుని ఆపి, అతని మనవరాలివైపు చూశాడు.

''బెంగుళూర్లో దొర అనే రౌడీతో హరిహరవర్మ గారికి సంబంధాలు వున్నాయట... డబ్బు కోసం ఎటువంటి నీచకార్యమైనా చేసే మనిషి ఆ దొర.... అతనితో తగువు పడిన మనిషికి ఆయువు తీరిపోయినట్లే అంటారు....'' తాత మాదిరిగా తడబడిపోకుండా నిబ్బరంగా కూర్చొని తనకు తెలిసిన విషయాన్ని చెప్పిందా పిల్ల.

“అతని అనుచరుల్ని కొట్టినందుకు నా అంతు చూస్తాడనటంలో అర్థం లేకపోలేదు?” ఆ మాటలకు తల వూపుతూ సాలోచనగా అన్నాడు భాను. “రివాల్వర్‌తో కాల్పులు జరిపిన హరిహరవర్మ గారిని, లాయర్ గారిని అతను తన శత్రువుల క్రిందే భావించాలి. నాతో పాటు వాళ్ళ అంతు కూడా చూడాలి, అటువంటి పని ఏదీ చేయకుండా అనుచరులతో సహా అతను ఆ భవనంలో నుంచి మాయమైపోవటం దేనికి?”

“లక్షలు కుమ్మరించే బంగారు బాతుల్ని చూస్తూ చూస్తూ ఎవరైనా చంపుకుంటారా? వాళ్ళ అంతు చూస్తే అడిగినప్పుడల్లా అంత డబ్బు ఇచ్చేది ఎవరు??” ఎదురు ప్రశ్న వేశాడు గురువప్ప.

"అతనికి లక్షలు లక్షలు అసలు ఎందుకు ఇస్తున్నట్లు? గంధపు దుంగల్ని, ఏనుగు దంతాల్ని అడవి దాటించటంలో సహాయపడతాడనా?” వెంటనే అడిగాడు భాను.

అటువంటి ప్రశ్న అతని నోటి నుంచి వస్తుందని అనుకోలేదు కాబోలు మరోసారి మనవరాలికేసి చూశాడు గురువప్ప.

“ఇంతదూరం వచ్చిన తర్వాత ఇంకా బిగపట్టుకోవటం దేనికి తాతా? చెప్పేయ్....” అంటూ ప్రోత్సహించిందా పిల్ల.

“తరువాత చెప్తాను గాని, బాబుకు ముందు అన్నం పెట్టు.” అన్నాడు గురువప్ప.

సిద్ధంగా వుంచిన అడవి ఆకులో అన్నం పెట్టటానికి రెడీ అవుతున్న పిల్లను వారించి, "ఇప్పుడు ఆకలిగా లేదు.... నువ్వు చెప్పేది విన్న తరువాత గాని అన్నం నోటికి ఎక్కదు...." అన్నాడు భాను.

"నీ లాంటి మొండివాడిని పెంచటానికి నీ తల్లి ఎంత కష్టపడి వుంటుందో తలుచుకుంటుంటే గుండె చెరువైపోతోంది...." అంటూ మాట దాటవేయటానికి ప్రయత్నించి, భాను అలాగే కూర్చోవటంతో విధిలేక తనకు తెలిసిన వషయాల్ని చెప్పటం మొదలు పెట్టాడు గురువప్ప.

"సూర్యప్రసాద్ గారికి ఏకైక సంతానం లక్ష్మీ ప్రసాద్. బెంగుళూర్లో చదువుకుంటూ ప్రసూనమ్మ అనే పేదింటి పిల్లను ప్రేమించి, తండ్రికి యిష్టం లేకపోయినా పెళ్ళి చేసుకొని ఎస్టేట్‌కి తీసుకువచ్చాడు."

"అతను చేసిన పనికి కినిసి ఇంట్లోనించి వెళ్ళిపోమ్మన్నాడు సూర్యప్రసాద్ గారు. ఆయన కోపం ఎంతో కాలం వుండదని తెలిసి కూడా, అభిమాన పడి అవతలికి పోయాడు లక్ష్మీ ప్రసాద్...."

"ఇవన్నీ నాకు తెలుసు తాతా... పేపర్లో వీటన్నిటి గురించీ వ్రాశారు. నేను అడిగేది బెంగుళూరు దొర గురించి... లక్ష్మీ ప్రసాద్ గురించి కాదు..." అంటూ అడ్డు పడబోయిన భానును వారించింది గురువప్ప మనవరాలు.

"పేపర్లలో వచ్చిన వార్తలకు, ఇక్కడ జరిగిన విషయాలకు చాలా తేడా వుంది. మాటలకు అడ్డం వస్తే చెప్పటం మానేస్తారు... మాట్లాడకుండా వినండి...." అని హెచ్చరించింది.

మాట్లాడకుండా వినటానికి సిద్ధపడి సర్దుకు కూర్చున్నాడు భాను.

“తన మాట వినలేదని మొదట్లో కొడుకు మీద ఆగ్రహించినా, కొద్ది రోజుల్లోనే కోపం తగ్గి, హరిహరవర్మ గారిని కొడుకు దగ్గిరికి పంపించాడు సూర్యప్రసాద్ గారు. హరిహరవర్మగారు అక్కడికి పోయి ఏం చెప్పారో గాని, ఇంటికి వచ్చే ఆలోచన తనకు లేదని మొండిగా సమాధానం పంపించాడు లక్ష్మీప్రసాద్.”

“ఆ సమాధానాన్ని విని హతాశుడయిన సూర్యప్రసాద్ గారిని తన పుల్లగొండి మాటలతో బాగా రెచ్చగొట్టాడు హరిహరవర్మ. చేస్తున్న ఉద్యోగాన్ని ఊడగొట్టించితే, తినటానికి తిండి లేక తనంతట తనే దారిలోకి వస్తాడని బోధించాడు.”

“నల్లనివన్నీ నీళ్ళు, తెల్లనివన్నీ పాలు అనుకునే ఆ ధర్మప్రభువు ఆ సలహాని అక్షరాలా అమలులో పెట్టి కొడుక్కి మరింత దూరమైపోయాడు.”

“తినటానికి తిండి లేకపోతే కూలిపనైనా చేసుకోవటానికి సిద్ధపడ్డాడు గాని, తండ్రి దగ్గరికి మాత్రం రాలేదు లక్ష్మీ ప్రసాద్. గర్భవతైన తన భార్య ఆసుపత్రిలో పండువంటి బిడ్డిడిని ప్రసవించి, కాన్పు కష్టమవటం వల్ల ప్రాణాలు పోగొట్టుకున్నప్పుడు కూడా తండ్రికి కబురు పంపలేదు.”

“తాను తాత అయినట్లు ఎవరి ద్వారానో తెలుసుకొని, పంతాలకు పట్టింపులకు తిలోదకాలు యిచ్చి, స్వయంగా కొడుకు దగ్గిరికి బయలుదేరాడు సూర్యప్రసాద్ గారు. హరిహరవర్మ ఎంత చెప్పినా వినలేదు....”

"జరిగిందేమిటో ఖచ్చితంగా తెలియలేదు గాని, బెంగుళూరు దొర సాయంతో తండ్రీ కొడుకులు కలుసుకోకుండా కలుసుకోకుండా ఏదో అడ్డంకి ఏర్పాటు చేశాడు హరిహరవర్మ బెంగుళూర్‌ని వదిలి లక్ష్మీప్రసాదే ఎక్కడికో వెళ్ళిపోయేటట్లు కథని నడిపించాడట....." అంటూ ఆగాడు గురవప్ప.

"తండ్రీ కొడుకులు కలుసుకోకుండా సహాయపడినందుకుగాను దొర అడిగినప్పుడల్లా వీళ్ళు డబ్బు తీసుకుపోయి యిస్తున్నారనా నీ ఉద్దేశ్యం??" మాట్లాడకుండా కూర్చోవటానికి అంగీకరించిన విషయాన్ని మరిచిపోయి ప్రశ్నించాడు భాను.

అవునని తల వూపాడు గురవప్ప.

"సూర్యప్రసాద్ గారు బ్రతికి వున్నంతవరకూ దొర డబ్బు అడగటంలోనూ, వీళ్ళు అడిగినంతా యివ్వటంలోను ఎంతో కొంత అర్థం వుంది. ఆయన చనిపోయిన తర్వాత కూడా పేమెంట్ చేయటం ఎందుకు? పేమెంట్ చేయకపోతే సూర్యప్రసాద్ గారికి నిజం చెప్పేస్తానని దొర బెదిరించే అవకాశాలు యిక లేవు గదా!"

"నాకు తెలుసు... ఒక్క ప్రశ్న ఒక్క ప్రశ్న అంటూ ఎస్టేట్ చరిత్ర నంతా నా నోటివెంట చెప్పించందే నీకు నిద్ర పట్టదు...." గాఢంగా నిట్టూరిస్తూ కూర్చున్న చోటి నుంచి లేచి గుడారం చుట్టూ ఒక రౌండ్ కొట్టి వచ్చాడు గురవప్ప.

ఆ చుట్టపట్ల ఎవరైనా పొంచులు వేసి, తమ మాటలు వింటున్నారేమో తెలుసుకోవటానికి అతనలా తిరిగి వచ్చారని గ్రహించి చిన్నగా నవ్వాడు భాను.

“నీ నోటి ద్వారా ఎస్టేటు రహస్యాలు చెప్పి అనవసరమైన బాధల్లో చిక్కుపడాల్సిన అవసరం నీకు రానీయను తాతా... నువ్వు చెప్పాల్సిన అవసరం లేకుండానే నాకు అర్థమైంది అసలు సంగతి” అంటూ ఆకులో అన్నం పెట్టమని అతని మనవరాలికి సైగ చేశాడు.

విపరీతమైన ఆశ్చర్యంతో అలాగే చూస్తూ వుండిపోయిందా పిల్ల. అతను అడిగిన పని చేయలేదు.

“సూర్యప్రసాద్ గారికి తెలియకుండా దొంగ వ్యాపారాలు చేసి సంపాదించిన డబ్బుతో తృప్తిపడటం హరిహరవర్మ గారికి చేతకాలేదు. బెంగుళూరు దొర సాయంతో పెద్దాయన కారును ఆగాధంలోకి పంపించి ప్రాణాలు తీశాడు. సూట్‌కేస్ వంటి బ్రీఫ్‌కేస్ నిండా నోట్లకట్టలు పెట్టి బెంగుళూరు దొరకు అందజేయటానికి కారణం యిదే..... వీళ్ళ జుట్టు దొర చేతిలో చిక్కుకుపోయింది. అతను అడిగినప్పుడల్లా అడిగినంత డబ్బు తీసుకుపోయి యివ్వక తప్పదు... అతనికి కోపం వస్తే తమ గుట్టు రట్టు అవుతుందన్న భయంతోనే, అతని అనుచరుల బారి నుండి రక్షించినందుకు కృతజ్ఞతగా చూడాల్సింది పోయి, అనవసరంగా జోక్యం చేసుకున్నానని నన్ను మందలించారు” అంటూ అన్నం పెట్టమని ఇంకోసారి సైగ చేశాడు భాను.

“ఒక్కమాట అడుగుతాను... ఏమీ అనుకోకుండా సమాధానం చెపుతావా?” అతని వంక అదో మాదిరిగా చూస్తూ అడిగాడు గురవప్ప.

"నువ్వు ఏమడిగినా ఏమీ అనుకోను.... అడుగు...." అతని మనవరాలు అందించిన ఆకును ముందు పెట్టుకుని అవురావురుమని తినటం మొదలుపెడుతూ అన్నాడు భాను.

"నువ్వు ఎవరివి బాబూ? డ్రయివర్ వేషంలో వచ్చిన పోలీసు మనిషివా?"

నోటిలో పెట్టుకున్న ముద్ద గొంతుకు అడ్డుపడిన సెన్సేషన్ కలిగి, టపటపా నెత్తిమీద చరుచుకున్నాడు భాను.

"పోలీసులకు తప్ప ఇంత త్వరగా విషయాల్ని అర్థం చేసుకునే శక్తి ఎవరికీ వుండదు.... ఎటువంటి ప్రమాదం ఎదురైనా నిబ్బరాన్ని పోగొట్టుకోకుండా నువ్వు నిలబడున్న పద్ధతి నాకు అనుమానాన్ని కలిగిస్తోంది....."

అతని మనవరాలు కూడా అదే పద్ధతిలో తన వంక చూస్తూ వుండటాన్ని గమనించి, "నేను పోలీసు మనిషిని కాదు తాతా.... భవిష్యత్తులో ఏమౌతానో తెలియదు గానీ, ఇప్పటి వరకూ మీ వంటి సాధారణమైన మనిషినే" అన్నాడు.

"నీ పద్ధతి చూస్తుంటే నమ్మబుద్ధి కావటం లేదు... నీ ముఖం చూస్తుంటే నమ్మకుండా వుండటం చేతకావటం లేదు..... అంతా గజిబిజిగా గందరగోళంగా అనిపిస్తోంది" తన మనసులోని మాటను సూటిగా బయటపెట్టి, గుడారంలోంచి చిరుగుల చాపను బయటకి తెచ్చుకున్నాడు గురవప్ప.

ఆకును ఖాళీ చేసి అతని మనవరాలు అందించిన నీళ్ళతో చేయి కడుక్కున్నాడు భాను. మరో పదినిమిషాల పాటు అక్కడే కూర్చొని, నెమ్మదిగా గారేజి దగ్గరికి తిరిగి వచ్చాడు.

అక్కడికి వచ్చిన దగ్గిర్నుంచీ అతనికి ఆశ్రయం ఇస్తున్న చెక్కబల్ల లేదక్కడ. మారు తాళంతో కారుడిక్కిని తెరిచి, లోపల వుండే దుస్తులను కూడా మాయం చేశారు.

ఎంత నీచంగా మాట్లాడినా, ఎటువంటి పాడు పనులు చేసినా, తన దుస్తుల్నీ దుప్పటిని మాయం చేయాల్సిన అవసరం దినేష్ బాబుకు లేదని భానుకి తెలుసు.

అతని ఫ్రెండ్ అయ్యనార్ పని అయివుంటుంది అది.... తనను యిబ్బంది పాలు చేసి, బుద్ధి చెప్పాలని అనిపించినా, అందువల్ల అనవసరమైన పబ్లిసిటీ రావటం. అందరి దృష్టిలోనూ పడటం జరుగుతుందనే అనుమానంతో ఆగిపోయాడు. కారు తలుపుల్ని తెరిచి, వెనుక సీట్లో ముడుచుకు పడుకున్నాడు.

# 17

“ఇదిగో... నిన్నే... ఇదిగో.....” భుజం తడుతూ ఎవరో పిలిచినట్లు అనిపించి కనులు తెరిచాడు ఉదయం ఆరుగంటల సమయంలో.

“కుంభకర్ణుడికి తమ్ముడిలా ఉన్నావ్... అరిచి అరిచి నా గొంతు రాచుకుపోయింది” అతన్ని నిద్రలేపటానికి ఎంతో కష్టపడినట్లు ముఖం పెట్టింది ఒక యువతి.

గీతికతో పాటు చాముండేశ్వరి ఆలయం దగ్గిరికి వచ్చిన సర్వెంట్స్‌లో ఆమె ఒకర్తె అని గుర్తు పట్టి ప్రశ్నార్థకంగా చూశాడు భాను.

“ముఖం కడుక్కుని వెంటనే రమ్మని చెప్పమన్నారు అమ్మాయి గారు. అర్జంటు పనేదో యిప్పుడే గుర్తుకు వచ్చిందిట” తను తీసుకువచ్చిన మెస్సేజిని వినిపించి హడావుడిగా వెళ్ళిపోయిందామె.

నలిగిపోయిన దుస్తుల వంక ఒకసారి చూసుకొని గారేజి ప్రక్క భాగంలో వున్న మంచినీరు కుళాయి దగ్గిర ముఖం కడుక్కున్నాడు భాను. హేండ్ కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ గీతిక దగ్గరికి బయలుదేరాడు.

విశాలమైన ముందు గదిలో మళ్ళీ అతనికి కనిపించారు లాయర్ సాబ్. హరిహరవర్మ... లోగొంతుకతో ఏదో విషయాన్ని గురించి చాలా తీవ్రంగా చర్చించుకుంటూ, లోపలికి వచ్చిన భానును గమనించగానే మాటలను ఆపేశాడు.

“ఎందుకు వచ్చావ్ ఇక్కడికి?” కనుబొమ్మలు ముడిచి కోపంగా చూస్తూ అడిగాడు హరిహరవర్మ.

“మనం తిరిగి వెళ్ళేదాకా నీకు పని ఏమీ లేదని చెప్పాను కదా!” అతనిలా క్రూరంగా చూడకపోయినా, విసుగు నిండిన కంఠంతో అన్నాడు లాయర్ సాబ్.

"అమ్మాయి గారు పిలిపించారు.... అర్జంట్ పనేదో గుర్తుకు వచ్చిందిట....” కదలకుండా నిలబడి సమాధానం చెపుతుండగా, ఆ గది వెనుక భాగంలో వున్న ద్వారం దగ్గిర భానుకు కనిపించిన గీతిక.... వాళ్ళ మాటలను పట్టించుకోకుండా ముందుకు వచ్చేయమని సైగ చేసింది.

తల వంచుకొని అటు వెళ్ళిన భానుకు ఆ ద్వారం అవతల కనిపించింది పెద్ద కిచెన్.

“పనులు చేయించుకోవటం తప్ప, పనిచేసే వాళ్ళ మంచి చెడుల్ని పట్టించుకునే అలవాటు యిక్కడున్న వారెవరికీ లేదు. ఇక్కడికి వచ్చిన దగ్గర్నించీ నువ్వు ఎక్కడ భోజనం చేస్తున్నావో యిప్పటివరకూ నాకు తెలియదు” ఒక ప్రక్కగా వున్న పెద్ద డైనింగ్ టేబిల్ ముందు అతన్ని కూర్చోబెట్టి, టిఫిన్ తీసుకురమ్మని కిచెన్ అటెండెంట్‌కి సైగ చేస్తూ అన్నది గీతిక.

మాటలతో సమయాన్ని వృధా చేయటం ఇష్టం లేక,”అర్జంట్ పని వున్నది అన్నావుట! ఏమిటది?” అని అడిగాడు భాను.

టిఫిన్ ప్లేట్ అతని ముందుకు వచ్చేదాకా సమాధానం చెప్పలేదు గీతిక. టిఫిన్ తీసుకుని అతను కాఫీ తాగటం పూర్తి చేసిన తరువాత ఒక కాగితాన్ని చేతికి అందించింది.

“రెండు మూడు రోజుల్లో మనం వెనక్కి వెళ్ళిపోతామని అనుకొని, కాస్మెటిక్స్ ఏవీ వెంట తెచ్చుకోలేదు నేను. ఇక్కడి నుంచి బయలుదేరటానికి యింకో మూడు నాలుగు రోజులు పట్టేటట్లు కనిపిస్తోంది....” కిచెన్ అటెండెంట్ తీసుకువచ్చి తన ఎదుట పెట్టిన కాఫీని సిప్ చేస్తూ అన్నది.

“కాస్మెటిక్స్ అంటే ఏమిటి? సోపులు, స్నోలు, ఫేస్ పౌడర్లేనా?” ఏమీ తెలియనట్లు అమాయకంగా అడిగాడు భాను.

కిసుక్కున నవ్వింది ఆ సమీపంలోనే ఉన్న పనిమనిషి ఒకర్తె... గీతిక తన వంక కోపంగా చూసేసరికి తల వంచుకొని అవతలికి వెళ్ళిపోయింది.

"నాకు ఏమేమి కావాలో నీకు ఇచ్చిన లిస్ట్‌లో వ్రాసాను... లిస్ట్ ప్రకారం తెచ్చిపెట్టు" అంటూ ఒక నోట్లకట్ట పొత్తికను భాను ముందు పెట్టింది గీతిక.

"నువ్వు వ్రాసినవన్నీ కలిపి నాలుగైదువందల కంటే ఎక్కువ ఖరీదు చేయవు" నాలుగైదు వందలకు మూడు రెట్లు ఎక్కువగా వున్న నోట్ల పొత్తికను చూస్తూ కామెంట్ చేశాడు భాను.

"మిగిలిన డబ్బుతో నువ్వు రెండు జతల రెడీమేడ్ దుస్తులు తెచ్చుకో.... దుప్పటీ, టవల్స్ మర్చిపోకు."

కనులు చిట్లిస్తూ ఆమె ముఖంలోకి చూశాడు భాను.

"ఎటువంటి బండ మొండి మనిషినైనా జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సందర్భంలో సహనాన్ని కోల్పోవటం, గంతులు, చిందులేసి గల్లంతు సృష్టించటం జరిగి తీరుతుందని నేను విన్నాను. కారణం లేకుండా చివాట్లు తిని, కట్టుబట్టలు కనిపించకుండా పోయిన తరువాత కూడా నీలో చలనం కనిపించటం లేదు. నిన్ను కలవరపెట్టే శక్తి ఏ సంఘటనకీ లేదా?"

కిటికీ చాటున నిలబడి దినేష్‌కి, తనకు మధ్య జరిగిన గొడవను తిలకించటమే కాకుండా, చెక్కబల్ల మాయం కావటం, కార్లో వున్న గార్మెంట్స్ గల్లంతు అవటాన్ని కూడా ఆమె గమనించిందని గ్రహించాడు భాను.

అంతకు ముందు రోజు అర్థరాత్రి సమయంలో తను చేసిన ఘనకార్యం కూడా కంటపడి వుంటే ఎటువంటి మాటలు ఆమె నోటి నుంచి వచ్చేవో

తలుచుకునేసరికి, అప్రయత్నంగా అతని పెదవుల మీద ప్రత్యక్షం అయిందొక చిరునవ్వు.

"ఎటువంటి ప్రశ్న వేసినా పెద్ద వేదాంతి మాదిరి ఫోజు పెట్టి నవ్వులు ఒలకపోయటం నీకు బాగా అలవాటైంది." అతనెందుకు నవ్వాడో తెలియక కోపంగా అంటూ డైనింగ్ టేబుల్ ముందు నుంచి లేచింది గీతిక.

"నేను వ్రాసిచ్చిన లిస్ట్ నీకు బెంగుళూర్లో తప్ప మరెక్కడా దొరకవు. మామయ్య అడిగితే నా పని మీద వెళ్ళావని చెపుతాను. కారు తీసుకుని వెళ్ళు. చీకటి పడకముందే తిరిగి రా...." అని చెపుతూ అతనికి సెలవు ఇచ్చింది.

# 18

ఎదురు చూడని విధంగా లభించిన ఆ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకున్నాడు భాను. బెంగుళూర్ పట్టణంలోకి ఎంటర్ కాగానే మొట్ట మొదటగా కనిపించిన పోస్టాఫీస్ ముందు కారు ఆపి, లెక్చరర్ గారికి ఒక లెటర్ వ్రాశాడు.

క్షేమ సమాచారాలు, కుశల ప్రశ్నలు అయిన తర్వాత ధార్వాడ ఎస్టేట్ వివరాలు లిఖించాడు. అక్కడ పనిచేస్తున్న వారిని గురించి, గురవప్ప మనవరాలిని గురించి తెలియచేశారు.

"యాక్సిడెంట్‌ని క్రియేట్ చేసి, సూర్యప్రసాద్ గారిని చంపించింది హరిహరవర్మే అనటంలో ఎటువంటి సందేహము అవసరం లేదు గాని, అందుకు అవసరమయిన సాక్ష్యాధారాలు నాకు లభించలేదు. అవి లభించిన మరుక్షణం

అతని ఛాప్టర్ క్లోజ్ అయిపోయినట్లే. ప్రభుత్వానికి చెందిన గంధపు చెట్లను, ఏనుగు దంతాల్ని సేకరించి చట్టానికి విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న దినేష్ బాబు, వీళ్ళు చేసే అన్యాయాలకు తెర వెనుక నిలబడి సలహాలు అందచేస్తున్న లాయర్ సాబ్ అందరూ శిక్షలు అనుభవించక తప్పదు. ఏదో ఒక విధంగా వీళ్ళ అక్రమాలను బయటపెడదామని మీ ముందు చెప్పినట్లు, పూర్తిగా కాకపోయినా ఎంతో కొంత సాధించగలిగాను... చేయవలసిన పని యింకా చాలా వుంది....."

సూర్యప్రసాద్ గారిని హతమార్చటంలో హరిహరవర్మకి తోడుపడినట్లు తను భావిస్తున్న బెంగుళూర్ దొరను గురించి మాత్రం వ్రాయలేదు అతను. అతని అనుచరులతో తను తలపడిన విషయం ప్రస్తావించలేదు. ఫైటింగులు చేయాల్సిన పరిస్థితుల్లో తను చిక్కుపడినట్లు బాబాయికి తెలిస్తే, పరుగు పరుగున వచ్చేస్తాడు అక్కడికి..... తెలియకుండా వుండే సమస్య లేదు. లెటర్ అందిన వెంటనే పిలిపిస్తాడు లెక్చరర్ గారు... చదువుకోమని చేతిలో పెడతాడు.

అనవసరమైన మాటల్ని వ్రాసి లేనిపోని బాధల్ని నెత్తిమీదికి తెచ్చుకోవటం దేనికి?

లెటర్‌ని పోస్ట్ చేసిన తరువాత సిటీ మధ్యభాగంలో వుండే ఒక సూపర్ బజార్‌కి వెళ్ళి, గీతిక వ్రాసి యిచ్చిన లిస్ట్ ప్రకారం ఆమెకు కావలిసిన కాస్మెటిక్స్‌ని ఖరీదు చేశాడతను. తనకు అవసరమయిన దుస్తుల్ని కూడా అక్కడే తీసుకుని బయటకు రాబోతుండగా కనిపించిందతనికి అందమైన ఒక పింగాణీ బొమ్మ.

యమునా నది ఒడ్డున పున్నాగ వృక్షం క్రింద పిల్లనగ్రోవి ఊదుతున్న కృష్ణుడిని ఆరాధన నిండిన కనులతో చూస్తూ అచేతనంగా నిలబడి వుంది రాధ.

ఏనుగు దంతాల్ని పట్టుకుని ఎలా స్మగుల్ చేయాలో ఆలోచిస్తూ నిలబడిన దినేష్ వంక ఏమీ తెలియని గీతిక అలా చూస్తూ నిలబడితే ఎలా వుంటుందో అనిపించి రెండో ఆలోచన లేకుండా ఆ బొమ్మను పర్చేజి చేశాడు. బహుమతులు ఇచ్చేందుకు ఉపయోగించే మార్బుల్ పేపర్‌తో గిఫ్ట్ పేక్ చేయించి కారులో పెట్టాడు.

అంతటితో పూర్తి అయిపోయాయి అతని పనులు. వెనుతిరిగి వచ్చిన దారినే ఎస్టేట్‌కి వెళ్ళటం ఒక్కటి మాత్రమే యిక చేయగలిగింది.

బెంగుళూరు దొర భవంతి మీదుగా పోయి, అక్కడి పరిస్థితుల్ని ఒకసారి అబ్జర్వ్ చేస్తే బాగుంటుందన్న ఆలోచన కలిగింది గాని, అందుకు అది సమయం కాదనిపించి, కారు డోర్స్‌ని లాక్ చేశాడు. సూపర్ బజార్‌కి ఎదురుగా వున్న హోటల్లో భోజన కార్యక్రమం పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణం ప్రారంభించాలనే ఉద్దేశ్యంతో అటు అడుగులు వేశాడు.

హోటల్ మెట్లు ఎక్కకముందే అతనికి కలిగింది తనను అదే పనిగా ఎవరో చూస్తున్న అనుభూతి. తనెవరో తెలిసిన వాళ్ళు ఆ సిటిలో ఎవరూ వుండి వుండరు కాబట్టి నెగ్లెక్ట్ చేశాడు భాను ఆ సెన్సేషన్‌ని.

అందుకు వెంటనే కాకపోయినా మరో పావుగంట తరువాత పే చేయవలసి వచ్చింది పెనాల్టీ.

భోజనం ముగించుకొని హోటల్లో నుంచి బయటికి వస్తుండగా ఎదురుగా వచ్చి చేయి పట్టుకున్నాడు ఒక అపరిచితుడు.

"నిన్ను మా దొర పిలుచుకు రమ్మని చెప్పాడు. గొడవ చేయకుండా మాతో వచ్చేయ్...." అంటూ అక్కడికి పది గజాల దూరంలో ఆగి వున్న టాక్సీ వైపు లాగాడు.

తనకు తెలియకుండానే అతని చేతిని విదిలించి కొట్టాడు భాను. గుండెల మీద చేయివేసి ప్రక్కకు నెట్టాడు. రెండు అంగల్లో ఫుట్‌పాత్ మీద నుంచి దిగి రోడ్డును క్రాస్ చేయబోతుండగా, తలా ఒక ప్రక్క నుంచీ అతన్ని కమ్ముకున్నారు మరికొంత మంది వ్యక్తులు.

అటువంటి ప్రమాదం ఏదయినా ఎదురు పడవచ్చునని ముందుగానే ఊహించి వుంటే... పొరపాటున కూడా వాళ్ళకు లొంగిపోయేవాడు కాదతను.

ఊహించకపోవటం వల్ల రియాక్ట్ అవటానికి కాస్తంత టైం పట్టింది. ఆ కాస్త వ్యవధిలోనే అతని తలమీద కొట్టి, ముఖం మీద పొడిచి స్పృహ తప్పించేశారా అగంతకులు. చేతుల మీద తీసుకుపోయి టాక్సీలో పడవేశారు.

నోళ్ళు తెరచుకు చూస్తూ వుండిపోయారు రోడ్డు మీది పౌరులు అందరూ..... ముందుకు వచ్చి అదేమిటని అడిగే ధైర్యం లేక తలల్ని ప్రక్కకు తిప్పుకున్నారు.

*　　　*　　　*　　　*　　　*

"నిన్ను గురించి నువ్వు ఏమనుకుంటున్నావ్ బే? పెద్ద రౌడీనని అనుకుంటున్నావా?" అని అడుగుతూ బూటు కాలిని ఎత్తి భాను గుండెల మీద తన్నాడు బెంగుళూరు దొర.

అంతకు ముందు అర నిముషం క్రిందటే స్పృహ తెలిసి కనులు తెరిచాడు భాను. తను బెంగుళూరు దొర ఎదుటికి తీసుకుపోబడుతున్నట్లు గ్రహించి, ఎటువంటి పరిస్థితి ఎదురయినా తట్టుకోవటానికి రెడీ అయ్యాడు.

ఇప్పుడు దొర కొట్టిన దెబ్బను ఊపిరి ఆగిపోయినట్లు బాధపడుతూ వెనక్కు జరిగి వెల్లికిలా పడిపోయాడు.

"డ్రయివర్‌గా పనిచేసేవాడివి డ్రయివర్‌గా వుండాకుండా, వీరాధివీరుడి మాదిరిగా నా మనుషుల మీద కలబడతావా? ఇప్పుడు కలబడి చూపించు బే.... చూపించు......" అంటూ ముందుకు వచ్చాడు దొర..... పడిన మనిషి పైకి లేచే అవకాశం యివ్వకుండా లాగి లాగి తన్నటం మొదలు పెట్టాడు.

ప్రక్కటెముకలు పటపటమని శబ్దం చేశాయి. పదునైన కత్తితో ఊపిరితిత్తుల్ని చీలుస్తున్నట్లు భరించరాని బాధ మెదడును ఆవరించుకున్నది.

పళ్ళ బిగువున ఆ బాధల్ని భరిస్తూ, తన రెసిస్టెన్స్ కెపాసిటీ ఎటువంటిదో వారికి తెలియజెప్పటం వల్ల ఉపయోగం ఏదీ వుండకపోగా, మరిన్ని దెబ్బలు తినాల్సి వస్తుందని భానుకు తెలుసు.

వీధుల్లో తిరిగి తన్నులు తిని వచ్చినప్పుడల్లా, తన వంటి మీద దెబ్బల్ని చూసి ఏడుపు ముఖం పెట్టిన భానుకు, బాబూలాల్ చెప్పిన విషయం అది.

"అరవాలి... ఆకాశం వూడి తలల మీద పడిపోతుందేమోనని భయం కలిగేటట్లు కేకలు పెట్టాలి... పళ్ళు బిగించి బాధల్ని భరిస్తే నిన్ను

మెచ్చుకునేవాడెవడూ అక్కడ వుండడు. నిన్ను హింసంచటానికి వచ్చిన వాళ్ళకు నీ గొప్పతనంతో నిమిత్తం లేదు....''

అటువంటి మాటలు మొదలు పెట్టినప్పుడల్లా భద్రకాళి మాదిరి బాబూలాల్ మీద విరుచుకు పడేది రాధాబాయి.

నా బిడ్డ పెద్ద చదువులు చదువుకొని మంచి ఉద్యోగంలో చేరి నీతిగా బతుకుతాడు గానీ నీలాగా వీధుల వెంట పరిగెత్తడు, నీ అనుభవాలు వాడికి చెప్పాల్సిన అవసరం లేదని ఎత్తిపొడిచేది.

ఆమె అలా ఎదురు మాట్లాడినప్పుడల్లా పెద్ద వేదాంతి మాదిరి ముఖం పెట్టి వేదాంతపు మాటల్నే వల్లించేవాడు బాబూలాల్.

''ఈ జీవితమే పెద్ద పరుగు పందెం లాంటిది... అందులో ఎవరు ఎప్పుడు ఎందుకు పరుగెత్తుతారో, ఎక్కడ ఆగిపోతారో ఎవరికీ తెలియదు. ఏ విధంగా పరిగెత్తినా ఒక్కో సమయంలో క్రింద పడక తప్పదు... ఎదురు దెబ్బలు తినకా తప్పదు.... అటువంటి సమయాల్లో పెదవి విప్పకుండా ఆ బాధను దిగమ్రింగుకోవాల్సిన సందర్భాలు కొన్ని వుంటే, అరిచి కేకలు పెట్టి బయటికి చెప్పుకోవాల్సిన సమయాలు మరికొన్ని వుంటాయి. ఆ సమయాన్ని గురించి, సందార్భాల్ని గురించి చెపుతున్నానే గాని, అరవమని గాని, అరవకుండా నోరు మూసుకోమని గాని నేను చెప్పటం లేదు....''

తను పాల్గొంటున్న పరుగు పందెంలో అరిచి కేకలు పెట్టాల్సిన సందర్భం వచ్చేసిందని గ్రహించి బాబూలాల్ మాటల్ని అక్షరాలా అమలులో పెట్టాడు భాను.

దెబ్బ వంటిమీద పడినప్పుడల్లా చెవులు చిల్లులు పడిపోయే లెవల్లో కేకలు పెట్టటం ప్రారంభించాడు. వద్దు, వద్దని వేడుకున్నాడు. ఇంకొక్క దెబ్బను కూడా తాను భరించలేనని మొత్తుకున్నాడు.

మాస్ సైకాలజీని మధించి, మధించి అనుభవపూర్వకంగా బాబూలాల్ చెప్పిన మాటలు అప్పటికప్పుడు యదార్థం అయినాయి.

గింగిరాలు తిరిగిపోయే తన్ను తన్నటానికి ఎత్తిన పాదాన్ని వెంటనే క్రిందికి దించాడు ఆ గోలని భరించలేని దొర.

“పోటుగాడిలా పరుగెత్తుకు వచ్చి నా మనుష్యుల మీద కలబడినప్పుడు ఏమైపోయినాయిబే ఈ అరుపులు?” అని అడుగుతూ స్వల్పమైన తన్నుతోనే సరిపెట్టి తను కూర్చునే బెంచీ దగ్గిరికి వెళ్ళిపోయాడు.

కదలటానికి కూడా శక్తి లేనట్లు కనులు తేలవేసిన భాను ముఖంలోకి చూస్తూ, “వీడి పని అయిపోయినట్లుంది. తీసుకుపోయి రోడ్డు మీద పారేయనా?” అడిగాడు ఒక అనుచరుడు.

పది క్షణాలు ఆలోచించి తల అడ్డంగా వూపాడు దొర.

“వీడి కోసం ఆ లాయరు, వాడి బావమరిది వెతుక్కుంటూ వస్తారేమో చూద్దాం.. వీడి కోసం రాకపోయనా, వీడు తీసుకువచ్చిన వాళ్ళ కారు కోసమైనా రాకతప్పదు. ఆ కారును కూడా తీసుకొచ్చి యిక్కడ పెట్టండి.... వాళ్ళు రావటం అంటూ జరిగితే యింకా కొంచెం డబ్బు వసూలు చేద్దాం.....” అని ఆజ్ఞ ఇచ్చాడు.

వెంటనే భాను జేబుల్ని వెతికి తాళం చెవుల్ని తీసుకున్నాడా అనుచరుడు. పరుగు పరుగున బయటికి పోవాల్సిన మనిషి కాస్తా ఏదో అనుమానం వచ్చినట్లు అలాగే నిలబడిపోయాడు.

"ఏంటిబే నీ అనుమానం?" విసుగ్గా ఎంక్వయిరీ చేశాడు దొర.

"కారు పోయిందని వాళ్ళు కంప్లయింట్ చేయటానికి అవకాశం వుంది కదా.... ఆ కారు యిక్కడ వుండగా పోలీసులు వస్తే మనకి ప్రమాదం కదా!" తన అనుమానాన్ని బహిర్గతం చేసాడా అనుచరుడు.

పెద్దగా నవ్వి తొడచరిచాడు దొర.

"మన మీద కంప్లయింట్ చేసే శక్తి వాళ్ళకు లేదు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే టాపు లేచిపోతుంది. సూర్యప్రసాద్‌కి యాక్సిడెంట్ ఎందుకయిందో, ఎలా అయిందో పోలీసులకీ, పేపర్లకీ చేరిపోతుంది. చేతిలో వున్న ముద్ద నోటి ముందుకు రాకముందే మట్టిపాలు అయినట్లు, అందుబాటులోకి వచ్చిన ఎస్టేట్ అన్యాక్రాంతమైపోతుంది. వాళ్ళకా సంగతి బాగా తెలుసు. నువ్వు అవసరమైన భయాలు పెట్టుకోకుండా ఆ కారును తీసుకొచ్చేయ్....." ఇనుప గొలుసులు రాచుకున్నట్లు వికృతమైన కంఠంతో అతడు చెప్పిన మాటల్ని వినేసరికి సూదుల్లా లేచి నిలబడ్డాయి భాను మెడ మీద రోమాలు.

సో.... తన ఎనలైజేషన్‌లో తప్పు అనేది ఇసుమంత కూడా లేదన్నమాట? హరిహరవర్మని బెదిరించే ఆధారం ఏదో యితని దగ్గిర జాగ్రత్త చేయబడింది... అదేమిటో ఎలా తెలుస్తుంది తనకి? బాధల్ని సౌఖ్యాలుగా భావించమని అన్న కవి

ఎవరో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ అలాగే పడుకున్నాడతను కదలకుండా – మెదలకుండా.

“వీడిని తీసుకుపోయి పైన గదిలో పారేయండి... గది బయట గొళ్ళెం పెట్టి ఒక కంట కనిపెట్టుకుంటూ వుండండి.....” మరో అనుచరుడిని పిలిచి కొత్త ఆర్డర్ నొకదాన్ని పాస్ చేశాడు దొర.

కాళ్ళను పట్టుకున్నాడు ఆ వ్యక్తి. ఇంకో మనిషిని పిలిచి భుజాలు పట్టుకోమన్నాడు. ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో కనిపించే లారీల్లోని సరుకుల్ని చేరవేసే పద్ధతిలో పైకి తీసుకుపోయి ఖాళీగా వున్న గదిలోకి విసిరేశారు వాళ్ళు.... తలుపులు మూసి గొళ్ళెం పెట్టారు.

# 19

భద్రకాళి మాదిరి తన భార్య ఎంత విరుచుకుపడినా, భానుని పెంచటంలో నీతి నియమాలు తప్పనని లెక్చరర్ గారి ముందు ఎన్ని ప్రమాణాలు చేసినా, ఇంట్లో వున్నంతసేపూ బల్లి మాదిరి తన గుండెలకు అతుక్కుని వుండే భానుకు ఎంతో కొంత విద్యాబోధన చేయకుండా వుండలేకపోయాడు బాబూలాల్.

తగిలిన దెబ్బల్నించి త్వరగా కోలుకొని అవతలికి వెళ్ళిపోయే విద్య అందులో ఒకటయితే, చుట్టూ వున్న పరిసరాల్ని జాగ్రత్తగా వాచ్ చేసి, విలువ కలిగిన ప్రదేశాల్ని, ప్రాధాన్యత వున్న ప్రిమైసెస్‌ని కనిపెట్టటం మరొకటి.

"యూ అబ్జర్వ్ ఎలాట్ బై వాచింగ్...” అనే మూలసూత్రాన్ని దృష్టిలో పెట్టుకొని అతను చెప్పిన ఆ విషయాలన్నింటినీ మనసులో పదిలపరుచుకుంటూ

వచ్చాడు భాను. వాటితో తనకు అవసరం లేదని తెలిసినా కూడా బాబాయి మాటల్ని వినటం మానుకోలేదతను.

అనుకోని విధంగా ఇప్పుడు అవసరం కలిగేసరికి, నిర్మొహమాటంగా, నిరభ్యంతరంగా అమలులో పెట్టాడు ఆ విద్యను. దొర అనుచరులు పడవేసిన ప్రదేశంలో నుంచి కదలకుండా, గుండెల నిండా గాలిని పీల్చుకుని మెల్లగా బయటికి వదలటం మొదలుపెట్టాడు.

బాధని రేకెత్తించుతున్న ప్రదేశాల దగ్గిర కంటికి కనిపించిన ఆకారాలు చేరి, సూదులతో చిల్లులు పెడుతున్నట్లు ముందుగా ఊహించుకున్నాడు... గుండెల నిండా పీల్చుకుంటున్న గాలిలో ఆక్సిజిన్ అనే ఆయుధం ఒకటి వున్నట్లు, అది సూటిగా పోయి బాధని పెంచే ఆకారాల అంతు చూస్తున్నట్లు అనుకున్నాడు.

వేగంగా గాలిని పీల్చి గుండెల్లో కొద్దిసేపు నిలుపుకోవటం వల్ల ఆక్సిజన్ ఇన్ టేక్ అధికం అయింది. ఊపిరి తీసుకోవటంలో ఒక క్రమ పద్ధతి కనిపించగానే గుండె వేగం మందగించి, రక్త ప్రసరణ స్లో అయింది. రక్త ప్రసరణ స్లో అవటంతో పాటు, నాడుల స్పందన మందగించింది.... శరీరంలోని బాధలను వేగంగా మెదడుకు తీసుకుపోయే నాడులు కాస్తంత విశ్రాంతి తీసుకోవటం మొదలుపెట్టాయి.... బాధల్ని గురించిన వార్తలు ఆలస్యంగా అందుతూ వుండటంతో ఆ బాధల్ని చూసుకొని బావురుమనాల్సిందిగా పంపే ఆజ్ఞలను ఉపసంహరించుకున్నది మెదడు.

మంత్రం వేసినట్లు అప్పటికప్పుడు కాస్తంత ఉపశాంతి లభించటంతో బాబూలాల్ మాటల్లో వున్న లాజికల్ పాయింట్స్‌ని గురించి ఆలోచించటం మానుకొని, మెల్లగా తలుపుల దగ్గరికి జరిగాడు భాను.

చూపులకు దృఢంగానే వున్నట్లున్నా, ఎప్పుడో కట్టబడిన పురాతన కాలపు భవంతి కావటం వల్ల రకరకాల సందులు, రంధ్రాలతో నిండి వున్నాయి ఆ గది తలుపులు.

మంచి సందు నొకదాన్ని సెలక్ట్ చేసుకొని గోడ ప్రక్కనే సెటిల్ అయ్యాడు. తను చేస్తున్న దేమిటో బయటికి కనిపించకుండా జాగ్రత్తలు తీసుకొని వాచ్ చేయటం మొదలుపెట్టాడు.

మధ్యాహ్న సమయం గడిచి, సాయం సమయం అడుగు పెడుతున్న సమయంలో నలుగురు అనుచరులని వెంటబెట్టుకొని పైకి వచ్చాడు దొర. భాను బంధించబడి వున్న గదికి పది అడుగుల దూరంలో వున్న ఒక గది తలుపు తెరిచి లోపలికి పోయాడు. అక్కడ వున్న ఇనుప బీరువాని ఓపెన్ చేసి కొంత డబ్బును అనుచరుల చేతికి అందించాడు.

డబ్బును తీసుకుని వాళ్ళు క్రిందికి వెళ్ళిపోయినా, తాను మాత్రం గదిలోనే వుండిపోయాడు దొర. బీరువాలో నుంచి ఎకౌంట్ పుస్తకం వంటి పెద్ద పుస్తకాన్ని బయటికి తీసి ఏవో లెక్కలు చూసుకుంటూ అక్కడే కూర్చున్నాడు.

తలుపు సందులో నుంచి చూస్తున్న భానుకి, ఆ గదే కాకుండా అటువంటివి ఇంకో నాలుగు చాలా క్లియర్‌గా కనిపిస్తున్నాయి. వాటిలో ఏ

ఒక్కదానికి తాళాలు వేసి లేవు. దొర కూర్చున్న గదికి మాత్రమే కనిపిస్తోంది లావుపాటి బేంక్ తాళం. పరుల కంటపడకుండా దాచుకోవాల్సిన వస్తువులకే చాలా ఎక్కువ మోతాదులో వుంటాయి జాగ్రత్తలు.

చీకటి పడబోతున్న సమయంలో ఏతెంచిన తర్వాత కూడా దొర ఆ గదిలో నుంచి బయటికి రాకపోవటంతో, చిన్నగా ఆరంభమై భాను మనసంతా ఆక్రమించుకున్నది తప్పించుకోవాలనే కోరిక......

అందుకు సరైన అవకాశం ఆ తరువాత కొద్ది క్షణాలకే చిక్కింది అతని చేతులకి. ఎకౌంట్ బుక్ మీది నుంచి చూపుల్ని మరలించి ఎందుకో అతనున్న గదివైపు చూశాడు దొర. ప్రక్కనే వున్న బటన్‌ని ప్రెస్ చేసి క్రింది నుంచి ఒక అనుచరుడిని పైకి పిలిచాడు.

"ఆ గదిలో వున్న రాస్కెల్ ముఖం మీద కాసిని మంచినీళ్లు పోసి తాగటానికి టీ ఏదైనా తెచ్చిపెట్టండి..... పట్టించుకోకుండా వదిలేస్తే గుటుక్కుమనగలడు...." గది ముందుకు వచ్చిన వ్యక్తికి ఆజ్ఞ ఇచ్చి తన పనిలో తాను మునిగిపోయాడు.

గది మూలకు పోయి రెడీగా కూర్చున్నాడు ఆ మాటల్ని విన్న భాను.

పది నిమిషాల తర్వాత ఒక ప్లాస్టిక్ జగ్‌తో నీళ్ళు, పింగాణీ పాత్రలో చల్లారిపోయిన తేనీరు పోసుకొని ఆ గదిలోకి వచ్చాడు దొర అనుచరుడు.

ఊపిరి తీసుకొనే వ్యవధి అతనికి ఇవ్వలేదు భాను. శబ్దం బయటికి రాకుండా నోటిని మూశాడు. తలను ముందుకు జరిపి గోడకేసి కొట్టాడు.

జరుగుతున్నదేమిటో పూర్తిగా అర్థం కాకముందే స్పృహ తప్పిపోయిందా వ్యక్తికి. కనులు తేలవేసి చాపచుట్టలా క్రిందికి జారిపోయాడు.

జేబులన్నీ వెతికిన భానుకు అతని ఫాంటు జేబులో లభించింది పదునైన స్ప్రింగ్ నైఫ్.

ఎదుటి గదిలో వున్న దొర తన ముందున్న పుస్తకాన్ని మూసి బీరువాలో భద్రపరుస్తున్న సవ్వడిని విని తొందర పడ్డాడు భాను. నాలుగు అంగల్లో పోయి ఆ గది ముందు నిలుచున్నాడు.

బీరువా తలుపుల్ని మూసి లాక్ చేయబోతూ, తలతిప్పి అతని వంక చూశాడు దొర. అతనెవరో, ఎందుకు అక్కడికి వచ్చాడో గ్రహించటానికి అరక్షణం టైమ్ కావాల్సి వచ్చిందతనికి.

గ్రహించిన మరుక్షణం క్రింద వున్న తన అనుచరుల్ని పైకి పిలిచే బటన్ వైపు చేతిని జాచాడు.

దాని శక్తి ఎటువంటిదో ఇంతకు ముందే అబ్జర్వ్ చేసి వుండటం వల్ల వెంటనే అడ్డుకున్నాడు భాను. స్ప్రింగ్ నైఫ్‌ని గాలిలోకి దూసి అతన్ని గది వెనక్కి జంప్ చేయించాడు.

"నీ పని అయిపోయింది.... నువ్వు ప్రాణాలతో ఇక్కడి నుంచి బయటపడలేవు......" గోడని ఆనుకొని ఆ ప్రమాదం నుంచి తప్పించుకోనే మార్గం కోసం వెతుకుతూ బెదిరించాడు దొర.

అరిచి కేకలు పెట్టి అనుచరులనందర్నీ హెచ్చరించవచ్చుననే ఆలోచన అతనికి రాక ముందే పని పూర్తి చేసుకోవాలని భాను ఉద్దేశ్యం. అతని మీద నుంచి కనులు తిప్పకుండా, అక్కడ వున్న టేబిల్ మీది పేపర్ వెయిట్‌ని చేతిలోకి తీసుకున్నాడు.

విసరబోతున్నట్లు చేతిని ఎత్తేసరికి చటుక్కున తలను క్రిందికి వంచాడు దొర. మొదటి సారి విసరలేదు భాను. అతను తలవంచినప్పుడు విసిరాడు.

గింగిరాలు తిరుగుతూ పోయి దొర కణతకు తగిలిందా బరువైన వస్తువు.

బాధగా శబ్దం చేస్తూ మోకాళ్ళ మీద వాలిపోయాడు దొర.

ఒక్క గంతులో అతన్ని సమీపించి పిడికిలితో మెడ మీద పొడిచాడు భాను.... మెకాలితో ముఖం మీద కొట్టాడు.

దట్స్ టూ మచ్... మోకాళ్ళ మీద నుంచి లేవకుండానే ముందుకు దొర్లి బోర్లాపడిపోయాడు దొర... స్పృహ తప్పి తలను వ్రేలాడవేశాడు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని చిక్కబట్టుకోవటానికి ప్రయత్నిస్తూ అతని బీరువాని తెరిచాడు భాను.

ఏం కనిపిస్తోందో, దేని కోసం వెతకాలో అతనికి సరైన ఐడియా లేదు.... ఎవరినైనా బ్లాక్ మెయిల్ చేయాలంటే, ఏం కావాలి? అవతలి వాళ్ళు చేసిన పాడు పనుల తాలుకు ఫోటోలు కావాలి..... వాళ్ళకు ఎంత అవసరమైన డాక్యుమెంట్స్ ఏవైనా సంపాదించగలిగితే చాలు పని జరిగిపోతుంది... అలా కాకపోతే వీడియో క్యాసెట్స్ గాని, ఆడియో క్యాసెట్స్ గాని ఏవి వున్నా సరిపెట్టుకోవచ్చు... బీరువా

క్రింది భాగంలో వున్న లాకర్లో అతనికి ఆగుపించింది లాయర్ గారు దొర దగ్గిరికి తీసుకువచ్చిన బ్రీఫ్ కేస్. వరసల్లో పేర్చి వున్న అందులోని నోట్ల కట్టల్ని చూడగానే కళ్ళు చెదిరిపోయినట్లుయింది అతనికి. దాన్ని టేబుల్మీద పెట్టి లాకర్ లోకి ఇంకోసారి తొంగి చూసేసరికి కనిపించాయి నీట్‌గా పాక్ చేసి వున్న వీడియో క్యాసెట్స్.

బ్లాక్ మెయిల్ చేయటానికి అవసరమని తను అనుకున్న ఐటమ్స్‌లో వీడియో క్యాసెట్స్ కూడా వున్నాయి కాబట్టి వాటిని నోట్ల కట్ట మీద పెట్టి బ్రీఫ్ కేసును క్లోజ్ చేశాడు భాను.

ఇంకోసారి లాకర్ లోకి తొంగి చూడబోతుండగా అతని చెవులకు చేరింది ఎవరో అటుగా వస్తున్న సవ్వడి.

ఆలస్యం చేస్తే దొర హెచ్చరించినట్లు అక్కడి నుంచి ప్రాణాలతో బయటికి పోవడం సాధ్యపడదని గ్రహించి, గదిలో నుంచి బయటికి పరుగెత్తుకు వచ్చాడు భాను.

స్టెయిర్ కేస్ దగ్గర్నుంచి అలికిడి తీవ్రస్థాయిలో వినవచ్చేసరికి, ఎటుపోవాలో అర్థం కాక, ప్రక్కనే వున్న గదిలోకి జంప్ చేశాడు. అందులో కనిపించిన చెక్క బీరువాని నిశ్శబ్దంగా ముందుకు జరిపి దాని చాటున ఒదిగి కూర్చున్నాడు.

పది అంకెలు కూడా లెక్కబెట్టటం పూర్తి కాకముందే దొర గది ముందు చెలరేగింది ఒక గందరగోళం....

"రండిరోయ్ రండి... దొంగరాస్కెల్ దొరను కొట్టి పారిపోయాడు. రండి.... రండి...." అని అరుస్తూ అటూ ఇటూ పరుగులు ప్రారంభించాడు పైకి వచ్చిన దొర అనుచరుల్లో ఇద్దరు. భాను దాగుకొని వున్న గదిలోకి వచ్చి అక్కడి మంచినీళ్ళ కుండను మోసుకుపోయారు మరో ఇద్దరు. దొర ముఖం మీద నీళ్ళు జల్లి ఉపచారాలు మొదలు పెట్టారు.

రెండు నిమిషాలు తరువాత కనులు తెరిచాడు దొర. బార్లా తెరిచి వున్న బీరువా తలుపుల్ని, ఖాళీగా వున్న లాకర్‌ను గమనించేసరికి పూనకం వచ్చేసినట్లయింది అతనికి.

"ఇది ఆ హరిహరవర్మ పన్నాగమే... నమ్మించినట్లే నమ్మించి వెన్నుపోటు పొడవటానికి ఎక్కడి నుంచో రప్పించాడు ఈ దొంగ రాస్కెల్‌ని.... వాడు మనకి పట్టుబడటం, మన దగ్గిర బందీ అవటం అంతా నాటకం....." పళ్ళు పటపటమని కొరుకుతూ వెల్లడించాడు తన అభిప్రాయాన్ని.

భవనం క్రింది భాగాన్ని, భవనం చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని వెతకటానికి పోయి వున్నారు కొందరు అనుచరులు. వట్టి చేతులతో తిరిగి వచ్చి గుంపుగా నిలబడ్డారు వాళ్ళు అతని ఎదుట.

"కారు... కారు ఇక్కడే వుంది దొరా... వాడు ఇక్కడే ఎక్కడో దాక్కుని వుంటాడు....." ఒక కిటికీలో నుంచి క్రిందికి చూస్తూ అర్జంట్‌గా అన్నాడు పైనే వుండిపోయిన వారిలో ఒకతను.

“ఈ కారు కోసం కిందికి వచ్చి అనవసరమైన బాధలు పడాల్సిన అవసరం వాడికి ఏముంది బే? వాడి కోసం ఇంకోకారు వెయిట్ చేస్తూ వుండి వుంటుంది. ఈ పాటికి సిటీని దాటి ఎస్టేట్ వైపు వెళ్ళిపోతూ వుంటాడు” తను కూడా క్రిందికి చూస్తూ అన్నాడు దొర.

“ఇప్పుడేం చేద్దాం దొరా? చేతులు ముడుచుకు కూర్చోవలసిందేనా? దెబ్బకు దెబ్బ తీయలేమా?” ఆత్రుత నిండిన కంఠంతో అడిగాడు మరో అనుచరుడు.

“దెబ్బకు దెబ్బ తీయకపోతే ఏలా బే? నలుగురికీ ఈ సంగతి తెలిస్తే మన పరువేం కావాలి? మనల్ని చూసి ఎవరైనా భయపడతాడా?” ఆ గదిలో పచార్లు చేయటం మొదలు పెడుతూ అన్నాడు దొర.

“అయితే ఆలస్యం దేనికి దొరా? వెంటనే వెళ్ళి ఎస్టేట్ మీద పడదాం... ఆ హరిహరవర్మని బయటికి లాగి తల పగల....” అనబోతూ అతను క్రూరంగా చూసేసరికి మాటల్ని మింగేశాడు ఇంకో అనుచరుడు.

“ధార్వాడ ఎస్టేట్ అంటే నీకు ఎలా కనిపిస్తోంది బే? నాలుగు ఎకరాల చుట్టూ ముళ్ల కంచెలు వేసుకొని సజ్జలు పండించుకునే ఫారమ్ హౌస్ మాదిరిగా అనిపిస్తోందా?” అతని వంక అలాగే చూస్తూ అడిగాడు దొర.

“దగ్గిర దగ్గిరగా వెయ్యి మందికి పైగా పనిచేస్తూ వుంటారక్కడ... తనని బెదిరించే ఆధారం మన దగ్గర్నుంచి మాయమైపోయిందని తెలియగానే, పనులు ఆపించి వారందర్నీ తన భవనం చుట్టూ నిలబెడతాడు హరిహరవర్మ...

పోలీసులకు కబురు పంపి పటాలాలకు పటాలాలు తెప్పించుకోగలిగిన శక్తి అతనికి వుంది.... అటువంటి వాడి మీద అడ్డగోలుగా దాడిచేస్తే నష్టం మనకే... అతనికేమీ కాదు....." అంటూ తిరిగి పచార్లు చేయటం మొదలుపెట్టాడు.

"అయితే మనం ఏం చేద్దాం... ఈ వేడి చల్లారేదాకా ఆగుదామా?" ఆత్రుతని అణుచుకోవటం చేతకాక మళ్ళీ నోరు విప్పాడు ఆ అనుచరుడు.

ఈ సారి క్రూరంగా చూడలేదు దొర. అతని నోరు మూయించలేదు.

"వేడి చల్లారిన కొద్దీ మన చేయి క్రింద అవుతుంది. హరిహరవర్మ చెయ్యి పైకి పోతుంది. అంతవరకూ ఆగకూడదు... ఆత్రపడకుండా ఇప్పుడే ఈ క్షణంలోనే దెబ్బ కొట్టాలి....." అంటూ గుంపుగా నిలబడిన వారిలో నుంచి పదిమందిని సెలక్ట్ చేశాడు.

"మన జీప్‌ని తీసుకుని మీరు ఎస్టేట్‌కి ప్రయాణం కండి.... దారి మధ్యలో ఈ దొంగ రాస్కెల్ కనిపిస్తే అసలు సమస్య లేదు. కామ్‌గా ఖతం చేసి వాడి దగ్గిర ఉన్న కాసెట్స్‌ని, బ్రీఫ్‌కేసుని తీసుకువచ్చేయండి. వాడు మీ కంటే ముందుగా ఎస్టేట్‌కి చేరుకోవటం జరిగినట్లయితే.... అక్కడి పరిస్థితుల్ని జాగ్రత్తగా గమనించండి. వీలుచూసుకుని హరిహరవర్మనో, లాయర్‌నో, అతగాడి కొడుకునో ఎవరినో ఒకర్ని ఎత్తుకు వచ్చేయండి.... వాళ్ళని అడ్డం పెట్టుకుని నేను కథని నడుపుతాను... చిత్రహింసలు పెట్టి మన క్యాసెట్స్‌ని డబ్బుని వెనక్కి తెప్పిస్తాను....." అని చెప్పాడు.

తలలు ఊపుతూ క్రిందికి బయలుదేరారా అనుచరులు. వాళ్ళు స్టెయిర్ కేస్‌ని చేరుకోకముందే గదిలో వున్న అనుచరుడికొకతనికి ఫ్లాష్ అయింది బ్రహ్మాండమైన ఆలోచన.

"హరిహరవర్మకి ఒక్కతే కూతురు వుంది... లాయర్ సాబ్ ఇంట్లో వుండి కాలేజి చదువేదో చదువుకుంటోంది... ఆ పిల్ల ఎస్టేట్‌లో గనుక వుండి వుంటే పట్టుకురావటం చాలా బాగుంటుంది. ఎస్టేట్‌లో లేకపోతే, నాలుగు రోజులు ఆగి ఆమె చదువుకుంటున్న చోటికే పోయి పట్టుకొచ్చేదాం... మగవాళ్లకు ముసుగు వేయటం కంటే, ఆడపిల్లను ఎత్తుకురావటం చాలా తేలిక... కూతురి కోసం మన కాళ్ళ దగ్గిరికి హరిహరవర్మ రాక తప్పదు...." స్టెయిర్ కేస్ దగ్గిరికి పోబోతున్న వారిని ఆగమని సైగచేస్తూ దొరకి వినిపించాడు ఆ ఆలోచనని.

రెండు క్షణాలు ఆలోచించి ఆనందంగా తల వూపాడు దొర. బ్రహ్మాండంగా వుందని మెచ్చుకుంటూ, బీరువా పై అరలోనే వున్న ఒక నోట్ల కట్టని తీసి అతనికి అందించాడు.

"దగ్గరి వుండి ఆ పని పూర్తి చేయించు... ఆ పిల్ల చదువుకుంటున్న చోటికి పోయి అవసరమైతే నాలుగు రోజులు వెయిట్ చేయండి. పని పూర్తి కాకుండా తిరిగి రావద్దు" అని ఆర్డర్ ఇచ్చాడు.

స్టెయిర్‌కేస్‌ని దడదడలాడిస్తూ వాళ్ళు క్రిందికి వెళ్లిన తరువాత బీరువా తలుపులు మూసి తను కూడా బయటికి వచ్చాడు దొర. విలువ కలిగిన మెటీరియల్ మాయం అయినా, అలవాటు ప్రకారం గదికి తాళం వేసి క్రిందికి పోయాడు.

తలుపులు బార్లా తెరిచి వున్న ఖాళీ గదిలోకి రావాలని గాని, చెక్క బీరువా చాటుకి తొంగి చూడాలని గాని అతనికీ, అతని అనుచరుల్లో ఎవరికీ తోచలేదు.

భవనం క్రింది భాగంలో అంత మంది వుండగా, అనన్య సామాన్యుడని పేరు గాంచిన దొరను, అతని గదిలోనే పడగొట్టిన మనిషి, ఆ ప్రక్కనే పది అడుగుల దూరంలో, పుచ్చిపోవటానికి సిద్ధంగా వున్న చెక్క బీరువా చాటున నక్కుతాడని ఎవరైనా అనుకుంటారా?

*        *        *        *        *

రాత్రి పది గంటలు అయ్యేదాకా కూర్చున్న చోటి నుంచి కదలలేదు భాను. గుండు సూది క్రింద పడినా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంగా ఆ భవనాన్ని చుట్టుముట్టిన తర్వాత మెల్లగా లేచి ఇవతలికి వచ్చాడు. స్టెయిర్‌కేస్‌ని ఉపయోగించకుండా, పిట్ట గోడల దగ్గిరికి పోయి క్రిందికి చూశాడు.

భవంతి ముందు భాగంలో పచార్లు చేస్తున్నారు దొర అనుచరులు పది మంది. ఆ ప్రదేశాన్ని వదిలి అవతలికి పోయే ఆలోచన లేనట్లు కబుర్లతో కాలక్షేపం కావించుకుంటున్నారు.

అక్కడికి సమీపంలోనే పార్క్ చేయబడి వుంది సూపర్‌బజార్ దగ్గర్నుంచి వాళ్ళు తీసుకువచ్చిన కారు. వాళ్ళు అక్కడ వుండగా దాని దగ్గరికి పోవటం మాత్రం ఇంపాజిబుల్.

కారు లేకుండా సిటీ వీధుల్లో చక్కర్లు కొట్టడం కూడా ప్రమాదాన్ని చేజేతులారా ఆహ్వానించుకోవటమే అవుతుంది.

పాతిక లక్షల విలువ చేసే క్యాష్ వుంది తన దగ్గిర... అభ్యంతకరమైన కాసెట్లు ఏవో వున్నాయి. నైట్ బీట్ కానిస్టేబుల్స్ ఎవరయినా అనుమానించినా, చీకటి వేళల్లో పట్టణ వీధుల్ని పవారా కాసే పెట్రోలింగ్ వాన్స్ ఎదురయినా సమాధానం చెప్పుకోవటం చాలా కష్టం.

కారు సంపాదించుకోవాల్సిందే... కాలి నడకన వెళ్ళే ప్రశ్నకు అసలు తావు లేదు.

బ్రీఫ్ కేసును ప్రక్కన పెట్టుకుని, పిట్టగోడ వెనకాల ఒదిగి కూర్చుంటూ తీవ్రంగా ఆలోచించాడు భాను. క్రిందికి పోయి కార్లో కూర్చునే దాకా దొర అనుచరులు తనను గమనించకూడదు..... ఎలా? పది నిముషాల పాటు మెదడు చింపుకున్న తరువాత అతనికి తోచిందొక మార్గం. రిస్క్‌తో కూడుకున్నదే అయినా, మరో ఆలోచన ఏదీ రాకపోవటంతో అందుకు సిద్ధపడి, పిట్టగోడ దగ్గర్నుంచి లేచాడు. దగ్గర్లో వున్న గది దగ్గరికి పోయి, దాని ద్వారం ప్రక్కనే వున్న ఎలక్ట్రిక్ స్విచ్‌ని బ్రీఫ్ కేసుతో పగలగొట్టాడు.

దట్టమైన నిశ్శబ్దం అక్కడ రాజ్యమేలుతూ వుండటం వల్ల, వెంటనే క్రిందికి వినిపించిందా శబ్దం. దొర అనుచరుల్ని ఎలర్ట్ చేసింది.

షాక్ కొట్టకుండా బ్రీఫ్ కేస్‌ను నేల మీద పెట్టి దాని మీద నిలబడ్డాడు భాను. పగిలిపోయిన స్విచ్ లోన వైర్లను విడివిడిగా పీకి, ఒక్కసారిగా కలిపాడు.

ఛట్ మని వినవచ్చింది ఒక శబ్దం... నీలం రంగు మెరుపులు రెండు ఆ వైర్లలో నుంచి బయటికి వచ్చాయి. అదే సమయంలో ఎగిరిపోయింది ఆ

భవనంలోని కరెంట్ నంతా రెగ్యులేట్ చేసే మెయిన్ బోర్డ్ లోని ఫ్యూజ్. కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని గాఢాంధకారం భవనాన్ని ఆవరించుకున్నది.

"పట్టుకోండిరోయ్ పట్టుకోండి... పారిపోతున్న దొంగ రాస్కెల్‌ని పట్టుకోండి....." అరుస్తూ మళ్లీ పిట్టగోడ దగ్గరికి పరిగెత్తాడు భాను.

స్విచ్ పగిలిన శబ్దానికే ఎలర్ట్ అయిన దొర అనుచరులు, కరెంట్ పోవటంతో ఖంగారు పడిపోయారు.... పై నుంచి స్టార్ట్ అయిన అరుపులు వారి ఖంగారును మరింత అధికం చేశాయి. వెనకా ముందు ఆలోచించుకోకుండా, అందరూ కలిసి లోపలికి పరుగెత్తుకు వచ్చారు.

పిట్టగోడమీది నుంచి క్రింద వున్న సన్‌షేడ్ మీదికి జారాడు భాను.... అక్కడి నుంచి నేల మీదకి దూకి నాలుగు అంగల్లో కారును సమీపించాడు.

ఆఖరి క్షణంలో ముఖం చాటు చేయకుండా అతని వెన్నంటే వుంది అదృష్టదేవత. లాక్ చేయబడలేదు కారు తలుపులు... డేష్ బోర్డుకు వ్రేలాడుతూనే వున్నాయి తాళం చెవులు.

బ్రీఫ్‌కేసుని వెనుక సీట్లోకి విసిరి, స్టీరింగ్ ముందు కూర్చున్నాడు భాను. భవనంలోకి పోయినవారు పిట్టగోడ దగ్గిర ప్రత్యక్షం అవటం, కారును స్టార్ట్ చేసి అతను రోడ్డు మీదికి దూసుకుపోవటం ఒకేసారి జరిగాయి.

# 20

తూర్పు దిక్కు పూర్తిగా తెల్లబడకముందే నిద్రలేచి బెడ్‌రూమ్ కిటికీ దగ్గిరికి పోయి బయటికి తొంగి చూసింది గీతిక.

గారేజ్ ముందు కనిపించలేదామెకు కారు. భాను వచ్చిన జాడలు అగుపించలేదు.

క్షణాల మీద డ్రసెప్ అయి కిచెన్ లోకి వెళ్ళిందామె. డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ, "భాను బెంగుళూరు నుంచి తిరిగి వచ్చాడా?" అని అక్కడి అటెండెంట్‌ని అడిగింది.

"భాను ఎవరు తల్లీ ?" అయోమయంగా చూస్తూ అడిగాడు అటెండెంట్.

"భాను... మా కారు డ్రయివర్... నిన్న ఉదయం ఇక్కడికి వచ్చి టిఫెన్ చేశాడు......" అతనికి అర్థం అయ్యేటట్లు ఎక్స్‌ప్లెయిన్ చేసిందామె.

"అతనా! అతను రాలేదమ్మా... మీరు కబురు పంపించందే ఇక్కడికి ఎలా వస్తాడు? బయట ఎక్కడైనా వున్నాడేమో!" అన్నాడు అతను.

ఆ మాటల్లో యదార్థం వున్నట్లు తోచి గబగబా భవనం ముందు భాగంలోకి బయలుదేరింది గీతిక.

"ఇంత పొద్దున్నే ఎక్కడికి బయలుదేరావ్?" అంటూ ఒక గదిలో నుంచి బయటికి వచ్చాడు లాయర్ సాబ్.

"భాను వచ్చాడేమో చూడటానికి పోతున్నా మామయ్యా... చీకటి పడకముందే రావాల్సిన మనిషి యింకా రాకపోవటం ఏమిటో నాకు అర్థం కావటం లేదు" తన యాంగ్జయిటీని ఫ్రాంక్‌గా తెలియచేసింది గీతిక.

"భాను విషయంలో నువ్వు అవసరానికి మించిన ఇంట్రస్ట్‌ని చూపిస్తున్నావ్...." ఉన్నట్లుండి సీరియస్‌గా అన్నాడు లాయర్ సాబ్.

ముందుకు వేయబోతున్న పాదాన్ని వెనక్కి తీసుకొని చురుకుగా చూసింది గీతిక.

“భాను నా క్లాస్‌మేట్... నీకు డ్రయివర్ అయితే అయ్యేడేమో గాని అతను నా స్నేహితుడు. అతని విషయంలో ఇంట్రస్ట్ చూపించటం నా విధి” బ్లంట్‌గా అంటూ ముందుకు అడుగు వేయబోతుండగా, పై నుంచి దిగివస్తూ ఆమెను పిలిచాడు హరిహరవర్మ.

“వయసు పెరిగుతున్న కొద్దీ నీ మొండితనం హద్దులు మీరుతుంది. మామయ్య మాటలకు ఎదురు చెప్పేటంత గొప్పదానివైపోయావా? ఆ భాను ఎవడోగాని వాడికోసం నువ్వు వెతకాల్సిన అవసరం లేదు... వాడు రాగానే ఉద్యోగం వూడగట్టి అవతలికి పంపేస్తాను. నీ గదికి వెళ్ళిపో....” ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞ యిస్తూ, ఆమె గదివైపు చేయి చూపించాడు.

తను ఏం చేసినా, ఎవరితో మాట్లాడినా ఎప్పుడూ ఆబ్జక్ట్ చేయని తండ్రి ఆ విధంగా మాట్లాడేసరికి బిత్తరపోయింది గీతిక.

“నాకు కావల్సిన కాస్మెటిక్స్ తీసుకురావటానికి బెంగుళూరు వెళ్ళాడు భాను. అవి తీసుకువచ్చాడో లేదో తెలుసుకోవాలి... జస్ట్... పది నిముషాల్లో వచ్చేస్తాను......” బేలగా అంటూ అడుగు కదపబోతుండగా మరోసారి అడ్డుకున్నాడు తండ్రి.

“నువ్వు ముందు నీ గదిలోకి పోతావా? నన్ను తీసుకుపోయి దింపమంటావా?” అని గర్జించాడు.

నీళ్ళతో నిండిపోయాయి గీతిక కనులు. కనురెప్పల్ని అల్లల్లార్చి వాటిని రెప్పలచాటున అదుముకోవటానికి ప్రయత్నిస్తూ, తన గదివైపు పరిగెత్తింది.

“ఈ భాను వ్యవహారం ఏదో వెంటనే తేల్చేయ్... అతను మన దగ్గిర వుండటం శ్రేయస్కరమని నాకు అనిపించటం లేదు....” హాల్లో వుండే సోఫాలో కూర్చుంటూ లాయర్ సాబ్‌తో అన్నాడు హరిహరవర్మ.

“ఉద్యోగం యిప్పించమని గీతిక రికమెండ్ చేసినప్పుడే నాకు అనుమానం రావాల్సింది... ఇప్పటికైనా వచ్చినందుకు సంతోషంగా వుంది.... ఐ విల్ సెండ్ హిమ్ బేక్... బెంగుళూరు నుంచి తిరిగి రాగానే పంపించేస్తాను....” అంటూ భవనం ముందు భాగంలోకి వచ్చి, కొండల మీదినుంచి వస్తున్న పరిశుభ్రమైన గాలిని పీల్చుకుంటూ నిలబడ్డాడు లాయర్ సాబ్.

కిచెన్‌లోకి వచ్చిన అమ్మాయి గారు కాఫీ తాగకుండా వెళ్ళేపోయేసరికి తనను, తన వృత్తిని అవమానించినట్లుగా ఫీల్ అయ్యాడు అక్కడి అటెండెంట్. కాఫీ కప్పుని తీసుకొని ఆమె గది ముందుకు పోయాడు.

“నాకు కాఫీ వద్దు. నన్ను డిస్టర్బ్ చేయకుండా ముందు యిక్కడినించి వెళ్ళిపో.....” బెడ్ మీద బోర్లా పడుకుని వున్న గీతిక తలెత్తి చూడకుండానే కసిరికొట్టింది అతన్ని.

ఆమె కంఠంలో ఏదో అపశృతి వినవచ్చి – అవతలికి పోకుండా లోపలికే వెళ్ళాడతను. “మీ బాధ ఏమిటో నాతో చెప్పండమ్మా.. అర్చకపోయినా

తీర్చకపోయినా గుండెలమీది బరువు కాస్తంత తగ్గిపోతుంది.....” అనునయంగా అంటూ కాఫీ కప్పును ఆమె ముందు పెట్టి పట్టుకున్నాడు.

“భాను మీద ఎవరైనా నాన్న గారికి గాని, మామయ్యకు గాని ఎక్కిస్తూ చెప్పారా?” లేచి కూర్చుని ఆ కప్పును అందుకుంటూ అడిగింది గీతిక.

అతను అయోమయంగా చూడటంతో, అంతకు ముందు రోజు కిచెన్‌లోకి వచ్చిన డ్రయివర్ పేరే భాను అని మరోసారి ఎక్స్‌ప్లెయిన్ చేయబోతుండగా, గుర్తుకువచ్చినట్లు చిటికెవేసి గొంతు తగ్గించాడు అటెండెంట్.

“మొన్న సాయంత్రం మీరు చాముండేశ్వరి ఆలయం దగ్గర్నించి వచ్చినప్పుడు మీతో పాటు వచ్చిన యిద్దరూ వట్టి అగ్గిపుల్లలు... వాళ్లు వింటుండగా ఆ కుర్రాడితో ఏమైనా మాట్లాడి వుంటే గుర్తుకు తెచ్చుకోండి.....” అని చెప్పి తన చోటికి తను వెళ్ళిపోబోతుండగా అపింది గీతిక.

“వాళ్ళు ఏం చెప్పారో నాకు తెలియాలి. ఇద్దర్నీ నేను రమ్మన్నానని చెప్పు” అనేసరికి భయం భయంగా చూస్తూ యింకా కాస్త గొంతు తగ్గించాడు అటెండెంట్.

“చిన్నచిన్న మాటలతో మర్యాదగా అడిగితే వాళ్ళు దారికి రాకపోవచ్చు. పెద్దగా అరిస్తే క్రిందికి వినపడి అయ్యగారు పైకి వచ్చేస్తారు. తొందరపడకుండా తాపీగా యింకో మార్గం ఆలోచించడమ్మా” అని సలహా యిచ్చాడు.

తొందర పడకుండానే ఆలోచించింది గీతిక. చటుక్కున బెడ్ మీది నుంచి దిగి, “మనసు బాగోకపోవటం వల్ల ఒకసారి చాముండేశ్వరీ ఆలయానికి

వెళ్ళాలని అనుకుంటున్నట్లు వాళ్ళకి చెప్పు.... నాతో పాటు రావటానికి రెడీ అవమని చెప్పు. ఎవర్నయినా పిలిచి ఏదో ఒక జీప్‌ని సిద్ధం చేయమని కబురు పంపు....." అంటూ ఆర్డర్ యిచ్చింది.

చాముండేశ్వరీ ఆలయానికి వెళ్ళిన తరువాత ఆ సర్వెంట్స్ ఇద్దరూ ఆలయంలోని దేవతతో పాటు ఇంకో చాముండిని చూడబోతున్నట్లు గ్రహించి, తనలో తాను నవ్వుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు అటెండెంట్.

అరగంటలో ప్రిపేర్ అయింది గీతిక. కిచెన్‌లోకి పోయి యింకో కప్పు కాఫీ తీసుకున్నది. అక్కడినుంచి హాల్లోకి వచ్చేసరికి, ప్రయాణానికి సిద్ధం అయినట్లు అటూ ఇటూ తిరుగుతూ ఆమెకి కనిపించాడు దినేష్.

"చాముండేశ్వరీ ఆలయం దగ్గిరికి పోయి రాదలుచుకుంటే దినేష్‌ని వెంటబెట్టుకు వెళ్ళు... ఆలయం తలుపులు తీయటం, అమ్మవారి ముందు దీపం వెలిగించటం దినేష్‌కి తెలుసు....." ఆమె ముఖంలోని భావాలను గమనించి, సీరియస్‌గా చూస్తూ చెప్పాడు హరిహరవర్మ.

ప్రోగ్రాం కాన్సిల్ చేసుకుంటే, తను మరింత తేలికపడిపోవటం జరగుతుందని గ్రహించి అందుకు అంగీకరించింది గీతిక.

తనే గారేజి దగ్గిరికిపోయి జీప్‌ని తీసుకువచ్చాడు దినేష్, ఘాట్ రోడ్డు మీద కూడా వేగం తగ్గించకుండా స్పీడ్‌గా ఆలయం దగ్గిరికి తీసుకుపోయాడు.

ఎస్టేట్‌కి సంబంధించిన కట్టడాలను దాటి వచ్చిన మరుక్షణం, తమ వెనుక ప్రత్యక్షం అయిన మరో జీప్‌ని అతను పట్టించుకోలేదు. పట్టించుకోవాల్సిన సమయం ఆసన్నమయ్యేసరికి చాలా ఆలస్యం అయిపోయింది.

మూకుమ్మడిగా అతని మీద పడి బలమైన దెబ్బలతో గాయపరిచారు ఆ జీప్‌లో వచ్చిన వ్యక్తులు. భయంతో బెంబేలెత్తిపోతూ ఆలయంలోకి పరిగెత్తబోయిన గీతికను వెంటాడి జీప్‌లోకి ఎక్కించారు.

వచ్చిన దారిని వదిలి, కాలిబాట మాదిరిగా కనిపిస్తున్న అడవిదోవ వైపు పరిగెత్తంది జీప్. అయిదు క్షణాల్లో దృష్టిపథం నుండి దూరమై పోయింది.

## 21

తెల్లవారకముందే ఎస్టేట్‌ని చేరుకోవాలన్న తొందరలో యాక్సిలేటర్ని అడుగుకంటా అదిమి పట్టి కారును అతి వేగంగా నడిపాడు భాను... తన యాంగ్జయిటీలో తనుండి ఆ వేగాన్ని కారు తట్టుకోలేకపోతున్న సంగతిని గమనించలేకపోయాడు. ఫలితంగా సిటీని దాటి యాభై కిలోమీటర్ల దూరం కూడా పోకముందే విచిత్రమైన శబ్దాలు చేస్తూ పనిచేయటం మానుకున్నది ఇంజన్.

రోడ్డు మధ్యలో నిలబడి ఎందుకు ఆగిపోయిందో ఐడెంటిఫై చేయటానికి భయపడ్డాడు భాను. కందిరీగల తుట్టి వంటి దొర అనుచరుల్ని రెండోసారి కదిలించి వచ్చాడు తను.... కక్షగట్టి వాళ్ళు తరుముకుంటూ వస్తే?

రోడ్డు మధ్యలో నిలబడిపోయిన కారును ప్రక్కకు నెట్టి, అందులో వున్న తన సరంజామానంతా చేతుల్లోకి తీసుకున్నాడతను. డోర్స్ లాక్ చేసి లెఫ్ట్ రైట్

కొడుతూ రెండు కిలోమీటర్లు దూరం వెళ్ళేసరికి వెనుక నుంచి అటుగా వస్తూ అగుపించిందొక లారీ.

దొర అనుచరులు ఎవరూ అందులో వుండి వుండకూడదని భగవంతుడిని ప్రార్థిస్తూ, రోడ్డు మధ్యకు వెళ్ళి చేతులు ఎత్తాడు భాను.

“ధార్వాడా ఎస్టేట్ దగ్గిరికి పోవాలి.... లిఫ్ట్ ఇస్తారా?” లారీని ఆపి విండోలోనుంచి తొంగిచూసిన డ్రయివర్‌ని రిక్వెస్ట్ చేశాడు.

“రోడ్డు ప్రక్కన వదిలేసిన మారుతీకారు మీదేనా?” అడిగాడు ఆ డ్రయివర్.

“దాని వాలకం చూసేసరికి ట్రబుల్ ఏదో వచ్చి వుంటుందని అనిపించింది... ఎవరైనా కనిపిస్తే ఎక్కించుకుందామని నెమ్మదిగా వస్తున్నాను” తన ప్రశ్నలకు భాను తల వూపగానే, పైకి రమ్మని సైగ చేస్తూ అన్నాడతను.

ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేసి ఉదయం ఏడుగంటల సమయంలో ఒక మట్టిరోడ్డు ప్రక్కన ఆగింది లారీ.

“ఈ రోడ్డు మీదుగా రెండు కిలోమీటర్లు నడిస్తే ఎస్టేట్‌కి చెందిన చాముండేశ్వరీ ఆలయం కనిపిస్తుంది.... అక్కడినుంచి పరీక్షగా చూస్తే ఎస్టేట్ కట్టడాలు కనిపిస్తాయి.....” త్వరగా వెళ్ళటానికి దారిని సూచిస్తూ లారీని కదిలించాడు డ్రయివర్.

తనను తీసుకు వచ్చినందుకు తగిన ఛార్జి తీసుకోమని భాను పెద్దగా పిలుస్తున్నా వినిపించుకోకుండా తన దారిన తాను వెళ్ళిపోయాడు.

దొర తన్నిన తన్నులకు నలిగిపోయిన శరీరం నడవటానికి నిరాకరిస్తున్నా, బలవంతంగా అడుగులు వేస్తూ అరగంట తర్వాత ఆలయాన్ని చేరుకున్నాడు భాను... ఆలయం మెట్లమీద నిలబడి, దూరంలో ఆగుపిస్తున్న ఎస్టేట్ కట్టడాలను చూసిన తర్వాత గాని గుర్తుకు రాలేదు, తన చేతిలో వున్న మెటీరియల్ ఎటువంటిదో.....

దొర దగ్గిర వుండవలసిన తమ రహస్యాలు చేతులు మారిన సంగతి గ్రహించిన మరుక్షణం రాక్షసులైపోతారు లాయర్ సాబ్, హరిహరవర్మ.... వాటిని స్వాధీనపరుచుకోవటానికి ఎంతకైనా తెగించగలరు.

తనకంటె ముందుగా ఎస్టేట్‌కి బయలుదేరి వచ్చిన దొర అనుచరులు ఆ చుట్టుపట్ల ఎక్కడా లేరని నిశ్చయం చేసుకొని, చేతిలోని బ్రీఫ్ కేసును ఆలయం కోనేరు వద్దున ఒక గోతిలో భద్రపరిచాడు భాను...... మిగిలిన పాకెట్స్‌ని మాత్రం వెంట తీసుకొని, మళ్ళీ నడక మొదలు పెట్టాడు.

ఈ సారి ఖచ్చితంగా గంటకు పైగానే పట్టిందతనికి హెడ్ క్వార్టర్స్‌ని సమీపించటానికి. బెంగుళూరు నుంచి రావటానికి ఆలస్యమెందుకయిందని ఎవరైనా అడిగితే, ట్రబుల్ యిచ్చిన కారును గురించి చెప్పటానికి మాటలు వెతుక్కుంటూ ఘాట్ రోడ్డును వదిలి, హెడ్ క్వార్టర్స్ వైపు తిరగబోతుండగా, కనిపించారతనికి అక్కడ గుంపులు గుంపులుగా నిలబడివున్న వర్కర్స్.

బెంగుళూరు దొర తన అనుచరులకు చెప్పి పంపిన మాటలు గుర్తుకు వచ్చి చలిగాలి వీచినట్లు జలదరించింది అతని శరీరం..... గీతిక ఎస్టేట్‌లోనే వున్నదని తెలుసుకొని, వచ్చిన పనిని పూర్తి చేసుకున్నారు వాళ్ళు??

తడబడుతున్న అడుగులతో సూటిగా ఎస్టేట్ భవనం వైపు వస్తున్న అతన్ని చూసి, ఎదురు వచ్చాడు గురవప్ప... అతన్ని ఎవరూ గమనించక ముందే దగ్గర్లో వున్న ఒక రేకుల షెడ్డు చాటుకు లాక్కుపోయాడు.

"ఏమయింది తాతా? ఎందుకీ ఖంగారు??" భవనం ముందు చెలరేగుతున్న గందరగోళాన్ని ఆలకించటానికి ప్రయత్నిస్తూ అడిగాడు భాను.

"నా ఖంగారెందుకో తర్వాత చెప్తాను గాని, ముందు నా మాటలకు సమాధానం చెప్పు... నిన్న పొద్దుననగా ఎక్కడికో పోయినవాడివి, ఇంత వరకూ ఏం చేస్తున్నావు?" అతని ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు గురవప్ప.

ఎంత కావాల్సినవాడయినా, తను ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో చెప్పటానికి తటాపటాయించాడు భాను.

"అనవసరమైన విషయాల్లో వేళ్ళు పెట్టవద్దని నీకు చిలక్కి చెప్పినట్లు చెప్పాను.... వినలేదు... ఇప్పుడు చూడు ఏమయిందో?" అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా ఆవేదనగా అన్నాడు గురవప్ప.

"ఏమయింది తాతా? నేనేం తప్పు చేశాను?" ఆశ్చర్యంగా అడిగాడు భాను.

"హరిహరవర్మ కూతుర్ని ఎవరో దుండగలు అపహరించుకు పోయారు... ఆ పనిలో నీకు వాటా వుండి వుంటుందని ప్రచారం చేస్తున్నాడు ఆ దుండగుల చేతిలో తన్నులు తిని వచ్చిన దినేష్ బాబు. నువ్వు అసలు బెంగుళూరు వెళ్ళింది అందుకేనట... నిన్న సాయంత్రం రావాల్సిన మనిషివి చీకటి పడిన తర్వాత కూడా

రాకపోవటానికి రకరకాల కారణాలు చెప్పబడుతున్నాయి. ఆ పిల్లను అపహరించిన వారికి నువ్వు నాయకుడివని కూడా చెప్పుకుంటున్నారు ...'' ఊపిరి తీసుకోవటానికి కూడా ఆగకుండా అతను చెప్పుకు పోతున్న ఆ మాటల్ని విని ఆశ్చర్యంతో ప్రాన్పడిపోయాడు భాను.

''ఆ పని చేసింది నేను కాదు తాతా.... బెంగుళూరు దొర అనుచరులు.....'' అంటూ తాను దొర దగ్గర్నించి అపహరించుకు వచ్చిన మెటీరియల్‌ని గురించి చెప్పకుండా తను పట్టుబడటం, తప్పించుకు రావటం మొదలైన విషయాలు చెప్పాడు.

''నువ్వు కనపడిన మరుక్షణం కాల్చి చంపటానికి సిద్ధంగా వున్న హరిహరవర్మకి ఈ మాటలు చెవికి ఎక్కుతాయా? నువ్వు నిర్దోషివని రుజువు ఎలా చేసుకోగలవ్?'' బాధగా అంటూ రేకుల షెడ్ గోడని అనుకున్నాడు గురవప్ప.

ఆ మాటల్లోని యదార్థాన్ని గుర్తించి, ''ఇప్పుడు నేనేం చేస్తే బాగుంటుందో నువ్వే చెప్పు.... బెంగుళూరు దొర తన్నిన తన్నులకు నా మెదడు పనిచేయటం మానుకున్నది'' అని అతన్ని సలహా అడిగాడు భాను.

''మాయమైపోయిన పిల్లను తిప్పి తీసుకురాగలిగితే నీ మాటల్ని వినటానికి ఒప్పుకుంటారు వీళ్ళు.... ఆ పిల్ల ఇంటికి చేరకుండా నువ్వొక్కడివే కనిపిస్తే ఏనుగుల్ని చంపే తుపాకీతో కాల్చిపారేస్తారు....'' గోడ దగ్గర్నుంచి ఇవతలికి జరిగి తమను ఎవరైనా గమనిస్తున్నారేమో చూసుకుంటూ అన్నాడు గురవప్ప.

గీతిక ఎక్కడ ఉండగా మాయం అయిందో అతని నోటినుంచే తెలుసుకుని ఆలోచనలో పడ్డాడు భాను.... ఆలయం దగ్గిర ఆమెను బంధించి, బెంగుళూరు తీసుకుపోలేదు దొర అనుచరులు..... బెంగుళూరు దారి పట్టివుంటే తను ప్రయాణించిన లారీకి ఎదురై వుండేవాళ్ళు. అంతకు ముందు తను అడవిలో నుంచి బయటపడటానికి ఉపయోగించిన కాలిబాటనే వాళ్ళు కూడా వాడుకుని వుండాలి..... అడవిలోకి పోయి, చుట్టుదారిన తమ స్థావరానికి చేరుకునే ఆలోచన చేసి వుండాలి. అప్పటికప్పుడు ఒక నిర్ణయానికి వస్తూ గురువప్ప కేసి చూశాడు భాను.

"గారేజి దగ్గిరికి పోయి ఏదో ఒక విధంగా ఒక జీప్‌ని తీసుకువస్తాను.... అడవిలో దారి చూపించటానికి నాతో రాగలవా?" అని అడిగాడు.

రెండు క్షణాలు ఆలోచించి తల ఊపాడు గురవప్ప.

"జీప్ కోసం నువ్వు గారేజీ దగ్గిరికి పోనక్కరలేదు... ఆలయం దగ్గర్నించి దినేష్ బాబు ఎక్కి వచ్చిన వాహనం యిక్కడే వుంది...." అంటూ అక్కడికి దగ్గిర్లోనే వున్న మరో షెడ్ ముందు నిలబెట్టి వున్న వెహికల్‌ని చూపించాడు.

అతన్ని అక్కడే వదిలి అడుగులో అడుగు వేస్తూ ఆ వెహికల్ దగ్గిరికి పోయాడు భాను. చేతుల్లో వున్న పాకెట్స్‌ని సీటు మీద పడవేసి స్టార్ట్ చేయబోతుండగా, ఆ శబ్దాన్ని విని వెనుతిరిగి చూశారు భవనం ముందు పోగై వున్న వర్కర్స్‌లో కొందరు.

"అడుగడుగో.... బెంగుళూరు పోయిన డ్రయివర్ అడుగో....." గొంతులు చించుకొని అరిచారు భాను ఎవరో తెలిసిన వ్యక్తులు యిద్దరు.

ముందుకు దూకి అతన్ని చుట్టుముట్టుమని ఎవరూ చెప్పవలసిన అవసరం లేకుండానే ఏనుగుల మందలా కదిలింది ఆ వర్కర్స్ సమూహం... వేగంగా వచ్చి జీప్‌ని నిలబెట్టటానికి ప్రయత్నించింది.

స్టార్ట్ అయిన జీప్‌ని టైట్‌గా టర్న్ చేసి గురవప్ప దగ్గిర కాస్తంత స్లో చేశాడు భాను. అతను ఎక్కగానే యాక్సిలేటర్ అడుగుకంటా అదిమి ఘాట్ రోడ్డు వైపు పరుగులు తీయించాడు.

కంటపడిన మనిషి చేతికి దొరక్కుండా తప్పించుకున్నాడన్న కక్షతో, రాళ్ళు రప్పల్ని అందుకొని జీప్ కేసి విసిరాడు కొందరు వర్కర్స్....

"జీప్‌లు తీసుకురండి... జీప్‌లలో ఎక్కివెంటపడదాం... తీసుకురండి.." గొంతు చించుకొని అరుస్తూ, డ్రయివింగ్ తెలిసిన వారిని హెచ్చరించాడు మరికొందరు.

గారేజీ దగ్గిరికి పరిగెత్తారు డ్రయివింగ్ తెలిసిన వర్కర్స్.... అక్కడ వున్న మరో రెండు వెహికల్స్‌ని తీసుకొని ఘాట్ రోడ్డు మీదికి వచ్చారు.

వద్దు వద్దని అనుభవం ఉన్న వాళ్ళు హెచ్చరిస్తున్నా వినకుండా, గుంపులు గుంపులుగా వాటిలో నిలబడ్డారు వర్కర్స్... నిలబడటానికి చోటు దొరకని వాళ్ళు ముందు భాగాన్ని పట్టుకుని వ్రేలాడారు.

ఆ బరువును భరించటం అసాధ్యమై, ఘాట్ రోడ్డును అధిగమించక ముందే పెద్ద శబ్దాలతో బ్రద్దలైపోయాయి ఆ వాహనాల వెనుక టైర్లు. ఎక్కడివక్కడ ఆగిపోయి, తమతో పాటు వర్కర్స్‌ని కూడా ఆపేశాయి.

*                    *                    *                    *                    *

"వెనకాల వచ్చేవాళ్ళు ఆగిపోయారని సంబరపడకు. నలుగురు హంటర్స్‌ని వెంటబెట్టుకొని, ఇంకో పదిమంది కరోడాలతో మన ముందున్నాడు లాయర్ సాబ్... నువ్వు రావటానికి ఒక అరగంట ముందే బయలుదేరి వచ్చాడు...." ఆగిపోయిన వెహికల్స్ దగ్గిర గోలగోలగా అరుస్తున్న వర్కర్స్‌ని చూస్తూ తేలికగా నిట్టూరుస్తున్న భానును హెచ్చరించాడు గురవప్ప.

"అడవిలో అడుగు పెట్టిన తరువాత దారి చూపించే బాధ్యత నీదే తాతా... లాయర్ సాబ్ ఎదురు పడితే తప్పించుకునే మార్గాన్ని కూడా నువ్వే సూచించాలి....." అంటూ ఆలయం దగ్గర్నించి కాలిబాట మీదికి జీప్‌ని మరలించాడు భాను.

నలభై నిముషాలపాటు ఏమీ మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నాడు గురవప్ప. ఒక మలుపును సమీపిస్తుండగా వున్నట్లుండి భాను భుజం మీద చేయి చేశాడు.

వెంటనే జీప్‌ని ఆపాడు భాను. కనులు చిట్లించుకు చూశాడు గాని, అతనికి ఏమీ కనిపించలేదు.

మరో రెండు నముషాలు ఆగి, కాలిబాట ప్రక్కనే మోకాలి ఎత్తున పెరిగి వున్న కసింద చెట్లవైపు చేయి చూపించాడు గురవప్ప. ముళ్ళు ఏవైనా దిగబడితే

ఘాట్ రోడ్డు వర్కర్స్‌కి పట్టిన గతే తనకు కూడా పడుతుందని తెలిసి కూడా, మొండిగా జీప్‌ని ఆ మొక్కల మీదికి పోనిచ్చాడు భాను.

పావుగంట తరువాత మళ్ళీ సైగ చేశాడు గురవప్ప. ఈ సారి ఇంజన్‌ని ఆపమని అర్జంటుగా చెప్పాడు.

ఎదురు ప్రశ్నలు వేయకుండా చెప్పినట్లు చేసి స్టీరింగ్ మీద తల వాల్చుకున్నాడు భాను... నాలుగైదు నిముషాలు గడిచిన తరువాత కూడా గురవప్ప మాట్లాడకపోవటంతో, అనుమానం వచ్చి అతనివైపు తిరగబోతుండగా, కసింద మొక్కలకు కొంచెం అవతలగా వున్న పొదలలో నుంచి యింకో ప్రక్కకు దూసుకుపోయిందొక జీప్. అందులో నిలబడి వున్న హంటర్స్‌ని, డ్రయివర్ ప్రక్కన వున్న లాయర్ సాబ్‌ని చూసేసరికి ఝల్లుమన్నది అతని శరీరం.

"గట్టిగా చూసి ఉంటే తప్పకుండా కనిపించి వుండేవాళ్ళం. ముందు చూపేగాని వెనుక చూపు లేనివాళ్ళు అడవిలో తిరగటానికి పనికిరారు...." అంటూ జీప్‌ని వెనక్కి తిప్పి కాలిబాట మీదికి పోనీయమని సైగ చేశాడు గురవప్ప.

కాలిబాట మీదికి వచ్చిన తరువాత, ఎటువంటి అడ్డంకులు లేకుండా ఒక గంటసేపు ప్రయాణం చేసింది జీప్. గంట గడిచిన తరువాత రెండు సార్లు దారి మార్పించాడు గురవప్ప. మరో రెండు కిలోమీటర్ల దూరం పోయిన తరువాత జీప్‌ని ఆపమని సైగచేశాడు.

"లాయర్ సాబ్ ఇటుగా వస్తున్నాడా?" అతనెందుకు ఆపమన్నాడో అర్థంగాక చుట్టూ చూస్తూ అడిగాడు భాను.

“లాయర్ సాబ్ రావటంలేదు... నీకు కావల్సిన మనుష్యులు వస్తున్నారు చూడు.....” అంటూ జీప్ దిగి ఒక పొదచాటుకు దారితీశాడు గురవప్ప.

అదేదో అత్యంత సాధారణమైన విషయమైనట్లు అతనంత కాజువల్‌గా చెప్పేసరికి అదిరిపడి, తను కూడా జీప్ దిగాడు భాను... అతని ప్రక్కకు పోయి ముందుకు తొంగి చూశాడు.

గురవప్ప మాటల్లో అసత్యం ఏమీలేదు... ఎత్తుపల్లాల్లో ఎగిరెగిరి పడుతూ వచ్చి, వారు నిలుచుని వున్న పొదకు పాతిక అడుగుల దూరంలో ఆగింది దొర అనుచరులున్న వెహికల్.

* * * * *

“ఈ చుట్టుపట్ల తాగటానికి మంచినీళ్ళు దొరికే ప్రదేశం యిది ఒక్కటే.... ఇక్కడి నించి ముందుకు పోతే, నీళ్ళు కనిపిస్తాయి గాని, తాగటానికి పనికిరావు... నేలలో తేడా వుండటం వల్ల అసహ్యకరమైన వాసన వస్తూ వుంటుంది. వీళ్ళు ఎవరో గాని ఈ అడవిని గురించి బాగా తెలిసిన వాళ్ళ మాదిరిగా కనిపిస్తున్నారు....” భాను చెవి దగ్గిర నోరు పెట్టి రహస్యంగా చెప్పాడు గురవప్ప.

జీప్‌ని ఒక చెట్టుక్రింద ఆపి, ఆ సమీపంలో ఉన్న మంచినీళ్ళ జాలుదగ్గిరికి పోతున్న దొర అనుచరుల్ని చూస్తూ అతనితో ఏకీభవించాడు భాను.

జీప్‌లోనే కూర్చుని ఉన్నది గీతిక.... ఆమెకు కాపలాగా నిలబడి వున్నాడు ఒక వ్యక్తి.

అతనికీ తనకూ ఉన్న మధ్య దూరాన్ని కనులతోనే అంచనా వేసుకుంటూ కదిలాడు భాను. తనేం చేయబోతున్నాడో గురవప్పకు అర్థం అయ్యేలోపుగా జీప్‌ని సమీపించి ఆ వ్యక్తి మీద కలబడ్డాడు.

అదిరిపడి వెర్రిగా అరిచాడా వ్యక్తి. భాను పిడికిళ్ళను తప్పించుకోబోయి వెనక్కి దొర్లాడు.

అతని అరుపును విని జాలు దగ్గిరికిపోయి వారందరూ పరుగు పరుగున వస్తూ వుండటాన్ని కను చివరనుంచి చూస్తూ జీప్‌లో వున్న గీతికను క్రిందికి లాగాడు భాను. “కమాన్... హర్రీ అప్... కమాన్....” అని హెచ్చరిస్తూ తీసుకువచ్చి తమ జీప్‌లో కూర్చోబెట్టాడు.

“వచ్చేశారు... దొంగనాయాళ్ళందరూ కట్టకట్టుకొని వచ్చేశారు....” ఆందోళనతో కంపించి పోతూ అరిచాడు గురవప్ప.

జీప్‌ని స్టార్ట్ చేశాడు భాను... వెనక్కి పోనిచ్చే వ్యవధి లేకపోవటం వల్ల సూటిగా ముందుకు పరుగు తీయించాడు.

ముందు భాగం తగిలి, వెల్లికిలా పడ్డారు ఇద్దరు వ్యక్తులు. బంపర్ పొడుచుకొని ప్రక్కకు దొర్లాడు మరో ఇద్దరు... జీప్ ప్రక్క భాగాన్ని పట్టుకోబోయి విఫలులయ్యారు మిగిలిన వారందరూ...

ఈ సారి డైరక్షన్స్ కోసం గురవప్ప వైపు చూడలేదు భాను... పడిపోయిన వారు పైకి లేచి వారు వెహికల్‌ని చేరుకోవటానికి ఎలా లేదన్నా ఒక నిముషం వ్యవధి కావాలి... ఆ కాస్త వ్యవధిలోనూ సాధ్యమైనంత దూరం వెళ్ళిపోవాలి

తాము..... వాళ్ళకీ తమకూ మధ్య నాలుగైదు కిలోమీటర్ల డిస్టెన్స్ ఏర్పడిన తరువాత వారిని గురించి ఆలోచించాలి.

అనుకోవటం వరకూ సాధ్యపడింది గాని, అంత డిస్టెన్స్‌ని క్రియేట్ చేయటం అతనికి చేతకాలేదు. పట్టిన పట్టు వదలకుండా వెన్నంటి వచ్చారు దొర అనుచరులు. అడవి అంతం అయిపోయి, బెంగుళూరుకి దారితీసే మట్టి రోడ్డు ఎదురు పడినప్పుడు కూడా వెనుకబడలేదు.

మట్టిరోడ్డు మాయమై తారురోడ్డు వచ్చింది... తారు రోడ్డు స్థానంలో సిమెంట్ రోడ్డు ప్రత్యక్షమయింది.... చూస్తూ చూస్తూ వుండగానే ఎట్ట ఎదుట కనిపించింది సిటీ ఎంట్రన్స్‌ని సూచించే బోర్డు....

“సిటీలోకి పోయి ఏదైనా పోలీస్ స్టేషన్ దగ్గిర ఆగుదాం. జరిగింది చెప్పి ప్రొటెక్షన్ యివ్వమని కోరదాం.....” తన మాటలు వినిపిస్తాయనే నమ్మకం లేకపోయినా, ఇంజన్ హోరును మించిన కంఠంతో అరిచాడు భాను....

అతనలా అరుస్తుండగానే దడదడమన్నది ఇంజన్. రెండు జర్క్‌లు ఇచ్చి ఆగిపోయింది జీప్.

ఇంజన్ ట్రబుల్ వల్ల ఆగిందో, డీసెల్ అయిపోవటం వల్ల నిలబడి పోయిందో తేల్చుకునే సమయం కాదది. ఏ మాత్రం ఆలస్యం చేసినా రాక్షసుల మాదిరి వచ్చిపడతారు దొర అనుచరులు.

గీతికకు చేయి అందించి క్రిందికి దింపాడు భాను.... గురవప్పను కూడా దిగమని సైగచేసి పరుగు ప్రారంభించాడు. అతడు తనను దొర అనుచరుల

దగ్గర్నించి యివతలికి తీసుకు వచ్చిన తరువాత మొదటిసారిగా పెదవి విప్పింది గీతిక.

“తప్పించుకోగలమంటావా భానూ? వీళ్ళకి పట్టుబడకుండా పారిపోవటం మనకి చేతనవుతుందా?” ఎగసుకురాబోతున్న ఆయాసాన్ని అణుచుకోవటానికి ప్రయత్నిస్తూ అడిగింది.

పట్టుబడకుండా తప్పించుకోవటం చేతకాకపోతే జరిగేది ఏమిటో ఆమెకు చెప్పలేదు భాను. వెనుక వున్న జీప్ క్షణ క్షణానికి దగ్గరలోకి వచ్చేస్తూ వుంటుందన్న భయంతో మెయిన్ రోడ్డును వదిలి, ఒక మురికి వాడలోకి ఎంటర్ అయినాడు.

పుట్టి బుద్ధెరిగిన తరువాత అటువంటి లొకాలిటీకి అడుగు పెట్టటం అదే ప్రధమం కాబోలు – అసహ్యకరంగా చూస్తూ, అతని వెనుక అడుగులు వేసింది గీతిక.

అడవిలో పనిచేసి చేసి రాటుదేలిన మొండి మనిషి గురవప్ప. ఆ మొండి మనిషి కూడా ఆయాసంతో వగరుస్తూ వుండటాన్ని గమనించి, మొట్టమొదటిసారిగా పారిపోయే ఆలోచనను ప్రక్కన పెట్టి, తను ఎంటర్ అయిన లొకాలిటీని కాస్తంత పరిశీలనగా చూశాడు భాను.

కలిగిన కుటుంబానికి చెందిన మనిషిగా గీతికను గుర్తుపట్టి, వింతగా విడ్డురంగా చూస్తున్నారు మురికివాడ పౌరులు. ఒకరి ప్రక్కన ఒకరు చేరి గుసగుసలు పోతున్నారు.

మరో పాతిక గజాల దూరం నడిచిన తరువాత భాను దృష్టిని ఆకర్షించింది ఒక హనుమంతుడి గుడి.... దాని ముందు నిలబడి తమ వంకే చూస్తున్న వృద్ధురాలు ఒకామె ఆగుపించింది. మనసులో మెదులుతున్న సందేహాలన్నీ ప్రక్కకు నెట్టి పరగు లాంటి నడకతో ఆమె ముందుకు పోయారు.

"మమ్మల్ని పట్టుకొని చిత్రహింసలు పెట్టే ఆలోచనతో కొందరు శత్రవులు తరుముకు వస్తున్నారు.... పారిపోయే మార్గం కనిపించక మీ ఇలాకాలోకి వచ్చాము. మమ్మల్ని కాపాడగలవా అవ్వా? పట్టుబడి ప్రాణాలు పోగొట్టుకోకుండా మమ్మల్ని రక్షించగలవా?" చేతులు జోడించి నమస్కరిస్తూ రిక్వెస్ట్ చేశాడు.

ఊహ తెలియక ముందునుంచీ అటువంటి ప్రదేశాల్లో పెరిగి వుండటం వల్ల, అక్కడ నివశించే వారి మనస్తత్వాన్ని గురించిన అవగాహన పూర్తిగా కలిగి వుండి అడిగిన మాట అది.

కూలి పనులు చేసినా, చిన్న చిన్న నేరాలతో బ్రతుకులు వెళ్ళదీస్తున్నా రోజుకు రెండుసార్లు ఒకరితో ఒకరు పోట్లాటలు పెట్టుకుంటున్నా, ఒక విచిత్రమైన డిసిప్లిన్ వారిలో కనిపిస్తుంది.

పరాయి వాడెవడైనా తమ వాడలోకి వచ్చి రౌడీయిజం చెలాయించటానికి ప్రయత్నిస్తే వాళ్ళు సహించరు. తమ రక్షణలో వున్న వారి జోలికి సాక్షాత్తూ ఆ భగవంతుడే రాదలుచుకున్నా ఊరుకోరు....

"నువ్వు ఏమంటున్నావో నాకు అర్థం కావటం లేదు" భాను ముఖంలోకి చూస్తూ యాసతో కూడిన కన్నడ భాషలో అన్నది ఆ వృద్ధురాలు.

తలను తీసుకుపోయి ఎదురుగా వున్న గుడి గోడకు కొట్టుకోవాలన్నంత నిస్పృహ భానును ఆవరించుకున్నది.

బెంగుళూరు దొరవద్దగాని, అతని అనుచరుల దగ్గిరగాని ఫేస్ చేయలేదు తను ఆ భాషా సమస్యని. ప్రమాదం వెన్నంటి వచ్చేస్తున్న తరుణంలో యిక్కడ ఎదుర్కోవాల్సి రావటం తన దురదృష్టం.

"నువ్వు చెప్పదలుచుకువవదేదో నా భాషలో చెప్పు....." అతని ముఖంలోకి చూస్తున్న వృద్ధురాలు మరోసారి మాట్లాడటంతో తను కలిపించుకున్నాడు అంతవరకూ మౌనంగా నిలబడిన గురవప్ప. ఆ మాటల్ని కన్నడలోకి తర్జుమా చేశాడు.

అతన్ని వెంటబెట్టుకు రావాలనే ఆలోచనను తనకు కలిగించిన ఆతీత శక్తికి మనసులోనే జోహర్లు అర్పిచుకుంటూ, తను మొదట చెప్పిన మాటల్ని ఆమె భాషలోకి ట్రాన్స్‌లేట్ చేయించాడు భాను.

"నా బాధ ఏమిటో నీ ముఖం చూడగానే నాకు అర్థం అయింది. ఇంతకీ నువ్వెవరివో, నాకు నమస్కరించి సహాయం అడగాలని ఎందుకు అనిపించిందో చెప్పలేదు" మొట్టమొదటిసారిగా చిరునవ్వు నవ్వుతూ ప్రశ్నించింది వృద్ధురాలు.

"కావాలంటే నా జీవిత చరిత్రను మొదటినుంచీ వివరంగా తర్వాత చెపుతాను. ముందు షెల్టర్ యిప్పించమని అడుగు.... ఆలస్యమైతే కొంప లంటుకుంటాయి" భుజం మీది నుంచి వెనక్కి చూస్తూ గురవప్పని తొందర పెట్టాడు భాను.

అతను ఎలా చెప్పాడో అలాగే వృద్ధురాలికి నివేదించాడు గురవప్ప. వెంటనే షెల్టర్ చూపించకపోతే ఏం జరుగుతుందో తన మాటల్లో చెప్పటానికి ప్రయత్నించబోతుండగా చేతిని ఎత్తి నోరు మూయించిందామె.

“నా దగ్గిరికి వచ్చి నా కళ్ళల్లోకి చూస్తూ చేతులు జోడించినప్పుడే అతను మా మనిషని నాకు అర్థం అయింది. మా మనిషి కానివారికి మా పద్ధతులు తెలియవు.... నడుము వంగిపోవటానికి సిద్ధంగా వున్న వృద్ధురాలు ఈ వాడకి నాయకురాలని గ్రహించటం సాధ్యపడదు.... నాతో రండి....” అంటూ హనుమంతుడి గుడిలోకి తీసుకుపోయి అరడుగుల ఎత్తున్న ఆ విగ్రహం చాటున నిలబడమని సైగ చేసింది.

రెండోసారి చెప్పవలసిన అవసరం లేకుండా విగ్రహం వెనుక వదిగి నిలబడ్డాడు భాను... గీతికను తన వెనుక నిలబెట్టాడు. గురవప్పను క్రింద కూర్చోమన్నాడు.

విగ్రహం ముందు నిలబడి వారి వంక ఒకసారి చూసింది వృద్ధురాలు. తృప్తిగా తల వూపుతూ గుడి బయటికి పోయి, అంతకుముందు నిలుచున్న స్థలంలోనే నిలబడి, మురికివాడ చివరి భాగంలోకి చూసింది.

ఎంతో సేపు ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా, రెండో నిముషంలో ఆమె ముందు ప్రత్యక్షం అయ్యారు దొర అనుచరులు.

“ఇద్దరు మగవాళ్ళు, ఒక పిల్లను వెంట పెట్టుకొని ఇటుగా వచ్చారు. నువ్వు చూశావా?” గుడి చుట్టూ తిరిగి వచ్చి రఫ్‌గా ఆమెను అడిగాడు వారిలో ఒకతను.

"ఎవరు వాళ్ళు?" మర్యాదపూర్వకంగా ప్రశ్నించింది వృద్ధురాలు.

"ఎవరైతే నీకెందుకు? నీకు కనిపించారో లేదో చెప్పకుండా ఎదురు ప్రశ్నలెందుకు?" విసుగ్గా అంటూ, ఒకసారి గుడిశెలోకి కూడా తొంగి చూశాడు ఆ వ్యక్తి.

విగ్రహం వెనకాల నిలబడి వున్న వారిని కనిపెట్టటం సాధ్యపడలేదు కాబోలు, పెదవి విరుస్తూ వెనక్కి వచ్చి మిగిలిన వారికి సైగచేశాడు.

పది క్షణాలపాటు గుడి దగ్గిరే తచ్చాట్లాడి మెల్లిగా అతన్ని అనుసరించారు అందరూ.... రెండు నిముషాల్లో ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళిపోయారు.

"ప్రమాదం ప్రస్తుతానికి తప్పిపోయింది... కుదురుగా కూర్చోగల చోటికి తీసుకుపోతాను. త్వరగా బయటికి రండి...." విగ్రహం వైపుకి తిరిగి మృదువుగా హెచ్చరించింది వృద్ధురాలు.

ఆ ప్రశ్నను భానుకు వినిపించాలని చూశాడు గాని, గీతిక తన వంకే చూడటం వల్ల వెంటనే ఆ పని చేయలేకపోయాడు గురవప్ప. భాను అభిప్రాయం తెలుసుకోకుండా తన స్వంత తెలివిని ఉపయోగించటం ఇష్టం లేక, వృద్ధురాలికి సమాధానం చెప్పలేదు.

సందుల వంటి ఇరుకు దారుల్లో నడిపించి, వారిని ఒక చిన్న గుడిశె దగ్గిరికి తీసుకుపోయింది వృద్ధురాలు.

“లోపల చాపలున్నాయి, హాయిగా పడుకోండి... ప్రమాదం తప్పిపోయిన తర్వాత వచ్చి పిలుస్తాను” అంటూ అవతలికి పోయి, ఆ చుట్టపట్ల నివసించే పౌరులతో మాట్లాడటం మొదలుపెట్టింది.

“అమ్మాయి గారు నీకేమౌతుందని అడుగుతోంది... సమాధానం చెప్పకపోతే బాగోదు. ఏమని చెప్పమంటావ్?” ముందుగా గుడిశెలోకి గీతిక ఎంటర్ కావటంతో భానును ప్రక్కకు పిలిచి రహస్యంగా అడిగాడు గురవప్ప.

“గీతిక ఎవరో తెలిసిదంటే మన బ్రతుకులు మళ్ళీ బజారు పాలౌతాయి. డబ్బున్న వారెవరూ నమ్మదగిన వారు కారనే అభిప్రాయం వీళ్ళకు చాలా బలంగా వుంటుంది....” తను కూడా రహస్యంగానే చెప్పాడు భాను.

“అయితే ఆమెకు ఏమని చెపుదాం?”

షెల్టర్ దొరుకుతుందని నమ్మకం ఏర్పడిన క్షణం నుంచీ, అందరూ ఎంతో ప్రయత్నం మీద దూరంగా వుంచిన బడలిక కాస్తా రెట్టింపు శక్తితో వచ్చి నెత్తిమీద కూర్చున్నట్లు ఫీలవుతున్నాడు భాను.

హాయిగా పడుకొని ఆదమరిచి నిద్రపోనీయకుండా అర్థం పర్థంలేని ప్రశ్నలకు సమాధానం వెతుక్కోవటం ఏమిటి?

ముందు వెనకలు ఆలోచించకుండా నోటికి వచ్చిన మాటను గురవప్ప చెవిన పడవేశాడు.

“నేను ప్రేమించి పెళ్ళి చేసుకోబోతున్న పిల్ల అని చెప్పు... అటువంటి మాటలు చాలా తేలికగా అర్థం అవుతాయి... ఆ పిల్ల తండ్రి దొరని కంటాక్ట్ చేసి

మన మీదికి ఉసిగొల్పాడని కూడా చెప్పు. మన కేసుకు ఇది కాస్తా బలం చేకూరుతుంది'' అంటూ గుడిశె లోపలికి పోయి, ఎదురుగా కనిపించిన చాపమీద మేను వాల్చాడు.

గురవప్ప ఏం చెప్పాడో, ఎలా మేసేజ్ చేశాడో అతనికి తెలియదు. శరీరం చాపమీద చేరుకోగానే తన్నుకుంటూ వచ్చేసింది దారుణమైన నిద్ర. తిరిగి కనులు తెరిచేసరికి మరునాడు ఉదయం ఎనిమిది గంటలయింది.

* * * * *

మెలకువ వచ్చిన తరువాత పది క్షణాల వరకూ తను ఎక్కడున్నాడో భానుకు అర్థం కాలేదు. ''నేను ఎక్కడ వున్నాను? దొర అనుచరులు ఏమైపోయారు?'' తనలో తను అనుకుంటున్నట్లు పైకే అంటూ లేచి కూర్చొని చుట్టూ చూశాడు.

మొట్ట మొదట అతనికి గీతిక కనిపించింది.

అంతకు ముందే ఎక్కడో స్నానం చేసినట్లుంది... సోపు వాసనతో గుభాళించిపోతోంది గుడిశె... అంతకు ముందు రోజు ప్రయాణంలో మాసిపోయిన దుస్తుల్ని వదిలి, ఎక్కడ సంపాదించిందో గాని, సింపిల్‌గా వున్న నేత చీరెను కట్టుకొని, ఎర్రటి మందారాన్ని తలలో తురుముకొని అప్సరస మాదిరి అతని వంకే చూస్తున్నది.

''దొర అనుచరుల చేతిలో తన్నులు తిని నేను స్వర్గానికి రాలేదు కదా?'' ఆమె వంక అలాగే చూస్తూ అడిగాడు భాను.

కాలేజీలో అతనికి తెలిసిన గీతికైతే గ౹య్ మని అరవాలి... నోటికి వచ్చిన మాటలతో నిందించాలి.

అటుంటి పనులేవీ చేయలేదు ఆమె.... అందంగా నవ్వి తల అడ్డం తిప్పింది.

జరిగిన సంఘటనలన్నీ ఒకటొకటిగా గుర్తుకు వచ్చేసరికి మారిపోయింది భానును ఆవరించుకుని వున్న జోవియల్ మూడ్. ఆందోళనగా లేచి గుడిశె బయటికి తొంగి చూసేసరికి కనిపించాడు గురవప్ప.

వంటరిగా లేడతను. వెంట పాతికమంది మురికివాడ యువకులు వున్నారు. అందరి దగ్గిరా లావుపాటి లాఠీల వంటి దుంగలు వున్నాయి.

"చీకటి పడిన దగ్గర్నించీ కాపలా కాస్తునే వున్నారు వాళ్ళు... క్షణం కూడా ఏమరిపాటుగా వుండలేదు" భాను వెనకనుంచి తను కూడా బయటికి చూస్తూ చెప్పింది గీతిక.

"గురవప్ప వాళ్ల దగ్గిరికి ఎప్పుడు పోయాడు?" అతను వాళ్ళతో ఎంత చనువుగా కబుర్లు చెపుతూ వుండటాన్ని చూసి అడిగాడు భాను.

"మనం ఇక్కడికి వచ్చిన దగ్గర్నించీ అతను వాళ్ళతోనే వున్నాడు."

"వాళ్ళతోనే వుండటం ఏమిటి? మనతో పాటు యిక్కడ పడుకోలేదా?"

"ప్రేమించి పెళ్ళి చేసుకోబోతున్న యిద్దరు యువతీ యువకుల మధ్య తను అడ్డంగా వుండటం దేనికని బయటే వుండిపోయాడు."

ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా చాలా కాజువల్‌గా ఆమె వదిలిన ఆ మాటను వినేసరికి కరెంట్ షాక్ కొట్టినట్లు అదిరిపడ్డాడు భాను.

"నువ్వు ఏం మాట్లాడుతున్నవో నీకు అర్థం అవుతోందా?" ఆందోళనగా చూస్తూ అడిగాడు.

"నాకు అర్థం అయినా కాకపోయినా నీకు అర్థం అయిందో లేదో బాగా ఆలోచించుకో... ఆ మాట నేను చెప్పలేదు. నువ్వే చెప్పావు...." అంటూ గురవప్పని గుడిశె దగ్గిరికి రమ్మని సైగ చేయబోయింది గీతిక.

వృద్ధురాలి ప్రశ్నకు సమాధానంగా గురవప్పకి తను చెప్పిన మాటలు గీతిక చెవిన పడ్డాయని గ్రహించి దిగులుగా చూశాడు భాను.

"అదికాదు గీతికా... అసలు ఆ మాట ఎందుకు అనాల్సివచ్చిందంటే..." అనబోతుండగా తీక్షణంగా చూసిందామె.

"ఎప్పటికయినా నీ మనసులోని అభిప్రాయాన్ని బయట పెట్టించి తీరుతానని మొన్న అన్నాను..... గుర్తుందా?" అని అడిగింది.

చాముండేశ్వరీ ఆలయం దగ్గర్నుంచీ తిరిగివస్తున్న సమయంలో ఆమెకు తనకు మధ్య జరిగన సంభాషణను గుర్తుకు తెచ్చుకుంటూ నీరసంగా తలూపాడు భాను.

"నోటివెంట బయట పెట్టకుండానే నాకు తెలిసిపోయింది నీ అభిప్రాయం...." అంటూ ఒక మూలగా వున్న పాకెట్స్‌లో నుంచి గిఫ్ట రేప్ చేయబడిన రాధాకృష్ణుల విగ్రహాన్ని తీసి అతనికి చూపించిందామె.

బ్రీఫ్‌కేసుతో పాటు ఆ పాకెట్స్‌ని కూడా ఆలయంలో పాతిపెట్టి వుంటే బాగుండేదని తలపోశాడు భాను... తను పాతిపెట్టలేదు... సరే.... దొర అనుచరులను చూసి బెంబేలెత్తిపోతున్న సమయంలో కూడా వదిలి పెట్టకుండా వాటిని వెంటబెట్టుకు వచ్చాడు గురవప్ప... వెంట బెట్టుకు వచ్చిన వాడు ఇంకెక్కడైనా పారేయకుండా, యిక్కడే ఎందుకు జాగ్రత్త చేయాలి?

ఎటువంటి అభిప్రాయంతో తను ఆ బొమ్మని పర్చేజ్ చేశాడో, చెబితే ఆమెను ఆవరించుకొని వున్న ఆ టీజింగ్ మూడ్ మారిపోయి, మామూలు పద్ధతిలో మాట్లాడటం మొదలు పెడుతుందన్న ఆశతో నోరు తెరవబోతుండగా, గుడిశె ముందుకు వచ్చి చిన్నగా దగ్గింది వృద్ధురాలు.

ముసి ముసి నవ్వులు నవ్వుతున్న గీతిక వంక కోపంగా చూసి, వృద్ధురాలిని లోపలికి ఆహ్వానించాడు భాను.

"మంచి మంచి మాటలు మాట్లాడుకుంటూ, ఒకరి మనసులోని మాటను మరొకరికి చెప్పుకుంటూ హాయిగా వుండాల్సిన మీకు అనవసరమైన కష్టాలు తెచ్చి పెట్టాడు భగవంతుడు" గీతిక తల నిమురుతూ ఆర్ద్రంగా అన్నది ఆమె.

భాను ఖంగారు ఖంగారుగా లేచి గురువప్పని లోపలికి పిలువబోతుండగా వారించి, బలవంతంగా కూర్చోబెట్టింది గీతిక.

"నువ్వు అనవసరమైన హైరానాకు గురికావాల్సిన అవసరం లేదు. నాకు కన్నడం వచ్చు..." అంటూ వృద్ధురాలి మాటలు అతనికి వివరించింది.

"నువ్వు ముందే నాకు ఎందుకు చెప్పలేదు?" ఆ మాటల్ని వివరిస్తున్న సమయంలో ఆమె కనుల్లో అంతకుముందెన్నడూ తను చూడని ఒక మెరుపును గమనించి, కోపంగా అడిగాడు భాను.

"ఏది నీకు ముందే చెప్పలేదు?" ఎదురు ప్రశ్న వేసింది గీతిక.

"నీకు కన్నడం వచ్చునే సంగతి."

"నువ్వు ముందే నన్ను ఎందుకు అడగలేదు?"

"అడగకపోతే చెప్పకూడదా?"

"అడిగినప్పుడు నువ్వు చెప్పావా?"

"నువ్వు అడిగినప్పుడు నేను చెప్పంది ఏమిటి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు భాను.

"నీ అభిప్రాయం...."

అటు తిరిగి ఇటు తిరిగి టాపిక్ మళ్ళీ మొదటికే చేరుకుంటున్నదని గ్రహించి ముఖం ముడుచుకున్నాడు భాను.

మాటలు అర్థం కాకపోయినా భావం అవగతమౌతూ వుండటం వల్ల వారికి అడ్డుపడకుండా వినోదంగా చూస్తూ కూర్చున్నది వృద్ధురాలు. భాను మౌనం వహించటంతో ఆ సంభాషణ అంతం అయిపోయిందని గ్రహించి, తను వచ్చిన పనిని ప్రస్తావించింది.

“మీరు ఇక్కడ వున్నట్లు రెండో కంటివాడికి తెలియకుండా జాగ్రత్త పడదామని అనుకున్నాం మేము. దురదృష్టవశాత్తూ ఆ దొరకి అనుమానం వచ్చేసింది. తన మనుష్యుల్ని నాలుగు ప్రక్కలా కాపలా పెట్టి కూర్చున్నాడు.”

గీతిక ద్వారా ఆ మాటల్ని తెలుసుకొని ఆందోళనగా చూశాడు భాను.

“అతను ఇక్కడికి వచ్చి మమ్మల్ని ఏదో చేస్తాడని భయపడాల్సిన అవసరం లేదు.” అతని భావాల్ని గమనించి వెంటనే అన్నది వృద్ధురాలు. “అతను కంటపడకుండా మీరు ఇక్కడినించి అవతలికి వెళ్లటం ఎలా అనే విషయాన్ని గురించి మేము ఎటూ తేల్చుకోలేక పోతున్నాం. ఎన్ని రోజులైనా కాపలా కాయించే శక్తి అతనికి వుంది. అతనికి వున్న సహనం మీకు కూడా వుంటే ఇబ్బంది లేదు. ఎన్ని రోజులైనా సరే మీరు ఇక్కడ వుండవచ్చు.”

అనటమైతే అన్నది కాని, ఆ పని మాట అన్నంత తేలిక కాదని, అడగకుండానే భానుకు చెప్పాయి ఆమె ముఖకవళికలు.

పనీ పాటల్ని మానుకొని ఎన్ని రోజులు అలా లాఠీలు పట్టుకుని కాపలా కాస్తారు వాళ్ళు? తమ దగ్గరికి వచ్చి రక్షణ కోరిన వారిని జాగ్రత్తగా చూసుకోవాలనే కోరిక మనసులోవున్నా, అందుకు సహకరిస్తుందా వారి ఆర్థిక పరిస్థితి??

పది క్షణాలపాటు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు భాను. వృద్ధురాలి సాయంతో చీకటి మాటున మురికి వాడలో నుంచి ముందుగా తను బయటపడాలి. దగ్గిర్లో వున్న పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసి గీతిక వేరెబౌట్స్

వివరించాలి... ఆమె చిక్కుబడిన పరిస్థితిని వివరించి ప్రొటెక్షన్ ఇవ్వమనీ, ఎస్టేట్‌కి పంపించే ఏర్పాటు చేయమనీ రిక్వెస్ట్ చేయాలి.....

ఆ పనులు జరిగేలోపుగా ఎస్టేట్‌కి వెళ్ళి ఆలయంలో దాచిన బ్రీఫ్‌కేసును బయటికి తీయాలి. ముక్కు ముఖం తెలియని పరాయి వ్యక్తుల మధ్య తను చేయగలిగింది ఏమీ లేదు... సరాసరి ఇంటికి పోయి లెక్చరర్ గారిని కలుసుకోవాలి. ఆయన సహాయంతో బ్రీఫ్‌కేసులో పెట్టి వుంచిన కాసెట్స్‌ని చూసి, హరిహరవర్మ సీక్రెట్‌ని బట్టబయలు చేసే కార్యక్రమం ప్రారంభించాలి.

ఏ పని చేయాలన్నా ముందు గీతికను క్షేమంగా ఆమె తండ్రి దగ్గిరికి చేర్చాలి....

తన తండ్రి నిజ స్వరూపం ఏమిటో తెలుసుకున్న తర్వాత, తనంటే ఆమెకు ఎటువంటి అభిప్రాయం మిగిలివుంటుందో వేచి చూడాలి.

కుతూహలంగా చూస్తున్న గీతకకు తన ఆలోచనల గురించి చెప్పకుండా, వృద్ధురాలితో గుడిశె బయటికి వచ్చాడు భాను.

# 22

"ఎక్స్‌లెంట్ మై డియర్ యంగ్ మాన్... కొట్టవలసిన చోట దెబ్బకొట్టే ఎవిడెన్స్‌ని సంపాదించావు. హరిహరవర్మ ఛాప్టర్ ఇంతటితో క్లోజ్ అయిపోయింది. అతనితో పాటు లాయర్ జనార్ధన్, అతని కొడుకు దినేష్ అందరూ జైలుపాలు కాక తప్పదు...." హూషారుగా చిటికెలు వేస్తూ సోఫాలోనుంచి లేచి భానును మెచ్చుకున్నాడు జస్టిస్ రమాకాంత్.

వృద్ధురాలి గుడిశెలో వుండగా తను తీసుకున్న నిర్ణయాన్ని అక్షరాలా అమలులో పెట్టాడు భాను. చీకటి మాటున మురికివాడను దాటి, పోలీసులకు గీతిక గురించి ఫోన్ చేశాడతను.

అక్కడి నుంచి ఎస్టేట్ వైపు పోతున్న ఒక లారీని కాచ్ చేసి దారి మధ్యలో వదిలేసిన కారు దగ్గిర దిగిపోయాడు. రెండు గంటలు శ్రమ పడిన తరువాత స్టార్టు అయిందా కారు. పద్దెనిమిది గంటల తరువాత అతన్ని లెక్చరర్ గారి ఇంటి దగ్గిరికి తీసుకుపోయింది. చాముండేశ్వరి ఆలయంలోని కోనేటి వద్దున భద్రపరిచిన బ్రీఫ్‌కేసును ఆయన చేతికి ఇచ్చాదు భాను. అందులోని కేసెట్సుని చూడమని కోరాడు.

హరిహరవర్మని ఒక్కడినే బ్లాక్ మెయిల్ చేయటం లేదు బెంగుళూరు దొర. లాయర్ సాబ్‌ని, దినేష్‌ని కూడా పీడించుకు తింటున్నట్లు రుజువు చేశాయి ఆ కాసెట్స్.

ఏనుగు దంతాల్ని, గంధపు దుంగల్ని స్మగుల్ చేస్తున్న సమయంలో వారి మూమెంట్స్‌ని నేర్పుగా కాసెట్సు మీదికి ఎక్కించాడు బెంగుళూరు దొర.... వారి జీవితాల్ని తన గుప్పిట్లో, ఇరికించుకున్నాడు.

సూర్యప్రసాద్ గారిని అడ్డు తొలగించుకుంటే ఎస్టేటు తన స్వాధీనం అవుతుందనీ, ఎంత డబ్బు కావాలన్నా ఇస్తానని బెంగుళూరు దొరని కాంటక్ట్ చేశాడు హరిహరవర్మ. తన మనిషినే పంపి సూర్య ప్రసాద్‌గారి కారు డ్రయివర్‌గా అపాయింట్ చేయించాడు దొర.... బ్రేకులు పని చేయని విధంగా ఆయన కారుని

రిపేర్స్ చేసి, ఆఖరి క్షణంలో తను ప్రక్కకి తప్పుకున్నాడు డ్రయివర్‌గా చేరిన అతని అనుచరుడు.

ఘాట్ రోడ్డు మీద వుండగా అదుపుతప్పి ఆగాధంలోకి దొర్లింది కారు. సూర్యప్రసాద్ గారి ప్రాణాల్ని బలిపుచ్చుకున్నది.

హరిహరవర్మ అటువంటి ప్రపోజల్‌తో తన దగ్గిరికి వచ్చిన రోజునించి, సూర్యప్రసాద్ గారు అగాధంలో పడిపోతున్న క్షణం వరకూ ప్రతి విషయాన్ని కాసెట్ మీద ముద్రింపించాడు దొర... హరిహరవర్మ కాళ్ళు చేతులు కట్టేసి తను ఎంత అడిగితే అంత ఇచ్చే విధంగా తయారు చేసుకున్నాడు.

సరైన లాయర్‌ని కన్సల్ట్ చేసి ఆ తరువాత చెయ్యవలసిన పనిని గురించి సలహా తీసుకుందామని లెక్చరర్‌గారు అంటూండగా, భాను కనుల ముందు మెదిలాడు జస్టిస్ రమాకాంత్. ఎప్పుడయినా వచ్చి కలుసుకోమని ఆయన చెప్పిన మాటల్ని గుర్తు చేసుకొని, విజిటింగ్ కార్డు ఆధారంగా వెతుక్కుంటూ వెళ్ళాడు... తను సేకరించిన ఆధారాల్ని చూపించాడు.

"ధార్వాడ ఎస్టేట్‌లో జరిగన దారుణాన్ని వెలుగులోకి తెచ్చి, పెద్ద మనుష్యులుగా చెలామణీ అవుతున్న వారి నిజ స్వరూపాల్ని బయట పెట్టావ్.... ఇందులో నీకు జరిగేది ఏముంది? నీ చదువేదో నువ్వు చదువుకోకుండా పోలీసులు చెయ్యవలసిన పనుల్ని నువ్వు చేయటం దేనికి?" కాసెట్ ప్లేయర్‌లో వున్న ఆఖరి కాసెట్‌ని బయటికి తీసి జాగ్రత్త చేస్తూ అడిగాడు జస్టిస్ రమాకాంత్.

అప్పుడు... ఆయన ఆ ప్రశ్న వేసినప్పుడు ఆయన చేతికి అందించాడు భాను తన దగ్గిర వున్న పాత కవర్‌ని, కవర్ పాటు చిన్నతనం నుంచీ అప్పుడప్పుడూ తీయించబడిన తన ఫోటోల్ని కూడా ఇచ్చాడు.

కవర్‌లోని ఫోటోలను, సర్టిఫికెట్లను, పేపర్ కటింగ్‌లను చూసి ఆశ్చర్యంతో ట్రాన్పడిపోయాడు జస్టిస్ రమాకాంత్.

"మైగాడ్! ధార్వాడ ఎస్టేట్‌కి వారసుడివి నువ్వు......" అంటూ ప్రక్కనే వున్న ఫోన్ అందుకుని ఎవరికో రింగ్ చేశాడు.

"ఎవరికి సార్ ఆ ఫోన్?" కుతూహలాన్ని అణుచుకోలేక అడిగాడు భాను.

"పద్మకుమార్ అనీ నాకు బాగా తెలిసిన లాయర్ ఒకతను వున్నాడు. అతన్ని పిలిచి నీ కేసును డీల్ చేయమంటాను. నువ్వు వారసుడివి కాదని అనే హక్కు ఎవరికీ లేకపోయినా ప్రొసీజర్ ప్రకారం ప్రొసీడ్ అవుతాం...." అంటూ అరగంట సేపు మాట్లాడాడు జస్టిస్ రమాకాంత్. లైన్ మీదికి వచ్చిన తన ఫ్రెండ్‌తో.

"ముందుగా ఒకసారి ధార్వాడ ఎస్టేట్స్‌కి వెళ్ళి హరిహరవర్మతో మాట్లాడి రావటం బాగుంటుందని అంటున్నాడు నా ఫ్రెండ్... అతను మర్యాదగా రిసీవ్ చేసుకోకపోతే కాసెట్స్‌లోని విషయాలను వివరించి కొద్దిగా బెదిరించటం పద్ధతిగా వుంటుందని చెప్పాడు." ఫోన్ పెట్టేసిన తరువాత భానుకి చెప్పాడాయన. ఎస్టేట్‌కి బయలుదేరేందుకు సిద్ధంగా వుండమని కూడా సూచించాడు.

"మరి బ్రీఫ్‌కేసులో వున్న డబ్బు సంగతి ఏమిటి?" తన ప్రక్కన వున్న బ్రీఫ్‌కేసును ఎత్తి టీ పాయ్ మీద పెడుతూ అడిగాడు భాను.

అందులోని నోట్ల కట్టల్ని చూసి సాలోచనగా నుదురు రుద్దుకున్నాడు జస్టిస్.

“న్యాయం ప్రకారం చూస్తే నీకు చెందాల్సిన డబ్బే యిది.... లిటిగేషన్‌లో చిక్కుబడింది కాబట్టి కోర్టులో డిపాజిట్ చేద్దాం... నీ వారసత్వం నిరూపించబడిన తరువాత తీసుకోవచ్చు ....” అంటూ అంతకు ముందు తీసుకున్న కాగితాలతో పాటు ఆ బ్రీఫ్‌కేసును కూడా అవతల పెట్టాడు.

ఎన్నో రోజులనించి గుండెలమీద కూర్చుని వున్న బరువు తొలిగిపోయినట్లు తేలికగా నిట్టూరుస్తూ బయటికి వచ్చాడు భాను. అక్కడికి దూరంగా ఒక బడ్డీ దగ్గర నిలబడిన బాబూలాల్‌ని కలుసుకొని యింటి దారిపట్టాడు.

## 23

అడవికి వెళ్ళలేదు గురవప్ప ఆ రోజు. గారేజీ వెనుక భాగంలో వున్న గార్డెన్‌లో డ్యూటీ చేస్తున్నాడు. అల్లంత దూరంలో గులాబీ మొక్కలకు కుదుర్లు చేస్తున్న తన మనవరాలు ఉన్నట్లుండి లేచి నిలబడటంలో ఆశ్చర్యం కలిగింది అతనికి.

“ఏమయిందమ్మా? ఎందుకు లేచావ్?” అని అడుగుతూ, ఆమె చూస్తున్న వైపుకు తను కూడా చూసి... కనులు చిట్లించాడు.

గారేజీ ముందు ఆగిందొక అంబాసిడర్ కారు..... లావుగా వున్న ఒక వ్యక్తి ముందుగా దిగి ఎస్టేట్ భవంతి వైపు పోతున్నాడు. అతని వెనుకే దిగాడు ఒక యువకుడు. భవంతి వైపు పోకుండా గార్డెన్ వైపు వస్తున్నాడతను.

దగ్గరికి వచ్చేదాకా గుర్తు పట్టలేకపోయాడు గురవప్ప... గుర్తుపట్టే సరికి నోటి వెంట మాట రాలేదు. "బాగున్నావా తాతా?" భుజం మీద చెయ్యి వేస్తూ ఆప్యాయంగా పలుకరించాడు భాను.

సంతోషం అధికమై కళ్ళవెంట నీళ్ళు వచ్చేశాయి గురవప్పకి.

"నువ్వు మళ్ళీ కనిపిస్తావని అనుకోలేదు బాబూ.. ఈ జన్మలో నిన్ను చూడగలనని తలచను కూడా తలచలేదు" తలకు చుట్టుకున్న తుండుగుడ్డతో కనులు తుడుచుకుంటూ అన్నాడు.

అతని మనవరాలిని కూడా పలుకరించి భవంతి వైపు బయలుదేరాడు భాను.

"అమ్మాయిగారిని ఎత్తుకు పోవటంలో నీ చెయ్యి లేదని తెలిసిన తర్వాత కూడా నీ మీద కోపం తగ్గలేదు అయ్యగారికి... అనవసరంగా అక్కడికి పోయి చివాట్లు తినటం దేనికి?" అంటూ అతన్ని వారించటానికి ప్రయత్నించాడు గురవప్ప.

"మీ అయ్యగారు నన్ను చివాట్లు పెట్టే రోజులు వెళ్ళిపోయాయి తాతా... ఇంత దూరం వచ్చిన తర్వాత కనిపించకుండా వుండటం బాగోదు. ఒకసారి వెళ్ళివస్తాను" అంటూ ముందుకు పోయాడు భాను.

"ఆ మాటలు నాకు అర్థం కాలేదు...." మనవరాలి వైపు చూస్తూ అన్నాడు గురవప్ప.

"నాకు అర్థమైనాయి గాని, ఎందుకో భయంగా వుంది తాతా...." భవనం వంకే చూస్తూ అన్నది ఆ పిల్ల.

"భయమెందుకే పిచ్చితల్లీ... మన బాబు ఈ చుట్టుపట్ల ఉండగా భయపడాల్సిన అవసరం లేదు..." అంటూ తన పని తను చేసుకోవటంలో మునిగపోయాడు గురవప్ప.

"అందుకే నాకు భయంగా ఉంది తాతా.. జరిగిన సంగతులన్నిటికీ యిప్పుడు ఆయన మాట్లాడిన మాటల్ని కలుపుకుంటే, ఎక్కడికీ పోకుండా ఎప్పడూ ఈ చుట్టుపట్లే ఉంటాడని అనిపిస్తోంది...." అంటున్న మనవరాలి వంక ఆశ్చర్యంగా చూశాడు గురవప్ప.

"సూర్యప్రసాద్ గారి తండ్రి గారి పేరేమిటి తాతా?" అడిగిందామె.

"భాను ప్రసాద్ గారు...."

"మన బాబు గారి పేరేమిటి తాతా?"

"భాను...." అంటూ అదిరిపడి అలాగే చూస్తూ వుండిపోయాడు గురవప్ప.

*   *   *   *   *

"ఎందుకొచ్చావ్ ఇక్కడకి? ఎవరు రమ్మన్నారు నిన్ను?" హాల్లో అడుగుపెట్టిన మరుక్షణం భానును నిలదీశాడు హరిహరవర్మ.

ఆయన ప్రక్కనే కూర్చుని వున్న గీతిక చటుక్కున లేచి ఎదురు వచ్చింది.

"నువ్వొక పెద్ద మోసగాడివి... ఇప్పుడే వస్తానని చెప్పి అయిపు లేకుండా పోయావ్.... పోలీసుల్ని పంపి చేతులు దులుపుకుంటే నీ బాధ్యత తీరిపోయిందని

అనుకున్నావా?" అని అడుగుతుండగా మరింత కఠిన స్వరంతో ఆమెను వెనక్కి పిలిచాడు ఆమె తండ్రి.

"ఎస్టేట్ వారసత్వాన్ని నిరూపించుకోవటానికి సూర్యప్రసాద్ గారి మనవడు వస్తున్నాడని ఫోన్ వచ్చింది. అప్పటినుంచీ డాడీకి మనశ్శాంతి లేదు. కొద్దిసేపు ఆగి చాముండేశ్వరీ ఆలయం దగ్గిరికి వస్తాను" లోగొంతుకతో చెప్పి వెనక్కి బయలుదేరింది గీతిక.

ఆమె తండ్రికి గాని, ఆయన ప్రక్కనే వున్న లాయర్ సాబ్‌కి గాని, భాను వంక కోరగా చూస్తన్న దినేష్‌కి గానీ అర్థంకాలేదా మాటలు. భానుతో పాటు వచ్చిన లాయర్ పద్మకుమార్‌కి అర్థం అయ్యాయి.

"సూర్యప్రసాద్ గారి మనవడు వచ్చేశాడమ్మా! ఇక్కడే వున్నాడు" అన్నాడాయన చిరునవ్వు నవ్వుతూ.

"ఏడి? ఎక్కడ?" ఆశ్చర్యంగా అడుగుతూ సోఫాల్లో నుంచి లేచారు అక్కడి వారందరూ.

"భానుగా మీకు పరిచయమై, మీ దగ్గిర కారు డ్రయివర్‌గా పని చేసిన ఆ పెద్దమనిషే సూర్యప్రసాద్ గారి మనవడు భాను ప్రసాద్.... అందుకు కావాల్సిన ఆధారాలు నా దగ్గిరున్నాయి. నేను అతని లాయర్‌ని...." అంటూ అప్పుడు తనని పరిచయం చేసుకున్నాడు పద్మ కుమార్.

తమ చెవుల్ని, కనుల్ని తామే నమ్మలేనట్లు చూస్తూ ఉండిపోయిన హరిహరవర్మ వైపు గాని, లాయర్ సాబ్ వైపు గాని, దినేష్ వంక గాని చూడలేదు

భాను. పాలరాతితో మలచిన శిలా విగ్రహంలా నిలుచున్న గీతిక వంకే చూశాడు. ఉన్నట్లుండి కదిలిందామె. పమిటె చెంగును ముఖానికి అడ్డు పెట్టుకొని తన గదివైపు పరుగెత్తింది.

"ఇక్కడి పని ఎంత సేపటిలో పూర్తి అవుతుంది?" పద్మ కుమార్‌ని అడిగాడు భాను.

"నేను చూపించే కాగితాల్ని వీళ్ళు యాక్సెప్ట్ చేస్తే వెంటనే పూర్తి అవుతుంది....." అంటున్న లాయర్ మాటలకు వెంటనే అడ్డు తగిలాడు హరిహరవర్మ.

"కూటికి టికాణాలేని ఒక డ్రయివర్ పగటి వేషం వేసుకువస్తే నమ్మటానికి మేము మూర్ఖులం కాదు..... మీరు చెప్పాల్సింది ఏమైనావుంటే కోర్టులో చెప్పండి....." అంటూ తను కూడా అక్కడినించి వెళ్ళిపోవటానికి రెడీ అయ్యాడు.

"ఇటీజ్ యువర్ విల్ అండ్ ప్లెజర్ సర్.... వారసత్వానికి సంబంధించిన కాగితాలతో పాటు వీటిని కూడా కోర్టులో పెట్టమంటారేమో చెప్పండి...." అంటూ నాలుగు ఫోటోలను బ్రీఫ్ కేసులో నుంచి అతనికి చూపించాడు పద్మకుమార్.

సూర్యప్రసాద్ గారి కేసులో ఆగాధంలోకి దొర్లుతున్నప్పుడు తీయబడిన వీడియో ఫిలింలో నుంచి సెలక్ట్ చేసి ప్రింట్ చేయబడిన షాట్స్ అవి.....

"వీటిని ఆధారంగా చేసుకొని బెంగుళూరు దొరని కాంటాక్ట్ చేశాము..... అతనికి కూడా ఈ నేరంలో భాగం వుంది కాబట్టి, అప్రూవర్‌గా మారితే శిక్ష

కాస్తంత తగ్గుతుందని చెప్పాము. అతను అంగీకరించాడు..... '' హరిహరవర్మ ముఖంలోకి సూటిగా చూస్తూ చెప్పాడాయన.

అవతలికి వెళ్ళిపోయే ఆలోచన విరమించుకొని సోఫాలో కూర్చుండిపోయాడు హరిహరవర్మ..... రక్తం లేనట్లు పాలిపోయిన ముఖంతో లాయర్‌సాబ్ వైపు చూశాడు.

''మీరు ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవాల్సిన అవసరం లేకుండా నా మాటల్ని ప్రశాంతంగా వినేటట్లయితే ఒక విషయం మీకు చెపుతాను.'' అంటూ మాట్లాడటం మొదలుపెట్టాడు పద్మకుమార్.

''నేను చాముండేశ్వరి ఆలయం దగ్గిర వుంటాను.....'' ఆయనతో చెప్పి బయటికి వెళ్ళిపోయాడు భాను.

''భాను మీ అమ్మాయి గీతికను ప్రేమిస్తున్నాడు.... మీరు అంగీకరించేటట్లయితే పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాడు... అతని వారసత్వాన్ని మీరు అంగీకరించి, అతని ఆస్తిని అతనికి స్వాధీనం చేసి, ఇంత వరకూ మీరు దోచుకు తిన్న ఎమౌంట్స్‌కి లెక్కచెప్పి, ఎటువంటి గొడవా చేయకుండా ఎస్టేట్‌ని వదలి వెళ్ళిపోయేందుకు అంగీకరించినట్లయితే, జరిగిన సంగతులన్నిటినీ మరిచి పోవటానికి అవకాశాలున్నాయని అతను నాకు చెప్పాడు... మీ అమ్మాయిని వివాహం చేసుకొని, మిమ్మల్ని కటకటాల వెనక్కి పంపించటం బాగోదు కాబట్టి, మీ అమ్మాయి సుఖసంతోషాల కోసమైనా మీరు అతని ప్రపోజల్‌ని అంగీకరించాలి....''

"వారసుడని అతను చెప్పేమాటల్ని మేము నమ్మకపోతే మమ్మల్ని కటకటాల వెనక్కి పంపిస్తారా?" కోపంగా అడిగాడు లాయర్ సాబ్.

"వారసత్వ నిరూపణలో మాకు ఎటువంటి అనుమానము లేదు. మాటలతో అంగీకరించకపోతే కోర్టుద్వారా మిమ్మల్ని వప్పిస్తాము. నేను మాట్లాడేది ముఖ్యంగా మీ అమ్మాయిని గురించి......" అంటూ బ్రీఫ్‌కేసులో నుంచి మరో నాలుగు ఫోటోల్ని అతని చేతికి అందించాడు పద్మకుమార్.

ఏనుగు దంతాల్ని, గంధపు చెక్కల్ని స్మగుల్ చేస్తున్న షాట్స్ అవి.....

వాటిని సోఫామీద వదిలి తన గదికి వెళ్ళిపోయడు లాయర్ సాబ్.

"ఆఫీసు గదిలోకి వెళ్ళి మాట్లాడుకుందాం పదండి....." అంటూ పద్మకుమార్‌ని సగౌరవంగా ఎస్టేట్ ఆఫీస్ రూమ్‌లోకి తీసుకుపోయాడు హరిహరవర్మ.

* * * * *

తూర్పు దిశలో వున్న సూర్యుడు నడినెత్తిమీదకి వచ్చేదాకా వెయిట్ చేశాడు భాను. గీతిక అక్కడికి వస్తున్న జాడలు కనిపించకపోవటంతో గాఢంగా నిట్టూర్చి ఆలయం బయటికి వచ్చాడు. అప్పుడు కనిపిచిందామె. ఎప్పుడు వచ్చిందో గాని, ఆలయం తలుపుల దగ్గిర నిలబడి అతని వంకే చూస్తోంది.

"అభిప్రాయం చెప్పమని నువ్వు ఎంత వత్తిడి చేసిన ఇంతవరకూ తప్పించుకు తిరిగాను. ఇప్పుడు చెప్పమంటావా?" వికసించిన ముఖంతో అడిగాడు భాను.

ఏడ్చి ఏడ్చి ఎర్రబడి వున్న కనుల్ని క్రిందికి దించుకున్నది గీతిక.

"ఈ ఆస్తి నీదేనని నీకు ముందుగానే తెలుసు..... కాలేజీలో నిన్ను ఆల్లరి పెట్టానన్న కక్షతో నన్ను ఏడిపించటానికి మా దగ్గిర డ్రయివర్‌గా చేరావు..... అవునా?" తల ఎత్తి చూడకుండానే అడిగింది.

"సమాధానం చెప్పటానికి నాకేం అభ్యంతరం లేదు గాని రెండు కండిషన్లకు నువ్వు ఒప్పుకుంటే వెంటనే చెపుతాను....." ఇంకా కొంచెం దగ్గిరికి జరుగుతూ అన్నాడు భాను.

"ఏమిటవి?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది గీతిక.

"మగపిల్లాడు పుడితే బాబూలాల్ అని, ఆడపిల్ల పుడితే రాధాబాయి అని పేరు పెట్టాటానికి నువ్వు అంగీకరించాలి....."

అర్థం కానట్లు అయోమయంగా చూస్తున్న ఆమెను అమాంతం కౌగలిలోకి తీసుకొని కనుల్ని ముద్దు పెట్టుకున్నాడు భాను.

అప్పుడు అర్థమై సిగ్గుతో కుచించుకుపోతూ, అతని కౌగలిలో వదిగి అలాగే వుండిపోయింది గీతిక.

- : అయిపోయింది : –

# SPANDANA

*by*

# MADHUBAABU




సత్యవాణి పబ్లికేషన్స్

మాచవరం, విజయవాడ - 520 004.